అంఆ

దివ్యానుభూతులు



జిల్లెళ్ళమూడి అమ్మ

రచన

ఎ. కుసుమా చక్రవర్తి (ఎమ్.ఎ., బి.యిడి)
ఆంధ్రా యూనివర్శిటి హైస్కూల్
వాల్తేరు



విశాఖ మందిరంలో జిల్లెళ్ళమూడి అమ్మ

ద్వితీయ ముద్రణ
వేయి ప్రతులు
స్వభానునామ
2003 సెప్టెంబర్ 28
లలితపీఠం - లలితాకాలనీ

వెల రూ. **60/-**

మాతృశ్రీ పూజా సర్కిల్
4-45-1, అశోక్‌హౌస్,
అమ్మమందిర్, పెదవాల్తేరు,
విశాఖపట్నం - 530 017.
ఫోన్ : 2530346

A.S. Chakravarthy
4-445-1, Ashok House,
Pedawaltair,
VISAKHAPATNAM - 530 017.
Ph. 2530346

ముద్రణ :

Sathyam Offset Imprints
46-18-10, Mandavari Peta,
Visakhapatnam-530 016.
✆ : 2735878, 2713440

His Holiness - Jagadguru

SRI SIDDHESWARANANDA BHARATISWAMY

Siddheswari Peetadhipati - Courtallam

Mounaswamy Mutt.
Courtallam - 627 802
(Via Tenkasi)
Thirunelvell (Dt.)
Tamilanadu.



Camp Office :
B1-C40, Kaallpeetam
Street,
4th Line, Ravindra Nagar,
GUNTUR - 522 006. (A.P.)
Ph : 0863 - 2231625
2256666

పరమహంస, పరివ్రాజకాచార్య జగద్గురు

శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి

సిద్ధేశ్వరీ పీఠాధిపతి – కుర్తాళం

విశాఖపట్టణ రచయిత్రి శ్రీమతి కుసుమకుమారికి ఆశీర్వచన శ్రీముఖము

శ్రీ పి.యన్.ఆర్. ఆంజనేయప్రసాద్ ద్వారా మీరు పంపిన **"దివ్యానుభూతులు"** అన్న గ్రంథం స్వామి వారికి చేరినది. వారు దానిని పరిశీలించి చాలా సంతోషించినారు. మాతృశ్రీ అనసూయాదేవి యందు కల భక్తిచే వారి పూర్వాశ్రమములో రచించిన గ్రంథ విశేషాలను స్మృతికి తెచ్చుకొని మీరు రచించిన అనుభవలహరికలను గమనించి పరమేశ్వరి దివ్యానుగ్రహమునకు కావలసిన యోగ్యత మీ యందున్నదని భావించినారు.

సిద్ధేశ్వరీ పీఠ దేవతయైన పరమేశ్వరి మీకు శుభములు ప్రసాదించాలని తమ ఆశీర్వచనములను తెలియజేయమన్నారు.

ఈ గ్రంథము భక్తి మార్గములో ప్రచారమునకు రావాలని వారు దీవిస్తున్నారు.

స్వామివారి ప్రతినిధి
సిద్ధేశ్వరీపీఠము
కుర్తాళం

ఓం - అం - ఆ

సహకార వాద్యం

రామకృష్ణ అన్నయ్య
అమ్మ అంతరంగిక కార్యదర్శి

జిల్లెళ్ళమూడి - 522 113

అమ్మ - మమతల సమవాటిక
- మహిమల మణిపేటిక
అమ్మ - మమతల కలకండ
- మహిమల విరిదండ

"మహిమలనే రవ్వలు పొదిగిన మమతల బంగారు గొలుసు-అమ్మ జీవితం" అనిపిస్తుంది.

అమ్మ జీవితం అపార మమకార పారావారమైతే అందులో ఉవ్వెత్తున లేచిన కెరటాలు అమ్మ మహిమలు. సాగరంలో కెరటాలు పుట్టటం ఎంత సహజమో అమ్మ వల్ల మహిమలు కూడా అంత సహజసుందరంగా జరుగుతాయి. కొందరు మహాత్ములు తప్పుదారిన నడిచే ప్రజలను తమ వద్దకు ఆకర్షించి వారిని దైవాభిముఖం చేయటం కోసం మహిమలు ప్రకటిస్తే - అమ్మ కేవలం తన సంతానం కష్టాల సుడిగుండంలో చిక్కి గిలగిలా తన్నుకునే సమయాల్లో మాత్రమే పరమ దయతో వారిని ఒడ్డు చేర్చటం కోసమే మహిమలను చేసినట్లుగా అమ్మ చరిత్ర మనకు చెబుతున్నది. విలాసంగా, వినోదం కొరకు యితరులను తన వైపుకు తిప్పుకోవటం కొరకుగానీ, యితరుల నుండి తాను మెప్పు పొందటం కోసం కానీ అమ్మ ఎప్పుడూ ఏ అసాధారణ క్రియనుగానీ, మానవాతీత చర్యనుగానీ, ప్రదర్శించక పోవటం గమనార్హం.

మహిమల ప్రకటనకు అమ్మ వ్యతిరేకి. ఒకసారి ఒక సాధువు అమ్మ వద్దకు వచ్చి అరచేతిలో కర్పూరాన్ని సృష్టించి, హారతి ఇచ్చినపుడు అన్నది "పావలా పెడితే కర్పూరం వస్తుంటే యీ ప్రదర్శనలు ఎందుకు?" అని.

ఆధ్యాత్మిక శక్తి ముందు ఈ మహిమలు అత్యల్పాలు అని అమ్మ భావన.

అమ్మ ఆధ్యాత్మిక శక్తి సాగరం. అమ్మ వల్ల అద్భుతాలు జరిగాయి కానీ, అమ్మ అద్భుతాలు చేయలేదు.

అమ్మ వల్ల మనమేదయినా, ప్రకృతి నైజానికి అతీతమైన ప్రయోజనం పొందినపుడు అమ్మకు మన కృతజ్ఞత తెలుపుకుంటే అమ్మ నుండి వెంటనే వినిపించే వాక్యం ఏమిటంటే – "నాదేముంది నాన్నా? ఆ తరుణం వచ్చింది ఆ పని జరిగింది. ఇందులో నా గొప్ప ఏముంది? నాకేమీ తెలీదు" అని అతి నిర్లిప్తంగా. అత్యంత నిరాడంబరంగా అంటుంది.

సూర్యోదయం కాగానే – కమలం విచ్చుతుంది. ఆ సంగతి సూర్యునికి తెలియాలా? చంద్రోదయం కాగానే – కలువ వికసిస్తుంది. ఆ విషయం చంద్రునికి తెలియాలా? దీపం వెలిగితే – చీకటి పారిపోతుంది. ఆ పరిణామం దీపానికి తెలియాలా? అవసరం లేదు. అమ్మ మహిమల సంబంధమూ అంతే.

అమ్మ స్పర్శ వల్ల, అమ్మ ఉనికి వల్ల, అమ్మ దృష్టిపాతం వల్ల, అమ్మ వాక్కువల్ల, అమ్మ సంకల్పం వల్ల అనేక అద్భుతాలు వాటంతట అవే జరుగుతుంటాయి. 1974 జనవరిలో వసుంధరక్కయ్య తన అనారోగ్యకారణంగా గుంటూరులో ఉన్నది. ఆ సమయంలో అమ్మ రాయలసీమ పర్యటనలో ఉన్నది. దురదృష్టవశాత్తు అక్కయ్యకు మంచంలో నుండి లేవలేని దుర్భరస్థితి వచ్చింది. డా॥ ఎస్. వి. సుబ్బారావు గారి సలహాననుసరించి అక్కయ్యను గవర్నమెంటు ఆసుపత్రిలో న్యూరోసర్జన్‌కు చూపిస్తే – అక్కయ్య పూర్తి విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. అంతలో పరిస్థితి మరింత విషమించింది. ఆర్థోపెడిషీయన్‌కి చూపిస్తే – కాలి ఎముకలకు క్షయ వచ్చిందని వెంటనే ఆపరేషన్ చేయించకపోతే రెండవ కాలికి కూడా ఆ జబ్బు వ్యాపిస్తుందని, ఇక అక్కయ్య శాశ్వతంగా మంచంలో ఉండిపోవాలని హెచ్చరించారు. అక్కయ్య భయపడిపోయింది. డాక్టరు సుబ్బారావు గారికి తెలిసి అందోళన చెందారు. అమ్మకు చెప్పకుండా ఆపరేషన్ చేయించుకోవటానికి అక్కయ్య ఇష్టపడలేదు. కారులో పడుకోబెట్టుకుని డాక్టరుగారు ఆమెను మదనపల్లెకు తీసుకువచ్చారు. అపుడు అమ్మ మదనపల్లెలో ఉంది. నడవలేని అక్కయ్యను తీసుకువచ్చి లోపల పడుకోబెట్టారు.

మదనపల్లె నుండి హార్సిలీ కొండలకు వెళ్ళేముందు అమ్మ స్నానం చేస్తున్నది. మేము అక్కయ్య వచ్చిన వార్తను అమ్మకు తెలియజేశాము. అక్కయ్య అమ్మకు అంతరంగిక పరిచారిక. అమ్మకు కావలసిన సేవలన్నీ స్వయంగా చేస్తూ – తనను

తాను అమ్మ పాదాలకు అంకితం చేసుకున్న నిస్వార్థమహోన్నతవ్యక్తి. అందువలనే అమ్మ 1966 మే 5వ తేదీన – ఆమెను వేలాది జనం సమక్షంలో మంగళవాద్యాల నడుమ, ఆమె మెడలో మంగళసూత్రం కట్టి, తలంబ్రాలు పోసి శాస్త్రబద్ధమైన కల్యాణం చేసుకుని లోకాన్నే సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది.

కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా మరొకరికి అర్పణ చేయటమే కల్యాణమని కదా... అమ్మ అపూర్వనిర్వచనం !

అక్కయ్య ఉన్న గదిలోకి వచ్చింది అమ్మ. లేచి నిలుచోవటానికి ఆమె ప్రయత్నం చేసి విఫలమైంది. అమ్మ ఆమె వద్దకు వచ్చి – చేతిని పట్టుకుంది. ఆమె లేచి నిలుచున్నది. అమ్మ ముందుకు సాగింది, అక్కయ్య చెయ్యి వదిలి పెట్టకుండా "నేను నడవలేనమ్మా" అని ఆమె చెబుతున్నా – చెయ్యి విడవకుండా అమ్మ – కారు వద్దకు వెళ్ళింది. అక్కయ్యను కూడా కారు ఎక్కమంది అమ్మ. ఆమె ఎదురు మాట్లాడలేక కారు ఎక్కి కూర్చుంది.

హార్సలీ కొండల్లో ఎగుడు దిగుడు రోడ్లపై – అమ్మ వెంట అక్కయ్య కూడా నడవక తప్పలేదు. ఆ నడకలో ఆ ఎముకలు ఏమి స్థితి పొందాయో, ఎలా బలోపేతం అయ్యాయో – అదొక విచిత్రమైన, ఎవరికీ అర్థంకాని దివ్యమయిన చికిత్స. ఈ సంఘటన జరిగింది – 1974 ఫిబ్రవరి 4వ తేదీ. ప్రఖ్యాత వైద్యులు – ఆపరేషన్ చేసినా అక్కయ్య మామూలుగా నడవగలుగుతుందని హామీ యివ్వలేదు. ఇక, ఏ చికిత్స, ఏ ఆపరేషన్ అవసరం లేకపోయింది. అమ్మ స్పర్శతో, లేక సంకల్పంతో అక్కయ్యకు పూర్తి స్వస్తత చిక్కింది. ఈ రోజుకూ అక్కయ్య – ఆ విషయంలో మరే కంప్లయింటూ లేకుండా హాయిగా నడుస్తూ, తన పనులు తాను చేసుకుంటూ యితరు లెందరికో సేవచేస్తూ – అమ్మ అనంత శక్తికి ఉదాహరణయై నిలిచింది.

విశాఖపట్నం నివాసి శ్రీ కె. శేషసాయి. అతనికి కడుపులో అల్సర్ పుట్టింది. కె.జి. హాస్పిటల్లో ప్రసాదరావుగారనే ఒక సర్జన్‌కు చూపించారు. వారు ఆపరేషన్‌కు తేదీ నిర్ణయించారు.

శ్రీ శేషశాయి అమ్మ భక్తుడు. అమ్మకు చెప్పి అనుమతి తీసుకుని వస్తానని జిల్లెళ్ళమూడి వచ్చాడు. అమ్మ శేషశాయి పొట్టను చేత్తో తడిమి చూసి "నాన్నా – నీకు అల్సర్ లేదు. ఆపరేషన్ వద్దు" అని సలహా యిచ్చింది. అతను సంతోషంగా

విశాఖ తిరిగి వెళ్ళాడు. అమ్మ చెప్పిన మాట డాక్టరుగారికి వివరించాడు. "ఆమె ఎట్లా పరీక్షించింది ? ఎట్లా చెప్పగలిగింది?" అని డాక్టరుగారు అడిగారు. "అమ్మ ఏ పరీక్షా చేయలేదు. కంటితో చూసింది చేత్తో తడిమింది" అని శేషశాయి చెప్పాడు. అమ్మలూ, బాబాలూ యిలాగే చెబుతారు. ఆధారం లేకుండా వాళ్ళమాటలు నమ్మితే మీరు ప్రాణాలు పోగొట్టుకుంటారు. అలా చెప్పగలిగితే – మాఖరీదైన చదువులూ, మావిలువైన పరికరాలూ ఎందుకు ? బ్రతకదల్చుకుంటే, ఆపరేషన్ చేయించుకో అని డాక్టరుగారు కఠినంగా సలహా యిచ్చారు. శేషశాయి ఆపరేషన్‌కి అంగీకరించాడు ఆపరేషన్ జరిగింది. డాక్టరుగారు కడుపుకోసి కంచుకాగడాలు వేసి వెదికారు. అల్సర్ ఏదీ ? ఎక్కడా కనిపించలేదు. దాని తాలూకు ఏ చిహ్నమూ కనిపించలేదు.

డాక్టరుగారు విభ్రాంతి చెందారు. పాత ఎక్సురే పరిశీలించారు. దానిలో సుస్పష్టంగా అల్సర్ దర్శనమిస్తున్నది. మరి, యిప్పుడేమయింది? వాక్కే ఆపరేషన్‌గా, అమ్మ అనుగ్రహమే ఔషధంగా పనిచేసి – ఆ అల్సర్‌ను నామరూపాలు లేకుండా మాయం చేశాయి. అమ్మ దివ్యశక్తిని స్వయంగా పరికించి, ప్రత్యక్షంగా గ్రహించిన డాక్టరుగారు తర్వాత జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను దర్శించి, క్షమాపణ కోరి అమ్మ కృపకు పాత్రులయ్యారు.

1980 సెప్టెంబరులో అమ్మకు ఆరోగ్యం సరిగాలేక చికిత్సకోసం హైద్రాబాద్ తీసుకువెళ్ళాము. సత్యా ఎక్సురే క్లినిక్‌లో అమ్మకు ఎక్సురే తీయించగా – ఊపిరితిత్తులో నారింజపండు పరిమాణంలో క్యాన్సర్‌గడ్డ కనిపించింది. ఆ ఎక్సురే చేత పట్టుకుని సోదరులు శ్రీదినకర్, నేను హైద్రాబాద్‌లోని ప్రఖ్యాత డాక్టర్లెందరినో సంప్రతించాము. అందరూ ఒకే మాట చెప్పారు. వెంటనే అమ్మను అమెరికా తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయిస్తే – అమ్మ కొంతకాలం బ్రతుకుతుందేమో కానీ లేకపోతే బ్రతకటానికి ఏమాత్రం అవకాశాలు లేవని బల్లగుద్ది చెప్పారు.

మేము అమ్మను అమెరికా తీసుకుని వెళ్ళగలమా? అందుకు ఎంత డబ్బు కావాలి? దానిని మేము సమకూర్చుకోగలమా? అశక్తులమై మేమిద్దరము ఒకరాత్రి పూర్తిగా కంటికి కడివెడు కన్నీళ్ళుగా దుఃఖించాము.

మరునాటి ఉదయం అమ్మ మమ్మల్ని అడిగింది గతరాత్రి కనిపించలేదేమని, మేమేదో అసత్యాలు చెప్పాము. కానీ అమ్మ వాటిని విశ్వసించక మమ్మల్ని నిలవేసింది. అపుడు మేము మా భయాందోళనలనూ, మా అశక్తతనూ వ్యక్తం చేశాము. అపుడు

అమ్మ వెంటనే అన్నది - "నాకు క్యాన్సర్ లేదు, రాదు. మీరేమీ భయపడకండి" అని. నేను రాత్రి డాక్టర్లందరినీ సంప్రతించిన సంగతీ, వారి స్థిర అభిప్రాయాం చెప్పాను.

వాటిని అమ్మ నిర్ద్వంద్వంగా ఖండించింది. ఈవిధంగా రెండురోజులు చర్చల్లో గడిచాయి. మా వాదనను బలపరుచుకోవటం కోసం అమ్మకు ఎక్సురే చూపించాము. అది తప్పు అన్నది అమ్మ. అయితే మళ్ళీ తీయిద్దాము - అన్నాము. అమ్మ 'సరే' నన్నది. ఎక్సురే తీయించాము అందులో ఏ క్యాన్సరూ కనిపించలేదు మరి. క్రిందటి ఎక్సురేలో ఉన్న క్యాన్సరుగడ్డ ఏమైనట్టు? గడ్డ అమ్మ సంకల్పబలం వల్ల - ఏ చికిత్సా లేకుండానే మాయమైంది.

అమ్మ యోగేశ్వరి. అమ్మకు తన శరీరం మీదా యితరుల శరీరం మీద కూడా అనిర్వచనీయమైన అధికారం ఉన్నట్లు అనేక సంఘటనల్లో రుజువయింది. శరీరం మీదేకాదు, తన మనస్సుమీద, యితరుల మనస్సుమీద కూడా అంతే. ఆ యోగశక్తే అనేక రూపాల్లో, అనేక సమయాల్లో మహిమలుగా, అద్భుతాలుగా, వింతలుగా, విచిత్రాలుగా, ప్రకృతిపై విజయాలుగా అభివ్యక్తమై అనేకులకు అనేక ఉపకారాలు చేసి లోకాన్నే విస్మయపరచింది అమ్మ. పంచభూతాత్మకమైన ప్రకృతిపై కూడా ఎదురులేని తన అధికారాన్ని ప్రదర్శించింది అమ్మ.

ఏలూరు సోదరుడు శ్రీ టి.టి. అప్పారావుగారి ఆహ్వానంపై శ్రీ పద్మనాభుని వెంకటరత్నంగారు 1974 జనవరి 1వ తేదీన జిల్లెళ్ళమూడి వచ్చారు. వారు అమ్మను దర్శించుకుని వెనుతిరిగి వెళుతుంటే ఆ రాత్రికి ఉండమని చెప్పాడు అప్పారావు - మరునాడు ఉదయం అభిషేకం చేసుకోవటానికి, అమ్మ కూడా "ఉండు నాన్నా" అన్నది. వెంకటరత్నంగారికి చన్నీళ్ళస్నానం అలవాటులేదు. మరునాడు ఉదయం ఆశ్రమంలో వేడినీళ్ళు ఎవరిస్తారు? ఆ విషయమై ఆయన ఆలోచనలో పడటం గమనించిన అమ్మ "ఫర్వాలేదు లే నాన్నా ఉండు" అన్నది మళ్ళీ ఆ కంఠంలో శాసనం ధ్వనించగా ఆయనకు ఉండక తప్పలేదు.

మరునాడు ఉదయం లేచి స్నానం చేయటానికి నీటి పంపులవద్దకు అప్పారావు అన్నయ్యతో కలిసి వెంకటరత్నంగారు వెళ్ళారు, చన్నీళ్ళను తలుచుకుంటూ, గజగజ వణుకుతూ, పంపువద్ద బకెట్ పెట్టారు. బకెట్‌లో పడేనీళ్ళు ఆవిరి కక్కుతున్నాయి. చెయ్యి పెట్టి చూశారు. నీళ్ళు వేడిగా మసిలిపోతున్నాయి. "అప్పారావూ? నాకోసం

వేడి నీళ్ళు ఏర్పాటు చేశావే!" అన్నారు వెంకటరత్నంగారు, కృతజ్ఞతనిండిన కంఠంతో.

"వేడినీళ్ళు ఏమిటి?" అని అదిరిపడ్డాడు అప్పారావు అన్నయ్య.

"పంపులో వేడినీళ్ళు వస్తున్నాయి" అని వెంకటరత్నంగారు అన్నారు.

నిజమే – వెంకటరత్నగారి పంపులో వేడినీళ్ళు వచ్చాయి. అప్పారావుగారి పంపులో చన్నీళ్ళే వచ్చాయి. రెండు పంపులు ఒకే నీటి గొట్టానికి అమర్చబడి ఉన్నాయి. పక్క పక్కనే ఉన్న ఒక పంపులో వేడినీళ్ళూ, మరొక పంపులో చన్నీళ్ళూ రావటం ఎలాసాధ్యం? కానీ – ఆనాడు ఆవింత జరిగింది.

1960కి పూర్వం అమ్మ ఒక పాదం వెచ్చగా ఒక పాదం చల్లగా ఉండటం కొమ్మూరు డాక్టరు శ్రీ అనంత శీతాచలంగారు అనేక పర్యాయాలు గమనించారు.

1958 ఫిబ్రవరి 4వ తేదీ మాఘపూర్ణిమ. దేశిరాజు రాజమ్మగారి కోరిక మేరకు – ఆనాడు ఉపదేశం చేయటానికి సంకల్పించింది. అందుకోసం ఆనాడు వెయ్యిమంది భక్తులు వచ్చారు. ఆ తెల్లవారు జామున అమ్మతో పాటు కాలినడకన అందరూ జిల్లెళ్ళమూడి గ్రామానికి దక్షిణదిశలో ప్రవహించే ఓంకారనదికి వెళ్ళారు. ఉపదేశం చేయటం సుమారు 4 గం.లకు ప్రారంభమయింది. ఆరోజున అమ్మ 600 మందికి ఉపదేశం చేసింది. ప్రతి ఒక్కరికి ప్రార్థన, ధ్యానశ్లోకం చెప్పి మంత్రం చెప్పింది. అవసరమయిన వాళ్ళకు మంత్రార్థాన్ని వివరించింది. అంటే ఒక్కొక్కరికోసం అమ్మ సుమారుగా ఒక నిముషం తీసుకుందని అంచనా. ఆ కార్యక్రమం మొత్తానికి 10 గం.ల సమయం పట్టి ఉండాలి. కానీ ఉదయం 7 గంటలకే అమ్మ వాగు ఒడ్డుకు చేరి యింటికి తిరిగి వచ్చింది.

ఆరోజున అక్కడ ఉన్న వెయ్యిమంది – అమ్మ సూర్యోదయాన్నే ఆపివేసింది. అని ఆశ్చర్యపోయారు. మహాపతివ్రత సుమతి కథను జ్ఞాపకం చేసుకున్నారు.

పతిని ఆధారం చేసుకుని పంచభూతాలను జయించినదే పతివ్రత – అని అమ్మ నిర్వచనం.

సర్వాన్నీ స్వాధీనం చేసుకున్నదే సాధ్వి – అని మరొక ప్రవచనం.

ఆ రెండు వాక్యాలు అమ్మ కిరీటంలో మెరిసే రెండు మాణిక్యాలు.

ఆ సంఘటనకు నేటికీ ఎందరో ప్రత్యక్ష సాక్షులున్నారు. వారిలో వసుంధరక్కయ్య, రుక్మిణక్కయ్య కూడా ఉన్నారు.

1970 జనవరిలో గుంటూరు హిందూకాలేజీ ప్రాంగణంలో అమ్మ దర్శనం ఏర్పాటయింది. ఆనాడు చంద్రమౌళినగర్ నుండి హిందూకాలేజీ వరకు ప్రత్యేకంగా అలంకరింపబడ్డ రథంపై అమ్మకు ఊరేగింపు. ఊరేగింపులో దాదాపు లక్షమంది పాల్గొన్నారు. ఊరేగింపు అమరావతి రోడ్డు వరకు వచ్చేసరికి తీవ్రమైన ఎండ వచ్చింది. రథంపై కూర్చున్న అమ్మకు ఎండ చురుకుగా తగలటం గమనించిన ఒక స్థానిక సోదరుడు గొడుగు తెచ్చి నాకు యిచ్చాడు. నేను అమ్మ పక్కనే నిల్చుని గొడుగు పట్టడానికి ప్రయత్నిస్తున్నాను. "ఏమిటి?" అన్నది అమ్మ. నా ప్రయత్నం వివరించాను.

"మరి, యీ లక్షమందికి గొడుగులు తెప్పిస్తావా?" అని నవ్వింది అమ్మ.

"లక్షగొడుగులా" - అంటూ నేను నివ్వెరపోయాను. అమ్మ ఆకాశం వంక చల్లగా చూసింది. ఎండ మాయమయింది. ఆకాశం విప్పిన గొడుగయింది. ఊరేగింపులో పాల్గొన్న నరనారీ జన సందోహం వెన్నెల్లో కలువలైపోయారు.

హైదరాబాద్ వద్ద గల బి.హెచ్.ఇ.ఎల్. రామచంద్రాపురంలో సోదరులు శ్రీ కొండేపూడి సూర్యనారాయణగారి ఆధ్వర్యంలో ప్రతిశుక్రవారం రాత్రి వారానికి ఒక భక్తుని యింట్లో అమ్మకు పూజ, భజన, నివేదన జరుగుతాయి. ఒకసారి సర్వశ్రీ శాస్త్రి, సుబ్బారావు, రామమూర్తి సోదరులు జిల్లెళ్ళమూడి వచ్చారు. అమ్మ వద్ద మూడురోజులు గడిపి ఆనందానుభూతిని పొందాలనే కోరికతో.

వారికి దర్శనం చేయించి - ఆ రాత్రికి అమ్మ పడుకున్న వరండాలోనే వారిని కూడా పడుకోమని చాపలు యిచ్చాను. అమ్మతో మాట్లాడాలని వారికి కుతూహలం కలిగింది.

వారిలో ఒకరు అన్నారు - ఇప్పుడు మా ఊళ్లో అమ్మ పూజ జరుగుతూ ఉంటుందమ్మా - అని. అప్పుడు రాత్రి 10 గంటలయింది. వెంటనే అమ్మ లేచి కూర్చుని "కాదు నాన్నా - యివ్వాళ తొమ్మిదిన్నరకే పూజ, భజన అయిపోయాయి" అన్నది. "ఇవ్వాళ సూర్యనారాయణకు ఒంట్లో బాగాలేదు. బాగా టెంపరేచర్ వచ్చింది. అందువల్ల త్వరగానే ముగించారు" అన్నది అమ్మ. అమ్మ మాటలను నమ్మలేనట్లుగా వారు అమ్మ వంక చూశారు. "ఇవ్వాళ శనగగుగ్గిళ్ళు చేశారు. వాటిలో ఉప్పు ఎక్కువయింది. అందువల్ల వాటిని తినలేక రోడ్డు మీద ఉమ్మేస్తూ అందరూ వెళుతున్నారు" అని వివరించింది అమ్మ.

అమ్మ తమకు కాశీమజిలీ కథలు చెబుతున్నట్లు భావించారు. ఒకరి చెవులు ఒకరు కొరుక్కున్నారు. మూడు రోజులు ఉందామని ఆసక్తితో వచ్చిన ఆ సోదరులు మరునాడు ఉదయమే ప్రయాణమైనారు.

"ఎందువల్ల?" అని అడిగాను.

'అమ్మ అసత్యాలు తమకు రుచించలేదు', అని వెళ్ళిపోయారు.

రామచంద్రాపురం వెళ్ళగానే, అమ్మ యెడల తమ నిరసన ప్రకటించటానికి వారు సూర్యనారాయణగారి యింటికి వెళ్ళారు. శుక్రవారం రాత్రి జరిగిన పూజను ప్రస్తావించారు. విచిత్రం! అమ్మ ఏ అక్షరాలు పలికిందో, సూర్యనారాయణ ఆ అక్షరాలనే పలికాడు. వాళ్ళనెత్తిన ఒక్కసారి వెయ్యి పిడుగులు పడినట్లు అయింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. శరీరాలు భయకంపితాలై స్వేదంతో తడిసిపోయాయి. ఎదురుగా గోడనున్న అమ్మ ఫోటో వద్ద వారు సాగిలపడి చెంపలు వాయించుకుని క్షమాపణ చెప్పుకున్నారు.

ఒకనాడు శేషగిరిరావు అన్నయ్య అమ్మను, అడిగాడు "మద్రాసు మౌంట్ రోడ్డులో నీ నామం స్మరిస్తూ వెళుతున్న భక్తుడు నీకు ఏమనిపిస్తాడు?" అని.

అమ్మ అన్నది - "నా ఎదురుగా నడిచి వెళుతున్నట్లు ఉంటుంది" అని. అమ్మకు దగ్గర, దూరం లేదు. అమ్మ సర్వవ్యాపిని కదా! ఒకసారి వసుంధరక్కయ్య అమ్మను అడిగింది - మా ఆలోచనలు నీకెట్లా తెలుస్తాయమ్మా? - అని. "మీరు నేను కాకపోతే గదా" అని ఒకసారీ "నా ఆలోచనలు నాకు తెలియటంలో విశేషం ఏముందీ?" అని మరొకసారి పలికిన అమ్మ సమాధానంలో అమ్మ సర్వజ్ఞత్వం రహస్యం నిక్షిప్తమై ఉంది.

అమ్మ భావజ్ఞ, కృతజ్ఞ, మనందరి అన్ని చేతలూ, అన్ని ఆలోచనలూ అమ్మకు తెలుసు. అందుకు కారణం - అందరితో అమ్మకు గల తాదాత్మ్యస్థితియే. దీనినే విశ్వతాదాత్మ్యస్థితి అంటున్నాం. ఇదే యోగానికి పరాకాష్ఠ! అమ్మ యోగపరమేశ్వరి. ఆ స్థితిలో పలికిన పదబంధమే "నేను నేనైన నేను" అని. ఈ అపూర్వ ప్రకటన పరంజ్యోతి నుండి వెలువడ్డ తేజఃపుంజం.

1973 ఏప్రిల్ 12వ తేదీ అమ్మ స్వర్ణోత్సవం. లక్షమందికి - ఆ రోజున ఒక్క పంక్తిలో భోజనం ఏర్పాటయింది. కానీ ఉదయం 10 గం॥లకు అవిచ్ఛిన్నంగా

జనప్రవాహాలు వస్తూ కార్యనిర్వాహకులకు ఆలోచనను, ఆందోళనను రేకెత్తించాయి. నేల యీనిందా అన్నట్లు ఎటుచూసినా క్రిక్కిరిసిన జనసమూహాలు ఉన్న బియ్యం వండించాము. వచ్చే జనానికి అన్నం సరిపోయేటట్లు లేదు. శ్రీ అన్నంరాజు రామకృష్ణారావు గారిని పిలిచి బాపట్ల నుండి ఒక లారీ బియ్యం తీసుకురమ్మని చెబుతున్నాను. మా సంభాషణను అమ్మ గమనించి, మమ్మల్ని దగ్గరకు పిలిచి ఏమిటీ? - అని అడిగింది. నేను విషయం చెప్పాను. వెంటనే అమ్మ అన్నది - "మనుషులను చూసి బియ్యం కొంటే మనం ఉత్సవం చెయ్యగలమా! వంట చేసినంత వరకు చాలులే. నేను స్నానం చేసి వస్తాను, పద" - అన్నది. ఆ రోజున లక్షా ఎనభైవేలమంది తృప్తిగా భోజనం చేశారు. ఇంకా అన్నంరాసులు మిగిలాయి. పశువులు, పక్షులు, క్రిమికీటకాలు తిన్నాయి. అవీ అమ్మకు బిడ్డలే. "వాటికీ ఈరోజు పండగే కదా" అని అమ్మ మురిసిపోవటం మనం మరిచిపోలేని సంఘటన.

1960కి పూర్వం తనను చూడటానికి వచ్చిన జనానికి అమ్మ స్వయంగా వండి పెట్టేది. రోజూ నలభై యాభైమంది వచ్చినా అమ్మ చిన్న గిన్నెతో మాత్రమే వండి అందరకు పెట్టేది. అది ఎట్లా సాధ్యం? - అని అమ్మను ప్రశ్నిస్తే "వాళ్ళు కడుపునిండా తినక కొద్దిగా మాత్రమే తింటున్నారు. అందువల్ల ఎక్కువమందికి తక్కువ అన్నం మాత్రమే ఖర్చు అవుతున్నది" అని చెప్పి అమ్మ నవ్వేసేది. వచ్చిన వాళ్ళను అడిగితే, "మేము మా ఇళ్ళవద్దకంటే యిక్కడనే ఎక్కువ తింటున్నాము, అమ్మ స్వయంగా వడ్డిస్తుంటే" అని సమాధానం చెబుతారు.

ఇట్లా ఎన్ని సంఘటనలు జ్ఞాపకం చేసుకుంటూపోతున్నా - అవి అనంతంగానే ఉంటాయి. అమ్మను ఆరాధించే వ్యక్తులు, కుటుంబాలు అసంఖ్యాకంగా ఉన్నట్లు మనకు తెలుసు. అందరి జీవితాల్లో యిటువంటి మహిమోపేత సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వాటిని సంపాదించి ఒక బృహత్ గ్రంథాన్ని ప్రచురించాలని నాకు చాలాకాలం నుండి గాఢమయిన ఆకాంక్ష. కానీ నా కాంక్ష కార్యరూపం ధరించకుండానే - కాలం పరుగెత్తి పోతున్నది.

ఇంతలో సోదరి శ్రీమతి అయ్యగారి కుసుమ "దివ్యానుభూతులు" అన్న నామంతో ఒక గ్రంథాన్ని వెలువరించటానికి ప్రయత్నించటం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నది.

శ్రీమతి కుసుమ యీ పుస్తకాన్ని వెలువరించటంలో ఎంతో ఔచిత్యం ఉన్నది,

సోదరి కుసుమ టీచరుగా పనిచేస్తున్నది. తాను పొందిన అనుభవాన్ని అభివ్యక్తీకరించటంలో సిద్ధహస్తురాలు. అనుభవాలు ఉండటం వేరు. వాటిని నలుగురికీ అర్థమయ్యేటట్లు విశదీకరించటం వేరు. ఈ కళలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించింది.

శ్రీ అయ్యగారి చక్రవర్తి - కుసుమ కోమల హృదయ సామ్రాజ్య చక్రవర్తి వాళ్ళది అన్యోన్య దాంపత్యం. వాళ్ళది అదర్శమయిన కుటుంబం. వాళ్ళిద్దరూ పూతావులవలె, శబ్దార్థాలవలె, పాలూనీరూవలె కలిసిపోయిన జంట. ఒకరు రాగమై, ఒకరు తాళమై పరవశులై పాడుకున్న భక్తి గీతం ఆ జంట. ఒకరు అమ్మ గుడిలో మౌనంగా వెలిగే దీపమయితే, మరొకరు మృదుమధురంగా నినాదించే గుడిగంట.

వారి కుటుంబం ఆర్థికపరమైన సుడిగుండంలో చిక్కినపుడు - వారు కనపర్చిన స్థిరచిత్తం, స్థితప్రజ్ఞ అరుదైనవి. అటువంటి క్లిష్ట పరిస్థితిలో వారి వెంట ఉండి అడుగడుగునా వారికి చేయూతనిచ్చి, వారిని ఒడ్డుకు చేర్చిన అమ్మ ఆ కుటుంబానికి ఆరాధ్యదైవం - కూర్మి నెచ్చెలి, మార్గదర్శిని, మంచి చెడ్డలను ఎప్పటికప్పుడు తెలియచెప్పిన గురువు.

వాళ్ళ జీవితాల్లో అమ్మ పడుగుపేకలవలె పెనవేసుకుపోయిందనటంలో అతిశయోక్తి లేదు. వాళ్ల జీవితాలనుండి అమ్మను విడదీయలేని మధురమయిన బంధం వాళ్ళది. అమ్మ స్ఫురణ, అమ్మ స్మరణ లేకుండా వాళ్ళ యింట్లో ఒక్క గడియ గడవదు. అమ్మ భక్తులకు వారిల్లు దేవాలయం.

కష్టాల్లో ఎవరయినా - భగవంతుడి యందు భక్తి శ్రద్ధలతోనే మెలుగుతారు. ఏరుదాటిన తర్వాత తెప్పను మరిచి పోనివాళ్ళే ఉత్తములు.

ఇన్నాళ్ళు అమ్మ దివ్యత్వపు వెలుగులో పులకించి పోయిన ఆ జంట - యిప్పుడు అమ్మ ఆదేశాన్ని, ఉపదేశాన్ని తమ జీవితాల్లోకి అనువదించుకుని తమ జీవితకేదారాల్లో పుణ్యసస్యాలను పండించుకుని మరింత అమ్మ అనుగ్రహానికి పాత్రులు కావటానికి వారు చేసే నిరంతర ప్రయత్నం లోకానికే మార్గదర్శకం.

నీకున్నది తృప్తిగా తిని - యితరులకు ఆదరంగా పెట్టుకో - అని కదా అమ్మ ఉపదేశం! ఈ గ్రంథాన్ని అలంకరించిన వ్యాసాలే కాక మరెన్నో మహిమాన్వితమయిన సంఘటనలు సోదరి కుసుమ జీవితంలో ఉండవచ్చు.

వాటన్నిటినీ కూడా శ్రద్ధాభక్తులతో అక్షరాల్లో నిబంధించి లోకానికి అందిస్తే ఎందరో భక్తులకు మహోపకారంగా ఉంటుందని భావిస్తున్నాను.

సోదరి కుసుమ 'మహతి' ని చేత ధరించి - తన దివ్యానుభూతులను రమణీయగీతాలుగా మలిచి మధుర మనోజ్ఞంగా, సరళ సుందరంగా, కుసుమకోమలంగా ఆలపిస్తుంటే - సహకారాన్ని అందిస్తే బాగుంటుందని ఉబలాటపడ్డాను, తత్ఫలితమే యీ రచన.

నాకు యీ అవకాశాన్ని అందించిన సోదరికి కృతజ్ఞుడను.

పరమదయాళువైన అమ్మ - తన అనుంగుబిడ్డ అయిన కుసుమపై, వారి కుటుంబ సభ్యులందరిపై - ఎల్లవేళలా తన శుభాశీస్సుల అమృతవర్షం కురిపించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.

అమ్మ చరణసేవలో
కొండముది రామకృష్ణ
28-1-97.



అమృతాశయం

'అమ్మ' అనే పదం అమృతానికి పర్యాయపదం. ఆప్యాయత, ఆర్ద్రత, అనిర్వచనీయమైన ఆనందం - 'అమ్మ' అనేపదానికి - అర్థాలుగా భాసిస్తాయి. ఆస్తికులకూ, నాస్తికులకూ అమ్మ కావాలి. పిపీలికాదిబ్రహ్మ పర్యంతం అమ్మ నుండే ఆవిర్భవించింది. త్రిమూర్తులు సైతం అనసూయాదేవి ఒడిలో పసిబిడ్డలై ఆమె వాత్సల్యామృతాన్ని ఆస్వాదించారు. చరాచరప్రపంచానికి ఆధారమయిన భూదేవిని 'భూమాత' అని పిలుచుకొంటున్నాము. సర్వసృష్టికీ ఆధారం అమ్మ. సర్వేశ్వరుడు ఒక అమ్మను ఆధారం చేసికొనే రామ, కృష్ణాద్యవతారమూర్తులుగా మానవలోకంలో ఆవిర్భవించాడు.

పరమజ్ఞానస్వరూపులయిన ఆదిశంకరభగవత్పాదులు జగన్మాతను స్తుతిస్తూ ఇలా అన్నారు.

"శివః శక్త్యా యుక్తో యదిభవతి శక్తః ప్రభవితుం
నచేదేవందేవో నఖలు కుశలః స్పందితు మపి।
అత స్త్వా మారాధ్యాం హరిహరవిరించాదిభిరపి
ప్రణంతుం స్తోతుంవా కథ మకృతపుణ్యః ప్రభవతి॥

(శివుడు శక్తితో కూడిఉంటేనే ప్రభువుకాగలడు. కానిచో ఆయనకు కదిలే సామర్థ్యం లేదు. హరి, హర బ్రహ్మలకు సైతం ఆరాధ్యమూర్తివైన నిన్ను నమస్కరించటంగానీ, స్తుతించటంగానీ పుణ్యంచేయని మానవులకు సాధ్యంగాదు). అందుకే 'మాతృదేవోభవ' అని శ్రుతి శాసిస్తున్నది.

జిల్లెళ్ళమూడి అమ్మను విశ్వజననిగా విశ్వసించి, ఆరాధించి ధన్యురాలయినదీ గ్రంథ రచయిత్రి శ్రీమతి కుసుమ. ఈమె మూర్తీభవించిన విశ్వాసం. ఆమె విదుషీమణిగాదు; కవయిత్రి గాదు. అమ్మ ప్రేమను అణువణువునా అనుభవించిన, నిండుమనస్సుగల సాధ్వీమణి. అమ్మను గూర్చిన తన భావాలను, ఆ తల్లినుండి తాను పొందిన అనుభవాలనూ ఆయాసమయాల్లో సరళమధురంగా వ్యాసరూపంలో వెలయించిన యీ రచయిత్రి వానిని ప్రస్తుతం 'దివ్యానుభూతులు' అన్న పేర గ్రంథరూపంగా ప్రకటిస్తున్నది. మనసు పెట్టి యిందలి వ్యాసాలను చదివితే పాఠకుల హృదయం దివ్యానుభవమయం అవుతుంది.

'విశ్వజనని అన్న వ్యాసంలో - "శ్రీ అనసూయాదేవిని గురించిన అధ్యయనంలో చిరుదీపిక ఈ వ్యాసం" అని రచయిత్రి చెప్పింది. నిజానికి ఈ గ్రంథంలోని వ్యాసాలన్నీ అజ్ఞానశోకాంధకారంలో కొట్టుమిట్టాడే బాధా తప్తమానవాళికి కమనీయకాంతినీ, మనశ్శాంతినీ నిరంతరం సమకూర్చే ఉజ్జ్వల కరదీపికలు.

ఈ గ్రంథం చదువుతుంటే క్రొత్తవారు ఆ అమ్మను చూడకపోతిమే అని కొంచెం బాధపడినా క్రమంగా అమ్మ విశ్వప్రేమసాగరంలో ఆనందంగా తేలియాడగలరు. ఇక అమ్మతో ప్రత్యక్షానుభవంగల అస్మదాదులు గతకాలిక మధురస్మృతులను మననం చేసికొంటూ నూతనోత్తేజం పొందుతారు. అన్ని వ్యాసాలలోను అమ్మ అనిర్వచనీయవాత్సల్యాన్నీ, విశ్వజనీనతనూ, విలక్షణవ్యక్తిత్వాన్నీ తన్మయత్వంతో చెప్పి పాండిత్యప్రాంగల్భ్యం లేని సామాన్య జిజ్ఞాసువులను ఆనందంతో పరవశింపజేసిందీ రచయిత్రి. ఈమె జీవితంలో ఎన్నో కష్ట, నష్టాలకు గురియై, చాలా విషమసమస్యలను ఎదుర్కొన్నది. అన్ని సందర్భాలలోను అమ్మయెడల గల అకుంఠిత భక్తి, ప్రపత్తులే కొండంత అండగా నిలిచి ఆమెను కాపాడినవి. భౌతికంగా దూరంగా ఉన్నా నిరంతర స్మరణతో అమ్మను తన హృదయ దేవాలయంలో ప్రతిష్ఠించుకొన్న పవిత్ర చరిత్ర యీ రచయిత్రి.

'అన్నయ్యా' అని నోరార ప్రేమగా పిలిచే వారికోసం తపించిన నాకు ఈ రచయిత్రి వంటి సోదరీమణులను వరంగా ప్రసాదించింది అమ్మ. ఈ రచయిత్రితో ప్రత్యక్షపరిచయం గల నాకు అమ్మలోని ప్రేమా, అప్యాయతా ఈమెలో పుంజీభవించినట్లు అనిపించేది. కుసుమ గురించి అమ్మ "నువ్వు నేను అనే భేదం లేదు. దానికి మన అనేకాని, వికసించిన పుష్పంలాంటిది అది. చదువంటే ఎంతశ్రద్ధో చూడు అంతపని చేస్తూ, కుట్లు కుడుతూ, బి.ఎ. కి కట్టింది. దాని మొహంలో ఎంతకళ, నిర్మలంగా, స్వచ్ఛంగా, అమాయకంగా వుంటుంది" అని అన్నది. ఈమె చూపిన వినిర్మల సోదర ప్రేమ నాహృదయంలో ఇప్పటికీ, ఎప్పటికీ చెరగని మధుర స్మృతిగానే ఉంటుంది. అనసూయా నామధారిణియైన అమ్మ వలన మనం నిజంగా నేర్చుకొనవలసిన ప్రధానపాఠం ఈ నిర్మల, నిర్వ్యాజసోదరప్రేమయే. ఈ ప్రేమయే క్రమంగా దివ్యప్రేమగా రూపుదిద్దుకుంఉటుంది.

కేవలం తన అనుభవాలనే కాక తాను అమ్మకు చేసేపూజలలో పాలుపంచుకొని, అచంచలవిశ్వాసంతో అమ్మను ఆరాధించిన యితరభక్తుల

అనుభవాలనూ, ఆ భక్తులతో సంబంధం గల వారికి అమ్మ సశరీరంగా సాక్షాత్కరించిన దివ్యానుభవాలనూగూడ రచయిత్రి యీ గ్రంథంలో చక్కగా వివరించింది. అంతేగాదు; ఆర్థికసమస్యలతో, కుటుంబకలహాలతో సతమతమయ్యే వారు అమ్మ అనుగ్రహంతో - కేవలం ఛాయాచిత్రరూపంతోనే - తమ, తమ, సమస్యలనుండి, కష్టాలనుండి గట్టెక్కినవైనం గూడ రచయిత్రి నిసర్గసుందరంగా చెప్పింది.

అమ్మ నిరుపమ, నిర్వ్యాజ, నిర్మల వాత్సల్యవివరణంతోబాటు భగవద్గీత మొదలగు పవిత్ర గ్రంథాల నుండి శ్లోకాలను ఉదహరించి, అమ్మ సూక్తులను పేర్కొని సాధకజనావళికి సరళమైన సాధనమార్గాన్ని గూడ రచయిత్రి చక్కగా చూపించింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ గ్రంథం 'అమృతాశయం' అనిపిస్తుంది.

అమ్మ సూచించిన శుభ్రమార్గంలో పయనిస్తూ దరహాసభాసురవదనంతో అతిథి, అభ్యాగతులకు యథాశక్తి ఆదర, సత్కారాలనుచేస్తూ, భర్తకు తలలో నాలుకగా ఉంటూ, కన్నబిడ్డల యోగక్షేమాలను చూచుకుంటూ, వేరొకవంక ఉద్యోగధర్మాన్ని నిర్వర్తించుకుంటూ, అన్ని సుఖ, దుఃఖసంఘటనల్లోనూ అమ్మ లీలా విశేషాలనే అనుభవిస్తూ పరిణామ రమణీయమయిన జీవనంలో పురోగమిస్తూ తన భవనమునే తపోవనముగా సంతరించుకొన్న ఆదర్శగృహిణి యీ రచయిత్రి. ఈమె వ్రాసిన యీ సరళగ్రంథం గార్హస్థ్యజీవనం గడిపే సోదర, సోదరీమణులకు శ్రేయోమార్గదర్శనం చేయించే అనర్ఘమయిన అక్షరదీపం.

ఈ సోదరికి అవగాహనతో గూడిన సహాయ, సహకారాలను అనన్య ప్రేమాభిమానాలను అన్ని వేళల అందిస్తూ ఈమె జీవితానికి ఏడుగడగా నిలిచి యీ రచనకూ ప్రోత్సాహమిచ్చిన సహృదయులు శ్రీ ఎ.ఎస్. చక్రవర్తిగారు బహధా ప్రశంసనీయులు. ఇద్దరూ అమ్మ యెడల అచంచల భక్తి, విశ్వాసాలు గలవారు. ఈ గ్రంథరచన చి॥ల॥సౌ॥ కుసుమదే అయినా ఈ గ్రంథానికి ఈ గ్రంథావిర్భావానికి సామోదస్ఫూర్తిదాత శ్రీచక్రవర్తిగారు. కావున ఈ రచన వీరిద్దరి సమిష్టి కృషిగా భావిస్తున్నాను.

కేవలవాత్సల్యజలధి అయిన అమ్మ ఈ ఆదర్శదంపతులకూ, వీరి కుటుంబసభ్యులకూ దీర్ఘాయురారోగ్యభాగ్యములను, సర్వశ్రేయములను ప్రసాదింపవలెనని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

గుంటూరు
22-12-1996.

విబుధజనవిధేయుడు
పన్నాల రాధాకృష్ణశర్మ

ఓం అమ్మ - అం ఆ శ్రీ

సమయకుసుమం

పురుషోత్తమ పుత్ర భార్గవ
పి. యస్. ఆర్. ఆంజనేయప్రసాద్

ఆధ్యాత్మిక వాదులు భౌతికవాదులు లోకంలో అనాదిగా ఉంటూనే ఉన్నారు. అమ్మ మాత్రం "ఆధ్యాత్మికము భౌతికము అంటూ రెండులేవు నాన్న! ఉన్నది ఒకటే" అన్నది. అమ్మ విజయవాడ వచ్చిన సందర్భంలో విలేఖరుల గోష్ఠి జరిగింది. విశాలాంధ్ర విలేఖరి కూడా వచ్చాడు. నాకు దైవం మీద నమ్మకం లేదమ్మా! అన్నాడు. "దేవులాడినా దొరకని వాడే దేవుడు" అని నిర్వచనం ఇచ్చిన అమ్మ "మంచిదే నాన్నా! దేవుడంటే ఏమిటి? నమ్మేవారు ఒక రూపాన్ని భావించి దేవుడు అంటున్నారు. నీవు నీ జెండా పట్ల నమ్మకంతో ఉన్నావు. అంటే వాళ్ళు నమ్మింది వాళ్ళకు దేవుడు, నీవు నమ్మింది నీకు దేవుడు. నమ్మకమే దేవుడు నాన్నా!" అని చెప్పింది. అతడు సంతృప్తి పడ్డాడు.

పై విషయం ఎందుచెప్పానంటే కుసుమ వ్రాసిన గ్రంథంలో ఎక్కువ భాగం అమ్మ యెడ విశ్వాసం గలవారి అనుభూతులే ఎక్కువ కనుక. అనుభవించిన అనుభవాన్ని కాగితం మీద పెట్టటం కష్టం. కుసుమ తన అనుభవాలనే కాక ఇతరుల అనుభవాలను కూడా సేకరించి గ్రంథస్థం చేసింది. ఆ విషయంలో కొంత కృతకృత్యురాలైంది. అమ్మ అనుగ్రహం ఆమె మీద ఆమె కుటుంబంపైన ఉన్నది. ఉన్నది అనటానికి కావలసిన ఉదాహరణలు ఈ గ్రంథంలో ఎన్నో ఉన్నాయి.

ఒకసారి కుసుమ అమ్మ సినిమాలో పాడిన పాటలలో ఎస్. వరలక్ష్మి పాట విని ఏడుపు గొంతులా ఉన్నది అని మనసులో అనుకుంటూ బైటకు అనేసింది. మరుసటిరోజు కుసుమ మాట్లాడుతుంటే వినేవారికి శోకతప్త కంఠంలోంచి వచ్చిన మాటలలా వినిపించినవని చెప్పారు. ఎవరినీ విమర్శించకూడదని అనుకుంది. "తనను తాను విమర్శించటం వివేకం. ఇతరులను విమర్శించటం అవివేకం" అన్నది అమ్మ. ఇక తరువాత కుసుమ అవివేకి కాదల్చుకోలేదు.

అమ్మ పూజలు ఆరాధనలు చేసుకునే వారికి ఆలయాలు ఏర్పాటు చేసింది. సేవా కార్యక్రమాలు చేసేవారికి ఆ రకమైన విద్యా, వైద్య, ఆదరణాలయాలు,

అన్నపూర్ణాలయము ఏర్పాటు చేసింది. "మానవత్వము మాధవత్వం" అన్న సూక్తి ఉన్నది. నిజానికి మానవత్వము మాధవత్వము వేరుకావు. సహజసిద్ధంగానే మహనీయులలో కలసిపోయి ఉంటాయి. జిల్లెళ్ళమూడిలో జరిగే సన్నివేశాలలో ఈ రెండూ ఏ పటాటోపం లేకుండా ప్రదర్శనలు కాకుండా సహజసిద్ధంగా వుంటాయి. గుర్తించటమే కావలసింది.

ఈ మధ్య జిల్లెళ్ళమూడిలో ఒక సమావేశంలో దేవాలయాల పట్ల చూపించవలసిన శ్రద్ధ చూపటంలేదని ఒకరు, సేవా కార్యక్రమాల పట్ల అసలే శ్రద్ధ కనిపించటం లేదని మరొకరు ఆవేశపడ్తుంటే అమ్మ రెండవ కుమారుడు రవి సంయమనశీలంతో రెండూ ఒకటికొకటి భిన్నములు కావు, రెండూ అప్పటి అవసరాన్ని బట్టి అవకాశాన్ని బట్టి చేయాలి, చేస్తూనే ఉన్నారు అని శాంతపరచటం జరిగింది.

ఒక సమయంలో కుసుమ వాళ్ళ కుటుంబం ఈతి బాధలు తట్టుకోలేక అమ్మతో అప్పులు తీరి బయటపడితే చాలమ్మా! అన్నారు. "ఇంకేం కోరికలు లేవా?" అన్నది అమ్మ. మనకేం కావాలో అమ్మకు తెలిసినంతగా మనకు తెలియదు. తర్వాత వారి కుటుంబం అమ్మ అనుగ్రహంతో ఎంత వైభవస్థితికి వచ్చిందో మనం చూస్తూనే ఉన్నాము. కష్టాలలో కుసుమ దంపతులను అనుగ్రహించి కూతురు పెళ్ళి చేయటమే కాదు, అడగకుండానే కొడుకు ఉపనయనం కూడా వైభవంగా చేసి పంపిన అమ్మ పట్ల వారికి అచంచల విశ్వాసం ఉండటంలో ఆశ్చర్యం లేదు.

అమ్మ వద్దకు వచ్చేవారిలో ఎవరి ప్రాప్తం వారిది. ఒక వృక్షం ఉన్నది దానికి పూత పూస్తుంది, పూలు పూస్తాయి, కాయలు కాస్తాయి, పండుతాయి కూడా. అయితే పూతకాలంలో రాలిపోయేవి కొన్ని, పూలు పిందెల కాలంలోనే రాలిపోయేవి కొన్ని, పండి పక్వస్థితికి వచ్చేవి కొన్ని. అమ్మ అనే కల్పవృక్షం నీడన పక్వానికి వచ్చిపండిన ధన్యులెందరో?

ఒక శిల్పి మట్టి బొమ్మలు, పంచదార బొమ్మలు, చెక్కబొమ్మలు, మెటల్‌బొమ్మలు ఎన్నో సృష్టించి సముద్రంలో వేస్తే కరిగిపోయేవి కొన్ని, తేలిపోయేవి కొన్ని, ఎంత కాలమున్నా అలాగే పడివుండేవి కొన్ని ఉంటాయి. అమ్మ మాత్రం అనుగ్రహ స్వరూపిణి. అందరినీ తన బిడ్డలుగానే భావిస్తుంది. సుగతినే ప్రసాదిస్తుంది కాస్త ముందు వెనకగా.

అలా అమ్మ దయాసముద్రంలో, అనురాగ జలధిలో తరించిపోతున్నది కుసుమాచక్రవర్తి కుటుంబం. అమ్మ తనను ఆరాధించే నిమిత్తం వారికి ఆలయాన్ని ప్రసాదించింది. ఆలయం నిర్మించటం వేరు, నిత్యం ఆరాధించటం వేరు. ఎంత శ్రమతో కూడినపనో చేసేవారికి తెలుస్తుంది. అయితే ఆ కుటుంబం దానిని తమ జీవనంలో భాగం చేసుకున్నారు అనేకంటే అదే జీవనం చేసుకున్నారు అంటే ఇంకా బాగుంటుంది.

బృందావనంలో నిరంతర జాగృత కృష్ణచింతనాపరులను చూచాను. మనతో మాట్లాడుతున్నా కృష్ణయ్యకు పాలు పట్టే సమయమో, భోగ్ పెట్టే సమయమో అయితే వారు వెంటనే లేచి ఆ పని చేసిన తరువాత వచ్చి మాట్లాడుతారు. వాళ్ళ ఇండ్లలో ఉన్న కృష్ణుడు ప్రాణ సహితమైన బాలునిగా చూచి ఆరాధిస్తారు. సేవ చేస్తారు తప్ప ఒక విగ్రహంగా చూడరు.

అలాగే కుసుమాచక్రవర్తులిద్దరూ అమ్మకు పాలు సమర్పించటం కాని, పూజ చేయటం గాని, నివేదనలు గాని సమయభావం కాకుండా చేయటం నేను గమనించాను.

కంచి పరమాచార్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీస్వామి నడిచే దేవునిగా లోకంలో ప్రసిద్ధులు. అందరూ తమ వద్దకు పూలు, పండ్లూ, కానుకలు తీసుకువస్తుంటే" ఇవి కాదు నాకు కావలసింది ప్రతిరోజూ కనీసం 10 నిముషాలు భగవంతుని ధ్యానించే సమయం దానం చేయండి" అన్నారుట.

కుసుమ, చక్రవర్తులిద్దరూ వారి సమయాన్ని, జీవనాన్ని అమ్మకు దానం చేస్తున్నారు. అదృష్టవంతులు 'ధ్యాసే ధ్యానం' అన్నది కనుక అమ్మ వారికా ధ్యాసను అనుగ్రహించింది. సమయ కుసుమాన్ని అమ్మ పాదాలపై సమర్పించే అవకాశాన్నిచ్చింది. దివ్యానుభూతులు అనగా దివ్యమైన అనుభూతులు లేదా దైవానికి సంబంధించిన అనుభూతులు. వాటన్నింటిని ఏర్చి కూర్చి పదబంధం చేసి కుసుమ వాటిని అక్షర సుమహారంగా అమ్మకు సమర్పించింది.

నామాట

అనంత కారుణ్యమూర్తి ప్రేమమయి అయిన అమ్మ వాత్సల్యాంభోనిధిలో తనివితీరా ఓలలాడినవారు అనేక లక్షలమంది వున్నారు. వారిలో కొందర 'మాతృశ్రీ అధ్యయనపరిషత్‌లను' మరికొందరు 'అమ్మ సేవాసమితి' లను స్థాపించి, అమ్మ సేవకు పాత్రులవుతున్నారన్న సంగతి అందరికీ తెలిసినవిషయమే. అమ్మకు అందరం బిడ్డలమేకదా! వీరిలో ఆధ్యాత్మికవాదులు, యోగులు, మునులు, పీఠాధిపతులు, పండితులు, పామరులు, నాస్తికులు కూడ వున్నారు. ప్రతివారికి ఒక్కో ప్రత్యేకత. అమ్మ ఎప్పుడూ, ఎవరికీ, ఏదీ ప్రత్యేకంగా చెప్పేదికాదు, అన్యాపదేశంగానో, వేరొకరిని ఉపకరణంగా చేసుకొనో చెప్పేది. తనబిడ్డలు కష్టాలలో వున్నప్పుడు, అజ్ఞానాంధకారంలో కొట్టుకుపోతున్నప్పుడు వారి జీవితాలలో వెలుగునింపుతూ, సరియైనమార్గాన్ని చూపుటకు శ్రీశ్రీశ్రీపూర్ణానందస్వామి - శ్రీశైలం, శ్రీశ్రీశ్రీలక్ష్మణయతీంద్రులు - ముముక్షుపీఠాధిపతులు, మాష్టర్ ఇ.కె. వరల్డ్ టీచర్సు ట్రష్టు, శ్రీశ్రీశ్రీవిశ్వంజీ - గుంటూరు, మాష్టర్ ఎ.వి.వి. ప్రసాదురావుగారు - విశాఖపట్నం మొదలగువారిని అమ్మ మనకు ప్రసాదించింది.

వరప్రసాదురావుగారిని, అమ్మ వరంగా మాకు ప్రసాదించటవే విశాఖఅధ్యయనపరిషత్ ప్రత్యేకత. ఆయనే అధ్యయనపరిషత్ ప్రెసిడెంట్ కూడ. వారిని మేమందరము మాష్టారుగారనే పిలుస్తాము. ఆయన మాకే కాకుండా అనేక మందికి పెద్దదిక్కు. ఆయన ఇల్లే మా ఆఫీసు, మా అందరిఇల్లు, మాష్టారుగారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలే అమ్మ, నిరంతరం అమ్మ ధ్యాసలోనేవుంటూ, అమ్మ యొక్క సాక్షాత్కారాన్ని ఎల్లప్పుడూ దర్శిస్తున్న 'మహామనీషి' ఆయన. వారి దగ్గరకు వచ్చేవారికి అసంభవమనుకున్న విషయాలు కూడ సంభవమని అమ్మ చెబుతోందని అంటారు. అవి అలా జరగటం చూస్తే అనూహ్యంగా వుంటుంది. ఈయన ప్రిడిక్షన్సు, ఎస్ట్రాలజీకి విరుద్ధంగా, అతీతంగా వుంటాయి. ఆయన ద్వారా అమ్మ పలుకుతోందని, అమ్మ యొక్క కరుణా కటాక్షాలకు అంతు, దరిలేదనిపిస్తుంది. మనమేదైనా సందేహం వెలిబెచ్చినా, అమ్మ చెప్పింది కాబట్టి జరిగితీరుతుందని ఘంటాపదంగా చెప్తారు. ఒకవేళ చెప్పిన సమయానికి జరగకపోయినా, అమ్మ కాలస్వరూపిణి కనుక జాతకాలను, మంచి చెడులను చదరంగంలో పావులను మార్చినట్టుగా మారుస్తుంటుంది. (జరగకపోవటమంటూ వుండదు)

విశాఖ అధ్యయనపరిషత్ మరోప్రత్యేకత ఏమిటంటే ఒకే తాటికి కట్టుబడి ఒకేమాట, ఒకేబాటగా నడవటం. అభిప్రాయాలు వేరైనా, ఏదైనా కార్యక్రమం తలపెడితే ఏకగ్రీవంగా ఆమోదించటం, ఆచరించటమే సభ్యులవంతు. విశాఖ అధ్యయనపరిషత్ సర్వశ్రీ మాష్టారు ఎ.వి.వి. ప్రసాదరావు, ఎ.ఎస్.చక్రవర్తి, గంటి వెంకట్రావు, చాగంటి శరభలింగం, ఎ.వి.యల్. నరసింహారావు, టి.కేశవశర్మ, కె.కామేశ్వరరావు, సన్యాసిరావు, చంద్రమౌళి, కాంతారావు, శ్యామ్, సరస్వతి అక్కయ్య మొదలైనవారితో ప్రారంభింపబడి తరువాత సర్వశ్రీ భవానీప్రసాద్, సత్యన్నారాయణరాజుగారు వారి బంధువర్గం, గవర్రాజు, వి.లక్ష్మి జె.యస్. యన్. మూర్తి వారి కుమారులు, కృష్ణశర్మ, లలిత, సత్యన్నారాయణ, సరళ, డి.సీతాదేవి కస్తూరి మొదలగు వారితో విశాఖమాతృశ్రీ అధ్యయన పరిషత్ మూడుపూలు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. అమ్మ మందిరంలో మాతృశ్రీ పూజా సర్కిల్ సభ్యులు ప్రతి శుక్రవారం, అమావాస్య, పౌర్ణమి రోజులలో సామూహికంగా అమ్మను అర్చించుకోవటం విశేషం ప్రతి మంగళవారం లలిత కోవెలలో అమ్మ పూజ జరిపించుకుంటోంది.

అధ్యయనపరిషత్ వటవృక్షంలా ఇంకా, ఇంకా శాఖోపశాఖలుగా విస్తరిల్లి, అమ్మ సేవచేసుకునే ప్రాప్తం మాకు కలిగించాలని జగన్మాతయైన అమ్మను మనసారా ప్రార్థిస్తున్నాను.

అమ్మసేవలో

సెక్రటరీ,

ఎ.ఎస్.చక్రవర్తి

విశాఖఅధ్యయనపరిషత్.

నివేదన

'దివ్యానుభూతులు' అన్న వ్యాససంపుటికి నన్ను ఉపకరణంగా చేసుకున్న అమ్మ కరుణాకటాక్షాలకు, అనంతవాత్సల్యప్రసారానికి మనఃపూర్వకసాష్టాంగ నమస్కారములర్పిస్తున్నాను. ద్వితీయ ముద్రణలో ఆశీస్సులందించిన, కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారికి నమోవాక్కములు. గ్రంథ ఆవిష్కరణ వారి చేతుల మీదగా జరగటం నా పూర్వజన్మ సుకృతం.

సమయ కుసుమాన్ని అందించిన పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ అన్నయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ రచనకు శ్రీకారం చుట్టటానికి, అవ్యాజమైన అభిమానంతో 'అమృతాశయాన్ని అందించిన అన్నయ్య శ్రీపన్నాల రాధాకృష్ణశర్మగారి ప్రోత్సాహం, శ్రీ రామకృష్ణ అన్నయ్య సలహాలు, శ్రీ లక్ష్మణరావుగారి సహకారం కొండంత అండగా వున్నాయి.

మొట్టమొదటినుంచి నాకు రచన చేయటానికి స్ఫూర్తినిచ్చిన మా ఆయన శ్రీ ఎ.ఎస్.చక్రవర్తి గారికి సర్వదా కృతజ్ఞతాపూర్వక సుమాంజలి. రామకృష్ణ అన్నయ్య 'సహకారవాద్యం', శ్రీ పన్నాల రాధాకృష్ణశర్మగారి 'అమృతాశయం'తో 'దివ్యానుభూతులు' మధురమనోజ్ఞంగా రూపుదిద్దుకున్నాయి. వారికి నా కృతజ్ఞతాభివందనములు.

ముద్రణకు ఇతోధికంగా తోడ్పడిన నాకుటుంబ సభ్యులకు ఆశీస్సులు, అధ్యయన పరిషత్ సభ్యులకు నా హృదయపూర్వక నమస్కారములు. మాతృశ్రీ విశాఖ అధ్యయన పరిషత్ ప్రెసిడెంట్ గారైన మాష్టారు, ఎ.వి.వి. ప్రసాదరావుగారు సహస్రాధిక ప్రణామములు సమర్పించుకుంటున్నాను. గ్రంథావిష్కరణకు సహాయ సహకారాలందించిన శ్రీవాడరేవు సుబ్బారావు గారికి, వారి శ్రీమతి మధురవాణి గారికి కృతజ్ఞతాపూర్వక నమస్కృతులు. మాతృశ్రీలో వ్యాసాలు చదివి నన్ను ప్రోత్సహించిన వసుంధర, భ్రమరాంబ, లలితాంబ అక్కయ్యలకు, డా॥ఝాన్సీ కి, అనేక మంది పాఠకులకు విశ్వజననియైన అమ్మ సకలశుభాలను, ఆయురారోగ్యభాగ్యాలను ప్రసాదించాలని కోరుతున్నాను.

గ్రంథాన్ని సకాలంలో, సర్వాంగ సుందరంగా ముద్రించిన **సత్యం** ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్ వారి యాజమాన్యానికి, సిబ్బందికి నా ధన్యవాదాలు.

అమ్మతత్వాన్ని మననం చేసుకొనుటకు ఈ వ్యాసాలు సహకరించగలవని ఆశిస్తూ ఈ చిరుకానుకను **"మాతృశ్రీ అనసూయ మహాదేవి"** కి సమర్పిస్తున్నాను.

ఇట్లు
అమ్మ చరణ సేవలో
కుసుమ

అంఆ

దివ్యానుభూతులు

1. అమ్మ
2. కారుణ్యమూర్తి
3. కన్నతల్లి - కల్పవల్లి
4. దైవం తలిస్తేనే
5. అమ్మ లీలావినోదం
6. అపదుద్ధారిణి - అనందసంధాయిని
7. అమ్మ నామామృతం - గీతగానామృతం
8. అనుగ్రహస్వరూపిణి - అమ్మ
9. ఆనందప్రదాయిని - అమ్మ
10. ఆధ్యాత్మికత - అమ్మ
11. విశ్వమానవసౌభ్రాతృత్వము - అమ్మ
12. ప్రేమస్వరూపిణి - అమ్మ
13. అమ్మ - మహాసమాధి
14. అమ్మ - వారసులు
15. నామసంకీర్తన
16. వాత్సల్యస్వరూపిణి
17. వాంచితార్థప్రదాయిని
18. దివ్యానుభూతులు - అమ్మ
19. విశ్వజనని
20. అనురాగస్రవంతి - అమ్మ
21. భగవదనుగ్రహం - అమ్మ
22. కారుణ్యసింధువు
23. ప్రేమైకమూర్తి
24. అనురాగజలధి
25. వాత్సల్యజలధి
26. అర్చన - అమ్మ
27. మధురస్మృతులు
28. ఆత్మవిశ్వాసం - అమ్మ
29. ఆత్మనిగ్రహం - అమ్మ
30. యోగం - అమ్మ
31. జీవితాశయం - అమ్మ
32. కామితార్థప్రదాయిని
33. భగవత్సాక్షాత్కారం
34. అవ్యాజకరుణామయి
35. అమ్మసాన్నిధ్యం
36. పదహారుఫలాలనోము
37. భావనామాత్రసంతుష్టహృదయ
38. అనురాగమయి - అమ్మ
39. ఆధ్యాత్మికసాధన
40. తపస్సు - అమ్మ
41. విశ్వవందిత - అమ్మ
42. విశాఖపట్నంలో 'అమ్మ' ఆలయ శంఖుస్థాపన
43. అమ్మ 'దీవెన'
44. క్షిప్రప్రసాదిని - అమ్మ
45. అమ్మ దయ
46. పిలిస్తే పలికే దైవం
47. వాత్సల్యామృత వర్షిణి - అమ్మ
48. అమ్మ విశాఖ పక్షపాతి
49. ఆర్తి - ఆవేదన
50. ఘటనాఘటన సమర్థ అమ్మ
51. అవధూత కాని అవధూత
52. రోగ పర్వత దంభోళి - అమ్మ
53. మానవత్వం+మాతృత్వం+దైవత్వం = అమ్మ
54. కరైకల్‌లో అమ్మ దేవాలయం
55. ప్రేమావతారం - అమ్మ
56. అందరింటి అమ్మమ్మ
57. భయాపహ - అమ్మ
58. ప్రదక్షిణలు
59. "విశాఖలో అమ్మ విగ్రహ ప్రతిష్ఠ"
60. మృత్యుదారు కుఠారిక - అమ్మ



శ్రీ చక్రవర్తిగారు, శ్రీమతి కుసుమాచక్రవర్తి

దివ్యానుభూతులు

అమ్మ

ప్రాచీన భారతీయ సంస్కృతి ఎంతో విలువైనది. మన ఆర్షవిద్యను లోకానికి అందించిన కృష్ణద్వైపాయనుడు దానిని లోకానికి అందుబాటులోకి తెచ్చిన త్రిమతాచార్యులు చిరస్మరణీయులు. వారి వల్లనే మన ప్రాచీన భారతీయ సంస్కృతి సజీవమై విరాజిల్లుతోంది. పాశ్చాత్య వ్యామోహంలో కొట్టుకుపోతూ మన సంస్కృతిని కాదనటం అవివేకం. రామతీర్థులు అమెరికాలో ఉపన్యసిస్తూ "భారతదేశాన్ని త్యాగమూర్తులు ఏలుతారని ఇక్కడ వెలిగే ఆధ్యాత్మిక చైతన్యం ప్రపంచానికి శాంతిని అందిస్తుందని, గొప్ప గొప్ప సన్యాసులు భారత భూమిపై ఉద్భవిస్తారని" చెప్పారు. "అమ్మను" చూస్తే ఆ కాలం వచ్చిందనిపిస్తుంది.

మానవత్వపు తెరచాటున తన దైవత్వాన్ని దాచుకుంటూ మన సహజావసరాలకు అనుగుణంగా భూమిక లేర్పరచి, మనకు అలౌకికమైన ఆనందాన్ని కలుగచేస్తోంది 'అమ్మ'. మన తలపులలో 'అమ్మ' నడయాడినప్పుడు మనకు కలిగే వివశత్వాన్ని ఏవిధంగా వర్ణించగలము? మనలోని అల్పత్వాన్ని తుడిచిపెట్టి, వ్యక్తిత్వపు ఔన్నత్యాన్ని వికసింపచేసే 'అమ్మ' ను కొలవటానికి ఏ కొలబద్ద సరిపోతుంది? విశ్వకుటుంబిని అయిన అమ్మ అందరికీ 'అమ్మ' గా తోస్తూ వారి వారి ఆర్తిని, దీనతను, వ్యధలను పారద్రోలి ప్రశాంతచిత్తులుగా చేయగలిగిన శక్తి 'అమ్మ' కే కలదు.

ఈ సమాజంలో ఎదిగీ ఎదగక దారీతెన్నూ తోచక కొట్టుమిట్టాడే ప్రజాళికి 'అమ్మ' మాటలు ముత్యాలసరాలు. మన ఆవేదనను తన అనురాగంతో

తల్లి అంటే తొలి.

తుడిచిపెడ్తుంది. మన హృదయవేదనను మనకు తెలిసేటట్లు చేసి, దయతో, సానుభూతితో చూచే చూపులో, స్వార్థరహిత ప్రేమ జాలువారుతుండగా మన కన్నీరు తుడిచి ధైర్యం 'అమ్మే' చెప్తుంది. మనమేమిటో మనకు తెలియక, మన గమ్యం ఏమిటో తెలియని మనకు గమ్యాన్ని చూపి అవ్యక్తానందాన్ని చేకూరుస్తుంది. ఇటు వర్తమానంలో, అటు భవిష్యత్‌లో వూగుతూ సంశయాలతో ఆశయే జీవితంగా జీవిస్తుంటాం. ఒకేరకమైన పరిస్థితులు ఎదురైనా అందరం ఒకే విధంగా తలవంచం. భిన్నమైన ఈ ప్రవర్తనలు చూస్తే వ్యక్తిత్వాల అంతరాలలో ఏదో నిలకడ, హృద్యంగా, పరిస్థితులను బట్టి చిత్రించుకుంటుందేమోననిపిస్తుంది. భిన్న భిన్న వ్యక్తిత్వాలకు హాయినీ తృప్తినీ, కలుగచేసి, సేదతీర్చి ఒక గమ్యం చూపిస్తుంది. వ్యక్తిత్వాల స్వేచ్ఛను అరికట్టినట్లు గాక వారికి గమ్యం, గమనం తానై, విశ్వకుటుంబినియై, స్వార్థమయ సంకుచితత్వం నుంచి విశాల, సమిష్టి సమాజ నిర్మాణానికి దారి తీస్తోంది 'అమ్మ'.

'అమ్మ' మనకు ఇది చేయండి, అది చేయండని చెప్పదు కాని అన్యాపదేశంగా ప్రాచీన సంస్కృతికే నీరాజనం పడుతున్నట్లు వుంటుంది. అమ్మ ఏ నోములు నోచలేదు. ఏ వ్రతాలు, పూజలు చేయలేదు. "నేనంటూ ఏ సంప్రదాయాన్ని పాటించడంలేదు" అంటూనే నోములు నోచుకునే వారిని అమ్మ ప్రోత్సహిస్తుంది. నోముల్లోని పరమార్థాన్ని వివరిస్తుంది. అన్ని నోములకు లక్ష్యం ఒకటేనంటుంది. అంతా అదేనని సోదాహరణగా మనకు బోధించటానికి అన్ని నోములు అంటుంది.

ఆస్తికులకు పరమాత్మగా, నాస్తికులకు భయం కలిగించే ప్రజ్ఞాశాలిగా అన్ని మతాల వారికి ఆరాధ్యంగా వున్న 'అమ్మ' తనను దర్శించక పూర్వమే

వికారంతోనే ఆకారం వచ్చింది.

కొందరికి సాక్షాత్కరించింది. విశ్వకుటింబినిగా అందరికీ అమ్మగా తోస్తుంది. అమ్మ దయతో ప్రశాంత చిత్తులౌతారే తప్ప, ఆమె ఎవరికి 'మానవి'గా తోచదు. అందువల్లే ఎవరూ అమ్మను భోంచేసారా అని అడగటం జరగదు. అందర్ని అమ్మ 'భోంచేసిరండని' అనటమే పరిపాటి.

అమ్మ విధానం విధియై సృష్టిసహజంగానే వున్నట్లుంటుంది కాని ప్రత్యేకత తోచదు. అతీతమైన ఆ మహనీయత భక్తిని రేపుతూ మూఢతకు తావీయక సునిశితమైన తర్కంతో విజ్ఞాన విషయ వివరణలతోకూడి వుంటుంది. అమ్మ దగ్గర జరిగే నామసంకీర్తన, పూజలు, ఉత్సవాలు, వివాహాలు, పాదపూజలు ప్రాచీన సంప్రదాయానికి ప్రతీకలుగానే నిలుస్తాయి. అమ్మలోని ఆప్యాయత, దయ, ప్రేమ, అనురాగానికి కట్టుబడిపోవటమే కాని వేరొక ఆలోచనలకు తావివ్వవు.

రమణమహర్షి "మహాత్ముల సన్నిధి ఆర్తులకు ప్రయోజనకారి. వారు చిక్కితే వదలకుండా వుంటే చాలు" అన్నారు. మన అదృష్టవశాత్తు 'అమ్మ' మనకు లభ్యమయింది, కాని మన 'అమ్మ' మనం మరచినా తాను మరువదు. మనం వదిలినా తాను మనను వదలకుండా వుండి మనకు గమ్యం, గమనం తానే ఔతున్నది.

కారుణ్యమూర్తి – అమ్మ

1969 మే 8వ తేదీన మా చెల్లెలి వివాహసందర్భంగా పెళ్ళికి వచ్చిన చుట్టాలతో ఇల్లంతా సందడిగా వుంది. 7వ తారీఖు సాయంత్రం మా అమ్మకి అనారోగ్యం వల్ల చాలా సీరియస్ అయి మాటా మంతి లేకుండా కోమాలో వున్నది. డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. నిస్సహాయ పరిస్థితి. పెళ్ళి జరుగుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నాం. ఆ సమయంలో జిల్లెళ్ళమూడి నుంచి

ప్రపంచమూ, పరమార్థమూ వేరుకాదు.

మా అన్నయ్య అన్నంరాజు రామకృష్ణారావు పెండ్లికి వచ్చాడు. అచ్చటి పరిస్థితి చూచి నిశ్చేష్టుడైపోయి, అంతలోనే తేరుకొని అమ్మ బట్టలు కుంకుమ, తీర్థం ఇచ్చింది. కాబట్టి పిన్నికి తప్పకుండా తగ్గుతుందని, మా అమ్మగారికి బొట్టుపెట్టి తీర్థం నోట్లోవేశాడు. రెండు గంటల నుంచి స్పృహలో లేని మా అమ్మ సంజీవిని తగిలినట్లుగా లేచి కూర్చుంది.

జిల్లెళ్ళమూడిలో అన్నయ్య స్థిరనివాసమేర్పరుచుకున్నాడు. అక్కడ నుంచి ఎవరు ఎక్కడికి వెళుతున్నా అమ్మతో చెప్పిరావటం ఆనవాయితి. అందుకని అన్నయ్య "బాబాయి కూతురు పెండ్లికి గుంటూరు వెళ్తున్నానమ్మా" అంటే మా అమ్మగారి గురించి "దానికి పుట్టింటివారు ఎవరు లేరు నాన్నా! అని తానే మా అమ్మకు నాన్నకు, చెల్లెలికి మధుర్కం బట్టలు ప్రసాదించి దాంతోపాటు కుంకుమ, తీర్థం కూడా ఇచ్చింది. అప్పటికి మా ఇంట్లో ఎవరూ ఎక్కువగా అమ్మ దగ్గరకు వెళ్ళటం లేదు. మా అమ్మకు పుట్టింటివారు ఎవరులేరన్న సంగతి తెలిసేందుకు అవకాశం లేదు. అడగకుండానే కుంకుమ, తీర్థం ఈ విషమ పరిస్థితి నుంచి తప్పించటానికే 'అమ్మ' ఇచ్చిందని అన్నయ్య అన్నాడు. పెండ్లి జరగదేమోనని కంగారుపడుతున్న మాకు ధైర్యాన్ని కలుగజేసి పెండ్లి జయప్రదంగా జరిపించటం అమ్మ మహిమే కదా!.

పెండ్లి హడావిడి తగ్గిన తరువాత జిల్లెళ్ళమూడి వెళ్దామనుకుంటే మా మురళీ అన్నయ్యకు విపరీతంగా జ్వరం రావటంతో వెళ్ళలేకపోయాము. నేను వైజాగ్ వచ్చిన తరువాత మిగిలిన వాళ్ళందరూ అమ్మ దర్శనం చేసుకున్నారు.

అక్టోబర్‌లో మా అమ్మ చేతికి ఆపరేషన్‌కని నేను గుంటూరు వెళ్ళాను. తీరా వెళ్ళాక ఆపరేషన్ చేయటం లేదని, జిల్లెళ్ళమూడి అమ్మ హోమియోవైద్యం చేయించమన్నారని తెలిసింది. అమ్మ అంటే మీకు మక్కువ, భక్తి వుండచ్చు

పరిణామమే కాని నాశనం లేదు.

పూజలు చేసుకోవచ్చు కాని డాక్టర్లు ఆపరేషన్ చేయనిదే చెయ్యి సరిగా రాదని చెప్పారు కదా మానేస్తే ఎలా తగ్గుతుందని వాదించాను. దానికి మా నాన్నగారు, మీ అమ్మ ఒప్పుకుంటే నేను ఆపరేషన్ చేయిస్తానని అన్నారు. కాని మా అమ్మ ససేమిరా ఒప్పుకోలేదు.

చెయ్యి విరిగినప్పటి నుంచి 'అమ్మ' చేతి స్పర్శ తగిలితే తనకు తగ్గుతుందని మా అమ్మగారి నమ్మకం. కుంకుమ పొట్లాలు తీసుకునేటపుడు 'అమ్మ' చెయ్యి తగిలితే చాలు, చెయ్యి తగ్గుతుందని తాను చేయి పైకి పెట్టిన కొద్ది ఇంకా పై నుండి కుంకుమ పొట్లాలు ఇచ్చిందిట. ఆపరేషన్ చేయించుకోవటానికి సిద్ధపడి 'అమ్మ'కు నివేదించుకుందామని వెడితే నొప్పి నొప్పి అని కూర్చుంటే తగ్గుతుందా ఆ చేత్తో అన్నీ చేయవచ్చని బక్కెట్టు, చెంబూ మోయించిందిట. ఏ పని చేయటానికి వీలు లేకుండా బూరెలా వాచిన చెయ్యి 'అమ్మ మాటే మంత్రం'లా వాపు తీసేయటమే కాక, నొప్పి కూడ తగ్గి మామూలుగా తన పనులన్నీ చేసుకోగలిగింది. డబుల్ ఫ్రాక్చర్ అయ్యింది ఆపరేషన్ అయితే కాని చెయ్యి సెట్ అవ్వదన్న డాక్టర్ల మాటకాక 'అమ్మ మాటే మంత్రం'లా పని చేసింది. దేనికి తన కర్తృత్వానికి ఒప్పుకోదు, దానికి తగ్గే రోజు వచ్చింది తగ్గిందని మాయ తెరలు వేస్తుంది అమ్మ.

నేను గుంటూరులో వుండగానే రామకృష్ణ అన్నయ్య వచ్చి జిల్లెళ్లమూడి వస్తావా అంటే, అందరూ చూసారు కదా ఏ నమ్మకం లేకపోయినా పెద్ద ముత్తయిదువును చూచినందున పోయేది ఏముందని వెళ్ళాను. ఆవరణలో సందడి, హడావిడి చూచి ఇక్కడ ప్రశాంతంగా లేదు. దువ్వాడ 'కుసుమహరనాథ ఆశ్రమం' చాలా బాగుంటుందని ప్రశాంతంగా హాయిగా వుండవచ్చని మా అన్నయ్య పిల్లలతో వాదించాను.

మరుపే మరణం.

సాయంత్రం 6 గం॥లకు అమ్మ ఆరుబయట మంచం మీద కూర్చుని ఉండగా బాబాయి కూతురు కుసుమ అని పరిచయం చేసాడు. అమ్మను చూచిన క్షణం నుంచీ నాలో నాకే తెలియని మార్పు కలిగింది. నేను చాలా రోజులుగా రావాలనుకుంటున్నాను అందరూ వచ్చారు, కానీ నేనే రాలేదని చెప్పాను. దానికి అమ్మ 'నీవు రావాలని అనుకున్నావు కానీ నేను అనుకోలేదు కదా' అన్నది. దీని వల్ల అర్థమయ్యేది ఏమిటంటే మనం రావాలని అనుకున్నా అమ్మ తలుచుకోనిదే మనం అమ్మ దగ్గరకు వెళ్ళలేము. 'దేనికైనా తరుణం రావాలి కదా' అని అంది. దీని వలన మనం ఏమీ చేయలేమని మనని ఆడించే శక్తి మరియొకటి వున్నదని బోధపడుతుంది.

సంధ్యావందనం జరుగుతున్నది, అక్కడకు వెళ్ళికూర్చోమంది. నాకు కొత్తగా ఉండటం వల్ల వాళ్లు పాడేది వింటూ యధాలాపంగా అమ్మ కూర్చున్న దిక్కుకు చూచాను. అక్కడంతా శూన్యంలా కనిపించింది. ఇప్పుడే కదా నేను అక్కడ నుంచి వచ్చింది. ఈ కాసేపటిలో ఇది ఎలా సంభవమని, నేను అసలు తెలివిలో ఉన్నానా లేదా అని నన్ను నేను గిల్లి చూచుకున్నాను. ఒక పక్క వాళ్ళపాటలు వినపడుతున్నాయి. మళ్ళీ కుతూహలంతో శూన్యంగా ఉన్న దిక్కు చూచాను. అక్కడ నిలువెత్తు 'కుసుమహరనాథులు' దీవించుతున్నట్లుగా తోచింది. నా ఆనందానికి అవధులు లేవు. అంతులేని ఆశ్చర్యంతో, మానవనైజంతో మళ్ళీ ఇటుతిరిగి, అటు తిరిగేటప్పటికి అంతా శూన్యమే. ఇంకా కాసేపు ఆమూర్తులనే చూడని నా మూర్ఖతకు నిందించుకున్నాను. మళ్లీ యధాస్థితిలో అనగా అమ్మ, అమ్మకూర్చున్న మంచం చుట్టూ అన్నయ్యలు కనిపించారు. నాలో నాకే తెలియని ఆనందం ఆవేశం, ఉద్రేకం కలిగాయి. ఇది ఎలా సంభవించింది. కాసేపటికి 'అమ్మే' అన్నీ అని, సర్వాంతర్యామి,

విశ్వజనని, ఆవిడలేనిది ఏదీలేదని విపరీతమయిన ఆనందంతో అంతకు పూర్వము ఎన్నడూ ఎరుగని అనుభూతిని పొందాను.

సంధ్యావందనం ముగిసిన తరువాత 'అమ్మ'కు అందరూ నమస్కారాలు చేసుకుంటుంటే నేను మళ్ళీ మనస్ఫూర్తిగా నమస్కరించాను. అప్పుడు అమ్మ 'తృప్తిగా వున్నదా' అని అడిగింది. దానితో నేను మరీ అయోమయావస్థలో పడ్డాను. ఏమిటీ ఈ అమ్మ మనసులో కూడ దూరి మన సంగతి గ్రహించగలదా! అని ఆశ్చర్యపోయాను.

మర్నాడు నవరాత్రులు మొదలైనందున, విశేషపూజలతో 'అమ్మ'ను అందరూ అర్చించు కొంటున్నారు. అప్పుడు నేను చాలాబాధపడ్డాను. నేను బయలుదేరేటప్పుడు ఏదో ఒకమారు చూచివద్దామనే కాని ఆవిడను అర్చించుకుందామన్న ఉద్దేశ్యమే లేదు. కాని ఒక్క వీక్షణతోనే నన్ను పూర్తిగా వివశురాలిని చేసింది. నేను వెళ్తానమ్మా అంటే నాలుగురోజులుండమ్మా అంది. తీరా మూడోరోజు మా నాన్నగారు అన్నంరాజు మాధవరావు గారికి హార్టుఎటాక్ వచ్చిందని తెలిసి, అమ్మా నేను గుంటూరు వెళ్తానమ్మా నాన్నకు బాగాలేదుట అన్నాను. దానికి అమ్మ అంతా చక్కబడ్తుందని అన్నది. నేనే ఉండబట్ట లేక వెళ్తానమ్మా అంటే సరే అని "మా చిన్నమ్మాయి చేతిలో ఒకగారె పెట్టి మీ తాతకివ్వు" అని చెప్పింది.

రామకృష్ణ అన్నయ్య నన్ను గుంటూరులో దింపివస్తానంటే "నీవు ఇప్పుడే వచ్చావు కదా! ఆ అబ్బాయి బాపట్లలో గుంటూరు బస్సు ఎక్కిస్తాడులే" అని చెప్పింది. అమ్మ ఆశీర్వాదం పొంది 7వ మైలురాయి దగ్గరకు వెళ్లాము. 2 గం॥ల తరువాత బాపట్లకు వెళ్ళేబస్సు వచ్చింది. ఇంతసేపు అమ్మ దగ్గరన్నా కూర్చున్నాను కాదని బాధపడ్డా, ఆ రెండు గంటలు అమ్మ దగ్గర జరిగిన

తరుణమంటే తప్పించుకొందామన్నా తప్పనిది.

దివ్యాను భూతులు నెమరు వేసుకుంటూనే వున్నాను. బాపట్ల వెళ్ళిన తరువాత ఎప్పటికీ గుంటూరు బస్సురాలేదు. నాకు తోడుగా వచ్చినతను చీరాలబస్సు వచ్చింది అంటే, గుంటూరు వెళ్ళే వాళ్ళున్నందున సరే వెళ్ళమన్నాను.

రెండు బస్సులు పాడైనందున 8.30 గంIIలకు బస్సు వచ్చింది. మూడు బస్సుల జనం గుమిగూడటంతో చేతిలో చిన్నపిల్ల, సామాను, టిక్కెట్లు తీసుకుందామన్నా వీలుకాని పరిస్థితి. ఏమిటమ్మా ఇంత విషమపరిస్థితిలో పెట్టావని బాధపడ్డాను "బాధే భగవంతుడు" అని అమ్మ చెప్పినట్లుగా, ఎవరో ఎక్కడికి వెళ్లాలి? ఎన్ని టిక్కెట్లంటే ఒకటిన్నర అని చెప్పాను. ఆయన టిక్కెట్లు కొని ఇవ్వటమే కాక బస్సులో సీటు కూడా అట్టేపెట్టారు. ధన్యవాదాలు చెప్పాలని ఎంత వెతికినా కనిపించలేదు. ఆ భగవంతుడే (అమ్మే) ఆ రూపంలో సాయంచేశాడని నా విశ్వాసం.

బస్సు బయలుదేరుతుండగా నాతోపాటు జిల్లెళ్ళమూడి నుండి వచ్చిన అబ్బాయి "టికెట్లు దొరికాయా అక్కయ్యా?" అని అడిగాడు. దానితో తెల్లబోవటం నావంతు అయ్యింది. చీరాల బస్సు వచ్చింది నేను వెడ్తున్నానని చెప్పి అరగంట అయ్యింది. అదేమిటోయ్ నీవు ఇందాకే వెడ్తానన్నావు కదా! అన్నాను. చీరాల బస్సు వెళ్ళటానికి ఇంకా వ్యవధి వుండటంతో హోటలుకు వెళ్ళాను తీరా బయటకు వచ్చేటప్పటికి ఆ బస్సు వెళ్ళిపోయింది. అమ్మ చెప్పారు కదా! "మిమ్మల్ని బస్సు ఎక్కించి వెళ్ళమని, ముందుగా వెళదామనుకున్నా ఎట్లా వెళ్ళగలను" అని అన్నాడు.

నేను గుంటూరు చేరేటప్పటికి రాత్రి 11.30 గంIIలు అయింది. నన్ను చూడగానే మా అమ్మా, నాన్నగారు రేపు ప్రొద్దున్నే జిల్లెళ్ళమూడి వద్దామనుకుంటున్నాం, సరే అమ్మ దగ్గరకే కదా నన్ను రమ్మన్నారు. మర్నాడు

పూలు, పళ్ళు, కొబ్బరి కాయలు తీసుకొని అమ్మకు యధావిధిగా పూజచేసుకున్నాము. ముందురోజు నేను పడ్డబాధను, ఆవేదనను అమ్మ గమనించి నా కోరిక ఆ రకంగా తీర్చింది. మా నాన్న గారిని అక్కడే విశ్రాంతి తీసుకోమంది. మురళి అన్నయ్య హైద్రాబాద్ రమ్మని అడిగితే అమ్మ అనుమతి తీసుకువెళ్దామని పైకి వెళితే అమ్మ బొట్టు పెట్టి చీరె, పసుపు, కుంకుమ నా చేతిలో వుంచేటప్పటికి కట్టలు త్రెంచుకొని ప్రవాహంలా ఒకటే ఏడుపు, ఎంత ఆపుకుందామన్నా అలవి కాలేదు. తరువాత చాలా హాయిగా, తేలికగా అనిపించింది.

అప్పుడు అక్కడే ఉన్న అన్నయ్య ఎందుకమ్మా అంత ఏడిపిస్తావంటే పుట్టగానే ఎందుకు ఏడుస్తారో ఇది అందుకే అన్నది. అమ్మను ఏ దివ్యముహూర్తాన చూచానో ఆనాటి నుంచి ఈనాటి వరకు అమ్మ కరుణా కటాక్షాలను మిక్కుటంగా పొందుతూ ఎన్నెన్నో అనుభూతులు చెందుతూ ఎన్ని అడ్డంకులు, అవాంతరాలు వచ్చినా అమ్మ కృపవల్ల ఎదుర్కొంటూ ఈ సంసార జీవన జలధిలో ప్రయాణం సాగిస్తున్నాను. నాలాగే ప్రపంచ ప్రజలందరూ, పశుపక్ష్యాదులు సహితం అమ్మదయకు పాత్రులు కావాలని కోరుకుంటున్నాను.

ఏకప్రపంచ భావన అన్నది ఒక భావనగా మాత్రమే మిగిలిపోక పూర్తిగా ఆచరణలోనికి వచ్చి అందరం అమ్మ పిల్లలమని గర్వించే రోజు రావాలని, ఆ రోజు వస్తుందని ఆశిస్తూ, ఆ రోజు వచ్చేలా చేయమని కారుణ్యమూర్తి అమ్మను వేడుకుంటున్నాను.

కన్నతల్లి - కల్పవల్లి

అమ్మను గూర్చి ఎంత చెబుతున్నా ఇంకా చెప్పాల్సింది మిగిలి పోయినట్లే అనిపిస్తుంది. అమ్మ నా జీవితంలో ఎంతగా చోటు చేసుకున్నదంటే, నిత్య

గణనకు కూడా అందనిది గండం.

జీవితంలో నాకు సంతోషం కలిగించే ప్రతిచిన్న విషయమూ అమ్మ దయకు చిహ్నామే అనిపిస్తుంది. వినేవారికి ఆ సంఘటన హాస్యాస్పదంగా వున్నా నాకు మాత్రం అమ్మ మహిమలుగా తోస్తాయి. తన సంతానంలో ఎవరికేది అవసరమో కన్నతల్లి గమనించినట్లే ఈ కన్నతల్లి నా అవసరాలను అంతకంటే ఎక్కువగా గమనించి అనుక్షణం ఈ జీవితరణరంగంలో ఎదురయ్యే ఆపదలనుండి, అవమానాల నుండి నన్ను రక్షిస్తోంది. బాధలలో, బాధ్యతల బరువులో నా వెన్ను తట్టి ధైర్యాన్ని, సహనాన్ని ప్రసాదిస్తోంది. అందుకే ఆ కల్పవల్లి గురించి నాకు తోచింది చెప్పాలనుకున్న ప్రయత్నమే ఈ వ్యాసం.

1971లో మా సత్యాలక్కయ్య కుమారుడి వివాహం జిల్లెళ్ళమూడిలో జరుగుతున్నది. ఆ పెళ్ళికి తప్పకరావలసినదిగా మాకు ఆహ్వానం అందింది. అప్పటికి నేను, పిల్లలు మాత్రమే అమ్మను దర్శించాము. మావారు కూడా అమ్మను దర్శించాలన్నది నా అభిలాష. కానీ వారికి ఇటువంటి విషయాలపట్ల ఆసక్తిలేదు. నన్ను జిల్లెళ్ళమూడి వెళ్ళటానికి అభ్యంతరం పెట్టకపోయినా ఆయన రాకపోవటం, నాకు చాలా అసంతృప్తిగా ఉండేది. ఆ విషయం అమ్మతో ఒకమారు విన్నవించుకున్నాను.

అమ్మ నామొర ఆలకించింది. ఈ పెళ్ళికి తప్పనిసరిగా మనిద్దరం వెళదామని పట్టుపట్టాను. కాని ఆర్థిక ఇబ్బందుల వల్ల నేను రాలేను నీవు వెళ్ళమని అన్నారు. ఆయన లేకుండా వెళ్ళటం ఇష్టంలేక మా తమ్ముడ్ని పంపాను. ఆ సమయంలో మా దగ్గిర డబ్బు లేనిమాట వాస్తవమే. వైజాగ్ నుండి బాపట్ల రావాలంటే కనీసం ఒక పచ్చనోటైనా వుండాలి. ఏ విధంగా ఈ సమస్యను పరిష్కరిస్తావమ్మా అని అమ్మనే ప్రార్థించాను. 15రోజుల క్రితం మా మేడమీద అద్దెకు దిగినవారు అడ్వాన్సుగా కొంతడబ్బు ఇచ్చారు. డబ్బు

బాధ లేకపోతే బ్రతకడం అనవసరం.

సమయానికి అందింది కనుక ప్రయాణానికి ఒత్తిడి చేసాను. కాని వారు ఒప్పుకోక రిజర్వేషన్ లేకుండా ప్రయాణం చేయనని వంక చెప్పారు. చివరిక్షణాలలో రిజర్వేషన్ దొరకటమనేది ఎంత దుర్లభమో తెలుసు కనుక వారు అమ్మను దర్శించాలన్న ఆశకు తిలోదకాలు ఇచ్చాను.

వారికి నమ్మకం లేకపోయినా బంధువుల పెళ్ళివంక నన్నా జిల్లెళ్ళమూడి వస్తారనుకున్నాను. కాని రేపు పెళ్లి అనగా ఏమనిపించిందో అప్పటికప్పుడు ప్రయాణానికి సిద్ధం అయ్యారు. అనుకోకుండా రిజర్వేషన్ దొరికింది. పెళ్ళి అయిన వెంటనే బయలుదేరి రావాలన్న షరతుపెట్టారు. వారు వస్తున్నారన్న సంతోషంలో ఏ షరతులు పెట్టినా సరే అన్నాను. ఆ క్షణంలో అమ్మ నా మీద చూపిన దయకు ఎంతో పరవశించిపోయాను. నా అసంతృప్తి తొలగిపోతుందనుకున్నాను. వారు అమ్మకు నమస్కారము చేయనన్నారు, బొట్టు పెట్టించుకోనన్నారు, దైవంగా నమ్మనన్నారు, అన్నింటికీ సరే అన్నాను.

రిజర్వేషన్ దొరకటం వలన ఏ అలసట లేకుండా ఉదయం బాపట్ల చేరాము. స్టేషన్ ఎదురుగుండా వున్న "మాతృశ్రీ ప్రెస్"కు వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని జిల్లెళ్ళమూడి వెళ్ళటానికి సిద్ధమవుతుండగా ఎవరో కారులో వెడ్తూ మాకు లిఫ్టు ఇచ్చారు. అప్పటికి వ్యాను సర్వీసు లేనందున ఒకటిన్నర మైలు ఆయన ఎలా నడుస్తారో, ఎంతగా తిట్టుకుంటారో అని ఆలోచిస్తున్నాను. ఈ సమస్యను కూడా అమ్మే పరిష్కరించింది. ముహూర్తం సమయానికి సరిగ్గా అక్కడకు చేరుకున్నాము. మా తమ్ముడు చెప్పిన వర్తమానాన్ని బట్టి మేము రామని నిరాశపడుతున్న మావాళ్ళందరూ మమ్మల్ని చూచి చాలా ఆనందించారు.

వివాహవేడుకలు పూర్తయి, భోజనాలు కాగానే మేము బయలుదేరాము. మా వాళ్ళంతా అప్పుడే వెళ్ళటమేమని గొడవ చేసారు. అమ్మతో చెప్పి నన్నైనా

చీకటే వెలుతురుకు ఆధారం.

పుంచమని కోరారు. అమ్మ నవ్వి "వాళ్ళిద్దరూ కలసి వచ్చారు, కలిసే వెడ్తారని చెప్పి ఆయనతో అర్జంటు పనులు లేకపోతే రేపు వెళ్దురుగాని నాన్నా" అని అంది. ఆయన "అలాగే అమ్మా" అని అంటే ఆశ్చర్యపోవటం నా వంతు అయ్యింది.

ఆ మర్నాడు గురువారం మా ప్రయాణం. మరునటి రోజు శ్రావణశుక్రవారం వరలక్ష్మీవ్రతం అవటంవల్ల అమ్మను అర్చించుకోవాలని ఎంతో ఆరాటపడ్డాను. కాని వారిని ఏమీ అడుగలేదు. అమ్మే గురువారాన్ని లక్ష్మీవారం అంటారని చెప్పి శుక్రవారం కట్టే తోరణాన్ని నా చేతికి కట్టి నా ఆరాటాన్ని చల్లార్చింది. జిల్లెళ్ళమూడి వెళ్ళేటప్పుడు మైలున్నర నడిచే శ్రమ లేకుండా ఏవిధంగా కారులో లిఫ్టు దొరికిందో, వచ్చేటప్పుడు కూడ కారులో లిఫ్టుదొరికి బాపట్ల చేరాము. అలాగే వైజాగ్ చేరటానికి తిరుగు ప్రయాణంలో రిజర్వేషన్ దొరికింది.

వైజాగ్‌లో బయలు దేరేటప్పుడు వారు అన్నవి ఏ ఒక్కటి చేయలేక పోయారు. అమ్మకు నమస్కరించి బొట్టు పెట్టించుకున్నారు, ప్రసాదం తీసుకున్నారు. తరువాత ఇవి అన్నీ దైవం అన్న అభిప్రాయంతో చేయలేదు, నలుగురిలో చేయకపోతే బాగుండదని చేసానన్నారు. కాని నాకు మాత్రం వారి ప్రవర్తన చాలా ఆనందాన్నే కలుగజేసింది. మొత్తం మీద నేను కోరుకున్న విధంగా శారీరక శ్రమ ఏమీ లేకుండా అమ్మను దర్శించటమే కాక క్రమక్రమంగా అమ్మ పట్లవారి దృక్పథంలో మార్పు రాసాగింది. "వింటే విమర్శకాని, కంటే విమర్శలేదు" అన్న అమ్మ సూక్తి అక్షరాల నిజమైంది.

అమ్మ దైవత్వాన్ని గురించి నాకెంత విశ్వాసం వున్నా వారు పిల్లలూ ఆ మార్గాన్నే నడిస్తే బాగుంటుందన్న నా ఆశను అడియాస చేయక అమ్మ

లక్ష్యం లేకపోవడమే మరుపుకు కారణం.

పరిపూర్ణంగా నెరవేర్చింది. ఈనాడు మేము మాకున్న బరువు, బాధ్యతల మధ్య ఈ మాత్రం మనశ్శాంతితో జీవిస్తున్నామంటే ఆ కల్పవల్లి చల్లని దీవెనే. అమ్మ తానేమీ మహిమలు చేయనన్నా, ఈ మా ప్రయాణం నా దృష్టిలో ఒక మహిమే అంటాను.

దైవం తలిస్తేనే

తానొకటి తలిస్తే దైవం వేరొకటి తలుస్తాడు - కాదు దైవం తలిస్తేనే తాను తలుస్తాడన్న అమ్మ సూక్తికి నిదర్శనమే ఈ వ్యాసం.

అమ్మను తొలిసారిగా 1969లో చూచినప్పటి నుంచీ ప్రతి 6 నెలలకు అమ్మ దర్శన భాగ్యం కలిగిన నాకు 1973 మే తరువాత, మళ్ళీ 1976 డిసెంబరు 29 వరకు అమ్మ దర్శనభాగ్యం కరువైంది. లలితాంబక్కయ్యతో అమ్మ నన్ను మరచిపోయిందని చెప్పి విపరీతంగా బాధపడేదాన్ని. అమ్మను చూడాలన్న కోరిక మితిమీరినప్పుడల్లా, అమ్మ కబుర్లు చెప్పుకునైనా తృప్తిపడదామని అక్కయ్య దగ్గరకు వెళ్ళేదాన్ని. నాకు ధైర్యాన్ని ప్రసాదించటం కొరకే అమ్మ లలితాంబక్కయ్యను వైజాగ్‌లో వుంచిందని అనుకుంటూ వుంటాను. నా బాధ చూడలేక - "కుసుమా! నిన్ను జిల్లెళ్ళమూడి వెళ్ళేటట్లు చేయమని అమ్మను నేను నీ కోసం ప్రార్థిస్తున్నాను" అనేది.

ఎన్నోరోజుల తపన, ఆర్తి తరువాత డిసెంబరు 29న అమ్మ దర్శనం చేసుకున్నాను. జిల్లెళ్ళమూడిలో దిగీ దిగటంతోనే ఇద్దరు, ముగ్గురు మీరేనా కుసుమ అక్కయ్య అంటే ఎంత అదృష్టవంతురాలివో అమ్మ నీ గురించి ఎప్పుడూ చెప్తూనే ఉంటారు, అని వాళ్ళు చెప్పేటప్పటికి ఆశ్చర్యపోవడం నా వంతు అయ్యింది. అమ్మ మర్చిపోయిందని బాధపడ్డ నేను, అమ్మ యొక్క అవ్యాజ ప్రేమకు, కరుణకు, అనురాగవల్లరికి హర్ష పులకితనయ్యాను.

ఇష్టం-అయిష్టం తప్ప పాపపుణ్యాలు లేవు.

ఆ వెంటనే అమ్మ దగ్గరకు వెళ్ళి ఎన్ని రోజులకు రానిచ్చావమ్మా అని ఆనందభాష్పాలతో పాదాభిషేకం చేసుకున్నాను. అప్పుడు అమ్మ అక్కడే ఉన్న చాగంటి వెంకట్రావుగారితో మీ అమ్మాయి ఎమ్.ఎ. పాస్ కావటం గొప్పకాదు నాన్నా. ఇంట్లో అన్నీ చూచుకుంటూ, పిల్లలకు, భర్తకు వేళకు కావలసినవి అమరుస్తూ, పిల్లల చదువు సంధ్యలు చూచుకుంటూ, ఉద్యోగం చేస్తూ, ఇంట్లో క్లాసులు చెప్పుకుంటూ అతిథి అభాగ్యతుల నాదరిస్తూ అని చెబుతూ – ఏమిటి నువ్వు చెప్పు అని అమ్మ నన్ను అడిగేటప్పటికి నేను అవాక్కు అయినాను. ఎందుకంటే నవంబరు 19 ఇందిరాగాంధి పుట్టినరోజున లైబ్రరీ స్త్రీల విభాగంలో "నేటి సమాజంలో స్త్రీపాత్ర" అన్న విషయమై నేను మాట్లాడుతున్నప్పుడు సరిగా ఆమాటలే చెప్పాను. అప్పటికి నెలక్రితం చెప్పినమాటలనే యధాతథంగా అమ్మ చెప్పేటప్పటికి ఎనలేని ఆశ్చర్యం కలిగింది.

అంతగా ఎందుకు చెప్తున్నానంటే – స్త్రీకి స్వాతంత్ర్యం లేదని భావించి మహిళా సంవత్సరమని ప్రత్యేకించవలసిన అవసరం లేదని, భర్తకు పెద్దలకు అనుగుణంగా నడుచుకున్నప్పుడు స్త్రీ స్వేచ్ఛకు ఎట్టి భంగం వాటిల్లదని నా అభిప్రాయాన్ని చెప్పాను. మహిళా సంవత్సరం అని సెమినార్లు, ఉపన్యాసాలు, డిబేటులు కాక అందరం కలసి తలోకొంత వేసుకుని ఈ చలికాలంలో దుప్పట్లు, బన్నీన్లు మొ॥ ఇవ్వటమో లేక అన్న సమారాధన చేయటమో బాగుంటుందని ముగింపులో చెప్పాను. ఇదేవిధంగా ఆ రోజూ నేను చెప్పిన విషయాలనే ఒకదాని తరువాత ఒకటిగా అప్పుడే తాను విన్న విషయమో లేదా తానే పలికిన విషయమో అన్నట్లుగా చెప్తుంటే ఆశ్చర్యపోవటం నావంతు అయింది.

దైవం తలుస్తేనే తాను తలుస్తాడన్న అమ్మ సూక్తికి ఇంతకంటే నిదర్శనమేముంటుంది.

తనను కన్నవాళ్ళమీద కంటే తను కన్నవాళ్ళమీదే ప్రేమ ఎక్కువ.

అమ్మ లీలావినోదం

ప్రకృతికి వికాసం ఎంత సహజమో విలయమూ అంతే సహజమని అమ్మ చెప్పినట్లుగా, మానవజీవితంలో కూడా వికాసం, విలయం సహజమే. అయితే విలయాన్ని కూడా వికాసంగా మార్చగల శక్తిస్వరూపిణి అమ్మ. అదీ అమ్మలీలా వినోదమనే చెప్పవచ్చును. "నమ్మకమే దైవం" అని అమ్మ అన్నది. మరి నమ్మకాన్ని కలిగించేది, కలిగించవలసినదీ అమ్మే కదా !

అది 1977 జూన్ 30 తేది సాయంత్రం 5.30 గం॥లకు, మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి బయలుదేరిన వాన్‌కు యాక్సిడెంట్ అయిందని, ఆ చోటుకు రమ్మని ఫోను వచ్చింది. ఏ చోటు, ఎక్కడకని వెళ్ళటం దారి, తెన్ను తోచక అలమటిస్తున్నాము. ఫోను వచ్చిన చోటికి వెళ్ళి కనుక్కుంటానని మావారు వెళ్ళారు. నాకు కాళ్ళు చేతులు ఆడక ఇంట్లోకి, బయటకు తిరుగుతూ అమ్మకు దీపారాధన చేసి అమ్మనే ఆ గండం నుంచి గట్టెక్కించమని వేడుకున్నాను. ఇంతలో ఆయన వచ్చి ఎలమంచిలి దగ్గర రేగుపాలెంలో ప్రమాదం జరిగిందని పెద్దావిడకు సీరియస్‌గా వుందని, ఎలమంచలిలో వైద్యం సరిపోనందున వైజాగ్ కె.జి.హెచ్‌కు తీసుకువస్తున్నారని చెప్పారు. ఆ వాన్‌లో మా అమ్మగారు, అన్నంరాజు దుర్గాంబగారు, మా అబ్బాయి, మా అక్కయ్య, బావగారు, పిల్లలూ వున్నారు. మా అబ్బాయి ఫోను నెంబరు ఇచ్చాడు. కాబట్టి వాడికి దెబ్బలు తగిలి వుండవని అనుకున్నాం. అంతకు ముందే అమ్మ దగ్గర నుంచి నాకు చీరె, పసుపు, కుంకుమ వచ్చాయి. జిల్లెళ్ళమూడి వెళ్ళిన మా బంధువు అమ్మా! కుసుమ అక్కయ్యకు ఏం చెప్పమంటావు అని అడిగితే చక్రవర్తిని ధైర్యంగా వుండమని కబురుపెట్టింది. వాళ్ళగురించి అడిగితే వీళ్ళ గురించి చెప్తుందని, ధైర్యం దేనికని నవ్వుకున్నాం. ముందు జరగబోయేది మానవ మాత్రులమైన మనకు తెలియదు కాని జగన్మాత అయిన అమ్మకు తెలియంది లేదు కదా!

కళంకం లేనిది అలంకారం.

దాదాపు 8.30 గంటల ప్రాంతంలో మూడు కార్లలో వచ్చారు. మా బాబు ముఖమంతా వాచి నీలంగా కమిలిపోయి, తలకు పెద్దకట్టుతోను, కళ్ళు నెత్తురు ముద్దలుగా ఉండి కదలలేని పరిస్థితిలో వున్నాడు. మా అమ్మగారికి బుగ్గ చితికిపోయి పెదిమలకు పళ్ళకు జాయింట్ తెగిపోయి గుర్తుపట్టలేని అపస్మారక స్థితిలో వుంది. మా అక్కయ్యకు కాలర్ బోన్ డిస్‌లొకేట్ అయ్యింది. అమ్మను, బాబును పూర్తిగా నెత్తురు ముద్దలుగా చెరోబెడ్ మీద చూచేటప్పటికి నా పరిస్థితి వర్ణనాతీతం. ఒక పక్క కన్నకొడుకు వేరొక పక్క కన్నతల్లి వారిద్దరి మధ్య వుండి "అమ్మా! తట్టుకోవడానికి, ధైర్యం, డబ్బు కూడా నీవే ఇవ్వవలసినది. ఎవ్వరిని దేహీ అని అడగలేను" అని ప్రార్థించాను. అమ్మ తాను ఎంతైనా బాధపడ్తుంది కాని తన బిడ్డలైన మన బాధను సహించలేదు అందుకే నాకు వెంటనే రెండింటినీ ప్రసాదించింది.

మూర్ఖత్వమో, మొండితనమో, తెలియనితనమో ఏది ఏమైనా సరే 'అమ్మ' ధైర్యంగా ఉండమన్నది కాబట్టి పిల్లవాడు, అమ్మ తప్పక కోలుకుంటారని నాప్రగాఢ విశ్వాసం. యూరినరీ బ్లాడర్ చితికిపోయి, పెల్విక్‌బోను ఫ్రాక్చర్ అయి, నెత్తి మీద బలమైన గాయం తగిలి నెత్తురు పోయి తలమీద కుట్లు పడ్డటువంటి పిల్లవాడు బ్రతుకుతాడని కాని, బ్రతికినా ఏ అవకరం లేకుండా మామూలుగా ఉంటాడని కాని ఆయనకు నమ్మకం లేదు.

వారిద్దరికీ ఎక్సరేలు తీసి, కుట్లువేసి బెడ్ మీద చేర్చేటప్పటికి రాత్రి 3 గం॥లు అయ్యింది. మా అమ్మకు ఆ పెద్దతనంలో ఎముక విరిగితే అతుక్కోవటం కష్టం కదా! అదేమీ లేకుండా బుగ్గమీద కుట్లువేసారు. వారం రోజులలోనే ఇంటికి పంపించారు.

బాబు పరిస్థితి :- మర్నాడు ప్రొద్దున్నే అనగా జూలై 1వ తేదీ ఉదయం

మనస్సుకు తగిలితే బాధ, శరీరానికి తగిలితే నొప్పి.

8 గం॥లకు ఎమర్జెన్సీ ఆపరేషన్ చేయాలని థియేటరు లోనికి తీసుకువెళ్ళారు. సాయంత్రం 5 గం॥లు గడిచినా పిల్లవాడిని ఇవతలకు తీసుకురాలేదు, సరే అన్నింటికి అమ్మే ఉన్నదన్న ధైర్యంతో వున్నాను. ఇప్పుడు సెటిల్ అవ్వకపోతే మళ్ళీ ఆపరేషన్ చేయాల్సి వుంటుందని చిన్నపిల్లవాడు తట్టుకోగలడో లేదో అన్నారు. ఆ పరిస్థితులలో మా బాబు స్నేహితులు చేసిన సహాయం చెప్పనలవి కాదు. వారికి అమ్మ ఆయురారోగ్యాలు ప్రసాదించవలసినదిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

అమ్మ దయవల్ల తిరిగి ఏ విధమైన ఆపరేషన్ అవసరం లేకపోయింది. మొదటి వారం రోజులు సెలైన్ ఎక్కించారు. రక్తం కూడా ఎక్కించవలసి వచ్చింది. "అమ్మా నీవు రెండుగా కనిపిస్తున్నావమ్మా" అని బాబు అన్నాడు. నెత్తికి బలమైన గాయం తగలటం వల్ల కళ్ళల్లో నెత్తురు గూడుకట్టుకొని ఎఱ్ఱగా జ్యోతుల్లా వున్నాయి. బాబు ఆ మాట అనేటప్పటికి కళ్ళుపోతాయేమోనని చాలా భయపడ్డాను. అంతమటుకు కంటతడి పెట్టని నాకు కన్నీళ్ళు ధారలు కట్టాయి. డాక్టర్లు భయం లేదని ఎంతగా ధైర్యం చెప్పినా సరిపెట్టుకో లేకపోయాను. మనస్సు కుదుటపడలేదు. నాకు ధైర్యం కలుగచేయటానికా అన్నట్లు మా మరిదిగారు కుటుంబరావుగారు, జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు ప్రసంగవశాన అమ్మ చెప్పిన మాటలు చెప్పారు "మునగండిరా మునగకుండా ఏమిచేయను గాని, మునిగాక ఒడ్డున పడేస్తా" అని. అమ్మా! ఎలాగూ మునిగాము, తీసి ఒడ్డున పడేస్తావో లేదా ముంచేస్తావో నీదే భారం అని నిశ్చింతగా వున్నాను. ఆ ధైర్యం నేను తెచ్చుకోవడం కాదు అమ్మే ప్రసాదించింది.

నెల మీద 17 రోజులు బాబు మంచంలో వున్నాడు. మొదట డాక్టర్లు చెప్పిన దానిని బట్టి మూడు నెలలు వుండాలని అన్నారు. అటువంటిది ఆగష్టు

నిర్వేదమంటే తెలియకుండా అనుభవించే బాధ.

17న అమ్మ దయవల్ల ఎటువంటి బాధ లేకుండా నడువగలిగాడు. అటూ బాబు, ఇటు మా అమ్మ బాధ పడ్తుంటే ఇంట్లోపని, ఉద్యోగం, వారిద్దరితోను, మానసికంగా, శారీరకంగా విసుగు చెందిన నేను వారు బాధపడ్తారన్న యోచన లేకుండా, "మీకు తగ్గే యోగ్యత వుంటే అమ్మ దగ్గర నుంచి ఏమైనా వస్తుంది లేకపోతే మీఖర్మ" అని అన్నాను. 17న, నడిపించమన్నా అమ్మ దగ్గర నుంచి కబురు రానిదే నడిపించనని 14న అన్నాను.

అమ్మ ఆదిపరాశక్తి కదా! ఆవిడకి తెలియంది లేదు "మనకు గోడలు అడ్డుకాని తనకు అడ్డులేవని" చెప్పనే చెప్పింది. నాకు తృప్తి కలిగించటానికే అన్నట్లుగా 16వ తేదీ సాయంత్రం అమ్మ ప్రసాదం, కుంకుమ పోస్టులో వచ్చాయి. నా ఆనందానికి మేర లేదు. నేను అనుకున్నదనుకోండి, అమ్మ కరుణ అనండి లేక రెండూ కోఇన్స్‌డెన్స్ అనండి. ఏది ఏమైనా అమ్మ నన్ను పూర్తిగా తృప్తిపరిచింది. పూర్తిగా చితికిపోయిన పిల్లవాడు బ్రతికి బయటపడటమే కాక ఏ అవకరం లేకుండా మామూలుగా వున్నాడంటే ఆ జగజ్జనని కృపాకటాక్షమే కాని వేరొకటి కాదు. అమ్మ కరుణాకటాక్షాలు ఎల్లప్పుడు అందరి మీద ప్రసరించాలని కోరుకుంటున్నాను.

మా బాబు చెప్పిన విషయం ఏమిటంటే "వ్యాన్ తిరగబడిపోతుంటే అమ్మమ్మ పని అయిపోయింది, నా పని రెండు నిమిషాల్లో ఖాళీ" అనుకున్నాడట. తాను పైకి విసిరివేయబడటం వల్ల ఎముకవిరిగి నందున ప్రక్కకు దొర్లటానికి కూడా వీలులేని పరిస్థితి కాని పక్కనే వున్న ఫర్లాంగు రాయిని పట్టుకొని పైకి గుంజుకున్నాడట. అందువల్ల గుండెల మీద నుంచీ పోవలసిన చక్రం పొట్టమీద నుండి వెళ్ళింది. ప్రక్కనే టెలీఫోన్ పెగ్ మీద అంత పెద్ద వ్యాన్ బ్యాలన్స్ అయ్యింది. లేని ఎడల పూర్తిగా చితికిపోయేవాడు. ఆ క్షణంలో అమ్మ ఫర్లాంగు రాయి, టెలిఫోన్ పెగ్ రూపంలో వచ్చి వాడిని కాపాడటమే కాక, వాడికి పైకి

సర్వాన్నీ అనుభవిస్తూ సర్వాన్నీ విడిచి పెట్టేది వివాహం.

గుంజుకునే ఆలోచన కలిగేటట్లు చేసింది. మా అమ్మ గారికి ముందుగానే స్పృహ తప్పేలా చేసింది, వాడిని చూచి భరించలేదని.

భగవంతుడు ఎప్పుడు, ఎక్కడ, ఏ రూపంలో ఆదుకుంటాడో చెప్పలేము కదా! వాడి బిడ్డలమైన మనలను కనిపెట్టుకొని ఉండటమే వాడి పని "మీరు బురదపూసుకు వచ్చినా కడగవలసిన భారం నాదేనని" అమ్మ చెప్పింది కదా! ఆవిధంగానే మా బాధనంతా అమ్మ తీసుకొని, వాడికి, మా అమ్మకు పునర్జన్మను ప్రసాదించింది అమ్మ.

మా అబ్బాయికి హైమక్క అంటే చాలా ఇష్టం, భక్తి. ఇప్పటికి 5 సం॥ పూర్వం ఆటలమ్మ వచ్చినప్పుడు అమ్మ తగ్గించటం లేదు, హైమక్కకు ప్రదక్షిణాలు చేస్తానని చిన్నపిల్లవాడు వాడంతటవాడే మొక్కుకున్నాడు. ఆ విధంగా అన్నాడని అమ్మతో అంటే వాడిచేత ప్రదక్షిణాలు చేయించమంది వాడికి అప్పుడు తొమ్మిది సంవత్సరాలు.

బాధగా ఉన్నప్పుడు హైమనామం చెప్పమని అడిగేవాడు. వాడికోరిక తీర్చటానికా అన్నట్లు వాడు ఇంటికి వచ్చిన రోజు శుక్రవారం (అప్పటికి 4 సం॥గా ప్రతీ శుక్రవారం అమ్మ పూజ మా యింట్లో చేస్తున్నాము) రాత్రి 11 గం॥లకు పూజ కొరకు దీపారాధన చేశాను. మా యింట్లో చెక్కతో చేసిన శివలింగం, పానువట్టం ఉన్నవి. ఆ చీకటిలో, దీపం వెలుగు దాని మీద పడి గోడమీద నీడ హైమ పద్మాసనం వేసుకొని కూర్చున్నట్లుగా ఉంది. ఫాను తిరుగుతోంది. దీపారాధన కదులుతోంది కాని ఎటువంటి కదలిక లేక నిశ్చలంగా హైమ కూర్చుని ఉంది. నాకే ఆ విధంగా తోచిందేమోనని, ఇంట్లో అందరిని పిలిచి చూపించాను. వారందరికి ఆ నీడలో హైమక్క గోచరమయింది. హైమక్క మన ఇంటికి వచ్చింది కాబట్టి తనకు పూర్తిగా తగ్గుతుందని బాబు అన్నాడు.

సర్వాన్నీ స్వాధీనం చేసుకొన్నది సాధ్వి.

హైమ తనంతట తానుగా వచ్చి మా బాబుకి ధైర్యం కలగజేసిందని మా నమ్మకం.

తరువాత దసరాకు కుటుంబసమేతంగా అమ్మ దగ్గరకు వెళ్ళి పూజ చేసుకున్నాము. వాడి భవిష్యత్తు గురించి అడుగుదామనుకొని సర్వం అమ్మే అయినప్పుడు, మళ్ళీ అమ్మను అడగటమేమని వచ్చేశాము. అమ్మ సర్వజ్ఞి కదా! నా మనసులోని కోరిక తెల్సుకొన్న కల్పవల్లి అమ్మ. నా చెల్లెలు వసంత అమ్మతో కృష్ణ ఎట్లా ఉన్నాడో వాడిని చూడలేదని అనుకుంటే "వాడికేమే వాడు బాగానే వున్నాడు, వాడికి ఏ వంక లేదని" అన్నదట "తాలు మాట రావటానికి తోలు నోరు కాదని" చిన్నతనంలోనే చెప్పింది. అలాగే వాడు ఏవిధమైన కంప్లయింట్ లేక హాయిగా ఉన్నాడు ఇదంతా అమ్మ, హైమల అనుగ్రహమే.

అపదుద్ధారిణి - ఆనందసంధాయిని

'అమ్మ' గురించి నేను చెప్పాలనుకోవటం హాస్యాస్పదంగా ఉంటుందేమోనని మధ్య మధ్య నాకు అనిపిస్తుంది. కాని నా అనుభవం వల్ల, ఒక్కరికి కనువిప్పు కలిగినా నా ప్రయత్నం ఫలించినట్లే. అందుకే అపదుద్ధారణి - ఆనందసంధాయిని అయిన అమ్మను గురించి చెప్పాలన్న ప్రయత్నమే ఈ వ్యాసం

1977 నవంబరు 19వ తేది కాలం కసిగా కాలనాగువలె తెలుగు గడ్డను కాటేసిన రోజు, సరిగా దివిసీమను స్మశానంగా మార్చినరోజు, వైజాగ్ సముద్రతీరాన వుండటంవల్ల హోరుగాలి, తీవ్ర వర్షం తప్పలేదు. ఆ రోజు రాత్రి ఏ ఒక్కరూ బయటకు రావటానికి సాహసించని రోజు. అటువంటిది 20వ తేది ఆదివారం ఉదయాన్నే షాపులో దొంగలు పడ్డారని తెలిసింది, ఎంత పోయిందో, ఏమి పోయాయో తెలియదు. అంతమటుకు జీవితంలో ఎన్నో

పాతివ్రత్యానికి చరమదశ భర్తకూడా భార్యను అమ్మా అని పిలవటం.

ఆటుపోటులు తిని అమ్మా నీవు తప్ప శరణ్యం లేదు అన్నప్పుడు అమ్మే మార్గాన్ని సూచించింది. ఆ తరువాత కొంత మదుపు పెట్టి షాపు నడుపుకుంటున్నాం.

'సంఘటనల కూర్పే జీవితం' అన్న అమ్మ సూక్తిని మననం చేసుకుంటూ జరుగుతున్న సంఘటనలన్ని అమ్మదయే అని ధైర్యంగా ఉంటున్నాం. అటువంటిది షాపులో దొంగలు పడ్డారని తెలియగానే ఎంత విలపించానో "నవ్వుతూ అనుభవించేవాడి దగ్గరకు ఏడుస్తూ అనుభవించేవాడు సలహాకు వస్తాడు" అన్నది అమ్మ. కాని ఎవరి దగ్గరకని, ఎక్కడకని వెళ్ళను? ఏమి చేయగలను? ఆయన 19వ తేదీన బందరు వెళ్ళనన్నా మా పినమామగారి అబ్బాయి పెళ్ళికని పట్టుపట్టి పంపించాను. తుఫాను కారణంగా వారు నిడదవోలులో ఆగిపోయారు. సమయానికి ఆయన లేరు ఇప్పుడు ఏమిచేయాలి? జీవితంలో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా, ఆఖరుకు మా అబ్బాయి యాక్సిడెంట్ అయినప్పుడు కూడ కంటతడి పెట్టి ఎరుగను. అటువంటిది షాపులో దొంగలు పడ్డారనగానే నాకు కట్టలు తెంపుకున్న నదిలా ఉధృతంగా దుఃఖం వచ్చింది. ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా కన్నీరు. ఏమిటి ఈ విపరీత పరిస్థితి? ఏదో కాస్త బాగున్నామనుకుంటే భగవంతుడు కూడా మా మీద పగ బూనాడా? అని పరి పరి విధాల విలపించాను. నా పరిస్థితికి మా పిల్లలు తెల్లబోవడం మినహా ఏమి చేయలేకపోయారు.

సరే చేసేదేముంది? షాపుకు వెళ్లి పరిస్థితి కనుక్కుందామని మా మరిది గారింటికి వెళ్ళి ఈ సంగతి చెప్పి 10 నిముషాలలో తిరిగి వచ్చాను. ఇంట్లోకి వెళ్ళగానే హైమ ఫోటో ఉన్న 'మాతృశ్రీ' మాసపత్రిక వున్నది. ఇది ఎక్కడదని అడిగితే ఇప్పుడే పోష్టుమాన్ ఇచ్చి వెళ్లాడని పిల్లలు చెప్పారు. నాకు ఆనందం ఆశ్చర్యం ముప్పిరిగొన్నవి.

కలత లేకపోతే నలత ఏమి చేస్తుంది.

నా బాధ తీసివేయటానికే హైమ మా ఇంటికి వచ్చిందని ధైర్యం తెచ్చుకున్నాను. అంతవరకు విపరీతంగా విలపిస్తూ, మనస్సును అదుపులోకి తెచ్చుకోలేని నాకు ధైర్యం కలగటం చూచి మా ఇరుగు పొరుగు వారికి కూడా ఇదంతా అమ్మదయే అనిపించిందిట. 'మాతృశ్రీ' వచ్చిందని ఇంతగా ఎందుకు చెప్తున్నానంటే మామూలుగానే ఉత్తరాలు అందవు అందులో ఆదివారం ఉత్తరాలు బట్వాడ చేశారంటే ఏమనుకోవాలి? అందులో ఆ రోజంతా కన్ను మిన్ను గానని వర్షము-గాలి.

నామటుకు నాకు అమ్మే పత్రికరూపంలో వచ్చి నాకు కావలసిన మనో ధైర్యాన్ని కలగజేసిందని నా ప్రగాఢవిశ్వాసం. అమ్మ కరుణాసముద్రి కదా! నా బాధను తొలగించటానికే ఆ విధంగా చేసింది. అదే పత్రిక విశాఖపట్నంలో మిగిలిన వారికి వారం రోజుల తరువాత వచ్చిందని తెలిసింది. పావలా స్టాంపుతో అమెరికా వెళ్ళిన అమ్మ గ్రీటింగ్ కార్డులా, ఆదివారం, అందునా విపరీతమైన వర్షం అయినా, మాతృశ్రీ అందేటట్లుచేసి నాకు ధైర్యాన్ని అమ్మ కలుగచేసింది. భగవంతుడు దీనవత్సలుడు కదా!

నేను షాపుకు వెళ్ళిచూడగా దొంగ పై కప్పుకు కన్నం పెట్టి షాపులోకి దిగాడు. అమ్మ దయవలన ఎక్కడ పెట్టిన మందులు అక్కడే ఉన్నాయి. చిల్లర 20రూ॥ కాష్ బాక్సులోది మాత్రం పోయింది. అంతమట్టుకు ఉన్న కంగారు, ఆవేదన తగ్గింది. అమ్మ అనురాగానికి, కరుణకు, అవ్యాజ ప్రేమకు ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలియక ఆపదుద్ధారిణి - ఆనందసంధాయిని అయిన అమ్మకు అంజలి ఘటించాను.

మాతృత్వం వేరూ, మాతృతత్వం వేరు.

అమ్మ నామామృతం - గీత గానామృతం

ఎవరి సన్నిధి వల్ల మనస్సు నిర్మలమై, ప్రశాంతతను పొందుతుందో వారినే పూజించమని పెద్దలు చెప్తారు. 'అమ్మసన్నిధి'లో నేను అటువంటి ప్రశాంతతను పొందుతున్నాను. అమ్మను స్మరించలేకపోయినా, భావించలేకపోయినా, అమ్మను మనసారా ధ్యానించలేకపోయినా జీవితమే వ్యర్థమనిపిస్తుంది. విశ్వమానవ సౌభ్రాతృత్వమును అమ్మ తన ప్రేమమయమైన ఒడిలో కల్పుతున్నది. అమ్మ అను రెండు అక్షరములలోనే మాధుర్యామృతం ఉన్నది.

శ్రీకృష్ణ పరమాత్మ తన అవతారము నందు రెండు గానములు చేసెను. ఒకటి మురళీ గానం, రెండవది గీతాగానం. మురళీ గాన మాధుర్యమును గోపికలు పూర్తిగా ఆస్వాదించి, ఆనందించి తరించారు. ఆ మురళీ గానమెట్టిదో, ఏ రీతిన వారిని పరవశుల గావించినదో మనకు తెలియదు. దానిని వినే భాగ్యం మనకు కలగలేదు. కాని దానికి మించిన గీతాగానం మన వంతునకు వచ్చింది. గీతామృతమును గ్రోలి ఆనందించి తరింపవలయును. పాడినవారికి పాటకు బేధము లేనట్లే శ్రీకృష్ణునికి గీతకు బేధము లేదు ఏలననగా శ్రీకృష్ణుని నిశ్వాసమే గీతయని సంశయము లేక చెబుతారు. కాబట్టి శ్రీకృష్ణునకు గీతకు అవినాభావ సంబంధం కలదు. భగవంతుని ముఖకమలమున జనించిన గీతాగాన స్రవంతి యందు ఓలలాడినవారి పాపాలు పటాపంచలు అవుతాయి. వారికి పరమపదం కరతలామలకం అవుతుంది. కావున శ్రీకృష్ణుని మొదటిగానమైన మురళీరవము విననందుకు వ్యధచెందక గీతాగానాన్ని శ్రవణ మననాలు చేయటానికి ప్రయత్నం చేయవలెను. అట్టి గీతాగాన శ్రవణ మననాదులకు నోచుకొనిన భూతభవిష్యద్వర్తమానకాలిక జీవుల యొక్క

నడుంవంచి తాళికట్టేవాడు భర్త. తలవంచి తాళి కట్టించుకునేది భార్య.

భాగ్యమును వర్ణించటం శక్యం కానట్లే, అమ్మ నామామృతాన్ని ఆస్వాదించిన వారికి ఇహపర సుఖాలు కరతలామలకం అవుతాయి (కాగలవు).

భగవానుడు కావించిన ఈ గీతోపదేశరూప మహాలీల ఒక కాలానికి గాని, ఒక దేశానికి గాని, ఒక మతానికి గాని, ఒక జాతికి గాని సంబంధించినది కాదు. అట్లే అమ్మ నామామృతం సార్వజనీన, సార్వకాలిక, సత్యశివసుందరమైన భగవద్వాణి.

దీనికి తోడు అమ్మ, హైమ జన్మదిన శుభసంధర్భమున జరిపించిన కోటి లలితా నామపారాయణామృతమును గ్రోలి ఆనందాబ్ధిలో మునిగిన వారి సంగతి వేరుగా చెప్పనవసరంలేదు.

నామపారాయణకు, ముందు మాటగా శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులు చెప్పిన మాటలు ఆణిముత్యాలు. ప్రతిఒక్కరికి అర్థమగు రీతిలో లలితా నామపారాయణ విశిష్ఠతను తెలియచెప్పి, దానిని చేయుటయందలి బాగోగులు చేయవలసిన విధానము చెప్పారు. ఉచ్చారణ దోషం వచ్చిన దేవి నెత్తి అణుస్తుందన్న భయం అవసరం లేదని, చేయించేది సాక్షాత్తు 'రాజరాజేశ్వరి' అవటం వల్ల ఏ దోషాలు అంటవని, మనలను లలితామూర్తులుగా చేయటానికి అమ్మ కోటి లలితా నామపారాయణ యజ్ఞాన్ని తలపెట్టిందని అన్నారు.

శ్రీకృష్ణ పరమాత్మ ద్వాపరయుగంలో గీతాగానం చేయగా అమ్మ కలియుగాన కోటి లలితానామపారాయణ మనచేత చేయించి పునీతుల గావించింది. అమ్మ దృష్టిలో ద్వంద్వములు లేవు. నామ పారాయణ జరిగేటప్పుడు మనమధ్యే ఉండి ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో ఆ పారాయణలో పాల్గొనునట్లు చేసింది. ఆ సమయాన జిల్లెళ్ళమూడిలో పురుషుడు ఒక్కడే ఆ పురుషుడే మన అమ్మ. మిగిలిన వారంతా స్త్రీమూర్తులుగా తోచింది.

సర్వత్రా మంచిని చూడటమే మన మంచితనం.

ద్వాపరయుగంలో గోపికలు శ్రీకృష్ణునితో ఏవిధంగా చరించారో అదే భావం నామపారాయణ నాడు తోచింది. శ్రీకృష్ణుని గీతాగానంతో మానవులు పునీతులు కాగా, ఇచ్చట ప్రత్యక్ష దర్శనాదుల చేత అమ్మ మనలను పునీతులగావిస్తుంది.

రాయినైన కాక పోతిని రామపాదం సోకగా అని శోకించవలసిన పనిలేదు ఆ అయోధ్య రాముడే 'అమ్మ' గా అవతరించాడు అట్లే ద్వాపరయుగంలో గోపికలుగా జీవించి యుండలేదని బాధనొందవలసిన పనిలేదు. అమ్మ పరమాత్మ స్వరూపం మనమధ్యనే వుండటం అనే భాగ్యంచే వెనుక తరాలవారికంటే, ముందు రాబోవు తరాలవారికంటే మనము ఎన్నో రెట్లు అదృష్టవంతులం.

ప్రజలు చక్కగా తృప్తిగా జీవించాలంటే అమ్మ సూక్తులను అధ్యయనం చేసి ఆచరించాలి. రామునిది స్మితపూర్వమైన భాషణ అట్లే అమ్మ. అమ్మ ఎక్కువగా మాట్లడకున్నా అలతి అలతి పదాలతో ఉపనిషత్తుల అర్థాన్ని వివరించేది. దానిని అర్థం చేసుకొని ఆచరించగల శక్తినీ అమ్మే అనుగ్రహించాలి. అమ్మ జీవితం మహాకావ్యం అది వ్యంగ్యోపదేశంగా ఉంటుంది. ఆ కావ్యాన్ని గానం చేసి అందలి అమృతాన్ని ఆస్వాదించి మన సహచరులతో కలిసి పంచుకొందాం.

"జయహోమాత శ్రీ అనసూయ
రాజ రాజేశ్వరి శ్రీ పరాత్పరి"

అనుగ్రహ స్వరూపిణి - అమ్మ

సాధారణంగా ప్రపంచంలో ధర్మానికి గాని, అధర్మానికి అభ్యుదయం కలిగినప్పుడు దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి ధర్మసంస్థాపన చేయటానికి అవతారమూర్తులు ఉద్భవిస్తారని భగవద్గీత చెప్తున్నది. భగవంతుని అనుగ్రహం

దయలేని వాళ్ళంతా దయ్యాలే.

ఏ రకంగానైనా ఉండవచ్చు అనగా దృష్టి రూపేణా, భావంరూపేణా, స్పర్శరూపేణా వాక్కురూపేణా అనుగ్రహం ప్రసారమవుతుంది.

దృష్టి రూపేణా అంటే మత్స్యం గ్రుడ్లను పెట్టి జ్ఞప్తికి వచ్చినపుడు వానిని చూచినందువల్లనే ఆ గ్రుడ్లు పిల్లలగా మారుతాయి. అట్లే రమణ మహర్షి తన దృష్టి ద్వారా అనేకులను పునీతులుగా చేశాడు.

అదేవిధంగా అమ్మ దృష్టి అనే అమృత ప్రసాదం చేత ఎందరినో ఎన్నెన్నో విధాలుగా పునీతులుగావించుచున్నది. "చూస్తే కనబడను కనబడితే చూస్తారు" అని అమ్మ అంటుంది. రోజు ఎందరెందరో అమ్మను దర్శిస్తున్నారు. అంతవరకు అమ్మను ఎంతగానో విమర్శించినవారూ అమ్మ దృష్టి వారిపై పడటం కారణంగా వారు పరిణామం చెంది అమ్మను శరణుకోరి పవిత్రులవుతున్నారు.

భావం రూపేణా అనగా కూర్మం తాను గ్రుడ్లు పెట్టి ఎన్నో యోజనాల దూరం వెళ్ళి అక్కడనే గ్రుడ్లను గురించి భావన చేసినంతమాత్రాన ఆ గ్రుడ్లు పిల్లలవుతున్నాయి అట్లే శంకరాచార్యులవారు తమ ఆలోచన మాత్రం చేతనే నది ఒడ్డున గురువుగారి కౌపీనం పిండుతున్న తోటమలకాచార్యులకు విద్యాదానం చేశారు.

ఈ మంచం మీద కూర్చున్నదే అమ్మ కాదని తానంతటా నిండివున్నానని తెలుపుతూ "మీకు గోడలడ్డు కాని నాకు గోడలు అడ్డుకాదని" అమ్మ తెలిపింది. అమ్మకు ఎవరి గురించి అయినా తీవ్రమైన ఆలోచన వస్తే వారి గొంతు, మాటలు వినిపిస్తాయట. వారెంత దూరములో వున్నప్పటికి జిల్లెళ్ళమూడిలో అమ్మ ఎంత మంది మధ్య కూర్చుని మాట్లాడుతున్నప్పటికినీ, అట్లా అమ్మ ఆలోచనలలోనికి వచ్చినవారు ఎంత ధన్యులో కదా!

స్పర్శ రూపేణా అనగా కోడి తాను గ్రుడ్లపై కూర్చుని స్పర్శద్వారా గ్రుడ్లను

చేతులు కలవడమే నమస్కారం కాదు. నమస్కారానికి సంస్కారం ఆస్కారం.

పొదుగుతుంది. అట్లే రామకృష్ణపరమహంస తన స్పర్శద్వారా నరేంద్రుని అనుగ్రహించాడు.

ఆర్తితో, ఆవేదనతో, అనేక ఈతి బాధలతో సతమతమవుతూ తన దగ్గరకు చేరిన అనేకులకు తన చల్లని స్పర్శతో ఓదార్చి అమ్మ అనుగ్రహిస్తున్నది. పైన వివరించిన మూడు రకాల అనుగ్రహాలను అమ్మ తన పిల్లలకు ప్రేమతో అందిస్తున్నది. "మీరు నా బిడ్డలే కాదు నా అవయవాలు కూడా అని" అమ్మ అన్నది. అట్టి మన బాగోగులు ఆవిడకంటే ఎవరు మిన్నగా చూడగలరు?

అమ్మ దృష్టిలో "అంతా ఈశ్వరస్వరూపమే, కనిపించేదంతా అదేనని అది కానిది వేరే లేదని" అన్నది. అన్ని సంకల్పాలు ఈశ్వరప్రేరణలేనని అమ్మ నిర్ద్వంద్వంగా చెబుతున్నది. సర్వరూపాలైవున్న దివ్యశక్తిని గుర్తింపచేయడమే అమ్మ బోధనలసారం.

పూర్వం భగవంతుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం అవతరించాడు. కాని ఈ కలియుగంలో ప్రేమమూర్తియై, కరుణాస్వరూపిణియై, వాత్సల్యరూపిణియై, అమ్మయై భగవచ్ఛక్తి రూపుదాల్చింది. కనుకనే పాపం - పాపులు దుష్టశిక్షణ అన్న పదాలను అమ్మ తన నిఘంటువులోనే చెరిపివేసింది. "అందరికీ సుగతేనని" ఘంటాపదంగా ప్రకటించింది. ఎవరు బురద పూసుకు వచ్చినా పరిశుభ్రం చేయవలసిన బాధ్యత తనదేనని చాటింది.

అనేక విషయాలను, అవి ఆధ్యాత్మికాలయినా ఆది భౌతికాలయినా, అమ్మ అలతి అలతి పదాలతో అందరికి సులభంగా బోధపడేటట్లు చెప్తుంది. అమ్మ బోధనలను సక్రమంగా అర్థంచేసుకొనగలిగితే ఈ లోకం వైకుంఠం, యీజీవితం ఆనందమయం అవుతుంది.

కనుకనే మనం అమ్మను తప్పక దర్శించుకోవాలి. అమ్మను

తల్లికి తప్పే కనబడదు.

పూజించుకోవాలి. అమ్మ ఏది చెప్పినా తన అనుభవంలో నుంచే చెప్తుంది. కాబట్టి వాటిని మనసుకు పట్టించుకొని వాటిని ఆచరణలో పెడ్తూ అమ్మ ప్రేమను పొందుతూ, అమ్మ అనుగ్రహాన్ని పొందాలి. ట్రెయిన్ ఎడ్వర్డ్ "నీ కోరికలు తీర్చడం లేదని భగవంతునిపై ఆగ్రహించకు, ఆలస్యమయినంత మాత్రాన వాటిని తిరస్కరించినట్లు కాదు, నిజమైన ప్రార్థన వల్ల నీ యోగ్యతను బట్టి, ఒక్కోసారి యోగ్యతను మించి ఫలితం లభిస్తుంది" అని అంటాడు.

అసలు మనకు ఏం కావాలో, ఏది మనకు మేలు చేస్తుందో, మేలు అంటే ఏమిటో మనకు తెలియదు. కనుక మన సర్వభారములు, బాధ్యతలు అమ్మకు వదిలి మనం నిశ్చితంగా ఉండడం పరమసుఖం.

అమ్మ అనుగ్రహస్వరూపిణి కనుక ఏ బిడ్డకు, ఏ వేళలో ఏమి అవసరమో తెలిసికొని అమ్మే ప్రసాదిస్తుంది. అమ్మ అలాగని పలుసార్లు హామీని కూడా ఇచ్చింది ఇంక మనకు దిగులెందుకు?

ఆనందప్రదాయిని - అమ్మ

అనురాగవల్లరి, ఆనందప్రదాయిని అయిన అమ్మను గూర్చి చెప్పాలనుకోవడం హాస్యాస్పదంగా ఉంటుందేమోననిపిస్తుంది. కానీ ఆవగింజలో అర్థభాగమైనా, సముద్రంలో నీటిబొట్టంతయినా అమ్మ గూర్చి చెప్పుకుంటే దాన్ని మించిన తృప్తి జీవితంలో వేరే ఉండదేమోననిపిస్తుంది.

ఆదిపరాశక్తి, లలితాపరాభట్టారిక మన జీవితకాలంలో మానవిగా అవతరించడం నిజంగా మన అదృష్టమే. "ధ్యాసే ధ్యానం" అన్న అమ్మ సూక్తికి తగినట్లుగా అమ్మను గురించి ఆలోచన చేయటం, దానిని మననం చేయటం, మాట్లాడుకోవాలనే తపన కూడా తపస్సే. నిరంతరం ఈ జీవన పోరాటంలో అలసి సొలసిన మనస్సులకు అమ్మ గురించిన ధ్యాస, ధ్యాసతో కూడిన తపన వుండటం ఒక వరమేనని చెప్పవచ్చు.

వున్నది చాలనుకొనేది సుఖం, లేనిదాని కొఱకు ఆశించేది దుఃఖం.

అమ్మా! నీవే నా దైవానివంటే, నేనూ మీలాంటిదాన్నే నాన్నా! మీరెంతో నేనూ అంతే అంటూ తనకేమీ చేతకాదని అంటుంది. కాని నిశితంగా చూస్తే మన సమస్యలకు చక్కగా లాయర్‌లాగా ఆర్గ్యూ చేస్తూ, 'జడ్జీలాగా జడ్జిమెంట్ ఇస్తుంది. దానిని మనం సరిగా అర్థం చేసుకొని జీవితాన్ని కొనసాగిస్తే మనబాట పూలబాట అవుతుంది.

ఒక రోజు అయ్యగారి నరసింహారావు గారు తమ మిత్రుని తీసుకువెళ్ళి చాలా కష్టాలలో వున్నాడని, అప్పుల పాలైనాడని చెప్తే దానికి అమ్మ పైన చెప్పినట్లుగా లాయర్‌లా ఆర్గ్యూ చేస్తూ జడ్జీలా తీర్పు చెప్పింది. "నీకు ఉన్న స్థోమతకు అప్పులు తీర్చలేవు కాబట్టి ఎవరి దగ్గరైతే అప్పు తీసుకున్నావో వారి దగ్గర నీ అసమర్థతను అప్పీలు చేసుకోమంది. అప్పీలు అంటే బయట అర్థిస్తున్నట్లు కోర్టులో అయితే అభ్యంతరం తెలపటం అని వివరిస్తుంటే అక్కడ ఉన్న మేమందరం ఆశ్చర్యంతో తలమునకలయినాము. వారికి ఏమి ఇవ్వలేనని చెప్పేస్తే వారికి ఆ డబ్బు వస్తుందన్న ఆశపోతుందని తీసుకున్నందుకు చెప్పటం విధి అని చెప్పింది. అక్కడ చెప్పేసివస్తే అతని కుటుంబబాధ్యత తానే తీసుకొని జీవనోపాధి కల్పిస్తానని హామీఇచ్చింది కానీ ఆయన 'అమ్మ' సలహా పాటించక పరారి అయ్యారు.

అప్పుడు అక్కడే వున్న మా ఆయన "అమ్మా నాకూ అప్పులున్నాయి. నేను ఎలా బయటపడగలను?" అన్నారు. 'నీకు వడ్డీ లేకుండా సహాయం చేసేవారున్నారుగా నాన్నా, వాడి విషయం అట్లాకాదు అందుకని ఆ విధంగా చెప్పమన్నాను. నీవు లక్షలైనా తీర్చుకోగలవు అని' హామి ఇచ్చింది. అది మొదలు అమ్మ మాటే మంత్రంలా అప్పులు తీర్చుకుంటూ అభాసుపాలు కాకుండా జీవించగల్గుతున్నాము. అవసర సమయంలో మనోధైర్యాన్ని కలిగించే

సర్వాన్నీ పూజ్యభావంతో చూచేవారు పూజ్యులు.

అమ్మ వాక్కుకు మించిన దేముంది. దీనిని బట్టి అర్థమయ్యేది ఏమిటంటే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, అన్యాపదేశంగానో అమ్మ మనకు సూచనలిస్తుంది. ఆ సూచన మేరకు నడుచుకోగలిగితే మనం ఇక్కట్ల నుంచీ బయటపడ్డట్టే.

"మాతృశ్రీ అధ్యయన పరిషత్ కార్యక్రమాల్లో ఏమీ చేయలేక పోతున్నాను. నేను చేయగల్గిందల్లా నీ పాదాలకు నమస్కరించుకోవడమే" అని ఆయన అంటే ఎవరు మాత్రం అంత కంటే ఏమి చేయగలరు అన్నది. అది కూడా అమ్మకరుణే. ఎవరైనా ఏదైనా చేసారన్నా ఆ పనికి వారిని పనిముట్లుగా వాడుకోవడమే. ఎప్పుడు ఎవరికి, ఏదవసరమో దాన్ని పంచిపెట్టే లోకజనని అమ్మ. మనం కావాలనుకున్నదల్లా కాక మనకు ఎప్పుడు ఏది అవసరమో మన అవసరాన్ని కనిపెట్టి మరీ అనుగ్రహిస్తుంది. ఏ విషయమైనా ఎవరైనా చెప్పినదానికంటే అమ్మ నోట ఒక్కమాట వచ్చినా వరాల మూటే. 1980 ఫిబ్రవరిలో విజయవాడ పెళ్ళికి వెళ్ళి బందరు, అట్నుంచి అమ్మ దర్శనానికి జిల్లెళ్ళమూడి వెళ్ళాము. ఆయనకు గొంతుక ఎఱ్ఱగా, నొప్పిగా వుండటంతో కేన్సరేమో అని భయపడ్డాం. అమ్మ దగ్గర కూర్చుని వుండగా అమ్మ ఆయన చేయి తీసుకొని షిరిడిసాయిబాబా ఉంగరం వుంటే దాన్ని ముద్దు పెట్టుకుంటూ "ఈ ముసలితాత వుండగా నీ ఆరోగ్యానికేమీ ఢోకా వుండదు. భోళాశంకరుడు పిలిస్తే పలుకుతాడు" అని అంది. నన్నూ ఆయన్ని షిర్డీ వెళ్లమని, వెంటనే అబ్బాయికి వీలు అవుతుందో లేదో కానీ నీవు వెళ్ళిరా అంది. నేను అమ్మ వెళ్ళమన్నది కదా అని, అంతకు పూర్వం నుంచే షిర్డీ వెళ్ళాలన్న కోరిక వుండటంతో, ఎప్పటి కప్పుడు వెళ్దామనుకుంటూనే వెళ్ళలేకపోయాను. ఆయన మాత్రం అనుకోకుండా షిర్డీసాయీశుని దర్శించుకొన్నారు. తరువాత మా పెద్దమ్మాయి వాళ్ళు నాసిక్‌లో వుండటంతో నాలుగుమార్లు అక్కడకు వెళ్ళటం, అక్కడ నుంచి షిర్డీకి వెళ్ళిరావటం నా దృష్టిలో అమ్మదయే దానికి కారణం.

దేవులాడినా దొరకనివాడు భగవంతుడు.

ఆయన ఆరోగ్యం గురించి అమ్మ అంతగా నొక్కి చెప్పకపోతే జబ్బు లేకపోయినా, బెంగతోనే అవసరాలను, ఆరోగ్యాన్ని చెడకొట్టుకునేవారే. అమ్మ ఏమీ మాట్లాడదన్నా వారి వారి అవసరాలను బట్టి, వారి యోగ్యతను మించే తగిన సూచనలు, సలహాలనిస్తూనే వుంటుంది. అంతవరకూ కేన్సరేమోనని బెంగతో బాధపడ్తున్న ఆయన ఏ చికాకులేక హాయిగా తృప్తిగా శాంతిగా ఉన్నారు. అమ్మ అనురాగాన్ని మాటలతో వర్ణించుటకు వీలుకాదు. ఎవరికి వారే ఆ అనురాగాన్ని చూరగొనాలి. ఎవరిని ఏవిధంగా అనుగ్రహిస్తుందో అది 'అమ్మ'కే ఎఱుక. సామాన్య మానవులైన మన తరం కాదు. ఏ కొంచెం అర్థమయినా అమ్మ అనుగ్రహం, కరుణ మనమీద వున్నట్లేనని ఆనందిస్తూ అట్టి ఆనంద ప్రదాయిని అయిన 'అమ్మ'కు కైమోడ్పులు సమర్పిస్తున్నాను.

ఆధ్యాత్మికత - అమ్మ

భక్తి జ్ఞాన తృష్ణలతో అమ్మదరి చేరిన వారికి దొరకని నిధి లేదు. అమ్మయే గొప్ప నిధినిక్షేపం. అమ్మ దగ్గరికి చేరటమే నిధి నిక్షేపాలను పొందటం వంటిది. అపారమైన, అనూహ్యమైన అమ్మ కరుణావృష్టిలో వారి వారి కోరికలు పుష్పించి ఫలవంతమవుతాయి. మనస్సుకు అందని, తోచని అవ్యక్తానందాన్ని పొందుతాము. ప్రపంచంలోని ప్రేమ మొత్తం గూడు కట్టుకొని ప్రేమైకమూర్తి అమ్మగా మనెదుట రూపొందిందేమోననిపిస్తుంది. సర్వజ్ఞ అయిన అమ్మను చూచిన ఎవరి హృదయం పులకరించదు? అట్టి అమ్మ మన హృదయాలను తాకుతున్నప్పుడు మనలోని ఔన్నత్యాలు వాటంతట అవే బహిర్గతమవుతాయి.

భగవంతునికై వెదుకులాడుకుంటూ పోయే భక్తుడు ఆ భగవత్సందర్శన భాగ్యమునకు పరితపించి పోతాడు. అట్టి భక్తికి, జ్ఞానానికి, ప్రేమకు మారుపేరు అమ్మ. సర్వాత్మనా అమ్మను నమ్మినవారికి భక్తి జ్ఞానములు కరతలామలకములే కానీ ఇప్పటి నాస్తిక సమాజం అమ్మను ఏపాటి గ్రహించకలదు?

గజంలో అంగుళాలు వున్నై, అంగుళంలో గజాలు లేవు.

సృష్టిలోని పూర్ణత, తుష్టి, సంతోషం, ఆనందం అంతా అమ్మేననిపిస్తుంది. కాలానికి, దేశానికి కట్టుబడని అతీతమయిన ప్రేమతో అమ్మ మనలను అక్కున చేర్చుకుంటుంది. మన ఆలోచనలలో అమ్మ నడయాడినప్పుడు పరిసరాలను, కాలాన్ని గమనించలేము. మన వ్యక్తిత్వాలను అవతలకు నెట్టి, మనలను నిమిత్తమాత్రులుగా చేసి, సృష్టి, స్థితి, లయలకు తానే హేతువుగా గోచరిస్తుంది. అమ్మ సన్నిధిలో అనిర్వచనీయమైన శాంతితో మన హృదయం నిండిపోతుంది. ఆది, అనాది అయిన అమ్మ కొరకు హృదయం తపిస్తుంది.

భక్తులయిన వారు ఆనందంతో నృత్యం చేస్తారు. ప్రశాంత చిత్తులై అమ్మ మహిమలను వేనోళ్ళ ప్రవచిస్తారు. అంతూ, అడ్డూ లేని ఆనందస్వరూపాన్ని అర్థం చేసుకోవటానికి మనం అశక్తులమే. కానీ అమ్మ దయవలన మనం తెలుసుకోవటమే కాక అందులో కరిగిపోతాము.

షిర్డీసాయీశుడు "పక్షికాలికి దారం కట్టి లాగినట్లుగా మిమ్మల్ని నా సన్నిధికి చేర్చుకుంటాను" అన్నాడు. అమ్మ తన అసాధారణ ప్రజ్ఞతో సమాజం నుంచి, మనందర్నీ ఎక్కడున్నా తన అధీనంలోకి తీసుకొని నెమ్మది మీద వారిలో మార్పును తెస్తుంది.

ఈనాటి సమాజంలో ఇమడలేక, అసంతృప్తితో వ్యధ చెందుతూ జీవితపరమార్థం గోచరించని స్థితిలో ఆధ్యాత్మికత మన మనస్సుకు వూరటను కలిగిస్తుంది. ఆ అవ్యక్తమయిన ఆనందములో, దైవసంబంధమైన ఆలోచనలతో మనస్సు హాయినీ శాంతిని, తుష్టిని, పుష్టిని పొందుతుంది. అప్పుడు సృష్టి అంతా భగవత్స్వరూపంగా తోచి భక్తి భావం జనించి జ్ఞానయుతమై ఆనందప్రదమై నిలుస్తుంది. ఆనందం ఇతర సుఖాలకన్నా వేరుగా వున్నప్పుడు అందుండి విరాగం జన్మిస్తుంది. అదియే ఆధ్యాత్మిక ప్రగతి. ఆధ్యాత్మికమైన అనుభూతికి

విచక్షణలేని వీక్షణ అనుగ్రహం.

అమ్మ దగ్గర మంత్రోపదేశం వుండదు. సర్వం త్యజించవలసిన పనిలేదు. ఆశ్రమ స్వీకారం అంతకంటే వుండదు. "నీకు తోచింది చేయి తోపించేవాడు వాడే కాదా" అని "సాధ్యమైనదే సాధన" అని అంటుంది. "ఆచారాలు వేరైనా ఆధ్యాత్మికత ఒకటే" అని నాకు అమ్మ కలలో చెప్పింది. ఏ మతానుసారం అర్చించినా తనకే చెందుతుందని అమ్మ ఘంటాపదంగా చెప్పనే చెప్పింది కదా!

"మొదట భగవంతుని కనుగొనిన తర్వాత సంపదను ఆర్జింపుము, అంతేగాని దానిని తలక్రిందులు చేయవద్దు. ఆధ్యాత్మికతను సాధించుకొనిన తరువాత ప్రాపంచిక జీవితమును గడిపినను నీవెన్నడును మనశ్శాంతిని గోల్పోవని" రామకృష్ణులు అన్నారు. కాబట్టి ఇహలోక సౌఖ్యముల కొఅకు ముందుగా వెంపర్లు ఆడక ఆధ్యాత్మికత సాధించుటకు కృషి చేయవలెను.

మనం ఎందుకు జన్మించావెూ ఎందుకు జీవిస్తున్నావెూ తెలుసుకోకుండానే ఈ ప్రపంచంనుంచి నిష్క్రమిస్తామని సర్వేపల్లి రాధాకృష్ణగారు అన్నారు. కాని అమ్మలాంటి కొండంత అండ, నిండుగా మనకుండగా మన జీవితాలలో వెలుగు నిండి మన జీవితానికి అర్థం, ధ్యేయం ఏర్పడుతుంది.

విశ్వమానవ సౌభ్రాతృత్వం - అమ్మ

అనుభవాలు విధి నిర్ణయాలైతే ఎక్కడ వున్నా తప్పవు కదా! అటువంటప్పుడు అమ్మ దరి చేరటమెందుకన్న ప్రశ్న కొందరికి ఉదయించవచ్చు. ఆర్తి తీవ్రత చెందినప్పుడు ఆధ్యాత్మికానుభూతి కొరకు మనం కొంత శ్రమిస్తే అమ్మలాంటివారు చేయూతనిస్తారు. మహాత్ముల సందర్శనం యొక్క ఆవశ్యకత ఏమిటని అడిగితే అమ్మ ఈ విధంగా చెప్పింది. "నది అంతటా పారుతున్నా మంచినీరు త్రాగాలంటే రేవు అవసరం ఈ జీవన సాగరాన్ని దాటించే రేవులే మహాత్ములు. కాబట్టి వారి సందర్శనం అవసరమని" చెప్పింది.

మనం అనుకొన్నట్లు జరిగితే పురుషప్రయత్నం లేకపోతే దైవం.

లౌకిక వ్యవహారాల్లో కొట్టుమిట్టాడే జీవునకు ఆధ్యాత్మిక శక్తి ఒక పట్టుకొమ్మ. ఆధ్యాత్మిక జీవనం అలవాటు కావాలంటే సత్సాంగత్యం మనకు చాలా అవసరం. సాధుపుంగవుల సహవాసం మోక్షమునకు మార్గం. సజ్జనుల సహకారం వుంటేనే మానవుడు ముక్తిని పొందుతాడు. మన పూర్వజన్మసుకృతాన ఓర్పు, నేర్పు, కరుణ, భూతదయ, చక్కటి మనస్సు, అందరి యందు సమభావం, సహనం కల అమ్మ మన ఆరాధ్యదైవం అయింది.

అమ్మ బట్టలు పెడ్తుంటే ఇప్పుడెందుకమ్మా అంటే "మీకు పెట్టుకుంటే నా పిల్లలకు పెట్టుకున్నానన్న తృప్తి, మీకూ పెట్టటం నేర్పటానికి" అని అన్నది. పైగా వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజనంతో పాటు బట్టలు పెట్టాలని వుందని అమ్మ తన కోరికను వెల్లడిచేస్తే అక్కడ వున్న అందరం అమ్మ అవ్యాజానురాగానికి ముగ్ధులయ్యాము. అమ్మకు మనందరియందు సమదృష్టి వుందనటానికి నిదర్శనంగా గాయత్రీ హోమంలో చిన్న, పెద్ద, బీద, ధనిక తారతమ్యం లేకుండా అందరికీ ఒకే విధమయిన చీరెలను బహుకరించింది. పెద్ద వాళ్ళకు అనగా ముసలి వాళ్ళకు, పిల్లలకు కూడా ఒకే రకం చీరెలు పెట్టిందంటే అమ్మ దృష్టిలో అందరం పిల్లలమే కదా! దాని ద్వారా మనలో సమభావాన్ని పాదుకొల్పింది. ప్రపంచంలో తోటి మానవుని యందు సుహృద్భావం కలిగి వుండాలికాని, ప్రక్కవాడిని ద్వేషిస్తూ "హరే రామ హరే రామ" అంటే మోక్షం రాదు. అట్టివారి అర్చన బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

పని చేసికొని బ్రతకటం కాక, పనిచేయటం కొరకే బ్రతకాలి. అదే నిజమైన ఆధ్యాత్మికత. కర్మ చేయుటకొరకే జీవించేవారు కాబట్టి మన భారతభూమిని కర్మభూమి అన్నారు. భగవద్గీతలో కృష్ణుడు కూడ కర్మలు చేయి, కాని ఫలితాన్ని తనకు వదలమంటాడు.

విశ్వాసమే భగవంతుడు.

మనలో ఉన్న జ్యోతి స్వరూపమైన ఆత్మను తెలిసికొనుటకే పూజ. భగవత్ సమర్పణ భావం లేకపోతే శాస్త్రాలు కాని, విద్యలు కాని మనలను రక్షించలేవు. ఇదే విషయాన్ని ఆధ్యాత్మిక రామాయణంలో "నా భక్తికి విముఖులైనవారు, ఎంత పాండిత్యం ఉన్నా శాస్త్రమనే గుంటలో పడికొట్టుకుంటారు అట్టివారికి ఎన్ని జన్మలు ఎత్తినా మోక్షం రాదు" అన్నారు.

కావ్యకంఠ గణపతి ఆ సేతు హిమాచలం పర్యటించి, వేద వేదాంగాలను పఠించి, శాస్త్ర అధ్యయనం చేసి తిరిగి తిరిగి ఏమీ చదువుకోని బ్రాహ్మణ స్వామిని శరణుకోరాడు. అరుణాచలంలో 'నాయన' అన్న పేరుతో స్థిరపడ్డారు. ఆయనే బ్రాహ్మణస్వామికి 'శ్రీరమణులని' పేరుపెట్టారు.

శాస్త్ర అధ్యయనం ఒక్కటీ సరిపోదు. అది శబ్దజాలమహారణ్యం, చిత్తభ్రమణ కారణం. శాస్త్ర అధ్యయనంతో పాటు మహానుభావుల అనుభవాలే మనల్ని రక్షించేవి, మోక్షానికి దారి చూపేవి. అందుకే అమ్మ "శాస్త్రం అనుభవాన్ని ఇవ్వదు కాని, అనుభవం శాస్త్రాన్ని ఇస్తుందని" అంటుంది.

"సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజాద్రవ్యాలు కావాలి" అంటుంది అమ్మ. అంటే మానవునికి కష్టాలు లేకపోతే సుఖం యొక్క విలువ తెలియదు, జీవితానికి సమగ్రత వుండదు. బంగారంను కొలిమిలో కాల్చినప్పుడే దానిలోని మాలిన్యం పోయి తన సహజకాంతితో మెరుస్తుంది. అట్లే మానవునికి కష్టాలు, బాధలు వున్నప్పుడే వాని ఔన్నత్యం బయటపడుతుంది. అందుకే కుంతీదేవి ధర్మరాజాదులు పట్టాభిషక్తులు అయిన తరువాత కృష్ణునితో "నిన్ను మర్చిపోకుండా వుండాలంటే మధ్య మధ్య కష్టాలు కలిగించవయ్యా! నీ దర్శన భాగ్యం వల్ల మళ్ళీ మళ్ళీ సంసార దర్శనం ఉండదు. జన్మరాహిత్యం పొంది పరమపదాన్ని పొందగల్గుతాము" అని అంటుంది.

ప్రారబ్ధం భగవంతుడు, సంచితం, ఆగామి, ప్రారబ్ధం-దేనికి యేది ముందు.

"ఎక్కడ ఆదరణ, ఆప్యాయతలుంటాయో అదే జిల్లెళ్ళమూడి" అని అమ్మ అంటుంది. అమ్మ ఏది చేసినా, ఏది మాట్లాడినా సర్వత్రా వ్యాపించిన మమకారం, మాతృత్వమే గోచరమవుతాయి. మనలను ఆ రకంగా తీర్చిదిద్దుటకే అమ్మ ప్రయత్నం.

కోటినామపారాయణతో మనలను పునీతులుగా చేసి లలితా సహస్రనామపారాయణ కొన్ని వేల గృహాలలో జరుగునట్లు చేసింది. దాని తదనంతరం గాయత్రీ దీక్షకు సంసిద్ధులను చేసింది. ఈ దీక్షలో కుల, మత, స్త్రీ పురుష వయోబేధం లేకుండా అందరూ పాల్గొనునట్లు చేసి వారందరూ గాయత్రీ యాగంలో పాలు పంచుకునేలా చేసింది. గాయత్రీ దీక్షనాడే, అడిగిన ప్రతివారికి, స్త్రీలకు, ఇతర కులస్థులకు కూడా ఉపనయనాలు చేసి ఆధ్యాత్మిక రంగంలోనే అనూహ్యమైన మార్పులు తెచ్చింది.

వైదిక కర్మలు ప్రతిఒక్కరూ అనుష్ఠించవచ్చునని ఘంటాపథంగా చెప్పి, ఆచరించి చూపింది. బ్రహ్మతత్వాన్ని తెలుసుకున్న వారంతా బ్రాహ్మణులే. వర్ణాల పేరుతో, మతాల పేరుతో కుంచించుకుపోకుండా సనాతనధర్మాన్ని తెలుసుకొని దాన్ని అనుష్ఠించాలి. అందుకే అమ్మ ఎక్కడో, ఏ కొందరి సొత్తో అన్నట్లుగా వున్న సనాతన ధర్మాన్ని అందరికీ అందుబాటులోనికి తీసుకువచ్చి, మాతృయాగానికి నాంది పలికింది.

మాతృయాగం అంటే అందరికీ తిండి, బట్ట ఇవ్వటం. అమ్మ తన మాటల ద్వారా, చేతల ద్వారా విశ్వమానవ సౌభ్రాతృత్వం అనే మొలకను నాటి పాదు చేసి నీరు నింపింది. ఆ మొలక ఆ పాదులో పెరిగి పెద్దదై, పుష్పించి ఫలిస్తుందనటానికి ఎట్టి సందేహం లేదు.

నడిపించేవాడు విధి, నడిచేది విధానం.

ప్రేమస్వరూపిణి - అమ్మ

నాగరికత ఎంత పరిణితి చెందినా, శాస్త్ర విజ్ఞానం ఎంత ప్రగతిని సాధించినా, మానవునిలో ఆర్తి రగులుతూనే వుంటుంది. చంచలమైన భావాల మధ్య సమన్వయం కుదరక ఆలోచనా పరంపరలలో కొట్టుకు పోతుంటాం. బ్రతుకులోని అలజడులనే మాయచేత కప్పబడి కోర్కెల వత్తిడిలో కనులెత్తి చూడటానికి కూడా వీలు కాక కాలగమనం నెట్టుకుపోతుంటుంది. అటువంటి పరిస్థితులలోనే మానవుని మనస్సు ప్రేమ, వాత్సల్యాల కొరకు అర్రులు చాస్తుంది.

జీవితాన్ని మొత్తం కాచి వడపోస్తే ఆఖరికి కనిపించే అమృతబిందువు ప్రేమ. అందుకే ఆ ప్రేమ ఆప్యాయతలకే మానవుడు తలవంచుతాడు. ఎంత కరకు రాతిగుండె అయినా ఆ ప్రేమ, ఆప్యాయతలకే లొంగుతుంది. అందుకే కబీరు "ప్రేమలేని శరీరం, శ్మశానంలోని శవంతో సమానం, కంచరి వాని తిత్తి ప్రాణం లేకపోయినా శ్వాస తీసుకుంటూనే వుంటుంది కదా" అని అంటాడు.

"దారిద్ర్యం గుమ్మం గుండా ప్రవేశిస్తే ప్రేమ కిటికీ గుండా పారిపోతుందని" ఆంగ్ల సామెత. మామూలు మానవుల విషయంలో ఇది అక్షరాలా నిజమే కాని అవతారమూర్తుల విషయంలో మాత్రం ఇది వర్తించదు. కులమతాలతో పని లేకుండా అందరినీ ఒకేలాగా ప్రేమించి, ఆదరించి, వాత్సల్యామృతాన్ని పంచి ఇచ్చే సమ్మోహన శక్తి అమ్మ.

హైదరాబాద్ వాళ్ల సావనీర్‌లో చదివినట్లు గుర్తు. "జిల్లెళ్ళమూడిలో వుందనుకుంటే వుంది అమ్మ లేదనుకుంటే వుంది కొమ్మ". అందుకే ఏదైనా మన నమ్మకాన్ని బట్టే వుంటుంది. దేవాలయంలో దేముడు ఆస్తికునికి దేముడిగాను, నాస్తికుడికి రాయిగా మాత్రమే తోస్తుంది. ఒక మారు అమ్మ దగ్గర కూర్చుని వుండగా "అమ్మా ! సత్యసాయిబాబాగారు నీవు రాజరాజేశ్వరి

కాలమే కర్తవ్యాన్ని బోధిస్తుంది.

అవతారం అన్నారమ్మా" అన్నారు. "నాన్నా! రాజరాజేశ్వరిని మనం చూసామా? మీరు పిల్లలు, నేను అమ్మను" అంది. "అమ్మా, బాబా గారి డాక్యుమెంటరీ ఫిలిం చూస్తావా?" అన్నారు. "ఎందుకు చూడను? వాడు వస్తే అమ్మను చూడటానికి, నేను వెడితే బిడ్డను చూచుకోవటానికి" అని అంది. అలాగే శ్రీ పన్నాల రాధాకృష్ణశర్మగారు తిరుపతి వెడ్తూ అమ్మ దర్శనార్థం వస్తే "వెంకన్నను అడిగానని చెప్పరా" అంది. అక్కడే వున్న మాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

అమ్మ ప్రేమస్వరూపిణి అనటానికి ఎటువంటి సందేహం లేదు. తన దగ్గరకు వచ్చినవారు ఎవరైనా సరే వారి వారి అవసరాలకు అనుగుణంగా తన ప్రేమామృతాన్ని వారికి అందచేస్తుంది. తన దగ్గరికి వచ్చిన వారికే కాక తన పరిధిలోనికి రాలేని వారికి సైతం తన సంకల్పం ద్వారా వారికి అవసరమైన మేరకు అనురాగాన్ని అందిస్తుంది. లేదా వేరొకరిని పనిముట్టుగా వాడుకొని అయినా సరే, వారి ద్వారా అవతల వ్యక్తికి కావలసిన మనోధైర్యాన్ని, వాత్సల్యాన్ని ప్రేమను అందిస్తుందనే దానికి నిదర్శనమే ఈ వ్యాసము.

1983 డిసెంబరులో అనుకుంటా మనస్సు చికాకుగా ఉంది, ఎటూతోచని స్థితిలో, నామనస్సును నేను అదుపుపెట్టుకొనలేని పరిస్థితి ఏర్పడింది. పోని అమ్మ దగ్గరకు వెళ్ళి వూరట చెందటానికి వీలు కాని పరిస్థితి. విపరీతమైన ఆవేదన, ఆలోచనలతో మానసికంగా కృంగిపోతున్న తరుణంలో దువ్వాడలో కుసుమహరనాథ నామ సప్తాహం జరుగుతున్నదని తెలిసి నేను మా అమ్మాయి మాధవి ఒక ఆదివారం దువ్వాడ వెళ్ళాము.

అక్కడ ఒక అన్నయ్య వేరొకరికి పరిచయం చేస్తూ వీరు తరచూ జిల్లెళ్ళమూడి వెడ్తుంటారు అని చెప్పారు. దానికి ఆమె జిల్లెళ్ళమూడి వెడుతుంటారు కదా మరి ఇక్కడికి వచ్చారేమని నా మెడలో షిర్డీసాయిబాబా

లాకెట్ చూచి ఈ లాకెట్ పెట్టుకున్నారే అని ప్రశ్నించింది . దానికి నేను "One in all, All in one" ఒకరిలోనే అందరిని, అందరిలో ఒకరిని చూచుకునే శక్తి అమ్మ మాకు ప్రసాదించిందని చెప్పాను. అమ్మ తన దగ్గరకు వస్తున్న ఏ ఒక్కరికీ తననే పూజించమని కాని, తన్నే ధ్యానం చేయమని కాని ఎప్పుడూ చెప్పలేదు. ఎవరికి ఏది ఇష్టమైతే దాన్నే చేయమంటుంది. పైగా వారి వారి ఇష్టదైవాలనే తనలో చూచుకుంటున్నారని అంటుందని చెప్పాను. అమ్మ స్వయంగా నన్ను, మా ఆయనను షిర్డీ వెళ్ళి రమ్మని చెప్పింది. అమ్మ దయవల్ల మేము షిర్డీబాబా దర్శనం చేసుకోగలిగాము.

ఒకమారు మా అమ్మ నీ నామం చేద్దామన్నా "కుసుమహర" అనే వస్తోందమ్మా అని అమ్మతో అంటే అదే చేయమని ఏ నామమైనా తనకే చెందుతుందని చెప్పింది. పైగా "శ్రీకృష్ణుడు అర్జునునకు సాయపడినట్లు హరనాథబాబా ఎల్లప్పుడూ నిన్ను కనిపెట్టుకొనే వున్నాడని" చెప్పింది. వీరు వారు అన్న తారతమ్యాలు మానవమాత్రులమైన మనకే గాని అమ్మలాంటి అవతారమూర్తులకు అంతా ఒకటే. అందుకే అమ్మ "నమ్మకమే దైవం - విశ్వాసమే భగవంతుడు' అంటుంది.

నామసప్తాహానికి శ్రీశ్రీ లక్ష్మణయతీంద్రుల వారు దువ్వాడ విచ్చేసారు. జిల్లెళ్ళమూడిలో కోటినామపారాయణప్పుడు వారి దర్శన బాగ్యం కలిగింది. వారికి నమస్కరించి వద్దామని వెళుతుండగా, ఆశ్రమ సెక్రటరీ శ్రీవెంకట్రావుగారు నీ గురించే వస్తున్నానమ్మా శ్రీలక్ష్మణ యతీంద్రులవారు నిన్ను అడిగారు అని చెప్పారు. యతీంద్రులవారి దగ్గర నా ప్రయత్నం లేకుండానే నా ప్రస్తావన వచ్చిందనేటప్పటికి ఆశ్చర్యం ఆనందం పెనవేసుకున్నాయి. మతిస్థిమితం లేక అల్లాడుతున్న నాకు నా ప్రస్తావన వచ్చిందంటే ఎడారిలో ఒయాసిస్సు కనిపించినంత ఆనందం కలిగింది.

నడవనివ్వని శక్తులన్నీ నడిపించే శక్తిమీద ఆధారపడి వున్నాయి.

శ్రీశ్రీ యతీంద్రులవారికి నమస్కారం చేసుకోగా "అంతా బాగున్నారా? అబ్బాయి ఎలా వున్నాడు? పిల్లలు ఏమిచేస్తున్నారని" అడిగితే, అవాక్కు అయినాను. ఎందుకంటే ఆ అడిగే తీరు కంఠస్వరం పూర్తిగా అమ్మవే ఆ సమయంలో అమ్మ సమక్షంలోనే వున్నానన్న అనుభూతి కలిగింది. నా ఆవేదనను దూరం చేయటానికే అమ్మ ఆవిధంగా వేంచేసిందని అనిపించింది "అమ్మ దయ పరిపూర్ణంగా నీ మీద వున్నది, దిగులు పడవలసిన పని లేదని అన్ని పరిస్థితులు సర్దుకుపోతాయని" యతీంద్రులవారు చెప్పటంతో, ఆవేదనతో అలమటిస్తున్న నాకు ఎంతో ధైర్యం, మనశ్శాంతి కలిగాయి.

మనుష్యుల మీదనే కాక ప్రకృతిపై కూడా అమ్మ లాంటి వారి ప్రభావం వుంటుంది. క్రూరమృగాలు సైతం వాటి నైజాన్ని పోగొట్టుకొని ప్రశాంతంగా వారి సన్నిధానంలో వుంటాయి. పిల్లి తన పిల్లలతో పాటు కుక్క పిల్లకు పాలివ్వటం, ఆవు కుక్కకు పాలివ్వటం, కుక్క 'జయహో మాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి' అని నామం చెప్పటం లాంటి అనూహ్యమైన విషయాలు అమ్మ సన్నిధిలో జరిగాయి. రమణమహర్షి ఒడిలో పిల్లి, ఎలుక, తమ సహజవైరాన్ని కూడా మరచి ఆడుకునేవట. మనుష్యులపై, పరిస్థితులపై ప్రకృతిపై కూడా ప్రభావాన్ని చూపే అతీతమైన వ్యక్తిత్వాలే అవతారాలు. వారి ప్రభావంలో మనం కూడా పునీతులమవుతాము.

బ్రతుకులోని అలజడులకు చివురాటుకు మాదిరిగా కొట్టుకుపోతూ, బీడువారిపోయిన మనస్సులమీద 'అమ్మదయ' అనే అమృతవృష్టి కురిసినప్పుడు బ్రతుకులోని మాధుర్యం వైపుకు మనస్సు పరుగులు తీస్తుంది "అవశ్యం అనుభోక్తవ్యం కృతం కర్మ శుభం అశుభం" చేసిన పుణ్యపాపాల కర్మఫలం అనుభవించి తీరవలసిందేనంటారు. కాని అమ్మ ప్రేమామృత వృష్టిలో తడిసిన

ఇతరులలో లోపం చూడకపోవడమే మన పవిత్రత.

వారికి పాపపుణ్యాల ప్రసక్తే వుండదు. సర్వభారములు, బాధ్యతలు అమ్మ మీదవేసి అమ్మ తోపించిన విధంగా మన జీవితాలను నడుపుకుంటూ అమ్మ ప్రేమామృతంతో తరిద్దాము.

అమ్మ - మహాసమాధి (మహాప్రస్థానం)

అమ్మ మహాసమాధి పొందారన్న సంగతి రేడియో వార్తలలో విని నిర్ఘాంతపోయాను. అమ్మ లేకుండా జీవనం సాగించగలమా! ఏవిధంగా జీవించాలని పరిపరి విధాల శోకించాను. నాలాగా ఎందరో, ఎందరికో, ఎన్నెన్నో కుటుంబాలకో అమ్మ గమ్యం, గమనం తానై నిలచింది. అట్టి మాతృమూర్తి లేకుండా ఎలా వుండగలనని బావురుమంటూ సుడిగాలిలో చిగురుటాకులా అల్లాడిపోయాను.

చివరిసారిగా శారీరకంగా వున్న అమ్మను దర్శించాలన్న ఆర్తితో జిల్లెళ్ళమూడికి మూడు టాక్సీలలో విశాఖపట్టణం వాళ్లం బయలుదేరాము. 7వ మైలురాయి దగ్గరకు వస్తున్నామంటేనే అమ్మ దర్శన భాగ్యం కలిగినట్లుగా ఆనందించేవారము. వైజాగ్ నుంచి ఎప్పుడు బయలుదేరినా అమ్మ గురించి ఆనందంగా ముచ్చటించుకుంటూ ఎంతో సందడిగా వెళ్ళేవాళ్ళము. అటువంటిది ఎవ్వరం నోట మాట, పలుకు లేకుండా అంతులేని ఆవేదనతో అలమటిస్తున్నాం. సింహద్వారం దగ్గర నుంచి అమ్మను చూడాలన్న తహతహతో అమ్మ నివాసభవనమైనా కనపడ్తుందని మెడలుచాచి చూచేదాన్ని. అలాంటిది ఇప్పుడు ఎనలేని గుండెబరువుతో ప్రయాణం సాగించాల్సి వచ్చింది. ఉదయం 6 గం॥లకు ఉదయిస్తున్న బాలార్కుని చూచి అమ్మ లేని ఉదయాన్ని చూడాల్సివస్తున్నదని వ్యధ చెందాను. జీవితంలో ఇంతకంటే అనూహ్యమైన రోజు వుంటుందా? ఏమిటి ఇట్టి వైపరీత్యం కలిగించావేమమ్మా ! అని రోదించాను.

ఎవరూ మనకున్న దానిని తొలగించలేరు, లేనిదానిని తెచ్చిపెట్టలేరు.

అమ్మలేని జిల్లెళ్ళమూడిని తలచుకుంటూ గుండె బరువెక్కుతుండగా, సింహద్వారం దాటిన తరువాత ఎదురుగా రెండు తాటిచెట్లు కనిపించాయి. ఒకటి పొడవుగా వుండి దానికి సమీపంగానే కొంచెం పొట్టిగా వున్న చెట్టును తనలో కలుపుకుంటూ, అమ్మ పొట్టలాగా భాసించింది పైభాగం తల భుజములుగాను, అటూ, ఇటూ, వున్న రెండు తాటాకులు చేతులుగాను, చేతులు చాచి మనలను దగ్గరకు తీసుకుంటున్న అమ్మలాగా అనిపించింది. అంతే అంతమటుకు వున్న గుండె బరువు, బాధ తగ్గి ఉపశమనం కలిగింది. 7వ మైలురాయి దాటి సింహద్వారాన్ని సమీపించినప్పటి నుంచి అమ్మ మనకు దూరమయిందన్న కొరత కలుగలేదు. ప్రకృతిలో అణువణువు తానై భాసిల్లుతున్నప్పుడు అమ్మ లేదనుకోవటం మన హృదయ దౌర్బల్యమే అనిపించింది. శారీరకంగా అమ్మ అక్కడ లేకపోయినా అమ్మ శక్తి అక్కడ నిక్షిప్తమైన దన్నమాట సత్యం. మనం ఆర్తిగా పిలిస్తే మనకై తానే ఎదురువస్తుంది. షిర్డీసాయి "నా శరీరం లేకపోయినా నా సమాధి నుండే మీకు సమాధానం లభిస్తుందని" అంటారు. అట్లే అమ్మ ఆ పార్థివ శరీరాన్ని త్యజించినా మనకై తన శక్తిని జిల్లెళ్ళమూడిలో నిక్షేపించి, తాను విశ్వవ్యాపిని అయింది.

హడావిడిగా అమ్మను దర్శించాలన్న కోరికతో అమ్మ నివాసగృహంలోకి పై అంతస్తుకు చేరాను. అంతమటుకు అమ్మ దర్శనం అందరికి లభించినా నాకు మటుకు అమ్మ దర్శనం కరువైంది. అమ్మను స్నానం చేయించి క్రిందకు తీసుకువస్తారు కాబట్టి ఇప్పుడు దర్శనానికి కుదరదని అన్నారు. సరే నా ప్రాప్తం అంతే అనుకొని, అంతలో అమ్మ మాటలు– "తన మంచం చుట్టూ చేరినవారి మీదే కాక దూరంగా వున్నవారి మీద కూడా తన ఆలోచనలు చోటు చేసుకున్నాయన్నది" జ్ఞప్తికి వచ్చి ఊరడిల్లాను.

అనిర్వచనీయమైనది ఆశీర్వచనం.

స్నానపానాలు ముగించుకొని వచ్చిన తరువాత కూడ అమ్మ సమక్షంలోకి వెళ్ళటానికి కుదర్లేదు. ఏది, ఏమైనా అమ్మను దర్శించటమే కదా! నాకు కావాల్సిందని, ఎదురుగా లెక్చరర్స్ క్వార్టర్సు పైకి ఎక్కి నిర్వికల్పంగా ఉన్న అమ్మను దర్శించాను. చివరిసారిగా అమ్మ వూరేగింపులో పాల్గొని నా మనస్తాపానికి తిలోదకాలు ఇచ్చాను. ఊరేగింపు అనంతరం అమ్మను పాలతో అభిషేకించుకొని తృప్తిచెందాను. అమ్మను మహాసమాధి చేసే వరకు అది ఒక మహోత్సవంలా కనిపించిందే కాని, అమ్మ శారీరకంగా మనకు దూరమై పోతుందన్న బాధ ఇసుమంతైనా కలుగలేదు. ఆ జనసమూహం, ఆ కోలాహలం చూస్తే స్వర్ణోత్సవమో, వజ్రోత్సవమో అన్నట్లుగా వుంది. కాని అమ్మ మనలను విడిచి వెళ్ళిందన్న ఆలోచన అసలు కలుగలేదు. ఒక్క క్షణం కూడా అమ్మ అక్కడ లేదని కాని, అమ్మ లేని జిల్లెళ్ళమూడి అని కానీ అనిపించలేదు.

అణువణువు వ్యాపించి, బ్రహ్మాండమంతా తానైన అమ్మ మనలను విడిచి వెళ్ళిందనుకోవటం మన దురదృష్టం. అమ్మ శారీరకంగా లేకపోయినా అమ్మ శక్తి అంతటా నిండివున్నది. "మీ ఆర్తి ఆవేదనలే మిమ్మల్ని నా దగ్గరకు చేర్చేవి" అన్న అమ్మ మాటలకు తగినట్లుగా మనం ఆర్తితో, అమ్మను మన ఆలోచలనలలో, మనస్సులో నడయాడే విధంగా చేసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమ్మ మొదలు పెట్టిన కార్యక్రమాలకు విఘ్నాలు రాకుండా, విఘ్నాలు కలుగ చేయకుండా అమ్మ శారీరకంగా వున్నప్పటి కంటే ఎక్కువ బాధ్యతతో అన్నయ్యలు, అక్కయ్యలు అందరూ పాలు పంచుకొని ఆ బృహత్కా కార్యక్రమాలన్నింటిని సక్రమంగా, సవ్యంగా కొనసాగించవలసి వున్నది. అమ్మ అదృశ్యం అయింది కాబట్టి జిల్లెళ్ళమూడితో ఋణం తీరిపోయిందనే వారికి జవాబుగా జిల్లెళ్ళమూడిలోనే కాక సర్వత్రా నిండి, విశ్వవ్యాపిని అయిన అమ్మ

సందేహ నివృత్తి చేసేది సందేశం.

శక్తితో మన జీవితాలు ముడిపడి వున్నాయన్న సత్యాన్ని లోకానికి చాటవలసిన అవసరం ఎంతైనా వుంది. అమ్మ మొదలు పెట్టిన కార్యక్రమాలను ఎక్కువ ఆసక్తితో, బాధ్యతతో చేపట్టి విజయశంఖాన్ని పూరించవలసినదిగా అక్కయ్యలకు, అన్నయ్యలకు విజ్ఞప్తి చేస్తున్నాను. అట్టి శక్తిని ప్రసాదించి, కార్యక్రమాలన్ని జయప్రదంగా జరిగేటట్లు, మనకు చేదోడు వాదోడుగా వుండవలసినదిగా సర్వత్రా నిండి అంతా తానే అయిన అమ్మ అనంత శక్తిని అర్థిస్తున్నాను.

"జయహో మాతాశ్రీ అనసూయా

రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి"

అమ్మ - వారసులు

అమ్మ భౌతిక బంధనాన్ని 12-6-85న విడనాడి విశ్వవ్యాప్తమై విరాజిల్లుతున్నది. అమ్మ భౌతిక శరీరాన్ని విడచిన వెంటనే అనేకమందికి ఒక సందేహం కల్గింది. అమ్మ తన తదనంతరం దీనినంతటిని ఎవరికి ధారాదత్తం చేసింది? లేదా అమ్మ తరువాత అమ్మగా వుండటానికి ఎవరినైనా వారసులుగా చేసి వెళ్ళిందా? అని రకరకాల ప్రశ్నలుదయించాయి.

అమ్మ భౌతికంగా లేదు కాబట్టి జిల్లెళ్ళమూడిలో ఇన్నాళ్ళు జరుగుతున్న కార్యక్రమాలు మూలపడతాయా? లేక వాటన్నింటినీ ఎవరు నిర్వహిస్తారు? ఇలా అనేక రకాలైన ప్రశ్నలు మొలకెత్తాయి. చాలామంది అలా అన్ని నన్ను అడిగారు కూడా. అలా అడిగిన వారికి జవాబుగా ఈ వ్యాసం అమ్మ నాకు తోపించిన విధంగా రాస్తున్నాను.

పుట్టుకనుంచి అమ్మ ఇలానే వుంది. అమ్మ కడుపున పడినప్పటినుంచి అమ్మమ్మకు భూభారం మోస్తున్నంత బరువుగా వుండేదిట. సాధనలేదు మధ్యంతరంగా సంక్రమించిందీ లేదు, వారసత్వంలాగా అమ్మ అసలు దేనికి

మంచికి మించిన మహిమలేదు.

వారసత్వం ఒప్పుకోదు. "ఏది ఏనాడు ఎట్లా జరగాల్సివుందో అలా జరుగుతుందని" అంటుంది. అలతి అలతి మాటలతో వేదాంతాన్ని తెలియచేయటమే కాక ఆచరణలో తాను చేసి చూపించింది.

అమ్మ ఆధ్యాత్మికోపన్యాసాలు ఇవ్వలేదు. తన మహిమను చాటుకోలేదు. తన గురించి గొప్పగా చెప్పేవారిని ప్రోత్సహించలేదు. అయినా అమ్మ యొక్క అవ్యాజకరుణ, మాతృత్వవీక్షణమే అసంఖ్యాకులైన మానవులకు జాతి, కుల, మత, వర్ణ, వర్గ, విచక్షణకు అతీతులుగా చేసి విశ్వమానవ సౌభ్రాతృత్వానికి పాదుకొల్పింది. అమ్మ మహాసమాధి చెందినప్పుడు ఎవరినీ వారసులుగా నిర్ణయించలేదు. తాను భౌతికంగా మన మధ్య లేకపోయినా తన శక్తి అంతటా వ్యాపించి వుంటుందని చెప్పింది. ఆ విషయాన్నే అనేక మందికి అనేక అనుభవాల ద్వారా సుస్పష్టం చేసింది చేస్తోంది. అమ్మ లేకపోతే కదా తనకు వారసులు అవసరమయ్యేది? అమ్మ మహాసమాధి అనంతరం కూడా ధ్యానంలో - స్వప్నంలో, ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడ అమ్మ దర్శనభాగ్యం కలుగుతూనేవుంది. అట్టి వారు ఎంత అదృష్టవంతులో కదా! ప్రకృతితానై, తానే ప్రకృతై అణువణువునా ప్రకాశిస్తూ తాదాత్మ్యం చెందింది అమ్మ.

లలిత సుందరదరహాస జ్యోత్స్నలతో నిండిన అమ్మ మోమును మనం గుర్తు తెచ్చుకుంటూ అమ్మ చూపిన బాటలో పయనిద్దాం. 'ధ్యాసే ధ్యానం' అను అమ్మ సూక్తిని పూర్వం కంటే అనగా అమ్మ భౌతికంగా మన మధ్య వున్నప్పటి కంటే సర్వత్రానిండిన అమ్మను తలుచుకుంటూ ఆధ్యాసలోనే మనగలిగే అదృష్టాన్ని కలుగచేయవలసినది కూడా అమ్మే కదా! "భారతదేశంలో వెలిగే ఆధ్యాత్మిక చైతన్యం ప్రపంచానికి శాంతిని అందిస్తుందని" అమెరికాలో ఉపన్యసించిన రామతీర్థులు నుడివారు. "అసాధ్యాన్ని సాధ్యం చేసేదే ఆధ్యాత్మిక శక్తి" అంటుంది అమ్మ. అట్టి ఆధ్యాత్మిక శక్తి మన భారతదేశంలో నిబిడీకృతమైవుంది.

సృష్టికి మించిన మహిమలేదు.

రమణమహర్షి "ఒక్కొక్కరు తనకు తానే గురువు కావచ్చు" అని అంటారు. అమ్మా నీవు చేసిన సాధన ఏమిటంటే, తెలిసి చేసిన సాధన లేదంది. అమ్మకు ప్రత్యేకంగా గురువంటూ లేనట్లే, అమ్మకు వారసులంటూ ప్రత్యేకించి ఎవరినీ నియమించలేదు. అమ్మ అనురాగపు ఒడిలోనికి వెళ్ళి మనమంతా అమ్మకు వారసులమే. అమ్మ చూపిన దారిలో పయనిస్తూ, అమ్మ సూక్తులను విశ్వమంతా చాటిచెప్పటమే కాక, ఆచరించి చూపించవలసిన అవసరం ఎంతైనా వుంది. అప్పుడే మనమందరం అమ్మకు తగ్గవారసుల మనిపించుకుంటాము.

నదీరా :

అమ్మకై కోవెలై ఆ నీడనే
కొమ్మపై కోయిలై నేపాడనే

కోయిల గొంతెత్తు సరికి కొమ్మ విరిగిపోయె
ఆ కోవెలలో పూవులలో అమ్మ మునిగిపోయె ॥ అమ్మకై ॥

నేనే కోవెలై తానే దేవతై
జగజగాలె తీవలై యుగయుగాలె పూవులై
కురిసెను విరిజల్లు విరిసెను హరివిల్లు ॥ అమ్మకై ॥

నీరు ఆవిరైనా నీలిమేఘమౌను
కన్నీరు ఆవిరైనా జాలిరాగమౌను
మిధ్యకాదులే అనురాగం
మధ్య ఆగిపోదు ఈ యాగం ॥ అమ్మకై ॥

అన్నదాతలంతా అమ్మకు వారసులే
అమ్మలేదు అంటే నమ్మరువారసలే

మహాతత్త్వానికి మహాత్మ్యాలతో పనిలేదు.

చిరంజీవి అమ్మా పరంజ్యోతి సుమ్మా || అమ్మకై ||

దీక్షా ముద్రే కాని దీర్ఘనిద్రే లేని
ఆయమ కంఠారవం ఆలయ ఘంటారవం
అది కోవెల ఘంటారవం ఇది కోయిల కంఠారవం || అమ్మకై ||

నామసంకీర్తన

కలియుగంలో అవతరించిన మహానుభావులందరూ నామసంకీర్తన యొక్క మాధుర్యాన్ని, నామసంకీర్తన యొక్క ఆవశ్యకత గురించి తెలియచేసారు. అందుకే అమ్మ "మీది భక్తి నాది యుక్తి. మీరు భక్తితో నామం చేయండ"ని అంది.

నామం చేయటం వల్ల కలిగే ఉపయోగమేమిటని ప్రశ్నిస్తే రూపం కంటే నామం గొప్పది. రూపం నశించేది. నామానికి నాశనం లేదు. నామం చేయగా, చేయగా దాని ఉపయోగం, అవసరం ఆ నామమే విశదీకరిస్తుందని అన్నది. ఆంజనేయస్వామి రాముని కంటే రామనామాన్నే ఆశ్రయించాడు.

నామసంకీర్తనం అంటే అమ్మకు చాలా అనురక్తి. నామసంకీర్తన విని అమ్మ ఎంతగా పరవశించిపోయేదో మాటలతో చెప్పలేము. "శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగాన రసఫణిః" అన్నట్లుగా అమ్మ ఆనందంతో తల ఊపే విధానం చూస్తే పాము పడగ విప్పి నాట్యం చేస్తూ ఆనందిస్తోందా అని అనిపిస్తుంది.

మనస్సు కుదిరి, హృదయపూర్వకంగా గళము విప్పి తనివిదీరా నామసంకీర్తన చేస్తే జన్మతప్పక తరిస్తుంది. అందుకే కృతయుగంలో ధ్యానం, త్రేతాయుగంలో యజ్ఞయాగాదులు, ద్వాపరయుగంలో అర్చన, కలియుగంలో నామసంకీర్తన తరుణోపాయమని విష్ణుపురాణం చెప్తున్నది.

మనస్సు చరాస్థి. దానికి పరిణామం స్థిరాస్థి.

నామం అంటారా? జపమంటారా? ధ్యానం అంటారా? మంత్రం అంటారా? అని అమ్మను ప్రశ్నిస్తే అక్షరం మంత్రం కాకపోతే కదా! ఇది అక్షరాలతో కూడిన మంత్రం అనుకోండి. రేకు మీద కఱ్ఱతో కొడితే వచ్చే శబ్దం కూడ మంత్రమేనన్నది. అమ్మ చెప్పినట్లుగా ప్రతి అక్షరం శక్తి స్వరూపమే. మనలో వున్న పరావాక్కు, పశ్యంతి, మధ్యమావస్థలను దాటి వాగ్వైఖరిగా వెలువడ్తున్నప్పుడు మనలోని దివ్యత్వమే అక్షరరూపంలో ఆవిర్భవిస్తుంది. కాబట్టి అమ్మ నామసంకీర్తన ద్వారా మనలోని దైవత్వాన్ని వెలికితీస్తుంది. నామసంకీర్తనలోని పరమార్థాన్ని అవగాహన చేసుకొనటానికి నిర్మలమైన మనస్సు, అనన్యమైన భక్తి ప్రపత్తులు కావాలి.

భగవన్నామం చేయటం చాలా తేలికగా, ఏమీ ఖర్చు లేనిదిగా కనిపిస్తుంది. కానీ అనేకరకాల తాపత్రయాలతో మునిగితేలుతున్న సంసారులం, భగవన్నామాన్ని క్షణకాలం చేసి మళ్ళీ తాపత్రయాలలో మునిగిపోతాము. ఆ దివ్యనామాన్ని తైలధారాపాతంగా స్మరించటానికి అభ్యాసం చాలా అవసరం. దానికి తోడు భగవతీ కృప అవసరమే. అదే మనకు అమ్మ ఇస్తున్న ఆశీర్వాదం.

కరుడు గట్టిన రాగద్వేషాలను, కామక్రోధాలను, భగవన్నామమే రూపు మాపగలదు. మానవులు ఆచరించే జపతపములు, పూజలు, పారాయణలు అన్నీ భగవతీ కృపకే కదా! అమ్మ దృష్టిలో పాపులు, పుణ్యులు అని ఎవరూ లేరు. మనం బురద పూసుకు వచ్చినా తానే కడుగుతానంటోంది. కనుక అమ్మ కృపకు అందరం అర్హులమే.

మన హృదయంలో నామం జరుగుతుంటే అమ్మ మన హృదయంలోనే స్థిరంగా వుంటుంది. నామం జరుగుతున్నంతసేపు రూపం మెదుల్తూనే వుంటుంది. రూపానికి, నామానికి అవినాభావ సంబంధం వుంది. రూపం

మారేదే మనస్సు, మార్పులేకపోతే దేవుడే.

కంటే నామం గొప్పది. నామాన్ని తులుచుకోగానే రూపాన్ని మన యెదుట సాక్షాత్కారింప చేస్తుంది. అంతశక్తి రూపానికి లేదు. అందుకే శ్రీహరనాథుడు "కృష్ణుని కంటే కృష్ణనామం గొప్పది. నామం తల్చుకుంటే ఆ నామధారిని నీ ఎదుట నిలబెడ్తుందని" ఘంటాపథంగా చెప్పాడు.

నిరంతర నామస్మరణ వల్ల మన హృదయంలోని మాలిన్యం పోయి విశాలత్వమేర్పడి అమ్మ ప్రేమామృతమును గ్రోలు భాగ్యము కల్గును. భవరోగాల్ని హరించేది, సర్వరోగాలను నివారించేది, సర్వపాతకాలను ఛేధించి సర్వసుఖాలను కలిగించేది అమ్మ నామసంకీర్తనమే.

అమ్మ యొక్క అనురాగ జలధిలో ఓలలాడిన మనమంతా అమ్మ గురించి, మననం చేసుకుంటూ అమ్మ సూక్తులను వల్లిస్తూ, అమ్మ నామం చేసుకొంటూ అమ్మ చూపిన దారిలో పయనించాలి. అదే మనందరి ముక్తికి మార్గం అవుతుంది. మన అదృష్టవశాత్తు అమ్మ ఒడిలో పిల్లలమయినాము. మీరు నా పిల్లలే కాదు, నా అవయవాలు అని అమ్మ అన్నది. అమ్మ జీవితాన్ని తరచి చూచుకుంటే మనకు కావలసిన అనర్ఘ్య రత్నమాణిక్యాలను పొందగల్గుతాము.

భావనలో మూర్తిని భావించుకుంటే మనం భగవత్సాన్నిధ్యాన్ని పొందగల్గుతాము. భగవత్ సాన్నిధ్యం ద్వారా పరమపదాన్ని పొందగల్గుతాము. బాహ్యంగా అమ్మ మనకు దూరమైనా మన భావనలో అమ్మ ఎల్లప్పుడూ నిలిచిపోయేలా అభ్యాసం చేసుకోవాలి. దానికి నిరంతర నామస్మరణయే మార్గం. ఆ మార్గం గుండా పయనించి మోక్షానికి చేరాలి. అందుకే అమ్మ జిల్లెళ్ళమూడిలో "అఖండనామ సంకీర్తన"ను ఏర్పాటు చేసింది.

పరిణామమే దైవం.

మనస్సే మంత్రం, శబ్దమే బీజం, దాని నిలకడకు అక్షరాలు.

వాత్సల్య స్వరూపిణి - అమ్మ

వాత్సల్య జలధి అయిన అమ్మ నుండి మనము పొందిన వాత్సల్యామృతానికి అవధులు లేవు. భౌతికంగా అమ్మ మనకు దూరమైనా, మన అవసరాలను కనిపెట్టి ఎవరికి ఎప్పుడు ఏది అవసరమో దానిని అందచేస్తున్నది.

మనలో ఉండే రాగద్వేషాలే అసలు స్వరూపానికి అడ్డంగా నిలుస్తాయి. రాగద్వేషాలు నశింపచేసుకుంటే మన వ్యక్తిత్వం స్వచ్ఛమైన అద్దంలా మారుతుంది. అప్పుడు బయట ప్రపంచంలో దేనికోసమూ తాపత్రయం ఉండదు. అట్టి వ్యక్తిత్వాన్ని వికసింపచేయటానికి వాత్సల్యమూర్తి అయిన అమ్మ అవసరం ఎంతైనా వుంది. శాశ్వతమయిన ఆనందానికి, సత్యానికి స్థూలరూపం 'అమ్మ' అట్టి అనురాగమూర్తి అయిన అమ్మ వాత్సల్యాంభోనిధిలో మునిగిన మనకు ఇతరత్రా కోరవలసినదంటూ ఏమీ ఉండదు.

అమ్మ అనే పదానికి వాత్సల్యం అనే పదం పర్యాయపదమా! అని అనిపిస్తుంది. ఆవు తన దూడను దగ్గరకు తీసుకోవడం వాత్సల్యంతో కూడి వుంటుంది. ఆవు ఈనినప్పుడు దూడకు అంటివున్న మాలిన్యాన్ని స్వయంగా నాకి పరిశుద్ధం చేసేందుకు దగ్గరకు తీసుకునే స్వభావమే వాత్సల్యం. ఆవుకు మాలిన్యం, దోషం కనబడనట్లే, అమ్మకు మనలోని దోషాలు కనబడవు. అటువంటి వాత్సల్యముతోనే అమ్మ "మీరు బురద పూసుకు వచ్చినా కడగవలసిన దాన్ని నేనే కదా!" అని అంటుంది. మనలోని మాలిన్యాన్ని, దోషాలను పట్టించుకోక వాటిని అమ్మ ప్రక్షాళనం చేస్తోంది.

అన్ని బాధలలోకి ఆకలిబాధ ఎక్కువ అనిపిస్తుందట అందుకే "నీకు ఇచ్చింది తృప్తిగా అనుభవించటం నీకు ఉన్నది ఇతరులకు ఆదరణగా పెట్టటం, అంతా వాడే చేస్తున్నాడని నమ్మటం ఇదే నా సందేశం" అని అన్నది. అమ్మ

మంత్రమంటే మనస్సే, మననం చేత మంత్రమైంది.

సందేశాన్ని ఆచరణలో పెట్టటానికి అమ్మ పిల్లలమైన మనమంతా నడుం కట్టాలి. సేవ, ప్రేమ-జ్ఞానం అనే కాగితానికి రెండు పక్కలు. తోటివారిని ప్రేమించటం, ఆదరించటం కన్న మించిన జ్ఞానం లేదు. అమ్మ తన అసాధారణ, అపారమైన వాత్సల్యంతో మన అందరినీ తనవైపుకు తిప్పుకొని మన శారీరక, మానసిక, ఆర్థికావసరాలను తీరుస్తున్నది. అట్టి అమ్మ వాత్సల్యాంభోనిధిలో ఓలలాడిన మనం కొంతలో కొంతగా ఆ వాత్సల్యాన్ని తోటివారి మీద చూపగలిగినప్పుడే మన జీవితాలు ధన్యం అవుతాయి. చంద్రునికో నూలుపోగు అన్నట్లుగా అమ్మకు మన కృతజ్ఞతను సమర్పించుకోగల్గుతాము.

అఖండ తపోధ్యానాదుల వల్ల భగవంతుడు ప్రత్యక్షమై వెంటనే అంతర్ధానమైనట్లు మహాభక్తుల చరిత్రలో మనకు కన్పిస్తుంటే, ఎట్టి కష్టమూ లేకుండా ఆ భగవతిచే లాలింపబడటం, పాలింపబడటం, ఓలలాడటం, మన అదృష్టం. ఆ అదృష్టాన్ని నెమరు వేసుకుంటూ అమ్మ తలపెట్టిన కార్యక్రమాలకు చేయూతనిస్తూ ప్రగతి పథంలో పయనిద్దాం.

వాంచితార్థ ప్రదాయిని - అమ్మ

అమ్మ యొక్క మహిమాన్వితమైన వ్యక్తిత్వపు ఛాయ మన జీవితాలలో నిండి, మన మనస్సులపై, గుణాలపై, కోర్కెలపై ప్రభావం చూపుతుంది. దానితో పిరికితనం నుంచి ధైర్యం, బలహీనత నుంచి బలం, అసంతృప్తి నుంచి తృప్తి, వ్యధ నుంచి ఆనందం ఎదిగి పరిణామాన్ని గుర్తించలేనంత సహజతను పొదుపు కుంటుంది.

మనస్సుకు బుద్ధికీ గల ఘర్షణ ఒక్కనాటితో తీరేది కాదు. నిరంతరాయంగా, నిత్య ప్రయత్నంగా బుద్ధిని బలపరుస్తూ, మనస్సును అదుపులో వుంచుకోవాలి. లేకపోతే మనస్సు బుద్ధిని వ్యామోహపరిచి తాను విచ్చలవిడిగా

అర్థం కావడమే అనుభవం.

సంచరించకలదు. కనుకనే బుద్ధిని బలపరచటానికి సాధనమైన ఆత్మచింతన ప్రతి మానవునికీ అవసరమవుతుంది.

అట్టి ఆత్మ శక్తి యొక్క ఆవిష్కరణమే శ్రీ వివేకానందస్వామి. శ్రీ రామకృష్ణుల ఆత్మశక్తిని భారతదేశ సముద్ధరణకు వినియోగించటానికి వివేకానందుడు చేసిన ప్రయత్నం అందరికీ తెలిసిందే. వివేకానందుని ఆదర్శంగా తీసుకొని బుద్ధితీక్షణతను, హృదయవైశాల్యాన్ని పెంచుకొని కార్యతత్పరులం కావాలి. మహానుభావుల గురించి చదవటము, తెలుసుకోవటమేకాక కొంతలో కొంతైనా మనం అలవరచుకోవటానికి ప్రయత్నం చేయాలి.

మధు జిల్లెళ్ళమూడి కాలేజీలో చదువుకున్నాడు. ఆంధ్రాయూనివర్సిటీలో ఎమ్.ఎ. చదువుతున్నప్పుడు అమ్మ పూజలు ఎక్కడ జరుగుతున్నా తప్పక వచ్చేవాడు. తరువాత విశాఖపట్టణంలోనే పార్టుటైమ్ ఉద్యోగాలు చేసాడు. అమ్మ మీద అపారమైన, అచంచలమైన విశ్వాసం కలిగి భవిష్యత్‌లో అమ్మే తనకు అండగా వుంటుందన్న నమ్మకంతో వుండేవాడు. మధుకు 'అమ్మ తప్పక తన అనుగ్రహ వీక్షణాలు ప్రసరిస్తుందని, అవి ఏ రకంగా ఎప్పుడు ప్రసరిస్తుందో నాకు తెలియదు కాని నీ చదువుకు సార్థకత కలిగిస్తుందని చెప్పేదాన్ని'. అతను ధైర్యం వీడక అమ్మనే త్రికరణశుద్ధిగా నమ్మి తన వంతు పనిని చేస్తుండేవాడు.

నవోదయా స్కూలులో ఇంటర్వ్యూ వచ్చిందంటే నీవే సెలక్టు అవుతావని, తప్పక వెళ్ళవలసిందని ప్రోత్సహించాము. అమ్మ కరుణా కటాక్షాలవల్ల అతనికి రాజస్థాన్‌లో కోటా అనే వూళ్ళో నవోదయాస్కూలులో ఉద్యోగం వచ్చింది. అది తెలియగానే చాలా దిగులు పడ్డాడు. ఎందుకంటే తనకాభాషరాదు,

---

ఆధ్యాత్మికానికి లౌకికానికి తేడాలేదు.

తెలిసినవారు ఎవరూలేరు. ఆహారపు అలవాట్లు వేరు ఏవిధంగా అక్కడ వుండగలనన్న భయం కలిగింది. అటువంటిది 4 సం॥లుగా అక్కడ అలవాటు అయి "అమ్మదయవల్ల ప్రపంచంలో ఎక్కడకి వెళ్ళినా, ఆఖరికి ఎడారిలో వేసినా బతకగలను" అని అన్నాడు.

మొట్టమొదట వెళ్ళగానే భాషరాకపోయినా అతనికి ఏవిధమయిన ఇబ్బందీ కల్గలేదు. ఎంతో ఆదరంతో, ఆప్యాయతతో అతన్ని ఆహ్వానించారు. అక్కడ అన్ని సౌకర్యాలతో క్వార్టర్సు, మెస్సులో భోజనంతో సహా ఎటువంటి కష్టం లేకుండా జరిగిపోతుందని, అక్కడ కూడ అమ్మ సాన్నిధ్యాన్ని తాను అనుభవిస్తున్నానని ఎంతో గర్వంగా చెప్పాడు. జిల్లెళ్ళమూడి గడ్డమీద చదువుకున్న వెయ్యిమందికి పైగానే మంచి మంచి ఉద్యోగాల్లో ఎంతో అభివృద్ధిని సాధించారని, మా అందరికీ అమ్మ ఆశీస్సులు తోడు, నీడలా వుంటాయని అమితమైన విశ్వాసంతో ఆనందంతో చెప్పాడు. అందుకే "అమ్మ నా మంచం చుట్టూ వున్నవారే కాదు దూరాన ఉన్నవారు కూడా తన ఆలోచనలో చోటుచేసుకుంటారని" అన్నది. ఇప్పుడు విశ్వవ్యాపినియై, వాంచితార్థ ప్రదాయిని అయింది.

మధు అక్కడ తెలుగుభాష బోధిస్తాడు. అక్షరదీపాలలో ఉన్న ఒక్కొక్క సూక్తిని కాపీరైటింగ్‌కు పెట్టాడు. తెలుగులో అతని ఇష్టము వచ్చిన పుస్తకాలు పెట్టుకోవచ్చు. అందుకని "జీవితమహోదధిలో తరంగాలు" పెట్టి తాను చదివి చెప్పటమేకాక తన అనుభవాలు జోడించి అవకాశం వచ్చినప్పుడల్లా అమ్మ ఆదరణ, ఆప్యాయతల గూర్చి తెలియచేసేవాడు. దానికి అక్కడ పిల్లలు ప్రభావితులై వారి తలిదండ్రులను తీసుకొని జిల్లెళ్ళమూడి వస్తున్నారని చెపితే ఆనందంతో తలమునకలైనాము.

అశుద్ధానికి పూజచేసినా వాడికే అందుతుంది.

అందరం వివేకానందులం కాలేకపోయినా మధుని అనుసరించి వీలైనంతమటుకు అమ్మ సూక్తులను, ఆదేశాలను విశ్వమంతాచాటాలి. విశ్వశక్తులలోని లయవల్ల ప్రతివారికి పుట్టినరోజునాడు ప్రత్యేకమైన ప్రమాణాలు చేసికొని వారి వారి సర్వతోముఖాభివృద్ధికై, నూతన ప్రగతిని పొందవచ్చు నంటారు. ఎవరికి వారు సర్వతోముఖాభివృద్ధి పొంది విశ్వశ్రేయస్సుకు కృషిచేయాలి.

దివ్యానుభూతులు - అమ్మ

అమ్మను తలుచుకోగానే వర్ణింపనలవికాని అనుభూతులు కలుగుతాయి. ఆ దివ్యానుభూతిలో కలుగుతున్న అనుభవాలను కాదనలేము. అలాగని ఒకరికి చెప్పుకోవటానికీ మాటలు రాని పరిస్థితి. మనకు మనమే ఆ దివ్యానుభూతి ఏమిటో విశదపరుచుకోలేము. మన మనస్సులో వచ్చే భావాలన్నింటినీ చెప్పుకోవటానికి భాష చాలదు. కానీ సాన్నిహిత్యం వల్ల అనుబంధం పెరిగి, ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలియచేసుకునే అవకాశం ఎంతైనా వుంది. ఒకరి అభిప్రాయాలు, అనుభూతులు మరొకరితో కలసి పంచుకోవటంలో వున్న ఆనందం అనుభవైకవేద్యమే కాని వర్ణింప శక్యం కాదు.

అమ్మను గూర్చి ఆలోచనలతో కలిగిన అనుభూతి ఛాయలను తలుచుకొని మురిసిపోవటం మనవంతు. అన్ని వేళలా మన మనస్సులోని ఆర్తికి, అన్వేషణకు, తపస్సుకు, తపనకు అమ్మే మూలం కావాలి. అట్టి ఆలోచనలలో 'అమ్మ' నడయాడినప్పుడు శాంతి, తృప్తి, జ్ఞానం ఒకదానితో ఒకటి పోటీపడివస్తాయి. అట్టి అమ్మ కరుణను వర్ణించుటకు సహస్రవదనుడైన ఆదిశేషునకు కూడా అలవి కాదనిపిస్తుంది.

ఈతిబాధలతో కొట్టుమిట్టాడే మనకు భగవంతునిపై అచంచల

ఏది సాధ్యమైతే అదే తరుణోపాయం.

విశ్వాసమున్నా మధ్య మధ్య ఆ విశ్వాసానికే విఘాతం కలుగుతుంటుంది. అట్టి పరిస్థితులలో అమ్మే మనకు నమ్మకం సడలిపోకుండా చేస్తుంది. ఒక సందర్భంలో గజేంద్రమక్కయ్య "పైనవాడు వున్నాడు, ఎంత ఏడిపించినా తిప్పలు పెట్టినా, మాయకప్పినా వాడిపాదాలు మాత్రం వదలకు" అని చెప్పింది. అదే వేదమంత్రంలా పనిచేసింది. అప్పటికీ, ఇప్పటికీ అదే వేద మంత్రం అయ్యింది.

సాధారణంగా పెద్దవారు ఇహంకంటే పరం ముఖ్యమని దాని కొఱకే మనం సాధన చేయాలని చెప్తుంటారు. కాని అమ్మ "ఇహమే ముఖ్యమని తిండి, బట్ట, గూడుతో పాటు మానవుడు సుఖంగా జీవించటానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చింది. భౌతికంగా హాయిగా వున్నవాడే ఆధ్యాత్మికత గురించి ఆలోచిస్తాడని, కడుపునిండనిదే ఏమి నేర్పినా నిరుపయోగమే" అని చెప్పింది.

గురువుల దగ్గరకు వెడితే ఇవిచేయకూడదు, అవి చేయకూడదని ఆంక్షలు, నియమాలు పెడ్తారు. కాని అమ్మ 'సాధ్యమైనదే సాధన' అని, నీ వీలును బట్టి చేయమని చెప్పి మెల్లిగా వారిని ఆధ్యాత్మికతవైపుకు తీసుకువెడ్తుంది. నియమనిబంధనలు పెడితే వాటికి భయపడి అసలే మొదలు పెట్టరని, కొంతసడలింపు వుంటే కొంత అలవాటు అయిన తరువాత, మానమన్నా వాళ్ళు మానరన్నది. ఆంక్షలు ఎక్కువైతే మన ఆత్మవిశ్వాసం తగ్గిపోయే ప్రమాదం వుంది. వాళ్ళు చెప్పినట్లు చేయలేకపోతున్నామన్న తపనతో, మనం ఏమి చేయాలో, ఏమి చేస్తున్నామో, మనకే తెలియని పరిస్థితి ఏర్పడుతుంది.

ఒకమారు అమ్మ దగ్గర కొబ్బరికాయ కొట్టగా కుళ్ళిపోయిందని బాధపడ్తుంటే "కుళ్ళిపోవటం కాదు నాన్నా కుళ్ళుపోయిందని" చెప్పి మనస్సుకు వూరట కల్పించింది. ప్రసాదం పిల్లిముట్టుకుందని విచారపడ్తుంటే "పిల్లికాదు నాన్నా పిల్లముట్టుకుందని" తన విశ్వజనీనతను చాటుకుంది. మీ కొక్కరికే

పుట్టాడని సంతోషమూ, చచ్చాడనీ దుఃఖం లేకపోవడమే అమృతత్వం.

అమ్మను కాదు పశుపక్షాదులకు, క్రిమికీటకాలకు కూడా అమ్మనే అని ధృవీకరించింది. జాతకాల విషయంలోను, "తిథులు విధిని మార్చలేవు" "పెట్టింది ముహూర్తం కాదు జరిగిందే ముహూర్తం" అన్న సూక్తులద్వారా మనలోని మూఢనమ్మకాలను దూరం చేసింది.

అమ్మ మాటల ద్వారా, చేతల ద్వారా, సూక్తులద్వారా మనలోని చెడుతలంపులను దూరం చేసి మనలను మనమే సంస్కరించుకునేలా చేసి మనలో ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలుగచేసింది. అమ్మ భౌతికదేహానంతరం కూడా అనేక మందికి స్ఫూర్తిని కలుగచేస్తోందనటానికి ఈక్రింది సంఘటనే నిదర్శనం.

హైద్రాబాద్‌లోని చిక్కడపల్లిలో శ్రీహనుమంతరావుగారింట్లో మా బావగారు అద్దెకుండేవారు. ఆయన అకస్మాత్తుగా మరణించారు. శవాన్ని బయట పెట్టాల్సివస్తుందని మా వాళ్ళంతా బాధపడ్డారు. అద్దెకున్న ఇళ్ళల్లో శవాన్ని వుంచటానికి ఎవరూ ఒప్పుకోరన్న సంగతి లోకవిదితమే. కానీ ఆ సమయంలో హనుమంతరావుగారు చెప్పిన మాటలు ఎట్టివారికైనా కనువిప్పుకలిగించేవే. "రాధాకృష్ణగారు నాకు సోదరుని లాంటివారు. రేపు నాకే ఇటువంటి కష్టం ఎదురవ్వచ్చు. నా తల్లి వుంది ఆమెనైతే బయటపెడ్తానా" అని శవాన్ని లోపలే వుండనిచ్చి వెంటనే చేయవల్సిన కార్యక్రమాన్ని దగ్గరుండి జరిపించారని మా తోడికోడలు చెప్పగానే అమ్మ బిడ్డనని ధైర్యంగా గుండెలమీద చెయ్యివేసి చెప్పుకోగలిగిన అర్హతను సంపాదించారని గర్వపడ్డాను. భర్త చనిపోయి భార్య బాధపడ్తుంటే ఓదార్పునందివ్వకపోగా, ఆ స్త్రీని హింసించే మూఢాచారాలకు, మూఢవిశ్వాసాలకు 'అమ్మ' స్వస్తి పలికింది.

మానవుడు, తన తప్పులను ఇతరులలో చూడటానికి అలవాటు

ఇతరులలో మంచిని చూడటమే మన మంచితనం.

పడివుంటాడు. కానీ అమ్మ మనలోని తప్పులను, బలహీనతలను అసహ్యించుకోకుండా జాలిపడేది, పైగా నా దగ్గర తప్పొప్పుల పట్టిక లేదంది. "చేతలు చేతుల్లో లేవని" "నాదంతా రాశి బేరమే, వాశి బేరం కాదు" అంది. మంచి జరిగితే మన ప్రయోజకత్వం, చెడుజరిగితే భగవంతుడి మీద వేస్తుంటాం. మనలో వున్న మంచి, ఇతరులలో వున్న చెడు వాడే ఇచ్చాడన్న నమ్మకం పూర్తిగా మనకు కలిగేటట్లు అమ్మ పదే పదే మనకు తెలియచేసింది.

మూఢాచారాలకు, అంధవిశ్వాసాలకు తిలోదకాలు ఇచ్చి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకొని, ఆత్మస్థైర్యంతో ముని ముందుకు సాగుతూ నవతరానికి అమ్మ తత్వాన్ని అందిస్తూ ఆ తత్వాన్ని వేనోళ్ళ చాటాలి. అమ్మ పిల్లలమైన మనందరికీ అమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా వుంటాయని ఘంటాపదంగా చెప్పగలను.

విశ్వజనని

అమ్మ! ఎవ్వరీ అమ్మ! ఈ అనంతవిశ్వంలో జగజ్జననిగా ప్రాచ్యపాశ్చాత్యులచే కొలవబడి జిల్లెళ్ళమూడి అమ్మగా ప్రసిద్ధిచెందిన శ్రీ అనసూయాదేవి గురించిన అధ్యయనంలో చిరుదీపిక ఈ వ్యాసం.

నిత్యం ఎందరెందరో అమ్మను దర్శించి బాధాతప్త హృదయాలను చల్లబరుచుకున్నారు. ఇహసంబంధమైన కోరికలతో సంసార ఝంఝూటంలో ఎదురైన ఇబ్బందులను తట్టుకోలేక సతమతమవుతూ తన దరిచేరిన వారందరినీ సేదదీర్చిన కరుణామయి అమ్మ. పారమార్థిక చింతనతో 'అమ్మ' దరిచేరే వారున్నారా అంటే "భగవద్గీతలో కృష్ణభగవానుడు ఆర్తో, జిజ్ఞాసుః, అర్థార్థీ, జ్ఞానీచ" అంటూ ఆర్తులు, జిజ్ఞాసులు అర్థార్థులు, జ్ఞానులు ఈ నాలుగు తరగతులకు చెందిన వారంతా నాభక్తులే అని చెప్పిన మాట గుర్తు కొస్తుంది.

ఏది చూస్తున్నప్పుడు అది అన్నీ అనే భావం నిలిస్తే ఏకాగ్రత.

ఎవరైనా పారమార్థిక స్థితి గురించి ప్రశ్నించినా "మనస్సు నిలుపుకోవాలన్న కోరిక కలిగింది కదా! నీ సొంతమేమీ లేదు. దానికి తరుణం రావాలి. లౌకిక విషయాలకు ఏ శక్తి సాయపడుతుందో నీవు అడుగుతున్న పరమార్థస్థితికి అదే సాయపడుతుంది" అన్నది. ఇహ జీవితంలో వాటిల్లే కష్టాలకు తాళలేక అమ్మను ఆశ్రయించిన వారికి అమ్మ అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మికతను అలవరుచుకునే అవకాశాన్ని కలుగజేస్తుంది. ఆ వ్యక్తి తప్పించుకోలేడు. ఇహలోక సంబంధమైన విషయాలద్వారా ఆధ్యాత్మికోన్నతి, దైవభక్తి కలుగజేస్తుంది. భారతదేశపు అమూల్యవారసత్వం (INDIA'S PRICE LESS HERRITGE) అనే ఆంగ్ల వ్యాసములలో సుప్రసిద్ధ న్యాయశాస్త్ర పారంగతుడు శ్రీ ఎన్.ఎ. పాల్కీవాలా వ్రాసిన మాటలు "జీవితమంతా ఒక పరిశోధనాలయంలో చేసిన కృషికంటే, యావజ్జీవితం ఒక గ్రంథాలయంలో చేసిన పఠనం కంటే, ఒక యోగి వర్యుని సాన్నిధ్యం ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది", భగవంతుడే గమ్యంగా వెళ్ళేరైలులో దారిచూపే కండక్టర్ వంటి వాడే గురువు. "నేనేం మాట్లాడినా నా అనుభవం నుంచే మాట్లాడతాను" అన్నది అమ్మ. అమ్మను మనం తెలుసుకోవాలన్నా అమ్మ అనుగ్రహం మనకు కావాలి. ఆ అనుగ్రహముంటే అమ్మను తెలుసుకోవటమే కాక అమ్మ అనుభవమే మనకు శాస్త్రం, సందేశం, ఉపదేశం, మార్గదర్శకం, ఉత్తమపాఠం, గురువు అవుతుంది. దాని కొఱకై మనం నిరంతరం తపించాలి. మన ఆర్తే మనలను అమ్మ దగ్గరకు తీసుకునేలా చేస్తుంది. "అనుభవం శాస్త్రాన్ని ఇస్తుంది కాని, శాస్త్రం అనుభవాన్ని ఇవ్వదని" అమ్మ అంటుంది. "భగవంతుడు లేడు అనే వాడికి, ఉన్నాడనే వాడికి, భగవంతుడు ఎవరూ అనేవాడికి సరిపోయేటట్లు చెప్పగలిగిందే శాస్త్రం" అని అమ్మ నిర్ణయించింది, అమ్మ మాటలన్నీ ఆ పరిధిలో ఇమిడిపోతాయి. అందుకే "శాస్త్రాల్లో అమ్మ చెప్పేది వుండదు కాని అమ్మ చెప్పింది శాస్త్రమే" అని శ్రీపాదవారు ఉద్ఘాటించారు.

విశ్వాసమే భగవంతుడు.

అమ్మచే ప్రభావితులైన ఎందరెందరో నాస్తికులు ఆస్తికులైనారు. భ్రష్టాచారులు శిష్టాచారులుగా, ధనికులు దానశీలురుగా, విద్యావంతులు వినయసంపన్నులుగా, భక్తులు పరమభక్తులుగా మారినవారు వున్నారు. అమ్మ యొక్క అపారకరుణ, ఆర్తత్రాణపరాయణతకు నోచుకున్నవారు కోకొల్లలు. దేశ విదేశాలనుంచి ఆర్తులు జిజ్ఞాసులు వచ్చి ఆ వాతావరణంలో ఉపశమనం పొందుతుంటారు. "గుర్తు చూపినవాడే గురువు" అంటుంది అమ్మ. వాళ్ళు గుర్తించే గురి ఇక్కడ కుదిరిందేమో అలా అమ్మను గురువుగా, దైవంగా, మాతృమూర్తిగా ఎలా భావించినా కానీ అమ్మలోని అతిలోక దివ్యప్రేమకు ఆకర్షితులు కాని వారు ఎవ్వరూ వుండరు. ఆ ఆప్యాయత, ఆ ఆత్మీయత, ఆ అనురాగం, ఆ వాత్సల్యం, ఆ కరుణ అద్వితీయమైనవి. మరి వేరెక్కడా దొరకనివి.

స్వామి వివేకానంద "యోగి పుంగవులు మానవులను ఉద్ధరించే మహనీయమూర్తులు. మహత్తరమైనవారి శక్తులు భౌతిక వాదులకు మింగుడుపడవు. సామాన్యుల బాహ్యదృష్టికి కనిపించని అనేక లోకాలను గోచరింపచేసి ఈశ్వరసాక్షాత్కారానికి దారి చూపుతాయి" అంటారు. రాజయోగ, హఠయోగవిభూతుల దర్శనం కాక అణుకువతో విలసిల్లిన మృదురీతిని అవలోకిస్తాము. ఆ అవలోకన, మన బాధ్యతలను మనం నిర్వహించుకుంటూ, ఆధ్యాత్మికతను అలవరచుకునేలా చేస్తుంది.

1979 నవంబరు 11తా॥న అమ్మ లలితా సహస్రనామాలతో కోటినామపారాయణ చేయించింది. తద్వారా ఎన్నో కోట్లపారాయణ జరగటానికి నాంది పలికింది. దాని ద్వారా ఎందరెందరో ప్రభావితులైనారు. ప్రతినిత్యం లలితాపారాయణ ఎన్నో గృహాలలో నిర్విఘ్నంగా ఇప్పటికీ జరుగుతూనే వుంది.

రాయిలో చైతన్యం చూడగల మనం, మనిషిలో చైతన్యం చూడలేక పోతున్నాం.

పూర్వం లలిత చేస్తే నెత్తి అణుస్తుందన్న అపవాదు వుండేది. దాన్ని దూరం చేసి వర్ణవర్గ లింగబేధం లేకుండా అందరికీ అర్హత వున్నదని తెలియచేసింది. అట్లే స్త్రీలకు దేవాలయంలో అర్చనాధికారం వుందని తెలియచేస్తూ అభిషేకాలు, అర్చనలు నిర్వహించే అధికారాన్ని స్త్రీలకు కలుగచేసింది. ఇప్పటికీ అనసూయేశ్వరాలయంలో స్త్రీయే అర్చనలు చేస్తోంది. స్త్రీ, పురుష, కుల, మత రహితంగా అడిగిన వారందరికీ ఉపనయనాలు చేసింది. గాయత్రీయాగంలో కుల, మత, వర్ణ, వర్గ, లింగభేదం లేకుండా అందరూ పాలుపంచుకునే అవకాశాన్ని కలుగచేసింది. మొగపిల్లలులేని శ్రీపాదగోపాల కృష్ణమూర్తిగారి అంత్యక్రియలను ఆయన కుమార్తె గాయత్రీ ద్వారా చేయించి ఒక కొత్త ప్రక్రియను పాదుకొల్పి ఆచారాల్లోనే అనూహ్యమైన మార్పును తీసుకువచ్చింది.

మొట్టమొదటగా అమ్మను దర్శించినవారు భావోద్వేగానికిలోనై విలపిస్తారు. మనలోని భయాందోళనలన్నీ ఒక్కమారుగా తీసివేయబడినట్లయి, మన అంతరంగం ఊర్ధ్వ లోకాలకు దూసుకువెడుతుంది, మనలో మనకు తెలియకుండానే "అమ్మ" అన్నపదమే మారుమ్రోగుతుంది. ఆ విత్తు ఎదలో పదిలమై అస్పష్టంగా వుండి అతిలోక జీవన పిపాసగా పరిపక్వమై తీరుతుంది.

1977 జూన్ 30వ తేదీన 15 సం॥ల మాబాబుకు మేజర్ యాక్సిడెంట్ అయ్యింది. ఎవరికైనా తెలియచేయాలన్న ఆలోచన కూడా లేకుండా అయోమయస్థితిలో వున్నాము. సరిగ్గా ప్రమాదం జరిగిన టైమ్‌లో అమ్మ రక్తం వాంతి చేసుకుందిట. మా నాన్నగారి స్నేహితులు జిల్లెళ్ళమూడి వెడితే "మాధవరావు మనవడు చితికిపోయాడురా" అని చెప్పిందట. అమ్మ కరుణా కటాక్షములవల్ల రెండు నెలలలో అంత పెద్ద ప్రమాదమునకులోనయి కూడా కోలుకున్నాడు. అమ్మ దగ్గరకు వెళ్ళినప్పుడు భవిష్యత్‌లో వాడికి ఎటువంటి

ఇబ్బంది వుండదుకదా అని అమ్మను అడుగుదామనుకొని, సర్వం అమ్మే అనుకుంటూ మళ్ళీ అడగటమెందుకని వచ్చేస్తాను. అమ్మ సర్వజ్ఞకదా! తరువాత మా చెల్లెలు వసంత వెళ్ళి వాడిని చూడలేదమ్మా! ఎలా ఉన్నాడో ఏమో అంటే "వాడికేమే! వాడికి ఏ వంకాలేదని" చెప్పిందంట. "తాలు మాటరావటానికి తోలునోరుకాదని" అమ్మ చెప్పినట్లుగా హాయిగా వున్నాడు. అంతమట్టుకు మా బంధువర్గంలో నేను అమ్మ దగ్గరకు వెడతానని విమర్శించే వారందరూ అమ్మ కరుణాకటాక్షాలకు ఆశ్చర్యచకితులైనారు. అందుకే "విన్నవాడు విమర్శిస్తాడు, కన్నవాడు వివరిస్తాడు, వింటే విమర్శకాని కంటే విమర్శలేదని" అమ్మ చెప్పింది.

అమ్మ తీరు ఎంతో నిరాడంబరంగా వుండి మనకు ఎంతో హాయిని కలుగచేస్తుంది. ఆందోళనలతో బిగిసిన ముఖాలు దరహాస చంద్రికలు అవుతాయి. ఆ చూపులో మనలను పునీతులచేసే గొప్ప ప్రవాహంలో ప్రక్షాళితులైన మనలో నూతనుత్తేజం చోటు చేసుకుంటుంది. అందరినీ ఒకే విధమయిన ప్రేమ, ఆదరాలతో వోలలాడిస్తుంది. మనలో తననే చూచుకుంటా నంటుంది కాబట్టి మనలో మార్పు తీసుకురావటంలో అమ్మ ప్రేమకు ఉన్నశక్తి మరి దేనికీలేదు.

రవి అన్నయ్య పెళ్ళికి మాకు బట్టలు పెడ్తుంటే మాకెందుకమ్మా అంటే "మీకు పెట్టుకుంటే నాకు సంతోషము. మీకు నేర్పటానికి" అని అన్నది. "తినకపోతే మీరు చిక్కిపోతారు. మీకు పెట్టుకొనకపోతే నేను చిక్కిపోతాను. మీరు తింటే నేను తిన్నట్లే" "జిల్లెళ్ళమూడికి ఆకలితో రావచ్చుకాని ఆకలితో వెళ్ళకూడదని వచ్చిన అందరికీ అన్నంతోపాటు బట్టలు పెట్టాలని వుంద"ంది. అక్కడ "భోజనంకు ఆకలే అర్హత" అని "డ్రస్సును బట్టి, ఎడ్రసును బట్టి భోజనం పెట్టటం" జరగదు అన్నది. ఇంత మటుకు చరిత్రలో ఎదో ఆశించి

నమస్కారం అంటే నీవిచ్చిన శరీరాన్ని నీకు అర్పణ అని తలవంచడం.

చేసిన వారిని చూశాము కాని మననుంచి ఏమీ కోరకుండానే మన యోగక్షేమాలను కనుక్కోవటం "విశ్వజనని" అయిన అమ్మకే చెల్లింది. "నాకు పని అంటూ వుంటే - అది మీకు కనబడటమే" అన్నది. ఎంతహాయి అయిన ఆలోచన. అమ్మ మాటల్లోని అనురాగాన్ని ఆప్యాయతను మనం గ్రహించకల్గితే జీవితంలో కోరదగినదంటూ ఏమీ వుండదు.

ప్రేమాంభోనిధియైన అమ్మ ఒడిలో ఓలలాడిన వారి ఆనందానికి అవధులుండవు. తాను భౌతికంగా మన మధ్యలేకపోయినా సర్వత్రానిండియున్న శక్తి ఎప్పటికప్పుడు మనకు కావలసిన అనురాగాన్ని ఆనందాన్ని కలుగచేస్తూనే వుంటుంది. మన ఆలోచనల ప్రతిరూపమై వున్న అమ్మను కొలవటానికి ఏకొలత అయితే సరిపోతుంది? మానం, మేయం, మాతా అమ్మే కదా!

జయహోమాతా శ్రీ అనసూయ

రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి

(జగజ్జనని సావనీర్‌లో ముద్రించబడినది)

అనురాగస్రవంతి

అమ్మ యొక్క అనురాగస్రవంతిలో మునిగిన వారికి ఇతరత్రా ఏమీకావాలనిపించదు. శ్రీలలితా సహస్రనామపారాయణ ఆయురారోగ్యాలను, భోగభాగ్యాలను, సమస్తపురుషార్థాలను, సకలపుణ్యఫలాలను, సమస్తవిద్యలను, సర్వసంపదలను, ఆత్మజ్ఞానాన్ని, ధర్మాసక్తిని, చివరకు మోక్షాన్ని ప్రసాదిస్తుందని, సకల పాపాలను పరిహరిస్తుందని సర్వభయసందేహాలను వారిస్తుందని, సకలశత్రువినాశం కలిగించి విజయాన్ని అనుగ్రహిస్తుందని, హయగ్రీవుడు ఫలశృతి విశేషాలను వివరించాడు. అటువంటి లలితా సహస్రనామాన్ని ఆబాలగోపాలం అమ్మ సన్నిధిలో పారాయణ చేయడమే అమ్మ నేర్పిన సాధన.

తపనే తపస్సు.

శరత్కాలపు వెన్నెలరాత్రులలో అమ్మ ఆరుబయట కూర్చుని వుంటే అందరం అమ్మ మంచం చుట్టూ చేరేవారం. ఆ దృశ్యం వెన్నెట్లో చందమామ చుట్టూ నక్షత్రాలు మూగినట్లుగా వుండేది. అమ్మ మీద నుండి వీచే పిల్లగాలి మనకు ఏవేవో సందేశాలను మోసుకొస్తోందేమో ననిపించేది. ఆసుందర దృశ్యంలో, ఆ సందర్శనలో మనహృదయాలు తేలికై ఎనలేని శాంతిని పొందేవి. ఎన్నో సంవత్సరాలుగా మనలో గూడుకట్టుకున్న వ్యథకు చరమ గీతం పాడినట్లు వుండేది. అమ్మను చూస్తుంటే ఏదో పరవశత్వం ప్రస్ఫుటమవుతుంటే, ఆ ఆనందంలో మూగబోవటమే మనవంతు అవుతుంది. నోరుపెగల్లదు, మాటలు రావు. ఆ ముగ్ధమోహన రూపాన్ని చూస్తుంటే నిత్యనూతనంగా, తోచే అమ్మ చూపులు, మాటలు కదలిక రూపంలో నిర్మలంగా జాలువారే ప్రేమలో మునకలు వేస్తాము. ఆ ప్రేమలో మన హృదయాలు ద్రవీభూతమై పొంగే ఆనందంలో చుట్టూ పరిసరాలుకూడ అదే వెల్లువతో నిండివుండగా దానికి మూలమైన అమ్మను చూస్తూ సమ్మోహితులమవుతాము.

అమ్మ కూర్చున్నతావు, ధరించే వస్త్రాలు, కదలిక, చూపులు, గాజుల గలగల, అమ్మ మాటలు అంతానిండి మనల్ని తాకుతూ ఎనలేని సౌందర్యం జాలువారుతుంటుంది. ఆ సౌందర్యం మనందరినీ ఆకట్టుకుంటూ, మనలను వినువీధులలో విహరింపచేస్తుంది. సృష్టి తన సర్వస్వాన్నీ మనకై 'అమ్మ' రూపుదాల్చినదేమో అనిపిస్తుంది. అందుకే అమ్మ సన్నిధిలో గొప్పశాంతితో పరవశించి పోతాము. కేవలం రూపంతోనే గొప్పహాయిని నింపే అమ్మ, తనమాటలతో మనలను ఊర్ధ్వలోకాలలో సయ్యాటలాడిస్తోందనిపిస్తుంది. అమ్మ ఉనికి మనల్నందర్నీ, పరిసరాలను కూడ సంతోషంతో తృప్తితో నింపేస్తుంది.

అమ్మ మాటలు సున్నితమైన హాస్యంతో మూర్ఖత్వానికి తావీయక

సూక్తి అంటే హృదయానికి హత్తుకొనేది.

నిత్యసత్యాలతో కూడి వుంటాయి. అమ్మ విశాలమైన మోమున, లేనవ్వులలో పొంగే ప్రేమవెల్లువలో మునకలు వేస్తాము. అమ్మ సాన్నిధ్యంలో ఎదో లోతైన అంతర్యం. భూమిని తాకిన విత్తనం మొలకెత్తినట్లు ఆ సందర్శన మాత్రాన లీలగా వెల్లివిరిసే కారుణ్యకాంతులు పులకించి చిగిర్చి, పెరిగి కొమ్మలు, రెమ్మలు, మొగ్గతొడిగే లోపల విపరీతమైన ఘర్షణ, వ్యధరేగి తప్పనిసరిగా నిలకడకోసం అమ్మనే ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఆ సందర్భం తరువాత స్మృతిభావనై ఆరాధనే యోచనై భక్తిగా హృదయం గూడుకట్టుకంటుంది. ఒక్కోహృదయంలో ఒక్కో విధమయిన మాధుర్యంతోకూడి జీవనపథం పరిణతి చెంది విశాలమౌతుంటుంది. అవధులు లేని దయతో, ప్రేమతో, వాత్సల్యంతో మనలో భక్తి జనింపచేసి తాను వాత్సల్యపూరితమై మనలను తరింపచేసే దివ్యశక్తే అమ్మ.

అమ్మను చూస్తూ ఎన్నిగంటలైనా అలాగే కూర్చోవాలనిపిస్తుంది. అమ్మ భోజనం చేసిరండన్నా అమ్మ మాట కాదనలేక భోజనానికి వెళ్ళేవాళ్ళమే కాని అమ్మ సన్నిధి వదలి వెళ్ళటానికి మనస్సు అంగీకరించేది కాదు. అంతలోనే ఎప్పుడూ మనమే కూర్చుంటే మిగిలిన వారికి అవకాశం వుండాలి కదా! అని వరండాలో కూర్చుని ఆ మధురక్షణాలను నెమరువేసుకునేవారం.

ఎవరైనా జిల్లెళ్ళమూడి నుండి వచ్చారంటే అమ్మనే చూచినంత పరవశత్వంతో అమ్మ కబుర్లు వినాలని ఎన్ని పనులున్నా పక్కనబెట్టేదాన్ని. అమ్మ సన్నిధిలో గడిపి వచ్చినవారిని, వారి ముఖాలలో వెలుగొందుతున్న తృప్తిని చూచి అమ్మనే చూచినంత సంబరపడేదాన్ని. ద్వాపర యుగంలో గోపికలు కృష్ణుని పెదవి విరుపు, వయ్యారం, లాలన, వేణూరవంలోని లయ గుర్తు చేసుకొని మురిసిపోయేవారన్న భాగవతఘట్టం జ్ఞాపకానికి వచ్చేది.

శాస్త్రమంటే శాసించేది, శాశ్వతమైనది.

జిల్లెళ్ళమూడిలో పై డాబా మీద పడుకొని ఉన్న నాకు అమ్మ పయ్యెద రాచుకుంటూ పోయిన అనుభూతి కలిగి కన్నులు తెరచి చూచా ఎదురుగా అమ్మ. ఒడలు మరచి ఆనందసాగరంలో మునకలు వేసా. నామనస్సుకందని ఎదో అవ్యక్తానందం కలిగింది. లేకాంతులు తెలతెలవారే వేళ పగటి అలజడి, నిండీ నిండని సందడిలో మెల్లమెల్లగా రేగే పక్షుల కిలకిలారావంతో అమ్మ నుదుటజారి కనుబొమ్మల పలకరించే ముంగురులతో, మెలకవతో కదిలే గాజుల గలగలతో ఉన్న అమ్మను మెల్లగా పక్కకువత్తిగిల్లి లేచి చూచాను. నామీద జాలితో సాంద్రమై అమ్మ ప్రేమతో వచ్చిందనిపించింది. అరుణోదయం నింపుకున్న అమ్మ మోమును గాంచిన ఆనాటి నా అదృష్టం జీవితంలో మరుపురాని మధురక్షణాలు.

అనంతమైన అమ్మ ప్రేమతత్వంలో ఐక్యం కావటానికే మనం సాధన చేయాలి. అదే పరమావధి. ఆర్తులకు దుఃఖోపశమనం, అర్థార్థులకు ఆశించిన ఫలం, జిజ్ఞాసువులకు ఆత్మజ్ఞానం, జ్ఞానులకు కైవల్యాన్ని అందించే కల్పతరువు శ్రీలలితాసహస్రనామావళి. అమ్మ మనకు అనుగ్రహించిన సాధనతో మన జీవనయాత్ర ప్రశాంతంగా సాగించుకుంటూ మన జీవితాలకు వెలుగు బాటను చూపమని అమ్మనే ప్రార్థించుదాము. అమ్మ అనురాగస్రవంతిలో మునిగినవారికి వెలలేని రత్నమాణిక్యాలు కరతలామలకములే అవుతాయి, వాటికాంతుల వెలుగులలో పయనించుదాము.

భగవదనుగ్రహం – అమ్మ

నిండుగా, అనంతమైన తత్వాన్ని కొలుచుకుంటే మన మనస్సు అనంతమై విశాలమవుతుంది. దైవపూజగా భావించి చేసే కార్యక్రమముల ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని సంపాదించు కోవచ్చు. అందుకే రామకృష్ణులు

బాధకు కారణం భేదం.

"మానవసేవయే మాధవసేవ" అన్నారు. సామాజిక కార్యక్రమములకు, సంస్కరణలకు, అన్నింటికీ పునాది ఆధ్యాత్మికత కావాలి. విగ్రహారాధనలో విశేషార్ధమున్నది. "నిగ్రహం కొరకే విగ్రహారాధన" అని "మీలోని ఆర్తేనా దర్శనానికి కారణమవుతుంది" అని అమ్మ అంది. భగవంతుడ్ని ఆర్తితో పిలవటం అనగా గజేంద్రుడు 'లావొక్కింతయు లేదు' అని ఆర్తిగా పిలవబట్టే ఎలావున్న విష్ణుమూర్తి అలా ఆయన్ని అనుగ్రహించటానికి వచ్చినట్లుగా పోతనగారి భాగవతంలోని గజేంద్ర మోక్షఘట్టంలో కనిపిస్తుంది.

మామూలుగా మన ఆస్తి పాస్తులందున్న ప్రీతి, భార్యాభర్తలకు గలప్రేమ, బిడ్డలందలి వాత్సల్యం, ఈమూడింటినీ కలిపి భగవంతుడిపట్ల చూపించినప్పుడు భగవదనుగ్రహం కలుగుతుంది. భగవదనుగ్రహం కొరకు ఆర్తితో ఆయనకై వెదుకులాడాలి. మనకు ఒకవస్తువు కావాల్సి వచ్చినప్పుడు, అది మనకు అందుబాటులో వుందనుకున్నప్పుడు మనస్సంతా దానిని సంపాదించుకునేందుకే వువ్విళ్ళూరుతుంది. మనస్సు పెట్టి చేయటాన్నే శ్రద్ధ అంటాము. శ్రద్ధతోపాటు ఏకాగ్రత, పట్టుదల అవసరం. ఏపనికైనా ఒకమాటు ప్రయత్నంచేసి అదిరాలేదని ఎలావూరుకోలేమో, భగవంతునికై చేసే ప్రయత్నానికి శ్రద్ధ, ఓర్పు, పట్టుదల వుండాలి. మనకేదైనా ఆటంకం కలిగినా వదలిపెట్టకుండా ఇంకా ఎక్కువశ్రద్ధ, పట్టుదలతో ప్రయత్నించాలి. భగవంతునికి ఆత్మసమర్పణ చేసిన నాడు మనకై వాడే వెతుకుంటూ వస్తాడు. అందుకే అమ్మ "దేవులాడినా దొరకని వాడే దేముడు" అని అంది. షిర్డీసాయి ! పక్షికాలికి దారంవేసి లాగినట్లు మిమ్మల్ని నేను లాక్కుంటానని" చెప్పారు. దానికి నమ్మకం, ఓర్పు అవసరమని చెప్పారు.

మా జీవితాల్లో అమ్మ ఎంతగా పెనవేసుకుపోయిందో చెప్పటానికి అలవికాదు. నేను, నా మనవరాలు స్ఫూర్తి విషజ్వరంతో బాధపడ్తున్నాము. నాబాధ ఎంత అలవికాకున్నా, చిన్నపిల్ల దానిబాధ చూడలేకపోయాను. తిట్టినా

తల్లి రక్షణ కాదు, రక్షణే తల్లి.

పూజించినా అమ్మనే కదా! మనసా, వాచా, కర్మణా నిన్నే నమ్ముకున్నాను. నాపూజలో ఏమైనా లోపముందా ఇటువంటి పరిస్థితి కల్పించావని ఎంతో విలపించాను. నిన్ను తెలుసుకున్ననాటి నుంచి నిన్ను తప్ప అన్యులను కొలచి ఎరుగను. వారిలో కూడా నిన్నే చూచుకుంటున్నాను. ఎందుకిలా జరిగిందని పరిపరివిధాల వెుురపెట్టుకున్నాను. నాన్న చనిపోయినప్పుడు నాకింకెవరున్నారమ్మా అంటే నాన్న ఎక్కడకు పోలేదు. నా దగ్గరే వున్నాడు ఇదే నీపుట్టిల్లు అనుకోమని చెప్పావుకదమ్మా. "ఏదివచ్చినా ఒడిపట్టమన్నావని, సుఖదుఃఖాల్లో అన్నింటా నీవే వున్నావని ధైర్యంతో కాలంగడుపుతున్నాను. సంవత్సరంన్నర క్రిందట తగిలిన దెబ్బ తగ్గక, ఈ విష జ్వరంతో తిరగబెట్టినా నా కర్మపరిపక్వమవ లేదనే అనుకుంటున్నాను. అలాంటిది చంటిపిల్ల అంత బాధ పడ్తుంటే చూడలేకుండా వున్నానని అమ్మతో దెబ్బలాటకు దిగాను.

మా మరిదిగారి అబ్బాయి పెండ్లికి తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లను చేతుల మధ్య వేసుకొని తీసుకువెళ్ళాను. అక్కడ డాక్టరు గారు చూచి వేరే మందు వేయమనిచెప్పారు. ఆ మందువాడకుండానే పిల్ల లేచితిరగటం మొదలుపెట్టింది. అంతకు ముందురోజు అంత బాధపడినట్లు సూచన కూడా లేకుండా హాయిగా వుంది.

నాకు విషజ్వరంతో పాటు ఆ దెబ్బ చుట్టూ చిన్నచిన్న కురుపులు వచ్చి విపరీతంగా బాధపడ్తున్నాను, మా స్ఫూర్తి "అమ్మమ్మా అమ్మ పూజ చెప్పమని, లలితాసహస్రనామ పారాయణ చేయమంది". అంతకు ముందు దానికి తగ్గించమని గట్టిగా అడిగానని, "అమ్మ కుంకుమ పెట్టుకొని నమస్కారం చేస్తూ మెల్లిగా స్ఫూర్తికి తగ్గంచమ్మా అని అడగాలి కాని దెబ్బలాడకూడదని" చెప్తుంటే నాకే సిగ్గనిపించింది. చిన్నపిల్లకున్న ఇంగితం నాకు లేకపోయిందని అనుకున్నాను. అమ్మమ్మా "నాకు రెండురోజుల్లో తగ్గుతుంది, నీకు 7 రోజుల్లో

ఆయా సమయాలలో ఆయాపనులు చేయించడమే కరుణ.

కొంచెం తగ్గుతుందని జయహోమాత చెప్పిందని" అన్నది. అదే విధంగా నాకు తగ్గుముఖం పట్టింది కానీ పూర్తిగా తగ్గలేదు.

అమ్మను స్మరించుకుంటూ ఈతిబాధలు కలిగినా, శారీరకంగా బలహీనపడ్తున్నా తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించమ్మా అని ప్రార్థించేదాన్ని. దాదాపు 3 సం॥, కాలుఫ్రాక్చర్ అయి, ఆపరేషన్ జరిగి నొప్పితో బాధపడ్తూ ఎక్కువైనప్పుడు ప్రారబ్ధం అనుభవించవలసిందేనని దానికి తట్టుకునే ఓర్పు ఇవ్వమని ప్రార్థించేదాన్ని, ఉధృతం తగ్గినా బాధ వుంటూనే వుంది మధ్యమధ్యలో మళ్ళీ ఎక్కువై ఓర్చుకోలేని స్థితిలో అమ్మతో మొరపెట్టుకునేదాన్ని.

అమ్మ మనల్ని పనిముట్లుగా వాడుకుంటుంది కదా! మా మనవరాలు తీరికగా కూర్చుని ఆలోచిస్తుంటే, ఇంత చిన్నపిల్లకు ఆలోచన ఏమిటి? అన్నాను. "అమ్మమ్మా మీరు ఎప్పుడైనా జిల్లెళ్ళమూడి వెడ్తారు కదా! వెళ్ళిన మూడోరోజు నీకు తగ్గుతుందని చెప్పింది" అన్నది.

నాన్నగారి ఆరాధనోత్సవం – ధాన్యాభిషేకానికి వెళ్ళలేకపోయానని అమ్మ పుణ్యతిథి జూన్ 12 కు జిల్లెళ్ళమూడి వెళ్ళాను. జిల్లెళ్ళమూడిలో రాధ అన్నయ్య (కాసు రాధాకృష్ణరెడ్డి, పుట్టు గుడ్డి). "కాలు ఈడుస్తూ నడుస్తున్నావే"మని ప్రశ్నించాడు. "అమ్మగారు కాలు విరగ కొట్టింది కదా!" అన్నాను. దానికి అన్నయ్య "నీకు దెబ్బ తగిలిన సమయం మారకదశ. కాని అమ్మ నిన్ను బతికించుకుంది. నీ చేత ఏమి చేయించ దల్చుకుందో! మళ్ళీ ఎప్పుడు దెబ్బ గురించి ఆలోచించక. దాని విషయం అమ్మ చూచుకుంటుంద"న్నాడు. దానితో నిర్ఘాంతపోవటం నా వంతు అయింది. అంతమటుకు గాయం చుట్టూ చిన్నచిన్న కురుపులుగా ఒకచోట తగ్గితే మరొకచోట వచ్చేవి. 10న బయలుదేరి 11 కు వెళ్ళాము. 12 వ తా॥ కూడా కురుపులు వచ్చాయి. 13 వ తా॥కు కొత్త

రాగద్వేష రహితమైనది అనసూయ, అత్రి అంటే త్రికాలాలూ, త్రివిధావస్థలూ లేనివాడు.

కురుపులు రావటం ఆగిపోవటమేకాక కాలువాపుతగ్గి దెబ్బపూర్తిగా తగ్గిపోయింది. 3 సం॥ ఎంతగానో బాధ ననుభవించిన నాకు ఎటువంటి వంకా లేకుండా మామూలుగా అయి నడవగల్గటం అమ్మ అనుగ్రహమే కారణం. ఇది నాదృష్టిలో అమ్మ మహిమేననిపిస్తుంది. ఆ తరువాతే దివ్యానుభూతులు, మధురస్మృతులు, అనసూయ వ్రతకల్పం, అమ్మ సచ్చరిత్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ భాగాలు అమ్మ నా చేత తాను రాసుకుంది. నేను కలం మాత్రమే. అందులో సిరా అమ్మే. అట్టి అవకాశాన్ని కలుగచేసిన అమ్మకు మనస్ఫూర్తిగా కైమోడ్పులం దిస్తున్నాను.

కారుణ్యసింధువు - అమ్మ

సమస్కరించేందుకు అమ్మ పాదాలు తాకటానికి, పూజచేసుకుంటూ అమ్మ దగ్గర ఎక్కువసేపు ఉండటానికి, అమ్మ దగ్గర నుంచి తీర్థం పొందటానికి, అమ్మచేత బొట్టుపెట్టించుకొనే మహత్తరభాగ్యం కలగటానికి ఆలవాలమైన ప్రాచీన భారతీయ సంస్కృతికి నమస్సులు.

దేని మీద మనస్సులగ్నం కాలేనితనం, దేనినీ తనలో ఇముడ్చుకోలేని వైనం మానవనైజం. అవతారపురుషుల సన్నిధానం మనజీవితాలలో కొత్త అందాలు నింపుతూ, మనలో దాగిన ఔన్నత్యాలు, మధురిమలు పరిమళింప చేస్తున్నప్పుడు జీవితంలో కావల్సిందేమీ లేదనిపిస్తుంది. మన నడివడిని మనం తెలివితో సమర్థించుకునేట్లు చేస్తారు. అందుకే మనలో మానసిక పరిణామం తొందరగా వస్తుంది. ఆ విధంగా కాక కొందరు అతి తెలివికి పోయి తాత్కాలిక మానసికోద్రేకాలతో అటూఇటూ తిరుగుతూ అర్ధాంగి, అర్జనా రెండూలేక సన్యసించి వయస్సు మళ్ళేవేళ ఎంతో ఘోరమైన జీవితం గడపవలసి వస్తుంది.

మా అబ్బాయి ప్రమాదానికి ముందు భ్రమరాంబక్కయ్య ద్వారా అమ్మ

జనన మరణాలను గురించిన క్రుంగుపొంగులు లేకపోవడం అమృతత్వం.

చీరె, కుంకుమ పొట్లాలు పంపింది. అమ్మ దయవల్ల పెద్ద ప్రమాదానికి గురియై కూడా ఎటువంటి అవకరం లేకుండా బయటపడ్డాడు. రెండోమాటు అక్కయ్య వచ్చి అమ్మ నీకు ఈ చీరె, కుంకుమ పొట్లాలు ఇమ్మందని ఇచ్చింది. నేను అప్పుడు M.A. final పరిక్షలు రాస్తున్నందున అమ్మ ఆశీస్సులు నాకు ఉన్నాయని తప్పక క్లాసు వస్తుందని అక్కయ్యతో చెప్పాను.

భ్రమరాంబక్కయ్య వాళ్ళు వైజాగ్‌కు ట్రాన్స్‌ఫర్ మీద రావాల్సి వచ్చింది. అక్కయ్య "అమ్మా! నిన్నువదిలి అంతదూరం వెళ్ళాలంటే చాలా విచారంగా వుందని" అంటే అమ్మ "మనుషులు దూరం అయితే మనస్సులు దగ్గర అవుతాయని" అంది. విశాఖపట్టణంలో కుసుమవుంది దాన్ని నీ తోబుట్టువులా చూచుకుంటూ కష్టసుఖాలలో కలిసి మెలసి వుండమంది. అందుకని అక్కయ్య తన దగ్గర ఉన్న చీరె ఇస్తే నేను ఏమనుకుంటానో అని అమ్మ ఇమ్మందని చెప్పింది. నాకు అమ్మ ఆశీస్సులున్నాయి. తప్పక క్లాసు వస్తుందనటంతో చాలా భయపడింది. ఎందుకమ్మా ! నాచేత ఈ అబద్ధం చెప్పించావు. అని ప్రతిరోజు నేను పరీక్షపాస్ అవ్వాలని ప్రార్థించేది. పరిక్ష పాస్ అవ్వకపోతే కుసుమ ముఖం చూడలేను, నిన్ను దర్శించలేనని తనకు చావే శరణ్యం అని మొరపెట్టుకుంది. రిజల్ట్సు వచ్చి పాస్ అయ్యి క్లాసువచ్చిందని తెలిసాక తనకు మనశ్శాంతి కల్గింది.

మా అమ్మగారు యాక్సిడెంట్ తరువాత కొంచెం కోలుకున్నాక జిల్లెళ్ళమూడి వెడ్తుంటే అక్కయ్య ఇచ్చిన చీరె మెత్తగా వుంది కదా అని మా అమ్మ గారికి ఇచ్చాను. ఆ చీరె కట్టుకొని అమ్మ దర్శనానికి వెడితే ఈ చీరె ఎక్కడిదే అని రెండుమూడు మార్లు అడిగింది అమ్మ. అప్పుడు మా అమ్మ "ఈ చీరె నీవు భ్రమరాంబ ద్వారా కుసుమకు పంపించావు, మెత్తగా వుందికదా

అని నన్ను కట్టుకోమని నాకు ఇచ్చిందని" చెప్పింది. అక్కడే వున్న సరోజినక్కయ్యతో "ఇది భ్రమరాంబ కుసుమకు ఇచ్చిన చీరె, నాకే నాలుగు చీరలు ఇవ్వాలని వుంటుంది కానీ మిగతావాళ్ళు బాధపడ్తారని భ్రమరాంబ మనస్సు మంచిది. ఏది చేసినా మనస్ఫూర్తిగా చేస్తుందని దానికి చెప్పాను" అన్నది. ఆ విషయం భ్రమరాంబక్కయ్య జిల్లెళ్ళమూడి వెడితే సరోజినక్కయ్య చెపితే, నేను ఆ చీరె ఇచ్చినట్లు అమ్మకు చెప్పనే లేదు. నాకు ఎవరోపెడితే కుసుమ ఉద్యోగం చేసుకుంటోంది కదా! బాగుంటుందని ఇచ్చానని ఆశ్చర్యపోయింది. అమ్మ సర్వజ్ఞ కదా! ఆవిడకు తెలియనిది ఏముంటుంది? అమ్మ ఆదేశానుసారమే వాళ్ళు మాకు సలహాలరూపేణ, ఆర్థికంగా, వస్తురూపేణా, ఎన్నో విధాల సహాయం చేసారు. అమ్మ దయవల్ల ఇప్పటికీ తోడబుట్టిన వాళ్ళకంటే ఎక్కువగా వుంటున్నాము. అమ్మ కరుణ గురించి ఎంతగారాస్తున్నా మిగిలిపోయిందే ఎక్కువగా వున్నట్లు అనిపిస్తుంది. ఆ దంపతులు అమ్మ సూక్తులను త్రికరణశుద్ధిగా ఆచరిస్తూ ఇప్పటికీ ఎందరికో తమ సహాయ సహకారాలను అందిస్తూ అమ్మ అడుగుజాడలలో నడుస్తున్నారు. వారి మంచి మనస్సుకు తగినట్లుగా 'అమ్మ' వారికి ఆనందాన్ని మంచి అవకాశాలను కలుగచేస్తోందనటానికి ఈ క్రింది సంఘటనలే నిదర్శనం.

భోగి పండుగకు అమ్మ మనందరికీ భోగి పళ్ళు పోసేది కదా! అమ్మ భౌతిక దేహానంతరం వసుంధరక్కయ్య చేత కావల్సినవాళ్ళు పోయించుకునేవారు. క్రిందటి సం॥న వసుంధరక్కయ్య ఆరోగ్యం సరిగాలేనందున వాళ్ళ తమ్ముడు సత్యం దగ్గరకు వెళ్ళింది. అప్పుడు పెద్దగుడి నిండా జనం కూర్చుని వున్నారు. ఈమారు భ్రమరాంబపోస్తుందని రామక్రిష్ణ అన్నయ్య అన్నారు. మామూలుగా పిల్లలు కలవాళ్ళు. వాళ్ళ పిల్లలకే భోగిపండ్లు పోసుకుంటారు. కాని అక్కయ్యకు, అందరికీ భోగుపళ్ళు పోసే అదృష్టం కలుగచేసింది అమ్మ. చాలా ఆనందంతో,

---

ఈ సంకల్పం నాది కాదు, అనుకోవడమే సంకల్పరాహిత్యం.

అందరికీ ఎటువంటి అలసట, ఆయాసం లేకుండా పోయటం ఒక మహిమే. ఎందుకంటే అక్కయ్య హార్టుఎటాక్ వచ్చిన మనిషి, స్వతహాగా కూడా బలహీనమైన మనిషి, పెద్దగా శ్రమ తట్టుకోలేనటువంటిది. అలాంటిది అమ్మ దయవల్ల అంతమందికి భోగిపళ్ళు పొయ్యటం ఆశ్చర్యకరమైన విషయమే. భోగిపళ్ళు పోస్తున్నప్పుడు అక్కయ్యకు నీరసం వస్తుందేమోనని లక్ష్మణరావుగారు చాలా భయపడ్తుంటే "నా శరీరంలో నేను వుంటే కదా! అమ్మే పరకాయప్రవేశం చేసిందని, నాకు పిల్లలు లేకపోయినా ఇంతమందికి నాచేతుల మీదుగా భోగి పళ్ళు పోయించటం నామహాద్భాగ్యమే" అని పొంగిపోయింది.

నాదెళ్ళలో వుండగా అక్కడ అందరూ అక్కయ్యను అమ్మా అని, అన్నయ్యను నాన్నగారని పిలిచేవారు, ఆ విధంగా పిలవద్దని ఎంత చెప్పినా వినేవారుకాదు, అదే మాట అమ్మతో "ఎప్పుడూ వాళ్ళ ఇళ్ళకు నేను వెళ్ళలేదు వాళ్ళే వస్తుంటారని అన్నది. "వాళ్ళనేరాని" అంది. పిల్లలు లేని మాకు అంతమంది చేత అమ్మా, నాన్నా అని పలిపించుకోవటం అమ్మదయే అనుకుంటూ లక్షరూపాయలు ఇచ్చినా ఎవరూ అమ్మ అని పిలవరు కదా! అని అక్కయ్య అమ్మతో అంటే "అంతే గా" అన్నది. ఉద్యోగ విరమణ తరువాత జిల్లెళ్ళమూడిలోనే స్థిరనివాసం ఏర్పరచుకున్న ధన్యజీవులు వారి చేతిలో తగినంత డబ్బు లేకపోయినా అమ్మ జిల్లెళ్ళమూడిలో వారిచేత ఇల్లుకొనిపించింది. వారిద్దరూ అమ్మకు అనుంగుబిడ్డలు. అక్కడే వుండి సేవ చేసుకునే అదృష్టం వారికి అమ్మ కలుగచేసింది. అమ్మ సంచరించిన ప్రదేశంలో ఆనందంగా సేదతీర్చుకుంటూ, జిజ్ఞాసతో కూడిన మానసిక సమన్వయంతో, నమ్మకమే నడవడిగా, బ్రతుకే జీవితంగా వెలుగుతున్నారు. వారి విధానమే మనకు మార్గదర్శకంగామారి, ఆకారుణ్యసింధువు నీడే మన జీవన విధానమై భాసిల్లాలి.

నమ్మకమే దైవం.

ప్రేమైకమూర్తి అమ్మ

అమ్మ యొక్క లావణ్య లలిత సుందర దరహాస జ్యోత్స్నలను చూస్తుంటే మనమీ ప్రపంచాన్నే మర్చిపోతాము. అంతకంటే కోరదగినది, కావల్సినది ఇంకొకటి వుండదు. కాలం అలాగే ఆగిపోతే బాగుంటుందనిపిస్తుంది. ఆ మృదుమధురమైన మోహనరూపం లీలగా మనస్సునమెదలి, మోముజేవురించి, మేను పులకరించి, మునుపెన్నడు ఎరుగని ఆనందానుభూతి కలుగుతుంది.

అమ్మ ఆప్యాయంగా, అనురాగంగా నిమిరే మధురస్మిత ప్రేమలో పులకరించిపోతాము. శాశ్వతమైన సత్యం వుండి, ప్రేమైకమూర్తి అమ్మగా అవతరించిందనిపిస్తుంది. అమ్మ దృష్టిలో బీదా - గొప్ప, మూర్ఖుడు - మేధావి, స్త్రీలు - పురుషులు అంతా సమానమే. అమ్మ ప్రేమానురాగాలు చవిచూచిన వారికి అమ్మను విడిచి వేరెక్కడికీ పోవాలనిపించదు (పోలేము). ఆ మనోహర రూపాన్ని చూస్తూ గడిపేయాలనిపిస్తుంది.

మేము ఇబ్బందులలో ఉన్న తరుణంలో అమ్మ మమ్మల్ని ఎంతగా ఆదుకుందో చెప్పటానికి మాటలు చాలవు. ఆమె చల్లని దీవెనలే మేము హాయిగా, ఆనందంగా కాలం గడపటానికి దోహదం చేస్తున్నాయి.

1976 వ సం॥ నవంబరు నెలలో మేము గడ్డుదినాల నెదుర్కొంటున్న రోజులు. అంతకు ముందే ఈయనకు డబుల్‌టైపాయిడ్, ఎమిబిక్ డిసెంట్రితో బాధపడ్తూ దాదాపు 40 రోజులు షాపుకు వెళ్ళని పరిస్థితి. అసలే షాపు నష్టాలలో నడుస్తున్న రోజులు అంతకుముందే అమ్మకు షాపు గురించి చెప్తే "పేరుపోలేదు, సెంటర్లోనే వుంది. ఎవరో ఒకరు సాయం చేయకపోరని" అంది. అమ్మ మాటే మంత్రంలా ఎప్పటికి ఆ రోజులు వస్తాయా అని ఎదురు చూపులు చూస్తున్నాము.

సంసారమంటే సంకల్పమే.

కార్తీక సోమవారం నాడు దీపారాధన చేద్దామన్నా చెమ్చాడు నూనె లేదు, అగరొత్తులు నిండుకున్నాయి. అవే లేకుంటే కొబ్బరికాయ, పండ్లు సరేసరి. ఆయన పూజకు కూర్చున్నారు, లేవని చెప్పటానికి నోరు రావటం లేదు. మాటపెగలటం లేదు. ఏమి చేయాలో తోచక మధనపడ్తూ అమ్మనే పరిపరి విధాల ప్రార్థిస్తున్నాను.

అమ్మ కరుణానిధి, కారుణ్యమూర్తి కదా! నా బాధను చూడలేకపోయింది. మాకు తెలిసిన ఒకావిడ మాఇంటి దగ్గర్లో శివాలయం వుంటే అక్కడకు వెళ్ళారు. శివాలయం తలుపులు వేసి వున్నందున మా ఇంటికి వచ్చింది. గుడికని వచ్చాను మూసివుందని ఆవిడ తీసుకువచ్చిన పళ్ళు, పూలు, కొబ్బరికాయ, అగరొత్తులు, కర్పూరం, వత్తులు నూనె అన్ని అక్కడ పెట్టారు. మామూలు రోజులలో అయితే నూనె, వత్తులు గుడికి పట్టుకువెళ్ళం. కార్తీకమాసం అవటంతో గుళ్ళో దీపం వెలిగించాలని ఆమె తీసుకువచ్చారుట. చిన్నసీసా ఏమీ కనిపించక కొంచెం పెద్దసీసాతో నూనె తీసుకువచ్చారు. అది నాలుగు రోజులు దీపారాధన చేయటానికి సరిపోయింది. ఇంతగా చెప్పటమెందుకంటే కార్తీకమాసంలో అందరూ దర్శనానికి వచ్చేసమయంలో గుడిమూసివేయటం ఆశ్చర్యమే కదా ! ఆ శివాలయం కట్టిన స్థలం డిస్ప్యూటులో వున్నందున కోర్టుకు వెళ్ళారు. కోర్టు ఆర్డర్సు ప్రకారం మూసి వేయటం జరిగింది.

అంతకు ముందు రోజే పరిస్థితులకు తట్టుకోలేక అమ్మతో మొరపెట్టుకున్నాను. నేను, ఆయనా, ధ్యానంలో ఉండగా నాతల నిమిరినట్లయి కళ్ళు తెరచి చూచాను. ఆయన కళ్ళు మూసుకొని ధ్యాన నిమగ్నులయి వున్నారు. నేను స్పర్శానందాన్ని అనుభవించాను. అంతమటుకు పరిస్థితులకు తట్టుకోలేక, ఎదురీద లేక బాధ పడ్తున్న నాకు చెప్పలేని ధైర్యం వచ్చింది.

శ్వాసతో మనస్సు నిలవదు, మనస్సుతో శ్వాస నిలుస్తుంది.

అమ్మ అండ వుండగా నేను ఎందుకు అనవసరంగా దుఃఖిస్తున్నాని నన్ను నేనే ఓదార్చుకున్నాను. ఆయన ధ్యానం ముగిసిన తరువాత మీరేమైనా నాతల నిమిరారా? అంటే నీకు మతి పోయిందా? నేనేమిటి? నీతల నిమరటమేమిటని అన్నారు. నన్ను విచారం నుంచి దూరం చేయటానికే అమ్మ ఆ రకంగా స్పర్శానందాన్ని కలుగ చేసిందని తృప్తి పడ్డాను.

మా నాన్నగారు అన్నంరాజు మాధవరావు గారికి, అమ్మ బాపట్ల సముద్రస్నానానికి వెడ్తున్నామని ఆయన్నీ రమ్మని ఫోను చేయించింది. ఆయన గుంటూరు నుంచి బాపట్ల వెళితే ఆయనకు తాను ధరించిన పాదుకలిచ్చి వాటితో సముద్ర స్నానం చేసిరమ్మంది. ఆయన అమ్మ పాదుకలను తలమీద పెట్టుకొని స్నానం చేసి వస్తుంటే అక్కడ వున్నవారందరికీ రామపాదుకలను శిరస్సున ధరించిన భరతుడే జ్ఞప్తికి వచ్చాడుట. మానాన్నగారి మరణానంతరం మా అమ్మగారు ఎక్కడికి వెడితే అక్కడకు తనతోపాటు అపాదుకలను తీసుకువెళ్ళేవారు. ఆవిడకు ప్రమాదంలో దెబ్బలు తగలటంతో రోజూ పాదుకలను మా ఆయన అర్చించేవారు. ఆవిడ వూరుకు వెడ్తూ ఆ పాదుకలను పట్టుకు వెడ్దామనుకున్నారు. కానీ ఆ రోజు ఉదయం ఆయన పూజ చేసుకుంటుంటే ఆయన చుట్టూ గొప్ప వెలుగు కన్పించింది. దానితో పాదుకలను తీసుకువెళ్దామన్న ఆలోచన విరమించుకున్నారు.

అప్పటి నుంచి ఆ పాదుకలను మేమే పూజించుకుంటున్నాము. కేశవశర్మగారు లలితాసహస్రనామావళి, త్రిశతి, ఖడ్గమాలపూజ, లలితా లక్షనామార్చన విశాఖ అధ్యయనపరిషత్ వాళ్ళ చేత చేయించేవారు. అందరూ చక్కగా చదువుతుంటే తనకు నోరు తిరగదని, సరిగా చదవలేకపోతున్నానని, తాను అందరితో పాలుపంచుకోలేకపోతున్నానని ఆయన 'అమ్మ' దగ్గర

అవధులు లేనిది సమాధి.

బాధపడ్డారు. అప్పుడు అమ్మ "నీవు ఏం చేస్తున్నావు?" అని అడిగింది. దానికి ఆయన "పూజ చేయటము రాదు. ప్రొద్దున్న లేచి నీ పాదాలు పట్టుకోవటం తప్పించి ఇంకేమీ చేయలేను" అని అన్నారు. అది చాలు నాన్నా! "ఎవరు మాత్రం నాకు అంతకంటే ఎక్కువ చేయగలరు, ఎవరైనా చివరకు చేయవలసింది అదేకదా!" అని వూరడించింది.

ఎప్పుడూ అమ్మకు కష్టాలు నివేదించుకొని మనల్ని బయటపడేయమని కోరుకోవటమే. మా స్వార్థంతో అమ్మను వేధించి బాద పెట్టాము. చివరకు భోజనం మానేసి అమ్మను సాధించాము. అమ్మ మమ్మల్ని అనేక విధాల కనిపెట్టి కాపాడింది. అమ్మా! అందరూ చల్లగా వుండేలా దీవించమ్మా అని ఆయన అంటే "చూడండిరా వాడు ఎంత చక్కని కోరిక కోరాడో అందరికీ తృప్తిగా పెట్టుకునేలా డబ్బు ఇమ్మని" అన్నాడు అని అమ్మ అన్యాపదేశంగా మాకు తృప్తిగా అందరికీ పెట్టుకోమని ఉపదేశించింది. అప్పటి నుంచి ఉన్నంతలో అమ్మ చెప్పినట్లుగా అమ్మ అడుగుజాడలలో నడవగల్గుతున్నాము.

అనురాగ జలధి

అమ్మ యొక్క అనురాగజలధిలో ఎంత ఓలలాడినా ఇంకా తనివితీరనట్లే వుంటుంది. అందరూ ఆ ఆనందాన్ని పొందాలని, అందరూ అమ్మను అర్చించాలనిపిస్తుంది. అర్చన గూర్చి భగవద్గీతలో

యతఃప్రవృత్తిర్భూతానాం
యేనసర్వమిదంతతమ్
స్వకర్మణా తమభ్యర్చ్య
సిద్ధింవిందతి మానవః (18 - 46)

సమస్తప్రాణుల పుట్టుకకు, పోషణకు కారకుడై విశ్వమందంతటా

అనేకం ఒకటిగా చూడటమే ఆత్మసాక్షాత్కారం.

వ్యాపించియున్న పరమాత్మను, తనకు విధించిన, కర్తవ్య కర్మలను ఆచరించడం ద్వారా అర్చించి మానవుడు అంతఃకరణ శుద్ధిని, పరమగతిని పొందగల్గుతాడు.

మనం చేసే కర్మ భగవంతుని అర్చనగా మారిన వెంటనే అది వాసనారహితంగా అంతఃకరణను శుద్ధిపరిచి భగవంతుని స్మృతిని పదిల పరుస్తుంది. దాని ద్వారా మనకు పరమపదం లభించి తీరుతుంది.

అంతఃకరణ మనేది శుద్ధిగా గాని, అశుద్ధిగా గాని వుండదు. అదొక స్వచ్ఛమైన దర్పణం లాంటిది. అద్దం ముందు మనం నిలబడితే మనం ఎలావుంటే అదే ప్రతిబింబం కనబడుతుంది. గాలికి ఎటువంటి వాసనా వుండదు. అది ఎటునుంచి వీస్తే అక్కడ గల సుగంధమో, దుర్గంధమో వ్యాపిస్తుంది. గాలి సహజంగా నిర్మలమైనందున తనను చేరిన సుగంధాన్ని కాని, దుర్గంధాన్ని కాని ఎక్కువ సమయం వహింపజాలదు. అదే విధంగా అంతఃకరణ నిర్మలమైనదగుటచే సంసారిక విషయవాసనల కనుగుణంగా శుద్ధిగానో అశుద్ధిగానో మారిపోతుంది. పవిత్రమైన చింతనప్రారంభమైన వెంటనే అది తిరిగి పవిత్రమైపోతుంది.

విశాఖపట్టణంలో నాలుగు శుక్రవారాలు, అమావాస్య, పౌర్ణమి రోజులలో క్రమం తప్పకుండా పూజలు జరుగుతున్నాయి. సత్యనారాయణరాజు గారి దంపతులు, వారి బంధువర్గం పూజలకు తప్పకుండా వస్తూ అనన్యభక్తి విశ్వాసాలతో అమ్మను అర్చించుకుంటున్నారు. అమ్మను చూచిన మనకంటే ఎన్నెన్నోరెట్లు అనుభవాలను పొందగల్గుతున్నారు.

రాజుగారింట్లో మార్చి 8 న పూజ పెట్టుకోవాలనుకుంటే వాళ్ళ బంధువులందరూ వూళ్ళో ఉండరు కాబట్టి ఇంకోరోజు పెట్టుకుందామని అనుకున్నారు. ఎందుకు పూజమార్చాలి ఆరోజే చేయవచ్చుకదా అని స్పష్టంగా,

---

బ్రహ్మ జ్ఞానం కాదు, జ్ఞానమే బ్రహ్మ.

గంభీరంగా, లక్ష్మిగారికి వినిపించింది. అందుకని ఆరోజే వారింట్లో పూజ పెట్టారు. ఎంతో వైభవంగా పూజ జరిగింది.

ఒకమారు రాజుగారి భార్య లక్ష్మిగారు ఇంటి దగ్గర పప్పులు ఎండబెట్టి దగ్గర్లోనే వున్న వారి ఆడపడుచు పద్మగారింటికి వెళ్ళారు. పప్పులు ఎండబెట్టానంటున్నావు మబ్బు పట్టిందంటే అమ్మ వుందిగా నాకేమి దిగులు అన్నారు. మీ అమ్మగారు ఎప్పుడు వచ్చారంటే మా అమ్మ కాదు "మన అమ్మ అనసూయాదేవి" అన్నారు. ఆవిడ నమ్మకానికి ధైర్యానికి ఆశ్చర్యపోయారు.

మూడురోజుల తర్వాత వాళ్ళ చాకలి వచ్చి అమ్మా బట్టలు ఇక్కడే వుంచేసారేమిటి అని అడిగింది. బట్టలు నీవు ఎప్పుడు ఇచ్చివెళ్ళావంటే మూడురోజులక్రితం తులసికోట వద్ద పెద్దబొట్టు పెట్టుకొని ఆకుపచ్చజరీచీరె కట్టుకొని ఒక ఆవిడ కూర్చునివుంది. "బట్టలు అక్కడపెట్టి వెళ్ళు నేను చూస్తానులే" అన్నారు. అందుకే ఆ మూట అక్కడ పెట్టాను" అని చాకలి సీత చెప్పింది. వాళ్ళు మేడ మీద వుంటారు. వెనుక వీలు లేనందున ముందున్న బాల్కనీలోనే తులసిచెట్టును పెట్టుకున్నారు. ఈ రెండు రోజులుగా తులసిచెట్టుకు నీళ్ళుపోసి ప్రదక్షిణాలు చేస్తూనే వున్నారు. కాని వారు ఆ మూటను చూడనేలేదు. ఎవరూ పట్టుకుపోలేదు. ఆమె ఆ మూట లోపల పెడ్తూ అమ్మ ఫోటో చూచి ఆ ఫోటోలో ఆవిడే నాకు చెప్పిందంటే వారు విస్తుపోయారు. నీవు చాలా అదృష్టవంతురాలివి అమ్మ తనంతతానుగా నీకు దర్శనమిచ్చింది. రామదాసు పరిపరివిధాల శ్రీరామచంద్రుడ్ని ప్రార్థిస్తే, ఆయనకు దర్శనమివ్వక, రామలక్ష్మణులు తానీషాకు దర్శనమిచ్చారు. అట్లాగే మేము పూజ చేసుకుంటుంటే నీకు అమ్మ దర్శనమిచ్చింది. నీ కష్టాలన్నీ తీరి సుఖంగా వుంటావని ఆశీర్వదించి అమ్మ ఫోటో ఇచ్చారు. ప్రతిరోజు అమ్మకు నమస్కరించనిదే ఏ పనీ చేసేది కాదు. ఆమె ఇబ్బందుల వల్ల చికాకుపడి దుః

క్షరం కానిది తెలుసుకోవడం జ్ఞానం.

ఖిస్తుంటే "అమ్మ మళ్ళీ సీతకు కనిపించి" "నేను వున్నాను కదే" అని అభయమిచ్చింది.

పెద్దగాలివాన వస్తుంటే వాళ్ళ బడ్డీ తడిసిపోయి ఎక్కడపడిపోతుందో పిల్లలతో ఏమి అవస్థపడాలో అనుకుంటుంటే మళ్ళీ రాజుగారింట్లో అదే ఆకుపచ్చజరీచీరెతో కనిపించిన విధంగా దర్శనమిచ్చింది. లక్ష్మిగారి చెల్లెలికి అమ్మ దర్శనభాగ్యం కలుగచేసి పూజకు ఎందుకు వెళ్ళవని అమ్మ అడిగిందట. వెంటనే ఆవిడ బయలుదేరి పూజకు వచ్చారు.

అంతఃకరణ శుద్ధిగా వుంటే భగవంతుడు మెచ్చుకుంటాడని, దుర్లభమయిన భగవదర్శనం కూడా వారికి కలుగుచేస్తాడని పై సంఘటన వల్ల తెలుస్తోంది.

వాత్సల్య జలధి - అమ్మ

మానవ జీవితాలకు మించిన, అతీతమైన శక్తి ఏదో సృష్టిలో నియతి ధర్మాలను ప్రవరిల్లజేస్తూ జీవనానికి దోహదకారి అవుతుంది. అట్టి 'అమ్మ' సన్నిధిలో కూర్చున్నప్పుడు దినాలు క్షణాలుగా దొర్లుతాయి. మహాత్ముల సన్నిధి ఆర్తులకు ప్రయోజనకారి. అచ్చటి అమ్మ దయాదృక్కులు మనల్ని హాయిగా, ప్రేమగా నిమురుతాయి.

అమ్మ మధురదరహాసం మనల్ని వెన్నెల్లో చకోరాలుగా చేస్తుంది. మన తలపుల్లో అమ్మ నడయాడినప్పుడు రేగే మధుర వివశతలో పరిసరాలని మరిపించి, కాలాన్ని గమనించకుండా చేస్తుంది. మనస్సుల్లో ఇముడ్చుకోలేని బాధ కన్నీరై ప్రేమగా, భక్తిగా మారుతుంది. అంతులేని ఆ ఆనందస్వరూపాన్ని అవగాహన చేసుకోలేము ఆ వాత్సల్యజలధిలో కరిగిపోవలసిందే.

పంచామృతాలు అనగా ఒకే అమృతం నుండి పంచబడినవి. పాలు, పెరుగు, మీగడ, వెన్న, నెయ్యి.

విశాఖ అధ్యయన పరిషత్ అధ్యక్షులైన శ్రీ ఎ.వి.వి. ప్రసాదరావు గారు అమ్మ అనుగ్రహం మూర్తీభవించిన మాన్యులు. ఆయన ప్రతిక్షణం అమ్మ ధ్యానంలో వుంటూ వేరే ఆలోచనలు లేక దీనజనులకు, ఆర్తులకు అయోమయం నుంచి బయటపడలేని వారికి ఎనలేని సేవ చేస్తున్న మహనీయులు. విశాఖ అధ్యయన పరిషత్‌కు 'గౌరీశంకర్' శిఖరం లాంటివారు. 'మానవసేవే మాధవసేవ' అన్న రామకృష్ణపరమహంస సూక్తిని ప్రతినిముషం ఆచరణలో చూపిస్తున్న మానవతావాది. ఆయన వద్దకు వచ్చేవారిలో ఒకరి అనుభవాలే ఈ వ్యాపానికి పట్టుకొమ్మలు.

ఆటోమోటివ్‌లో పనిచేస్తున్న సురేష్ అనే ఆయన మాష్టారు గారిని కలుసుకోవటం తటస్థించింది. అప్పుడు మాష్టరుగారు ఆయన్ని చూచి ఈ ఉద్యోగంలో ఎక్కువ కాలం ఉండరని వేరే ఉద్యోగం వస్తుందని 'అమ్మ చెప్పిందని' చెప్పారు. ఆయన చెప్పిన విధంగానే వేరే మంచి ఉద్యోగం రావటంతో 'అమ్మ' మీద తిరుగులేని గురి కుదిరింది. ఆయన భార్య ఉపాధ్యాయిని. దంపతులిద్దరూ పూర్తి నమ్మకంతో అమ్మను అర్చించుకుంటున్నారు.

వారి ఇంటికి రెండిళ్ళ అవతల ఒక దంపతులుంటున్నారు, వారికి పెండ్లి అయి 6 సం॥లు అయింది. చీటికి మాటికి భార్యను కొడ్తూ తిడుతూ వుంటారు. స్వతహాగా ఆయన మంచి మనిషే కాని ఎందుకు కొడ్తుంటారో అనూహ్యంగా వుండేది. చివరకు సైక్రియాటిష్టుకు చూపించాలని తీసుకువెడితే ఆ డాక్టరుగారు లేరు. మర్నాడు ఆయన కొట్టే దెబ్బలకు భరించలేక వీరింటికి వెళ్ళి రోదించింది. వారికి ఏమిచేయాలో తోచక మీరు మనస్ఫూర్తిగా అమ్మను ప్రార్థించండి అని అమ్మ ఫోటో దగ్గరకు తీసుకువెళ్ళి మీ పరిస్థితులు వాటంతటవే చక్కబడతాయి అని నమ్మకంగా చెప్పారు. ఆవిడ తన గోడు అమ్మకు నివేదించుకుంది. మూడురోజుల తర్వాత ఆయనకు భువనేశ్వర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యిందని టెలిగ్రామ్

పెట్టినా విమర్శించేవాడు బిడ్డ, విమర్శించినా పెట్టేది తల్లి.

చూపించి, ఇన్నిరోజులూ నిన్ను అనవసరంగా హింసించాను, నన్ను క్షమించమని వేడుకున్నారు. 2 రోజుల్లో వెళ్ళిపోవాలి కాబట్టి తెలిసినవారికి చెప్పివద్దామని ముందుగా ఎక్కడైతే భార్య తనవేదనను అమ్మకు నివేదించుకున్నదో అక్కడికి వచ్చి అమ్మకు నమస్కరించుకొని, అమ్మ దయవల్ల తనలో ఉన్న పిశాచం వదిలిందని భార్యను ప్రేమగా చూచుకుంటానని అన్నారు. దానికి ఆశ్చర్య పోవటం సురేష్ దంపతుల పని అయింది. ఆరు సంవత్సరాలుగా రాని మార్పు అమ్మకు నమస్కరించుకున్న వెంటనే రావటం అమ్మ మహిమే. కొలిచిన వారికి కొంగుబంగారమై క్షణాలలో అనుగ్రహిస్తుందనటానికి ఇంతకంటే నిదర్శనమేముంది? 'అమ్మ' అనుగ్రహవృష్టి ఏ క్షణాన ఎవరి మీద కురుస్తుందో మనకు తెలియదు. అమ్మకు అందరం బిడ్డలమే. దీనిని బట్టి చూస్తే అమ్మ సైక్రియాటిష్టుగా పనిచేసి వారి సంసారాన్ని ఆనందప్రదం చేసింది.

సురేష్‌గారు హైద్రాబాదు పని మీద వెళ్ళారు. అక్కడ వారి స్నేహితుని ఇంటికి చూడటానికి వెళ్ళారు. అక్కడ వాళ్ళు టీ ఇవ్వగా, ఇంకో కప్పు కావాలని అడిగారుట. వాళ్ళు ఎంతో దుఃఖముతో, గద్గద కంఠంతో మీకు ఇంకో కప్పు టీ ఇచ్చే పరిస్థితిలో లేమని హృదయ విదారకంగా చెప్పారు. అంతమటుకు వారు ఇబ్బందుల్లో వున్నారని తెలుసు కాని ఇంత దయనీయమైన పరిస్థితిలో అనగా ఏ రోజు బత్తెం ఆ రోజు వెతుక్కునే పరిస్థితిలో వున్నారని తెలియనందున విపరీతంగా చలించిపోయారు. దానితో ఆయన మితిమీరిన ఆవేదనకు గురి అయి తన పర్సులో ఉన్న "అమ్మ ఫోటోను ఒక్క మాటు తాకి ఇవ్వమన్నారు. అమ్మ అనుగ్రహం ఏ రూపంలో వెలువడ్తుందో నేనైతే చెప్పలేను కాని, వారం రోజుల్లో మీ పరిస్థితుల్లో మీకే తెలియనంత మార్పు వస్తుందని మీరు సంతోషంగా, హాయిగా, సుఖంగా వుంటారని" ఘంటాపదంగా చెప్పారు. ఆయన నమ్మకం చూచి ఆ దంపతులు ఆనందభరితులై వారం రోజులు

లెక్కపెట్టుకుంటూ గడిపారు. నడిసముద్రంలో నావకు చుక్కాని ఎంత అవసరమో గడ్డు రోజులలో ధైర్యం చెప్పేవాళ్ళూ అంతే అవసరం. అమ్మ మహిమలు చూపదన్నా మన అవసరాల బట్టి మనలనే పనిముట్లుగా వాడుకొని వారివారి ఆవేదనలను, ఆర్తిని దూరం చేస్తుంది.

సరిగ్గా వారం రోజులకల్లా ఆయనకు ఉద్యోగం రావటంతో వారి ఈతి బాధలు తొలగటమే కాక వారికి అమ్మ మీద అపారమైన నమ్మకం, భక్తి ఏర్పడ్డాయి. అవ్యాజ కరుణామయి అయిన అమ్మకు అంజలి ఘటించి అమ్మ వాత్సల్యజలధిలో ఓలలాడటం జరిగింది. ఆ స్నేహితుడు రెండో కప్పు టీ అడగటం ద్వారా, వారి దయనీయమైన పరిస్థితి ఆయనకు తెలిసేటట్లు చేసి ఆయన ద్వారా వారిని అనుగ్రహించిందనటానికి ఇంతకంటే నిదర్శనమేం కావాలి?

అర్చన - అమ్మ

"యద్యత్కర్మకరో మితత్తదఖిలం
శంభోతవారాధనం"

మనం ఏదిచేసినా సరే అది భగవంతుని అర్చనే అన్న భావం మాత్రమే కావాలి. ఆ భావన మనల్ని పవిత్రం చేసి పరమపదానికి చేరుస్తుంది. మనిషిలో భగవంతుని గురించిన ఆలోచన, చింతన వుండాలి. అది సత్యాన్వేషణకు దారి తీస్తుంది. మనస్సే సర్వదుఃఖ వికారాలకు కారణము. ఆ మనస్సును అమనస్కం చేస్తే మనిషికి పరమశాంతి లభిస్తుంది. అటువంటి శక్తి సజ్జనసాంగత్యం, సాధుపురుష సందర్శనం, సద్గ్రంథపఠనము వలన అలవడుతుంది. మన అదృష్టవశాత్తు రాజరాజేశ్వరి అయిన అమ్మ సమక్షంలో గడపగలగటంతో మనపని సులువైంది.

అనుభవం లేకపోతే మహా వాక్యాలు మన వాక్యాలే.

రామకృష్ణపరమహంస భగవదవతారమని, వివేకానందకూడా భగవదవతారంతో పాటు వచ్చేవారిలో ఒకరని వివేకచైతన్య వివరించారు. కాని వారిలో ఒక బ్రహ్మచారి "నేను స్వామీజీని భగవదవతారంగానే తలుస్తాను" అని అన్నారు. అట్లే 'అమ్మ' మనకు భగవదవతారమే కాదు భగవంతుడే.

అమ్మ లక్షమందికి ఒకే పంక్తిన భోజనం పెట్టాలన్న ఉద్దేశ్యం వ్యక్తీకరించినందున స్వర్ణోత్సవాల్లో లక్షమంది భోజనం చేస్తుంటే చూచి ఆనందపరవశురాలైంది. తరువాత కోటిమందిని చూడాలని, తన దగ్గరకు రాలేని వారిని తానే వెళ్ళిచూడాలన్న కోరిక వెలిబుచ్చింది. దానికి తగిన ఏర్పాట్లన్నీ జరిగి మద్రాసు హైద్రాబాద్‌లలో లక్షలమంది పిల్లలకు అనాయాసంగా తన దర్శనాన్ని కలుగచేసింది. కృష్ణాజిల్లా పర్యటనలో అమ్మ మచిలీపట్నం వస్తున్నారని తెలిసి మా సొంతవూరులో అమ్మను అర్చించుకోవాలన్న తపనతో పదిమందిమి వెళ్ళాం.

అమ్మకు ఉదయ భీమరాజుగారింట్లో బస ఏర్పాటు చేసారని తెలిసి, అక్కడకు బయలుదేరుతుండగా మా పిన్నత్తగారు "అమ్మను మన ఇంటికి రమ్మని వేడమని" చెప్పారు. అమ్మను చూచి పరవశించి మా అత్తగారు అడగమన్న మాటే మర్చేపోయాను. "మాచెల్లెలు, పాపరాలేదేమని" అమ్మ అడిగింది. దానికి అబార్షన్ అయ్యింది అందువల్ల రాలేకపోయిందంటే ప్రక్కనే వున్న రామకృష్ణ అన్నయ్య మేమే వస్తామని అన్నాడు. మా అత్తగారి సంకల్పం బలమైనది అవటంతో అమ్మే అన్నయ్య ద్వారా అనిపించింది. అందుకే మన సంకల్పం మంచిదయితే అది తప్పక నెరవేరుతుంది. అట్లా అనేక సందర్భాలలో అమ్మ నెరవేర్చింది. మర్నాడు ప్రొద్దున్న ఎస్.ఆర్.వై. ప్రసాద్ గారింటికి అమ్మ వస్తున్నారని నన్ను అక్కడ ఏర్పాట్లు చూడటానికి ముందుగా రమ్మంటే వెళ్ళాను.

స్థిమితమైన ప్రజ్ఞకలవాడే స్థితప్రజ్ఞుడు.

ప్రసాదుగారి తల్లి "అమ్మ లేదు, బొమ్మ లేదు అంతా ట్రాష్" అంటూ ఇష్టమొచ్చినట్లు అమ్మ గురించి మాట్లాడారు. మా మరిదిగారు వచ్చి ఆవిడ అలా మాట్లాడుతోంది మీరేమి వాదించకండి అంటే "అమ్మే ఆవిడచేత అలా మాట్లాడిస్తోంది, ఇందులో నేను బాధపడవల్సినది ఏముందని" అన్నాను. ఇంతలో అమ్మ వస్తున్నారంటే అందరం వీధిలోకి వెడ్తుంటే, మా అందర్నీ నెట్టేసి ప్రసాదుగారి తల్లి ముందుగా వెళ్ళి అమ్మకు పాద నమస్కారం చేస్తుంటే అమ్మ యొక్క కరుణా, కటాక్షాలకు మురిసిపోయాను. మధ్యాహ్నం మా ఇంటికి వస్తున్నారని మేమందరం అమ్మ కోసం ఎదురు చూస్తున్నాము. సాయంకాలం అమ్మ వచ్చింది. మా ఇంట్లో పదిమంది దంపతులం పూజ చేసుకుంటుంటే కళ్యాణమహోత్సవంలా వుందని అంది. మా పినమామగారు, మేము అంతా కలిసి వుండటం మా ఉమ్మడి కుటుంబం చూచి పొంగిపోయింది. "మీ మాట వినాలని వుందని అన్న మా పిన్నత్తగారితో జిల్లెళ్ళమూడి రమ్మని అంది. మా పెద్ద అమ్మాయి పెళ్ళి, అబ్బాయి ఒడుగు అమ్మ సమక్షంలోనే జరిగాయి. అప్పుడు మా పిన్నత్తగారికి, మామగారికి అమ్మ తనచేత్తో ఇడ్లీ పెట్టి, కాఫీ పట్టింది.

సైంటిఫిక్ కంపెనీ వాళ్ళు వేదప్రవచనాలతో, పూర్ణకుంభంతో 'అమ్మకు' స్వాగతం పలికారు. అప్పుడు అమ్మతో పాటు నేను వెళ్ళాను. ఈ కంపెనీ మా మామగారు స్థాపించారమ్మా అని ఆయన విగ్రహాన్ని అమ్మకు చూపిస్తూ ఆయన పిల్లల్లో ఒక్కరికి కూడా స్థానం లేక పోయిందమ్మా అని బాధపడ్తే "తాడిదన్నే వాడిని తలదన్నే వాడుంటాడని" అంది. ఆ తరువాతే అది గవర్నమెంట్ ఆధీనంలోకి వెళ్ళింది.

హిందూ కాలేజీలో అమ్మ దర్శనమిస్తారంటే వెళ్ళాము. లక్షలాది జనం, స్టేజికి ఒక పక్కగా నుంచుంటే 'అంజన్' పైకి వచ్చేయమంటే నాతోపాటు

శరీరమంతా పాదమ్మీదనే ఆధారపడింది. కనుక పాదాలకే నమస్కారం.

ఇంకొకరు వున్నారు. ఇద్దర్నీ రానిచ్చేటట్లయితే వస్తానని పైకి వెళ్ళి ప్రక్కన కూర్చున్నాము. రోజూ చూచే అమ్మ వేరు. ఆ స్టేజీ మీద అమ్మ, రాజరాజేశ్వరీ మనకొరకు దివి నుండి భువికి దిగి వచ్చిందా అనిపించింది. మూడు గంటలసేపు అమ్మ పిల్లల కొరకు శ్రమకోర్చి దర్శనమిచ్చింది.

మచిలీపట్నం నుంచి విజయవాడకు రెండుకార్లలో వెడ్తున్నాము. ఒక కారులో అమ్మ, రామకృష్ణ అన్నయ్య, ఉషా, నేను వున్నాము. పార్థు డ్రైవ్ చేస్తున్నాడు. అవతలి కారులో గోపాలన్నయ్య, లాలా, ఇంకా మరి కొంతమంది వున్నారు. ఆ కారులో వాళ్ళు వినసొంపుగా అమ్మ నామాన్ని గానం చేస్తున్నారు. అది విని మా కారులో ఎవరికీ చక్కటి కంఠం ఇవ్వలేదని అమ్మతో అంటే "అందరూ పాటగాళ్ళే అయితే విని ఆనందించే వారెవరుంటారని" అంది. వూరు వదిలి కొంతదూరం వెళ్ళిన తరువాత అమ్మ కారు ఆపమంది ఎటుచూచినా పచ్చని పొలాలు, తోటలతో కనువిందు కలిగించేలా వున్నాయి. ఇక్కడ ఎందుకు ఆపమన్నావమ్మా అంటే నవ్వి వూరుకుంది. ఎంతసేపటికీ వెళ్దామని చెప్పటం లేదు. అమ్మ ఎందుకు ఆపమందో, ఎంత ఆలోచించినా ఎవ్వరికీ అర్థం కాలేదు.

లాలా, పార్థు మిగతా మగపిల్లలు అక్కడి తోటల్లో దూరి దొండకాయలు, నిమ్మకాయలు కోసుకు వచ్చారు. అమ్మ నిమ్మకాయలను ఆ చేతిలోకి ఈ చేతిలోకి ఎగరువేస్తూ ఆడుతోంది. ఆ ఆట చూచి తీరవలసినదే కాని వర్ణించశక్యం కాదు.

ఏదో తెలియని ఆనందంతో మేను పులకరించింది. అలా ఆడుతూనే వుంది కాని ఎప్పటికీ బయలుదేరుదామని అనలేదు. ఈలోగా ఒకామె భర్తను నడిపించుకుంటూ ఆరోడ్డు మీదనుంచి వస్తోంది. అమ్మ వారిని దగ్గరకు

రమ్మని పిలచి అతని ఒడలు నిమిరి, అంతమటుకు తను ఆడుతున్న నిమ్మకాయలను ఆమె చేతిలో పెట్టి ఇంటికి వెళ్ళిన తరువాత రసం తీసి ఇమ్మని చెప్పి, అతనికేమీ భయంలేదని, జబ్బు నిమ్మళిస్తుందని, కులాసాగా వుంటాడని చెప్పింది. మేమంతా వీరి కోసమా అమ్మ కారు ఆపమందని విస్తుపోయాము. అమ్మ దూరదృష్టికి ఇంతకంటే నిదర్శనమేమి కావాలి? మేము ఆగినప్పుడు అసలు రోడ్డు మీద ఎవ్వరూ లేరు. అటువంటిది వాళ్ళు వచ్చేవరకూ ఆగి వారి ఆవేదనను దూరం చేసి వారికి కావల్సిన మనోధైర్యాన్ని కలుగచేసింది అమ్మ.

చర్మ చక్షువులతో భగవంతుడ్ని దర్శించటం సగుణమని, ఆకార రహితమయిన అంతరంలో భగవంతుని చూడాలని ప్రయత్నించటం నిర్గుణమని అంటారు. సగుణం సులభసాధ్యం, నిర్గుణం కష్టసాధ్యం. రెండింటి వలన లభించే ధ్యేయం ఒకటే. భగవంతుడు వేరే ఎక్కడో లేడు. విశ్వస్వరూపమే భగవంతుడు. ప్రతి వస్తువులో అతని రూపాన్ని చూడగలగాలి. మనలో వున్న ఇంద్రియాలకు సంస్కారం అవసరం. మనలోని చాపల్యం నీచత్వం నశించి పవిత్రమైన ప్రేమ దృష్టి వ్యాపించటంతో మనకు ప్రతి వస్తువులోనూ పరమేశ్వరుడే కనిపిస్తాడు. అమ్మ సాహచర్యంలో మన గలిగిన మనము అమ్మ చేతులను మననం చేసుకుంటూ, అమ్మనే అర్చించుకుంటూ, ఆమె అడుగుజాడలలో నడుస్తుంటే, ప్రతి వస్తువులో 'అమ్మే' దర్శనమిస్తుంది.

మధురస్మృతులు - అమ్మ

"అవతారమన్నది ఎప్పుడూ ఒకటే. భగవంతుడు జీవనమను సముద్రములో మునిగి ఒకచోట కృష్ణుడుగాను, మరియొకచోట మునిగి ఏసుక్రీస్తుగాను పిలవబడుచున్నారని" రామకృష్ణుల అమృతవాక్కు. ఆ భగవంతుడే ఇప్పుడు అమ్మగా ఉద్భవించాడు. మహాపురుషులు ఈ లోకమందలి

ఈ కలిలో నాకాకలి లేదు.

కష్టములను చూచి కరుణతో కరిగిపోతారు. వారు తాము మాత్రమే జ్ఞానమును సంపాదించుకొనిన చాలునని తలచినట్టి స్వార్థపరులు కారు.

మన అనుభూతులు మధురంగా, ఆనందంగా స్థిరపడినప్పుడు అవి వ్యక్తం కావడం సహజమై, ఆ అనుభూతుల స్మృతులు గాఢంగా స్థిరపడి మన నైజానికి మనం చేరుకొని స్థిమితత చెందుతుంటాము. భావాన్ని భాషలో వ్యక్తీకరించటం అలవాటు కావటం వలన, మన ఆనందాన్ని, అనుభూతులను అందరికీ పంచవలెనన్న తపన బయలుదేరుతుంది.

అమ్మ యొక్క సుందర సందర్శన మాత్రాన మేను పులకరించి, హృదయతంత్రులను మీటినట్లు వుంటుంది. ఆ సమయంలో ఇతరత్రా ఆలోచనలు లేక మనోవీథులలో విహరించుతాము. అమ్మకు నడుము రాస్తూ, కాళ్ళు పడుతుంటే ఆ స్పర్శ ఏ దివ్యలోకాలకో తీసుకువెళ్తుంది. అమ్మ పాదాలు లేత గులాబి రంగులో లేత తమలపాకు వలె మృదువుగా వుండి, నా మొరటు చేతులతో రాస్తుంటే ఎక్కడ కందిపోతాయో అన్న ఆలోచన వచ్చి నెమ్మదిగా తాకీ తాకకుండా రాస్తూ నా అదృష్టానికి పరవశించేదాన్ని.

ఒకమారు అమ్మకు నడుము రాస్తుండగా, తన గోళ్ళు తీసి నా చేతిలో పోసింది. బయటకు వెళ్ళాక పారవేద్దామని నా చీర కొంగుకు ముడివేసుకున్నాను. ఈ తరువాత నాలో నాకే తెలియని పరవశత్వం కలిగింది. బయటకి వెడదామని గడప దాటుతుండగా, భ్రమరాంబక్కయ్య అమ్మ వెంట్రుకను డైరీలో దాచుకున్న సంగతి గుర్తుకు వచ్చింది. ఇదేమిటి? అమ్మ కరుణించి నాకు గోళ్ళు ప్రసాదిస్తే పారవేయాలనుకోవటం నా మూర్ఖత్వం కాక ఏమిటని నన్ను నేనే ఎంతో నిందించుకున్నాను. ఆ సమయంలో భ్రమరాంబక్కయ్య విషయం గుర్తుకు తెచ్చిన అమ్మ యొక్క కరుణకు,

---

వాత్సల్యానికి అంజలి ఘటించాను. ఆ గోళ్ళను లెక్కించగా సరిగ్గా తొమ్మిది గోళ్ళు వున్నాయి. సాయిసచ్చరిత్రలో బాబా తొమ్మిది రూపాయి కాసులను లక్ష్మికి ఇవ్వటం. అవి నవవిధ భక్తులకు, తార్కాణమనటం, ఇక్కడ అమ్మ ఇచ్చిన తొమ్మిదిగోళ్ళను చూసి నా అదృష్టానికి మురిసిపోయాను. వాటిని జాగ్రత్తగా తీసుకువచ్చి, చిన్న భరిణలో పెట్టి దేవుడి సింహాసనంలో వుంచి రోజు అర్చించుకుంటున్నాము. ఒకరోజు రాత్రి అమ్మ నాకు శ్లోకం చెబితే దానిని నేను ధారణచేసినట్లు, మర్నాడు ఉదయం రాసుకుందామనుకున్నట్లుగా కలవచ్చింది. తెల్లవారి తీరా రాసుకుందామని ఎంత ప్రయత్నించినా గుర్తు రాలేదు. భగవంతుడు తనంతతానుగా నాకు చెప్పిన, దానిని నిలుపుకోలేని నా దౌర్భాగ్యానికి ఎంతగానో వగచాను. ఇంకొకరు మారు 28-5-84 అమ్మ కలలో "ఆచారాలు వేరైనా ఆధ్యాత్మికత ఒక్కటే" అని చెప్పగా వెంటనే పక్కనే వున్న ఆయన్ని లేపి వ్రాయించాను. అప్పటి నుంచి ఏమైనా కల వచ్చినా అప్పటికప్పుడే వ్రాయాలని నిశ్చయించుకున్నాను. 27-7-86 రాత్రి 12.45 ని॥లకు అయోమయంలో కొట్టుమిట్లాడుతున్న నా మనస్సుకు ఊరట కలిగించి, నాకు సరియైన పంథాను అమ్మ చూపించింది.

మా మనవరాలు స్ఫూర్తికి ఒంట్లో బాగుండకపోతే అమ్మ పూజ చెప్పమని అడిగేది. ఒకమారు నేను కాలునొప్పితో విపరీతంగా బాధపడ్తుంటే పంచపాత్రతో నీళ్ళు అమ్మ పాదుకల దగ్గర పెట్టి, అవి తీసుకువచ్చి అమ్మ తీర్థం తాగు, తగ్గిపోతుంది అని చెప్పింది. 96, మే లో స్ఫూర్తికి కలలో అమ్మ కనిపించి "ఎన్ని రోజులకు వచ్చావే అని దాని చేయి తీసుకొని ముద్దు పెట్టుకుంది". అప్పుడు అమ్మ గదిలో దుప్పటి కప్పుకొని పడుకుంది, ఆ గదిలో మేము అందరం కూర్చుని వున్నామని చెప్పింది.

నాకు పిల్లలకోసం ఆశ; చాలక అసంతృప్తి.

ఆధ్యాత్మిక సాధకులందరూ సాంఘిక నియమాలకు అతీతమైన కులమునకు చెందిన వారగుచున్నారు. అట్లే మనము ఆధ్యాత్మికతను పెంచుకొని భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగి వసుధైక కుటుంబంలో మనగలగాలి. పది జన్మలకు సరిపడా మధురస్మృతులను అమ్మ మాకు అందించింది. వాటిని పదిలంగా దాచుకుంటూ అందరితో కలసి పంచుకోవాలన్నదే నా తాపత్రయం.

ఆత్మవిశ్వాసం-అమ్మ

ఆత్మవిశ్వాసం లేని మానవుడు క్రిమివలే ప్రాకులాడుతాడు. ఆత్మవిశ్వాసం కలవాడు స్వేచ్ఛగా గగన విహారం చేసే విహంగమును పోలి ఉంటాడు. ఆత్మవిశ్వాసం ఆవగింజంతవున్నా మహత్తర కార్యములను సాధింపగల్గుతారు. అమ్మ ఏమీ చెప్పదన్నా వారి వారి అవసరాల కనుగుణంగా అన్యాపదేశంగా తెలియచేస్తుంది. నా పెళ్ళి నాటికి ఎస్.ఎస్.ఎల్.సి. మాత్రమే అయ్యింది. 10 సం॥ల తరువాత పి.యు.సి. పరీక్షలు వ్రాశాను. ఈ మధ్యకాలంలో ఒక్కరోజు కూడా మళ్ళీ చదువుకుంటానన్న ఆలోచన రాలేదు. తీరా బి.ఎ. పరీక్ష రాసాక పాస్ అవుతానో లేదో అని మధన పడ్తున్నాను. అప్పుడు మావారు స్నేహితులతో జిల్లెళ్ళమూడి వెళ్తే 'అమ్మాయి ఎమ్.ఎ. అయ్యిందా' అని అడిగిందట. దానితో అమ్మ ఆశీర్వాదం వుంది, నేను తప్పక పాస్ అవ్వగలనన్న ఆలోచనతో అంతమటుకు వున్న బెంగ తీరిపోయింది. ప్రిన్సిపాల్ రాధాకృష్ణశర్మగారితో అమ్మాయి ఎమ్.ఎ. కూడా చేస్తుందిరా అని అన్నదిట. దానితో అమ్మ అనుగ్రహం నాకు పూర్తిగా వున్నదని సంతోషించాను.

"అనుకూలస్యసంకల్పః
ప్రతికూలస్య అసంకల్పః"

మన సంకల్పం బలమైనదై, దానికి తోడుగా భగవంతుని అనుగ్రహం

నేను నేనైన నేను, అన్ని నేనులు నేనైన నేను.

వుంటే మనం చేసే ప్రతిపనిలో అనుకూలాలే కలుగుతాయి. అలాకాక మన సంకల్పం సరిగాలేక, చేయాలా వద్దా అన్న ద్వైదీభావన ఏర్పడితే మనకు ప్రతికూలాలే ఎదురవుతాయి.

మా నాన్నగారు లక్నో యూనివర్సిటీలో ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. చేశారు. నాకు ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. చేయాలన్న కోరిక కలిగింది. బి.ఎ. అయిన తరువాత ఒక సంవత్సరం గ్యాప్ వుండాలంటే సరదాకి కటింగ్, ఎంబ్రాయిడరీ డిప్లొమాలకి కట్టాను. ఆ తరువాత ఎమ్.ఎ. చేశాను. అప్పటికే మా పరిస్థితులలో అనూహ్యమైన మార్పు రావటంతో, నేను ఉద్యోగం చేయటం తప్పనిసరి అయింది. సరదాకి కట్టిన కటింగ్, ఎంబ్రాయిడరీ డిప్లొమాల వల్ల ఆంధ్రాయూనివర్సిటీ హైస్కూలులో క్రాఫ్ట టీచరుగా చేరాను. ఆ డిప్లొమాలే నాకు ఉద్యోగం రావటానికి దోహదకారి అయ్యాయి. జీవితంలో నిలదొక్కుకోవటానికి అవసరమైన పరీక్షలు అమ్మే నా చేత చేయించిందని నా పూర్తి విశ్వాసం. ఎల్.ఎల్.బి. బదులుగా నాకు ఉపయోగపడే బి.ఎడ్. చేయటం వల్ల ఆ స్కూల్‌లోనే బి.యి.డి. అసిస్టెంట్‌గా ప్రమోషన్ అమ్మ దయవల్లే వచ్చిందని నా విశ్వాసం.

అమ్మ కరుణ వల్లే ఆత్మవిశ్వాసంతో ముందుకు పోగలిగాను. ఆత్మవిశ్వాసమే మానవుని పురోగతికి దోహదం చేస్తుంది. ఆత్మవిశ్వాసం, ధైర్యం వేరుకావు. రెండూ ఒకటే ప్రతిమానవునికి తనమీద తనకు నమ్మకం, ఆత్మవిశ్వాసం ముఖ్యం, శతసహస్రానేక మేఘాచ్ఛాదన మాత్రమున ప్రచండ సూర్యునికేమి కొరత. ఆత్మవిశ్వాసం లేనందునే తనలోని దైవమును తెలిసికోలేక కొందరు భయపడ్తుంటారు. భయము వలన నిస్సహాయ స్థితి, నిస్సహాయత వల్ల నీరసము, నీరసము వలన నాశనము కలుగుతాయి. ఆత్మవిశ్వాసము

వలన ధైర్యముతో వెలుగులకు వెలుగై సూర్యులకు సూర్యుడైన జగత్పతిని తెలుసుకోగల్గుతాము.

మనస్సును మన వశంలోకి తెచ్చుకుంటే తప్ప, తత్వ విచారం గాని, యోగసాధన గాని, నిష్కామకర్మ గాని ఏమీ చేయలేము. భక్తులకు పరమశ్రేయస్సును కలుగచేయువాడు భగవంతుడు. ఆ పరమేశ్వరుడు మనలో వున్నాడన్న ఆత్మవిశ్వాసమే అంతఃకరణను శుద్ధిచేసి ఉన్మీలితం చేస్తుంది. ఆ పరమాత్మను హృదయ గుహలో చూచుకోగలగటమే ముఖ్యం. భగవద్దర్శనమే మానవ జీవితానికి పరమావధి. అట్టి భగవంతుడైన అమ్మ సమక్షంలో మనగలగటం మన పూర్వజన్మ సుకృతం. శంకర భగవత్పాదులు తమ భజగోవింద శ్లోకములలో "కణమపి సజ్జన సంగతి రేకా భవతి భవార్ణవతరణే నౌకా" అనగా సజ్జన సాంగత్యంలో ఒక్క క్షణం గడిచినా చాలు అది సంసార సాగరాన్ని దాటడానికి నావగా ఏర్పడుతుందని అన్నారు.

ఆచరణ యోగ్యం కాని ఆశయాలు జీవం లేని కళేబరాల వంటివి. అమ్మ తాను ఆచరించి మనకు కర్తవ్యాన్ని బోధించింది. భగవద్భక్తి ద్వారా భగవతీ దర్శనానికి సాయశక్తులా ప్రయత్నించడమే మన కర్తవ్యం. స్వభావాన్నే స్వధర్మం అనొచ్చు. స్వభావానికి విరుద్ధంగా నడవటమే "పులిని చూచి నక్క వాత పెట్టుకోవటం" అంటారు.

అమ్మ స్వయంగా ఏమీ చదువలేదు. కాని అమ్మ ముఖ కమలము నుండి వెలువడిన దివ్యబోధనలు అమ్మ వాక్యాల ద్వారా అందరికీ అందుబాటులో వున్నాయి. అతి సరళమైన, అలతి అలతి పదాలతో కూడిన అమ్మ వాక్కులు మనందరికీ శిరోధార్యం.

నేను దగ్గరకు తీయడం తప్ప, మీరు నాదగ్గరకు రావడంకాదు.

ఆత్మనిగ్రహం - అమ్మ

భగవంతుడున్నాడని విశ్వసించే వారికి కూడా ఐహిక సుఖాల ప్రభావం వల్ల భగవంతుని మీద నుండి దృష్టి మళ్ళి ఇతర విషయాల మీద ఆరాటం ఎక్కువవుతుంది. ఈ ప్రపంచం అంతా ఈశ్వరేచ్ఛ వల్లనే నడుస్తోంది. ధర్మం–అధర్మం, నీతి–అవినీతి, న్యాయం–అన్యాయం ఆయనకు తెలిసే ఆయన ఇచ్ఛానుసారమే జరుగుతాయి. ఆ విషయంలో పూర్తి నమ్మక మేర్పరుచుకొని మనం చేయగలిగినది, మన వంతు మనం చేసి నిశ్చింతగా భగవంతుని తలుచుకోవాలి. "చేతలు చేతుల్లో లేవని" అమ్మ అంటుంది. అమ్మ ఆజ్ఞానుసారమే మనం చేయగల్గుతున్నామన్న విషయం మరచి, అంతా మన ఇచ్ఛానుసారమే జరుగుతోందని భ్రమపడి లేని పోని ఆరాటాలకు లోనై భగవంతుడ్నే మర్చిపోయే స్థితికి చేరుకుంటాము.

'అమ్మ' దగ్గరకు దసరా పూజలకని వెళ్ళినప్పుడు అమ్మ దగ్గర కూర్చుని వుండగా రామకృష్ణ అన్నయ్య "అమ్మా! పూజలు చేసే వాళ్ళకు, చేయని వాళ్ళకు, చేయించుకునే వాళ్ళకు తేడా ఏమిటమ్మా" అని అడిగాడు. దానికి అమ్మ "పూజలు చేసే వాళ్ళకు తమకంటే మించిన శక్తి ఒకటి వుందని, కష్టం వచ్చినా, సుఖం వచ్చినా అన్నీ వాడిచ్చినవేనన్న విశ్వాసం వుంటుంది. అనుకోని పరిస్థితులు ఎదురైనా నాకేం అమ్మ చూచుకుంటుందన్న ధైర్యంతో నిర్విచారంగా వుంటాడు. పూజలు చేయనివాడికి ఆ పరిస్థితుల నుంచి ఏ విధంగా బయటపడాలి, ఎలా వాటి నుంచి విముక్తి పొందాలన్న ఆలోచనలతో సతమతమవుతూ ధైర్యాన్ని కోల్పోయి విచారగ్రస్తుడు అవుతాడు. చేయించుకునేవాడికి, అంతా వాడే అయినప్పుడు వాడికి వేరే ఆలోచనేముంటుంది" అన్నది.

మీలో నేను దైవత్వం చూస్తాను, మీరు నాలో మానవత్వం చూస్తారు.

సాధారణంగా, సామాన్య మానవులం మనకుండే శారీరక బలాన్ని, మనోబలాన్ని, అర్థబలాన్ని వెంటనే లభించే విషయ సుఖాలపై ఖర్చుచేసి తృప్తి పడతాము. వాటిని ఆత్మనిగ్రహం ద్వారా వెనకవేసుకొని జపధ్యానాదులతో ఆత్మవిచారణ చేసుకొని బ్రహ్మానందాన్ని పొందగలగటానికి ప్రయత్నం చేయాలి. పవిత్రతయే దైవత్వం. కామక్రోధాదులు మనలో తగ్గించుకొని ప్రేమ, కరుణ అన్న భావాలను వృద్ధిపరుచుకోగలగాలి. అప్పుడు మనమే దైవసదృశులమవుతాము. అందుకే శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులవారు అమ్మ "లలితా కోటినామ పారాయణ చేయించి తద్వారా మనలనందరినీ లలితా మూర్తులుగా చేయదలచిందని" వాక్రుచ్చినారు.

మనం పవిత్రులమైనప్పుడే భగవత్స్వరూపం స్పష్టమై భగవంతుని మీద ప్రేమ వర్ధిల్లుతుంది. భగవత్ప్రాప్తికి ముఖ్యంగా కావలసినది మనలోని పవిత్రతయే. భగవన్నామం పరమపావనమైనది. కనుక పవిత్రత కోసం మనం చేయగలిగిన సాధనలలో ముఖ్యమైనది, సులభ సాధ్యమయినది నామసంకీర్తనమే. కనుక దానిని మనం ఆచరించగల్గాలి. దాని కొరకే అమ్మ "అఖండ నామ సంకీర్తన యజ్ఞాన్ని" ఏర్పాటు చేసింది. దానిని మనందరం చక్కగా ఆచరించి మన బ్రతుకులను పండించుకోవాలి.

పవిత్రతకు ఇంద్రియ నిగ్రహము ముఖ్యము. అందుకే అమ్మ "నిగ్రహం కొరకే విగ్రహారాధన" అంది. ఇంద్రియ నిగ్రహం కొరకు చేసే ప్రయత్నాలే భక్తి రూపంలో కన్పించే కర్మకాండ. వ్రతాలు, నియమాలు, దేవతార్చన, యజ్ఞ యాగాదులు ఇవి అన్నీ మనం కామక్రోధాలకు లోబడకుండా స్వతంత్రంగా పనిచేయగలిగేందుకే ఉపయోగపడతాయి. మనం ఏది చేసినా త్రికరణశుద్ధి చాలా అవసరం. మనసా, వాచా, కర్మణా మనం చేసేదాంట్లో మనకు నమ్మకం ఉన్నప్పుడే ఫలితం కలుగుతుంది. మనస్సు మరోవైపుకు లాగుతుంటే ఎన్ని

కర్మలు చేసినా, ఎన్ని శాస్త్రాలు వల్లించినా పురోగతి ఏమీ వుండదు. మనస్సును ఆత్మనిగ్రహం చేత అరికట్టుకోగలిగిననాడు అపారమైన శక్తి మనకు లభ్యమవుతుంది. దానివల్ల మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించగల్గుతాము. మనస్సును అరికట్టడానికి తగ్గ ప్రయత్నాలే సర్వదా నామస్మరణ చేయటం, ఆత్మ వివేచన, ఆరంభ శూరత్వం కాకుండా క్రమబద్ధంగా ప్రయత్నం చేయాలి.

చాలా వరకు పరిస్థితులు మనం కల్పించుకున్నవే. అన్నింటిలో తల దూర్చి, అందరితో కలహాలు పెట్టుకొని అసంతృప్తితో వేగిపోతుంటే ప్రతికూల పరిస్థితులు తొలగవు. సుఖాలు వున్నచోటే దుఃఖాలు వుంటాయి. అలాగే అనుకూలాలున్నచోట ప్రతికూలాలు తప్పవు. కనుక ఉన్నదానితో తృప్తిపడుతూ అనుకూలాలకు పొంగక ప్రతికూలలకు కృంగక సుఖదుఃఖాది ద్వంద్వ స్వరూపమైన ప్రపంచంలో ఎక్కువ ఆసక్తి చూపకూడదు. అందుకే అమ్మ "నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరణగా పెట్టమంది". ఆత్మ నిగ్రహం ద్వారా మనం సుఖదుఃఖాలకు అతీతులుగా వుంటూ భగవంతుని మనసారా శరణు పొందినప్పుడే అన్ని పరిస్థితులు అనుకూలిస్తాయి. భగవంతుడు అనుగ్రహిస్తాడు.

యోగం - అమ్మ

సాధారణమైన జీవితాల్లో మనకి వైరుధ్యం కనిపిస్తుంది. జీవితానికి, ప్రబోధానికి, నమ్మకాలకు, చేతులకు సమన్వయం లేకపోవడమే ఈ విచిత్రం. కాని అవతారమూర్తుల విషయంలో మాత్రం వేరుగా వుంటుంది. అందుకే అమ్మ జీవితాన్ని, సందేశాన్ని విడదీయలేము. అమ్మ జీవితమే ఒక సందేశం. తన అనుభవంలోని మాటలనే మనకు చెప్పింది కాని ఎవరో చెప్పింది తాను చిలుక పలుకుల్లా వల్లించలేదు. ఆచరణ యోగ్యమైనవే తాను ఆచరించి చూపి మనకు మార్గదర్శిని అయ్యింది. అమ్మ జీవితమే ఆచరణాల దర్పణం.

నేను గురువునూ కాను, మీరు శిష్యులూ కారు.

మనిషికి కావలసినది, కర్మలయొక్క పరమావధి ముక్తి. సంసారాన్ని త్యజించినంత మాత్రాన సంసార వాసనలు పోవు. సంసారాన్ని వదిలి సన్యాసం స్వీకరించవలసిన పనిలేదని తాను సంసారంలో వుంటూ మనకు ఆదర్శప్రాయమైనది. "సర్వకమాన్ పరిత్యజ అద్వైతే పరితిష్టతి" సంసారంలో వుండి కర్మయోగాన్ని అనుష్టించవచ్చు. కర్మ సన్యాసం కంటే కర్మయోగమే ముఖ్యం అప్పుడే మానవుడు గమ్యాన్ని చేరగల్గుతాడు. కర్మ చేయకుండా వుండలేము. కర్మ చేయకుండా వుండాలనుకోవటమే కర్మ. అందుకే అమ్మ "సంసారం అంటే కోటలోపల వుండి యుద్ధం చేయటం, సన్యాసం అంటే కోటవెలుపల వుండి యుద్ధం చేయటం" అన్నది. అందుకే ఆత్మజ్ఞాని అన్నవాడు కర్మలు వదిలి పెట్టడు.

వైయుక్తికమైన అమ్మ నడవడే అమ్మ ఉపదేశాలకు ఒరవడి. ఉపదేశాలు చేయటం అమ్మకు అలవాటు లేదనుకున్నా అమ్మ ఒక్కొక్క మాట ఒక్కో సందేశం, ఉపదేశం. అమ్మ జీవితమే ఉదాత్తమైన కావ్యం. అమ్మ వ్యక్తిత్వం విషయం తీసుకుంటే – ఏ విషయంలోనైనా, జటిలం, క్లిష్టం అయిన సమస్యలను కూడా నిశితంగా పరిశీలించి, లోతుల్ని క్షణంలో గ్రహించటమే కాక మనకు ఆత్మస్థైర్యాన్ని, మనోధైర్యాన్ని, నిబ్బరాన్ని కలుగచేసి ఆయా సమస్యలకు సరియైన గమ్యం చూపించిన అనురాగమూర్తి అమ్మ. ఇంతకు మించిన యోగం ఏమి వుంటుంది? మన మధ్య తాను లేకపోయినా మనకు ఎదురైన ఎన్నెన్నో సమస్యలకు గమ్యం చూపించిన కారుణ్యమూర్తి అమ్మ.

అమ్మ దగ్గర ఎంతమందిమి కూర్చున్నా అమ్మ మాట్లాడినా ఒకటి రెండు మాటలు ఎవరి మటుకు వారికి, వారి ఆలోచనలకు, సమస్యలకు తగిన సమాధానాలు లభించేవి.

నేను మార్గదర్శినీ కాను, మీరు బాటసారులూ కాదు.

అమ్మ చూపు ఏ ఒక్కరికో పరిమితం కాక కూర్చున్న అందరికీ మనల్నే చూస్తోందన్న భావన కలిగించేది. ఆమె సమక్షంలో అందరం తనివితీరా మాధుర్యాన్ని గ్రోలినవారమే. ఆ మాధుర్యానికి అవధులు లేవు. అడ్డంకులు అర్హతలు అంతకంటే లేవు. ఎందుకంటే అందరం ఆవిడ అవయవాలమే కాబట్టి శరీరంలో ఒక అవయవం ఎక్కువ, ఒకటి తక్కువగా వుండనట్లే అమ్మ బిడ్డలందరం సమానమేనని సూచించింది.

అమ్మ మాటలు శ్రావ్యంగా, హృదయతంత్రులను ఆపాత మాధుర్యంతో ఆకట్టుకునేవి. అన్నింటినీ మించి మన మీద అమ్మకు వున్న ప్రేమకు విలువ కట్టలేము. అమ్మ మాటలను అవగాహన చేసుకొని మన అవసరాలకు చేదోడువాదోడుగా చేసుకోవాలి. అమ్మ మాటల్లో జీవితానికి గల అర్థం, విలువ బోధపడ్తాయి. వస్తు విషయంగా కాక, వ్యక్తీకరించే విధానం మనలను ఆకట్టుకుంటుంది. జీవితమంతా పరిపుష్టమైన ఆహారలేమి అనుభవించిన వ్యక్తికి చక్కటి విందుభోజనం దొరకటం లాంటిది. అమ్మ మాటలను మన జీవితాలకు అన్వయించుకోగలిగితే ఏం జరిగినా దాన్ని ఎదుర్కొనటానికి సంసిద్ధులం కాగలుగుతాము. అమ్మ దృష్టిలో త్యాగం అంటే సంఘజీవితాన్ని కాదని ఏకాంతంలో ధ్యాన నిష్ఠతో ఎవరి మోక్షాన్ని వాళ్ళు సంపాదించేది కాదు.

ఆత్మ సముద్ధరణ, జగత్‌హితం అమ్మ మాటలలో పడుగు పేకలా కలసివుంటాయి. త్యాగం అంటే సంకుచిత్వాన్ని, స్వార్థాన్ని త్యజించటం కాని, సాంఘిక బాధ్యతలను విస్మరించటం కాదు. ఆత్మ సముద్ధరణకు ఆధ్యాత్మికత, యోగం అన్నవి నిత్యజీవితంలో సమన్వయం చేయవలసిన అనుష్ఠాన పద్ధతులు. ఎవరు ఏ పని చేసినా, ఏ భావనతో చేసినా అది యోగ ప్రక్రియను బలపరచి, దైనందిన జీవితాన్ని తీర్చిదిద్దేదిగా వుండాలి. మానవ చైతన్యంలో నిద్రాణమైన

దివ్యత్వాన్ని పరిపూర్ణత్వాన్ని జాగరూకం చేసేది యోగం. ఆ దివ్యత్వం అందరిలో అంతర్గతంగా వుంది. దానిని వ్యక్తీకరించటం, వెలికితీయటమే జీవితపురుషార్థం "ఇక్కడకు రావటమే యోగం. జిల్లెళ్ళమూడి రావటం వృధాపోదు" అని అమ్మ సూటిగా చెప్పింది. గమ్యం వైపుకు నడపటమే యోగం. దాన్ని విడవకుండా, మరవకుండా మన గమ్యానికి చేరుకోవాలి. రహస్యమేమనగా భగవస్సాక్షాత్కారం పొందటానికి మనము ఏ మార్గాన్ని అనుసరించినా మనస్సునకు పరిపూర్ణమైన ప్రశాంతి చెందనిచో యోగం ఫలించదు. యోగి స్వాధీనములో మనస్సుండునుగాని, మనస్సు స్వాధీనంలో యోగి వుండడంటారు. కాబట్టి అట్టి యోగసిద్ధికే మనం నిరంతరం కృషి చేయాలి.

జీవితాశయం - అమ్మ

జీవితానికి ఓ ఆశయం పెట్టుకొని దానిని సాధించుటలో, భవిష్యత్తుకు రూపకల్పన చేసుకోవడం జరుగుతుంది. ఆ ఆశయసిద్ధికై మానవుడు నిరంతరం కృషిచేయాలి. మనం చేసే దైనందిన కార్యక్రమాలు మన జీవిత లక్ష్యాన్ని అనుసరించి వుండాలి. జీవితానికి పరమావధి ముక్తి, ఆ ముక్తి కొరకు కోరికలను విడనాడవలసిన పనిలేదు. మన సుఖజీవనం కొరకు ధనం సంపాదించుకున్నా నిజము తెలుసుకొని జీవించాలి. అనగా ఈ సంపదకు నేను అధిపతిని, అధికారిని కాను. అన్నింటికీ మూలము ఆ జగత్ప్రభువే అన్న విషయం మనం ఎన్నటికీ మరువకూడదు.

అమ్మ ఒకరికి ఒడిలో చలిమిడి పెడ్తూ "ఈ చలిమిడికే కాదు ఏది వచ్చినా ఒడిపట్టాలని" చెప్పింది. అది ఆ ఒక్కరికే కాక మనందరికీ అన్యాపదేశంగా చెప్పిందనిపించింది. మనము అనుభవించే సంపదలో భగవంతుడున్నాడు. అట్లే దారిద్ర్యంలో కూడా. అందుకే అమ్మ "భాగ్యము

నేనే, దారిద్ర్యము నేనే" అంది. వేదాంతము కూడా మన విద్యుక్త కర్మల నాచరించమనే బోధిస్తున్నది.

మనం ఏ పనిని ఆచరించుచున్నా దాని మీద శ్రద్ధాభక్తులు కలిగి ఉండాలి. "అప్పుచేసి పప్పుకూడు తినమంటాడు చార్వాకుడు". ఉన్న మూడురోజులు భగవంతుని భజించమంటాడు కబీరు. మన లక్ష్యాన్ని బట్టే మన ఆలోచనలు నడుస్తుంటాయి. బాహ్యంలో గాలి, అంతరంలో ప్రాణం. బాహ్యంలో వుండే చెడు భావాలు అంతరంలోకి ప్రవేశించి మన మనస్సులోని భావాలను ఎదుర్కొంటాయి. అలా నిరంతరం సాగుతుండుట వలన బాహ్యంలో నుంచి చెడు మన అంతరంగంలోనికి ప్రవేశించి మన మనస్సును బలహీనపరుస్తుంది. దానితో చెడు ప్రభావం మన మీద ప్రబలమవుతుంది. మనం వాటిని అధిగమించి నేను, నాది అనే సంకుచితత్వం నుంచి మనం, మనది అనే విశ్వశ్రేయస్సును కాంక్షించి దానికి తగినట్లుగా మన ఆలోచనలకు రూపకల్పన చేసుకోవాలి. మనం చేసే ఆలోచనలు, పనులు ఎదుటి వ్యక్తిని స్పందింప చేసేటట్లుగా వుండాలి.

వాసనను తీసుకు వచ్చేది గాలి. అదే విధంగా శబ్దాన్ని కూడా వాయువే తీసుకువస్తుంది. శబ్దకాలుష్యం, దుష్టకర్మలు, దుష్టభావాలు, దుష్ట ప్రవచనాల వల్ల వాతావరణం కలుషితమవుతోంది. వాతావరణాన్ని శుద్ధి చేయటానికి భగవన్నామం చేయాలి. మనోబుద్ధుల్ని శుద్ధి చేసేది భగవన్నామం. వ్యక్తిలోని దుష్టభావాలను, వాతావరణంలోని కాలుష్యాన్ని భగవన్నామం పోగొడుతుంది. మనందరం సర్వాత్మనాభావాన్ని అలవరుచుకోవాలి. నూతన ప్రక్రియలను అనుసరించాలి. మన జీవిత లక్ష్యం, గమ్యం భగవంతుని సన్నిధే అన్న విషయం మరువరాదు. సమాజం ఒక ప్రక్క కలుషితమవుతున్నా మనసా, వాచా, కర్మణా మనం వాతావరణాన్ని శుద్ధి చేయటానికే సంసిద్ధులం కావాలి.

తోలు నోరు కాదు కనుక తాలుమాట లేదు.

"మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయః
దుర్లభంత్రయమే వైతత్ దైవానుగ్రహహేతుకం॥"

మనుష్యుడుగా పుట్టటం, పుట్టినవాడికి మోక్షమందే ఆసక్తి కలగటం,ఆ కోర్కెను నెరవేర్చుకోవడానికి మహాపురుషులను ఆశ్రయించటం ఈ మూడు దుర్లభమని శంకరభగత్పాదుల వాక్కు. కాని మన అదృష్టవశాత్తూ 'అమ్మ' ఆశ్రయం మనకు దొరకటం, తద్వారా మనలో ఆధ్యాత్మిక చింతన, సమభావం, కలిగి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి దారి తీయటం మన పూర్వజన్మ సుకృతమే కాని వేరొకటి కాదనిపిస్తుంది. త్రికరణ శుద్ధిగా అమ్మను నమ్మినవారికి కొంగుబంగారమే కాని, జీవితంలో దేనికి, తిరిగి చూచుకోవలసిన అవసరం కాని, వెతుక్కోవలసిన పని కాని లేదు. ఈ విషయం అమ్మ పిల్లలందరికీ అనుభవైక వేద్యమే.

"ప్రధమం సగుణ మాశ్రిత్యతతో నిర్గుణ మాశ్రయేత్" అని శంకరులు సగుణోపాసనచేతనిర్గుణబ్రహ్మను గుర్తించాలని వివరించారు. మన ఎదురుగా వున్న పరబ్రహ్మయైన అమ్మను గుర్తించక ఎక్కడో వున్న పరబ్రహ్మకోసం అర్రులు చాచటం అవివేకం. సహజంగా అమ్మ వల్ల ఆకర్షింపబడి, పరిణతి చెందుతూ అంతరంతరాలలో ఎక్కడో తాకుతూ పరవశింపచేస్తే మాధుర్యాన్ని మాటలతో వర్ణించలేము. అమ్మ దగ్గరకు ఎందుకు వెళ్ళామో, ఎందుకు ఆకర్షింపబడుతున్నామో, ఎందుకు పూజ చేస్తున్నామో కూడా అనూహ్యంగా వుంటుంది. అలా చేస్తుంటే ఎంతో తృప్తిగా, హాయిగా, తెలిసినకొద్దీ తెలుసుకోవలసినది ఇంకా వున్నట్లు తోస్తుంది. ఆ మనోహరత జీవితాన్ని వెలిగించేదిగా పూర్ణతను ఆపాదించేదిగా వుంటుంది. అదే మన జీవితాశయం నెరవేరేటట్లుగా చేస్తుంది.

అసలయిన అమ్మకు యెవరిని చూచినా తన బిడ్డేననిపిస్తుంది.

కామితార్థ ప్రదాయిని

'శ్రీ' అనే అక్షరం పరబ్రహ్మ సూచకమయిన ఓంకారానికి ప్రతిరూపము. సర్వసంగపరిత్యాగులైన యతీశ్వరులకు ఓంకారం ఎలాంటిదో, శ్రీ విద్యాతత్పరులకు శ్రీకారం అలాంటిది. 'శ్రీ' అనే అక్షరంలో 'శ'కారం ఆనందవాచకం, 'రేఫ' తేజోవాచకం. 'ఈ' కారం సర్వవ్యాపకమయిన శక్తివాచకం. శ్రీ అంటే తేజోమయానంద పరబ్రహ్మస్వరూపం. శ్రీకారంలోని శవర్ణరేఫ ఈకారములు సత్వరజస్తమోగుణములు. త్రిగుణాలకు అధి దేవతగా వున్న శ్రీమాత త్రిపురసుందరి. ఆమెయే జిల్లెళ్ళమూడి అమ్మ.

వేదములనే లతకు పక్వమైన ఫలం అమ్మ. ఆ పక్వఫలాన్ని ఒక్కమారు ఆస్వాదించే అదృష్టం కలిగితే మరొక పండును రుచి చూడాలన్న కాంక్ష కలగదు. అలాంటి సర్వబంధ విముక్తిని కల్పించి శాశ్వతానందాన్ని అందించే అధిష్ఠాన స్వరూపిణి శ్రీమాత. అట్టి అధిష్ఠాన దేవతే జిల్లెళ్ళమూడిలో వెలసిన మాతృశ్రీ అనసూయాదేవి. ఆవిడే జిల్లెళ్ళమూడి అమ్మగా లోకప్రసిద్ధి గాంచినది. అమ్మ శరీరధారణ చేసిన కాలంలో మనం జీవించి వుండటానికి మన పూర్వజన్మ సుకృతమే కారణం. శ్రీమాత అయిన మన అమ్మ మనలందరినీ లలితామూర్తులుగా చేయటానికే లలితాకోటి నామపారాయణ చేయించింది. దేవికి వున్న అన్ని నామాలలో లలిత అన్న నామమే ప్రశస్త్యమయినది. అనంతమయిన నామవైభవం గల పరాశక్తి లలిత. లోకాలన్నింటినీ అతిక్రమించిన లాలిత్యం, లావణ్యం గలది లలిత.

అమ్మ నామాలలో శ్రీమాత, శ్రీ మహారాజ్ఞి, శ్రీమత్ సింహాసనేశ్వరి అనే మూడు నామాలు పరాశక్తి యొక్క సృష్టి, స్థితి, సంహారతత్వాలను ప్రతిపాదిస్తున్నాయి. సదసదాత్మకమైన ఈ జగత్తును పరాశక్తి తన

భారం వహించే శక్తి యెక్కడున్నదో అక్కడే మాతృత్వం.

త్రిగుణాత్మకమైన శక్తితో సృష్టించి, పోషించి, లయం చేస్తోంది. చివరకు తనకు తానుగా సచ్చిదానందస్వరూపిణిగా ప్రకాశిస్తుంటుంది. సమస్త విశ్వానికి తల్లి అయిన శ్రీమాతను మహావిష్ణువు ప్రార్థించే ఘటం దేవి భాగవతంలో గోచరిస్తుంది. లలిత అన్న నామం లలితా సహస్ర నామాల్లో చివరినామం. మిగిలిన నామాలన్నీ విశేషణాలు. ఇలాంటి విశేషణాలకు విశేష్యమయిన పరాశక్తి లలిత. ఆమె ప్రేమైకమూర్తి. వాత్సల్యామృతవర్షిణి, అవ్యాజ కరుణామయి.

మాతృప్రేమను మించిన ప్రేమ లోకంలో ఎక్కడా వుండదు. అందుకే మాతృమూర్తి అమృతమయమయిన ప్రేమతత్వం నిండిన పరాశక్తి లలిత. ఆమె రూపమే జిల్లెళ్ళమూడిలో అనసూయాదేవిగా ఆవిర్భవించి తన దగ్గరకు వచ్చిన వారిని దృష్టి, స్పర్శల ద్వారా, తన దగ్గరకు రాలేని వారిని తన సంకల్పాల ద్వారా లాలించిన లాలిత్యమూర్తి అమ్మ. కారుణ్యం చూపిన కరుణాసింధువు అమ్మ. దృష్టి, స్పర్శ, భావరూపేణా తన వాత్సల్యాన్ని కురిపించిన వాత్సల్యామృత వర్షిణి అమ్మ. అన్నపూర్ణలా తన దగ్గరకు వచ్చిన వారి క్షుద్బాధను తీర్చుటేకాక, అన్నంతో పాటు ఆధ్యాత్మికతను పంచింది. అన్నపూర్ణాలయ ప్రసాదంతో పాటు బట్టలు పెట్టింది. మాకు ఎందుకు పెడ్తున్నావమ్మా అంటే "మీకు పెట్టుకుంటే నాకు తృప్తి, మీకు నేర్పటానికి అన్నది. ఇంత అన్నదానం ఎలా చేస్తున్నావమ్మా అంటే ఇది అన్నదానం కాదు నాన్నా, ఎవరి అన్నం ఇక్కడ వుంటే వాడు తింటున్నాడు లేనివాడు వాడు వచ్చినా తినలేడు, "అని అన్నది. అన్నపూర్ణాలయంలో అన్నం తినటానికి ఆకలే అర్హత అన్నది. అక్కడ డ్రస్సుని బట్టి, అడ్రస్సుని బట్టి పెట్టడం వుండదంది.

మన కన్నతల్లులు మనకు వచ్చిన వ్యాధిని నయం చేయించకలరేమో కాని మన మనస్సుకు సంబంధించినది 'ఆధి' ని పోగొట్టలేరు. ఆధిని పోగొట్ట

యమదూతలు అమ్మ దూతలు కాకపోతే కదా.

గలిగే శక్తి పరాశక్తి అయిన అమ్మకే కలదు. అందుకే మన మనస్సును నమస్సుగా మార్చి శాశ్వతానందస్థితిని కలిగించేది కనుకనే శ్రీమాత అయ్యింది.

ఆధి దైవిక, ఆధి భౌతిక, ఆధి మానసిక కష్టాల కారణంగా మనం ప్రశాంతతను పొందలేక బాధలను అనుభవిస్తాం. అన్ని బాధలకు, దుఃఖాలకు అతీతమయిన స్థితిని అందుకొనుటకై చేసే పోరాటమే ఆధ్యాత్మికసాధన. అట్టి స్థితిని మన కందించుటకై అమ్మ మనచేత 1979 నవంబరు 11న లలితా కోటిపారాయణ చేయించింది. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ అనేక వేల గృహాలలో లలితా నామపారాయణ అవిచ్ఛిన్నంగా జరుగుతూనే వుంది.

లలితానామపారాయణ ఫలితాన్ని కూడా అనేక వేల గృహాలలో మనం ప్రత్యక్షంగా చూడగల్గుతున్నాం. అమ్మ రుధిరోద్గారి చైత్రశుద్ధ ఏకాదశిన జన్మించింది. చైత్రశుద్ధ ఏకాదశి కామితాలను తీర్చేటువంటిది. అట్టి శుభసమయంలో అమ్మ మన కోరికలను తీర్చుటకై జన్మించింది. భౌతికంగా అమ్మ మన మధ్య వున్నప్పటి కంటే విశ్వవ్యాపిని అయిన తరువాత మన కోరికలను నెరవేర్చే కల్పతరువు అయ్యింది. లాలిత్యం, సౌందర్యం, మాతృప్రేమ మొదలైనవన్నీ దైవీగుణాలు. అట్టి దైవీగుణసంపదలతో కూడి మన కామితార్థములను తీర్చుటకై అవతరించిన అమ్మకు కైవోడ్పులు సమర్పిస్తున్నాను.

(విశాఖ మాతృశ్రీ అధ్యయన పరిషత్ వార్షికోత్సవములో ఉపన్యసించినది)

భగవత్సాక్షాత్కారం

ఆధునిక విజ్ఞానం మూలంగా, హేతువాదం మూలంగా భగవంతుని ఉనికి గురించి కొందరికి సంశయం కలుగుతుంది. కాని కొంతమందికి ఇంద్రియగోచరం కానంత మాత్రాన ఇంద్రియాలకు అతీతంగా వుండే సత్యం

ఇక్కడ కమిట్‌మెంట్ కావడమే కానీ, కమిటీలు లేవు.

ఒకటి వుండదనరాదు. భగవంతుడు అనుభవైక వేద్యుడే కాని బోధింప శక్యుడుకాదు. ఇట్టి విషమపరిస్థితులలోనే "సంభవామి యుగే యుగే" అని శ్రీ కృష్ణుడు చెప్పినట్లుగా, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మహాత్ములు అవతరించి జాతిని సక్రమమార్గాన నడుపుతుంటారు. ఆ కోవకు చెందిన వారే శ్రీ కుసుమహరనాథులు, రామకృష్ణపరమహంస, రమణమహర్షి, అరవిందులు, అమ్మ మున్నగువారు. ఇట్టి అవతారమూర్తుల బోధనల వల్ల మనలో వున్న అహంకారం వల్ల ఉద్భవించే సందేహాలకు తావులేకుండా పోతున్నది. పగటిపూట మనం నక్షత్రాలను చూడలేము. అంత మాత్రాన ఆకాశంలో పగటిపూట నక్షత్రాలు లేవని కాదు కదా! అదే విధంగా దైవం మానవ చక్షువులకు గోచరించనంత మాత్రాన లేదా మానవులు అజ్ఞానం చేత దైవాన్ని తెలుసుకోలేకపోయినా దైవం లేదని అర్థం కాదు.

ఆధ్యాత్మిక జీవనాన్ని సాగించటానికి ముందుగా భగవంతునిపై దృఢంగా నమ్మకం ఏర్పరచుకోవాలి. అందుకే అమ్మ "నమ్మకమే దైవం" అంటుంది. భగవన్నామం లోపల, బయట పవిత్రం చేస్తుంది. దైవసాక్షాత్కారంకు కావలసిన యోగ్యతలలో ముఖ్యమైనది పవిత్రత. అందుకే ఏసుక్రీస్తు "హృదయం పవిత్రంగా ఉన్నవారు ధన్యులు. ఏలననగా వారు దైవమును గాంతురు" అని చెప్పాడు. ప్రపంచం అనే సరోవరంలో భగవంతుడనే చేప దొరకాలంటే నామం అనే వల కావాలి. ఎవరైతే ఆర్తితో, భక్తితో నామం చేస్తారో భగవంతుడు వారి దగ్గరే వుంటాడు. అందుకే లక్ష్మణుడు రాముని దగ్గర వున్నాడు. రాముడ్ని భరతుడు దగ్గర వుంచుకున్నాడంటారు. ముందు గోప్యంగా వుండి తరువాత అభివ్యక్తం అయ్యేది దైవం.

భగవంతుని అస్తిత్వాన్ని గురించిన ఋజువు భగవత్సాక్షాత్కారం ద్వారా పూర్వం లభించేది. కానీ ఆ భగవంతుడే మనకొరకు మానవ రూపంలో

తృప్తే ముక్తి, ఇంతకన్నా మరొకటి లేదనే స్థితి.

భగవతిగా అవతరించాడు. ఆ భగవతియే మన అమ్మ. అమ్మ భౌతికంగా మనకు దూరమైనా సర్వవ్యాపినియై యున్నది. అట్టి అమ్మ సాక్షాత్కారం కావాలంటే దృఢమైన నమ్మకం, దీక్ష కావాలి. సముద్రం అడుగున అతి విలువైన ఆణిముత్యాలుంటాయి. వాటి కోసం ఒక్కమారు మునక వేసినంత మాత్రాన దొరకవు. అవి దొరికేంత వరకూ, ఆ అగాధ జలధిలో అనేక పర్యాయాలు అన్వేషించాలి. అట్లే భగవత్ సాక్షాత్కారం కొరకు ఎంతో పట్టుదల దృఢమైన నమ్మకంతో శ్రమించాలి. నీటిలో ఈదాలంటే ముందుగా కష్టపడి ఈత నేర్చుకోవాలి అదే విధంగా దైవ సాక్షాత్కారానికి నిర్మలమైన మనస్సుతో పరితపించాలి.

చమురు లేనిదే దీపం వెలగనట్లే, దైవం లేనిదే మానవుడు మానవునిగా మనలేడు. ఒకటి అంకె వుంటే దానిప్రక్కన ఎన్ని సున్నాలయినా చేర్చి విలువ పెంచవచ్చును కానీ ఆ ఒక్కటే లేకపోతే మిగిలిన సున్నాలు ఎన్ని ఉన్నా వాటికి విలువ వుండదు. అట్లే దైవాన్ని అంటి పెట్టుకున్న వానికే విలువ సమకూరుతుంది. మానవునిగా జన్మించినందుకు సార్ధకత ఏర్పడుతుంది. అదే ముక్తికి సోపానమవుతుంది. రామకృష్ణ పరమహంస అన్నట్లుగా 'మానవసేవే మాధవసేవ' అన్న మహావాక్యానికి అనుగుణంగా మానవ సేవాకార్యక్రమాన్ని భగవదారాధనగా భావించాలి. అందుకే అమ్మ "వైద్యోనారాయణోహరిః" అన్నదే కాదు "రోగి వైద్యునకు నారాయణ స్వరూపుడే" అంది. సంసార తాపత్రయాలలో పడి భగవంతుని ధ్యానించ లేకపోతున్నామమ్మా అంటే "మీ పిల్లలకు స్నానం చేయిస్తూ భగవంతునికి అభిషేకం చేస్తున్నామని, అన్నం పెడ్తూ ఆ భగవంతునికే నివేదన చేస్తున్నామనుకోండి" అని అంది. కాబట్టి భగవంతుని అర్చిస్తున్నామన్న భావనతో మానవసేవ చేస్తే, ఆ సేవ అంతా భగవత్ సాక్షాత్కారానికి దారి తీయగలదు. ఈ ప్రకారం చేయటం

నేను నిండు గృహిణిని, నాకు బ్రహ్మచర్యమంటే ఏమిటో తెలియదు.

వలన ఒక ప్రక్క తాను ముక్తి పొందేటందుకు, వేరొక పక్క ప్రాపంచిక బాధల నుండి బయటపడి నిరంతర సుఖాన్ని పొందేటందుకు ఉపయోగపడ్తుంది.

గాలిలేని చోట పెట్టిన దీపం లాగా మన మనస్సు నిరంతరం, నిశ్చలంగా భగవంతుని ధ్యానిస్తూ వుండాలి. మనము ఏపని చేస్తున్నా, మన మనస్సు భగవంతునిపైనే వుండేటట్లు అభ్యాసం చేసుకోవాలి. మనము ఏ పరమాత్మనైతే ధ్యానిస్తున్నామో ఆ పరమాత్మయైన అమ్మ విశ్వవ్యాప్తినియై వున్నది. మానవరూపంలో ఉన్న మాధవుని అర్చించటంలో విశ్వవ్యాప్తమైన అమ్మను విస్మరించలేము. మన మనస్సులో ఇతర ఆలోచనలకు తావివ్వకుండా భగవంతుని గురించే నిరంతరం ఆలోచనలు సాగాలి.

అన్ని మతాలకు ఒకటే గమ్యం. కాబట్టి ఏ మతాన్ని అవలంబించినా గమ్యానికి చేరుతాము. ఒక మతం కంటే మరియొక మతం గొప్పదని పలుకుట తెలివి తక్కువ. అందుకే అమ్మ "ఆచరించే వాడికి ఏ మతమైనా ఒక్కటే, ఎవరి మతాను సారం వారిని అర్చించుకోమని, సర్వసమ్మతమే తన మతమని" వాక్కాణించింది.

దైవారాధనలో మునిగి పోవటమంటే మన గృహస్థ ధర్మాలను విస్మరించి సన్యసించవలసిన పనిలేదు. అమ్మ తాను గృహిణిగా వుంటూ విశ్వాన్ని తన సంసారంగా చేసికొని విశ్వకుటుంబినియై విలసిల్లినది. "సన్యసించటమంటే కోట వెలుపల వుండి యుద్ధం చేయటమని, సంసారం అంటే కోటలోపల వుండి యుద్ధం చేయటమని" ప్రస్ఫుటం చేసింది. అమ్మా! మీకు పెళ్ళితో పనియేమిటి అని అడిగితే "పెళ్ళిలో పెద్దపులి వుందని భయపడే నీలాంటి వారి భయం పోగొట్టడానికి నాన్నా" అని అంది.

స్వామి వివేకానంద అన్నట్లుగా "మొదట నీమీద నీకు విశ్వాసం

సంకల్పం రావడానికి కారణం ప్రేరణ, సంకల్పం వచ్చిన తర్వాత చేసేది ప్రయత్నం, ప్రేరణే దైవం.

కలిగించుకో, తరువాత భగవంతుని మీద విశ్వాసం అదే కలుగుతుంది." త్రికరణ శుద్ధిగా మోక్షప్రాప్తికి, దైవదర్శనానికి ప్రయత్నించాలి. పరితపించాలి. అట్టి ప్రయత్నం చేసినప్పుడు దివ్యానుభూతులు ఎవరికి వారే పొందగల్గుతారు. ఆ దివ్యానుభూతి, ఆ అనురక్తి మనకు మిగిలి చివరంటా భగవంతుని సేవలో తాదాత్మ్యం చెందాలి. అప్పుడే మోక్షప్రాప్తి, భగవత్ సాక్షాత్కారాన్ని పొందగల్గుతాము.

అవ్యాజకరుణామయి

ప్రతివారు జీవితంలో ఎప్పుడో అప్పుడు ఏవో సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. వాటిలో కొన్ని సహించగలవి, మరికొన్ని సహించలేనివి. సహించలేని సమస్యల వల్ల ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి నిస్సహాయతకు లోనవుతారు. అట్టి పరిస్థితులలో వారి వారి అర్హతను బట్టి, భగవదనుగ్రహాన్ని బట్టి, మహానుభావుల చేయూత లభిస్తుంది. తెలివైనవాడు దానినుపయోగించుకొని తన సమస్యలను పరిష్కరించుకుంటాడు. కొంతమంది, మహానుభావుల అనుగ్రహం కొరకు నిరీక్షించలేక, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, సాహసం లేక అధోగతి పాలవుతుంటారు. భౌతికంగా అమ్మ మన మధ్య ఉన్నప్పుడు కూడ ఏ విషయమైనా అడిగితే 'నాకేం తెలియదు నాన్నా నేనూ మీలాంటి దాన్నే" అంటూ ప్రసాదం ఇచ్చేది. మనం అర్థం కాక అమ్మ వంక చూస్తే "మాటలతో పని యేముంది" అనేది అంటే మనకు కావలసినది క్రియ కాని, మాటలు కావు గదా! అలాగే భౌతికంగా అమ్మ మనకు దూరమైనా, మన వెన్నంటే వుండి, మనకు అన్ని వేళలా, అన్ని విధాలా సాయపడ్తున్నది. ఇది నా ఒక్కదాని అభిప్రాయమే కాదు. అనేక మందికి అమ్మ ఇచ్చే అనుభవాల సారమే.

ఆయా తరుణాల్లో ఆయా పనులు చేయించటమే కరుణ అని అమ్మ

నాజీవితచరిత్ర పండితుడైన పామరుడు వ్రాయుడు. పామరుడైన పండితుడు వ్రాస్తాడు.

అంటుంది. అమ్మ కరుణ ఏ రకంగా ప్రసారమవుతుందో మనం చెప్పలేము కదా! అట్టి అమ్మ కరుణకు నిదర్శనమే ఈ వ్యాసం.

శరభలింగం గారు ఇల్లు కట్టించాలనుకున్న తరువాత అనేక ఆటంకాలు ఎదురైనవి. చేతిలో డబ్బు వుండి శెలవు పెట్టుకొని ఎలాగైనా ఇల్లు కట్టించాలని తాపత్రయ పడ్తుంటే ఏ పనీ సక్రమంగా జరుగక అనుకున్న దాని కంటే చాలా ఆలస్యమవుతున్నది. ఈ రకంగా ఎందుకు జరుగుతుందో అని మధనపడ్తుంటే ఆయన ఎంతగానో అభిమానించే వారి అత్తయ్య, మామయ్య కల్లో కనిపించి "సుందరాకాండ పారాయణ చేస్తే అన్ని ఆటంకాలు తీరుతాయని" చెప్పారుట జగన్మాతయైన మన అమ్మ పార్వతీ పరమేశ్వరులుగా తాను అభిమానించే వ్యక్తుల ద్వారా తనకు దోవ చూపించిందని అనుకున్నారు. సుందరాకాండ పారాయణ ఏవిధంగా చేయాలో కూడా తెలియదుట. నవంబరు 30వ తారీఖు తెల్లవారు ఝామున మొదలు పెట్టి ఉదయం 8.30 నిముషాల వరకు 34 సర్గలు, మధ్యాహ్నాము 17 సర్గలు, రాత్రి 17 సర్గలు, మొత్తం 68 సర్గలు అమ్మను తలుచుకొని ఒక్క రోజులోనే పూర్తి చేసి అమ్మకే సమర్పించారు.

ఆ తరువాత ఎట్టి ఆటంకం లేక ఇంటిపని చురుకుగా సాగుతోంది. డిసెంబరు 20 వ తారీఖు శ్లాబ్ వేయాలని నిశ్చయించుకొన్నారు. తీరా శ్లాబ్ వేయటానికి కావల్సిన సిమెంట్ రానందున ముందు అనుకున్న విధంగా శ్లాబ్ వేయటం జరగదనుకున్నారు. ఎలాగూ శ్లాబ్ పని లేదు కదా అని ఆఫీసు పని మీద 19 వ తారీఖు హైద్రాబాద్ వెళ్ళారు. అక్కడ వాళ్ళకు తెల్సిన వారింటికి వెళ్ళగా "శరభలింగంగారిని చూచి ఒకామె పకపకా నవ్వటం మొదలుపెట్టింది. ఎప్పుడూ లేనిది ఏమిటి ఈవిడ ఇంతగా నవ్వుతోందనుకుంటుండగా 'ఏరా నన్ను పోల్చుకోలేదా' అంటే అమ్మను పోల్చుకోకపోవటమేమిటని అన్నారు.

అవసరం అన్నింటికంటే విలువైనది.

గుడి కట్టించాలని అనుకున్నావు కట్టేశావు కదా! ఇల్లు కడదామనుకున్నావు శ్లాబ్ వేశావు కదా? అంటే ఇంకా శ్లాబ్ వేయలేదమ్మా అని అన్నారు. శ్లాబ్ పూర్తి అవుతోందని, పైగా పూర్వం జిల్లెళ్ళమూడి అమ్మకు, ఆయనకు మధ్య జరిగిన విషయాల గురించి కూడా చెప్పారు. విషయాలు విన్న ఆయన నోట మాట రాక అవాక్కు అయితే "ఏం నాన్నా ఈ మధ్య జిల్లెళ్ళమూడి రావటం లేదేమని" అడిగారు, శుక్రవారం వైజాగ్ వచ్చే వరకూ శ్లాబ్ అయిన సంగతి ఆయనకు తెలియదు. కానీ సోమవారం నాటికే అనగా శ్లాబ్ పూర్తయిన రోజునే హైద్రాబాద్‌లో అమ్మ తెలియచేసింది. హైద్రాబాద్‌లో అమ్మ చెప్పినప్పుడు అంతగా నమ్మకమనిపించక పోయినా వైజాగ్ వచ్చాక తెల్సిన సంగతులతో అమ్మ యొక్క అవ్యాజ కరుణకు ఆశ్చర్యచకితులైనారు.

మనలోని ఆర్తిని, ఆవేదనను తీర్చటం కొరకు అమ్మ ఇతరులను పనిముట్టుగా వాడుకోవటం అలవాటే కదా! అందుకే ఆయన "అమ్మే నాకు ఆవిధంగా తెలియచేసి, నా ఆవేదనను దూరం చేసిందని" అన్నారు. ఆయన దృష్టిలో వారు ఇల్లు మొదలు పెట్టినప్పటి నుంచీ ప్రతి చిన్న విషయంలో కూడా అమ్మ అమృతహస్తం వున్నదని, ప్రతి నిముషం తనకు అండగా వుండి తమ ఇల్లు 'అమ్మే' కట్టించిందని అన్నారు. ఒక్క శ్లాబ్ విషయంలోనే కాక ప్రతి విషయంలో ఎంతగానో అమ్మ తోడ్పడ్డదని చెప్పారు.

అమ్మ యొక్క అవ్యాజ కరుణాంభోనిధిలో తలమునకలౌతాము. అమ్మను గురించి అనుంగు సోదరులతో మన అనుభవాలు పంచుకుంటూ హాయిగా జీవన సరళిని సాగించుదాము.

అమ్మ సాన్నిధ్యం

ఉన్నతమైన ఆశయానికి జీవితాన్ని అంకితం చేసి సమాజంలోని అన్ని

రూపం లేనిది రూపం ధరించడం సృష్టి.

తరగతుల వారిని సమ్మోహపరిచే మహానుభావులు అరుదుగా వుంటారు. సమాజంలోని అట్టడుగు నుంచి, అందరినీ తన జీవితంలో ఏ తేడా లేకుండా 'అమ్మ' సమ్మోహ పరిచిందనటానికి దేశ విదేశాలలోని అమ్మ అనుంగు బిడ్డలే దానికి తార్కాణము.

మామూలుగా సన్నిహితులకు, అన్నదమ్ములకు జీవితభాగస్వాముల మధ్యే సరసమైన అవగాహన, సమన్వయం కనిపించదు. దొంగలు-దొరలు, భోగులు-యోగులు, అందరూ అమ్మ నీడన తలదాచుకున్న వారే. శ్రీరాముని సేతు బంధనంలో, లోకకంటకుడైన రావణుని సంహరించటంలో నరవానరులకు ప్రవేశం వున్నట్లే అమ్మ కావించబూనిన సమసమాజ నిర్మాణంలో మనందరం భాగస్వాములమే.

"నేను శరీరంతో ఉన్నప్పటి కన్నా, విశ్వవ్యాప్తమైనప్పుడే మీకు ఎక్కువగా ఉపయోగపడతానని" అమ్మ హామీ ఇచ్చింది. అమ్మ మహిమలు అంటూ ప్రత్యేకించి ఏమీ చేయదు కానీ మనమటుకు మనకే మహిమలుగా తోచేవి. ఎన్నెన్నో, ఎందరెందరికో భౌతిక దేహానంతరం చేస్తున్నది. కాబట్టే మనకు ఏది జరిగినా అమ్మ మహిమే అనిపించటంలో అతిశయోక్తి లేదు.

అమ్మ శరీరం త్యజించిన తదనంతరం అమ్మ కళ్యాణ దిన మహోత్సవం ఎంతో వేడుకగా, కన్నుల పండువుగా జరుగుతోందని విని 1988 మే 5కు జిల్లెళ్ళమూడి వెళ్ళాలని తహతహ చెందాను. వైజాగ్‌లో బయలు దేరుతుంటే ఎప్పుడు వస్తావమ్మా అంటే ఇది వరకు అయితే అమ్మ ఆజ్ఞ అయితే కాని వచ్చే వాళ్ళము కాము. ఇప్పుడేముంది మన ఇష్టం వచ్చినప్పుడు వచ్చేయటమే కదా, అని అన్నాను. సర్వవ్యాప్తిని అయిన అమ్మకు తెలియంది ఏముంది. మానవ మాత్రులమైన మనం అమ్మ తన దైవత్వాన్ని మనకు ఎంత విశద

ప్రపంచమూ, పరమార్థమూ వేరుకాదు.

పరుస్తున్నా మాయచే కప్పబడి పోయి అజ్ఞానులమవుతాము. ఆవిడ కరుణే ఆ మాయ తెరను విడగొట్టటానికి ఉపయోగపడుతుంది.

వైజాగ్‌లో 3 వ తా॥ బయలుదేరి గుంటూరు వెళ్ళి ఒక్క రోజు వుండి 5 వ తా॥ ఉదయానికి జిల్లెళ్ళమూడి చేరాలన్నది నా ఉద్దేశ్యం. తీరా గుంటూరులో బయలుదేరటమే ఆలస్యమయి 5 వ తా॥ అమ్మ కళ్యాణం అయిపోయి చదివింపుల సమయానికి చేరాను, నా ప్రాప్తం ఇంతే కాబోలుననుకొని నన్ను నేనే సమాధానపరుచుకున్నాను. ఎలాగూ కళ్యాణం చూడనే లేదు, వచ్చాను కదా అని అనసూయేశ్వరాలయంలో, హైమాలయంలో అభిషేకాలు, పూజలు చేసుకొని వెడ్దామనుకున్నాను.

అనసూయేశ్వరాలయంలో, హైమాలయంలో పూజలు, అభిషేకాలు చేసుకొని సంధ్యావందనం, సుప్రభాతాలలో పాలుపంచుకొన్నాను. 3 వ రోజు బయలుదేరుదామని అనుకున్నాను. ఆ తెల్లవారుఝామున అమ్మకు స్నానం చేయిస్తుండగా మూడు రోజులుండరాదా! అని అమ్మ అన్నట్లుగా తోచింది. స్నానం చేయిస్తుండగా రక్తమాంసాదులతో కూడిన శరీరమే అనిపించింది కాని శిలాకృతిలా తోచనే లేదు, చాలా హాయిగా అనిపించింది. అమ్మ శరీర ధారణ చేసినప్పుడు, అమ్మ కాళ్ళు పిసుకుతున్నప్పుడు ఎలా వుండేదో ఆ విగ్రహానికి స్నానం చేయించినప్పుడు అలాగే అనిపించింది. ఎందుకు తోచిందో 3 రోజులు పూర్తిగా వుండి వెడ్దామని ఈలోగా వూరికే వుండటమెందుకని హైమాలయ, అనసూయేశ్వరాలయంలో ప్రదక్షిణాలు చేసి అఖండనామ యజ్ఞంలో కొంతసేపు పాలుపంచుకున్నాను. ఆదివారం 10.30 గంటలకు గుంటూరుకు డైరెక్టు బస్సు వుందంటే దానిలో వెళ్దామని, ఆలోగా టి.వి.లో రామాయణ చూస్తూ కూర్చున్నాను. 10.30 ని॥లకు అన్న బస్సు 10 గం॥లకు వచ్చి వెళ్ళిపోవటం

శరీరము ఆత్మ కాకపోలేదు.

జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట వ్యాన్‌కు బయలుదేరి వెళ్దామనుకున్నాను. సరిగ్గా జిల్లెళ్ళమూడి గడ్డ మీద అమ్మ తోపించినట్లు పూర్తి గంటలు, నిమిషాలతో సహా మూడు రోజులున్నాను.

మొదట బయలు దేరేటప్పుడు ఒకరోజు లేదా ఇంకొకరోజు వుందామనుకున్నాను. కానీ అమ్మ ఆదేశించినట్లుగా పూర్తిగా మూడు రోజులుండటము నా దృష్టిలో మహిమే. స్థూలదృష్టికి అమ్మ కనిపించకపోయినా సూక్ష్మ దృష్టికి అమ్మ విశ్వవ్యాప్తమై వున్నదనటానికి ఇంతకంటే నిదర్శనమేమున్నది. అమ్మ బిడ్డలమైన మనందరం ఆత్మబంధువులమే. కాబట్టి మీరు, మేము అను బేధాలను విడనాడి అందరం సమైక్యమై అమ్మ సూక్తులను లోకానికి చాటి, సమసమాజ నిర్మాణానికి మనవంతు కర్తవ్యాన్ని మనం నిర్వహించాలి.

పదహారు ఫలాలనోము

అవతారమూర్తియైన అమ్మ సన్నిధిని మనం గడపగల్గటం నిజంగా మనపూర్వజన్మ సుకృతమే. అమ్మను గూర్చిన ఆలోచన వస్తేనే మనస్సుకు ఆహ్లాదంగా వుంటుంది. ఆ ఆలోచన మనసును మనకు తెలియని లోకాలకు తీసుకు వెడ్తుంది ఆ ఆహ్లాదాన్ని అందరితో పంచుకోవటం కోసమే ఈ ప్రయత్నం.

1981లో అమ్మ జన్మదిన శుభసందర్భంగా జిల్లెళ్ళమూడిలో నాలుగు రోజులుండి వద్దామని వెళ్ళాను. శ్రీరామనవమినాడు హైమాలయంలో పూజ చేసుకుందామని వెడితే కర్పూరం నిండుకున్నందున స్టోరులో తీసుకు రావటానికి వెళ్ళాను. స్టోరులో గుమ్మడిపళ్లు చూసాను. (అంతకు ముందు వైజాగ్‌లో గుమ్మడిపళ్ళు పదహారు ఫలాల నోము చేసుకుందామనుకుంటే ఇక్కడ ఎందుకు? జిల్లెళ్ళమూడిలో అమ్మకే చేసుకుంటే ఆ పళ్ళు అన్నపూర్ణాలయంలో

జగత్సత్యం, బ్రహ్మామిధ్య.

వినియోగపడతాయి కదా! అని ఆయన అన్నారు) ఆఫీసులో కనుక్కొని ఆ పండ్ల ఖరీదు చెల్లించి పళ్ళు తీసుకున్నాను. పైకి వెళ్ళి అమ్మతో గుమ్మడి పళ్ళ నోము చేసుకుంటానంటే రేపు చేసుకోమని అమ్మ చెప్పింది. ఆ నోము అమ్మకు చేసుకోగలగటం నాకు అమ్మ ఇచ్చిన సువర్ణావకాశమే.

మర్నాడు గుమ్మడి పళ్ళు కడిగి, పసుపు రాసి, కుంకుమ పెట్టి ముందుగా హైమాలయంలో పూజ చేసుకున్నాను. గుమ్మడి పళ్ళనోముకు చీరె పెట్టమని తన దగ్గర వున్న చీరె ఇచ్చింది అమ్మ. గుమ్మడి పళ్ళు చాలా పెద్దవిగా, బంగారపు వన్నెలో అన్నీ ఒకే రకంగా వున్నాయి. వాటిని రెండో అంతస్తులోకి చేర్చటం ఎలా అని మదనపడ్డాను. హైమాలయంలో పూజ అయిన తరువాత, అఖండ నామం దగ్గర చాలామంది నామం చెప్తుంటే వాళ్ళతో మీరు అమ్మ దర్శనానికి పైకి వెడ్తారు కదా! అప్పుడు తలో పండూ పైకి తెచ్చి పెడ్తారా అని అడిగాను. దానికి వాళ్ళంతా ఎంతో ఆనందంగా అమ్మ నామం చెప్తూ పైకి తీసుకు వెడ్తుంటే, అదేమిటో చూద్దామని అన్నపూర్ణాలయం దగ్గర వున్న వాళ్ళూ వచ్చారు. అమ్మ జన్మదినం కొరకు మేళగాళ్ళు వచ్చారు. వారు మేళం వాయించుకుంటూ పైకి వెడ్తుంటే అనుకోకుండా గుమ్మడిపళ్ళు పట్టుకొని నామం చెప్తూ వారి వెనకాల చాలామంది బయలుదేరటంతో, అదేదో ఒక ఉత్సవంలా వుండటంతో అప్పుడే భోజనానికి కూర్చున్న చాలామంది ఆ వేడుక చూద్దామని పైకి వచ్చారు.

అమ్మకు పూజ చేసుకొని, నివేదన తరువాత తాంబూలం చేతికిస్తే, పక్కనే వున్న రామకృష్ణ అన్నయ్య చేతికిచ్చింది. అందులో బంగారం పండు వుందని అంటే దాన్ని జేబులో వేసుకున్నాడు. వెంటనే అమ్మ అర్చనామూర్తి కాస్తా దక్షిణామూర్తి అయ్యాడని అంటే అక్కడ వున్న వాళ్ళందరం ఒక్కమాటు

మరుపే మరణం, మరణమంటే పరిణామమే.

పన్నీట జలకాలాడామా అనిపించింది. నేను ఒక్కొక్క పండూ అమ్మ చేతిలో పెడ్తుంటే దానిని అమ్మ తీసుకొని అన్నయ్య చేతికిచ్చింది. అప్పుడు నేను పొందిన ఆనందానుభూతిని మాటలతో వర్ణించలేను. సాధారణంగా పళ్ళు బుట్టలో పెడితే ఆ బుట్టమీద అమ్మ చేయి వేస్తుందని తరువాత అక్కయ్య వాళ్ళు చెప్పారు. నా అదృష్టమే అనుకుంటా నా చేతిమీదుగా అన్ని పళ్ళూ అమ్మకు ఇచ్చుకోగల్గటము. పోనీ అమ్మ కూడా నన్ను వారించలేదు. ఒక్కొక్కటీ తాను తీసుకోవటం, నేను ఇస్తుండటం అక్కడ చేరిన వారందరికీ ఎంతో కన్నుల పండుగలా అనిపించిందిట. ఇది అంతా మా అదృష్టం అని వారంతా పొంగిపోయారు.

ఆ సాయంత్రం చీరె కట్టుకొని నన్ను పిలవమని చెప్పి, నాకు చూపించి నీవు పెట్టిన చీరె కట్టుకున్నానని అంటే మురిసిపోవటం నా వంతు అయ్యింది. తన పిల్లలమైన మన ఆనందమే తన ఆనందంగా భావించుకుంటుంది కదా! అందుకే అమ్మ "మీరు తింటే నేను తిన్నట్లే. ఇన్ని నోళ్ళు తింటుండగా నాకు ఆకలేమిటని" అంటుంది. అవతారమూర్తియైన అమ్మ సన్నిధిలో గడపగల్గిన అదృష్టాన్ని తలుచుకుంటూ, అమ్మ దగ్గర మన అనుభూతులను నెమరు వేసుకుంటూ, జీవితాన్ని సాగించటం నాదృష్టిలో ఆధ్యాత్మిక సాధనే. అమ్మ అన్నట్లు "సాధ్యంలోనే సాధన వుంది" అని ఆ సాధనను కూడ మన కోసం సులభతరం చేసింది. నీకు ఎలా చేయాలనిపిస్తే, ఎట్లా వీలుకుదిరితే అట్లా చేయమంది. చేయటం కోసం పద్ధతులు పెట్టారు కాని, ఏవిధంగానైనా చేయగల్గిన వారిని పద్ధతుల పేరుతో, నియమాల పేరుతో చేయటాన్ని మాన్పించటం కాదంది. చావన్నా, కష్టాలన్నా, దుఃఖాలన్నా వున్న భయాన్ని పోగొట్టేది ఆధ్యాత్మికత. అలాంటిది నెత్తి అణుస్తుందన్న భయాన్ని జోడిస్తే సాధనలో ఆధ్యాత్మికత ఏముంటుందని అన్నది.

బ్రహ్మచైతన్యం, సరస్వతి తెలివి.

అందుకనే ఎవరి ఇచ్ఛానుసారం వారిని సాధన చేసుకోమంది. "చేతులు మీవేకాని, చేతలు మీవికావు" అని "ఆచారాలు వేరైనా ఆధ్యాత్మికత ఒక్కటే" అని మనకు సాధన మార్గంలో దారి చూపింది. జీవాత్మను, పరమాత్మతో కలుపు సంధానకర్తే ఆధ్మాత్మికత. మన ధర్మాన్ని మనం ఆచరిస్తున్నప్పుడు ఎప్పుడో ఒకప్పుడు జీవాత్మ పరమాత్మతో కలిసిపోతుంది.

"జయహోమాతాశ్రీ అనసూయా
రాజ రాజేశ్వరి శ్రీ పరాత్పరి"

భావనామాత్ర సంతుష్ట హృదయ

భావనామాత్ర సంతుష్ట హృదయ "భావన చేసినంతనే సంతృప్తి చెందిన హృదయం కలది అమ్మ. లేదా భావన చేసుకున్నంతనే మన హృదయాలకు సంతుష్టి కలిగించేది అమ్మ. అట్టి మన అమ్మను గురించి భావించుకోవటంలో కల ఆనందం మాటలతో వర్ణించలేము. అమ్మ సందర్శనం తరువాత స్మృతి భావనయై, ఆరాధనే యోచనగా మారి భక్తిగా హృదయం గూడు కట్టుకుంటుంది. అప్పుడు ఆ భావనే "ఇంతింతై వటుడింతై" అన్నట్టుగా మారి మన జీవితాలలో ముఖ్య భూమికగా ఏర్పడుతుంది. ఆ భూమికలే ఒక్కొక్కరికి ఒక్కొక్క రకమైన మాధుర్యాన్ని నింపుతూ మన జీవన పథాన్ని విశాలం చేస్తాయి. ఈ విధంగా ఎదిగే వ్యక్తిత్వాల భావ సమైక్యత ఆవరించిన సమాజాన్ని చూస్తుంటే అమ్మ ఏ ఏ లోకాలను ఆక్రమించుకుంటున్నదోననిపిస్తుంది.

విశాఖపట్నం వారందరం కూర్చుని వుండగా శ్రీ ప్రసాదరావుగారు "గ్రహబలం బాగాలేదమ్మా, చాలా అరిష్టాలు జరగనున్నవి. చాలా గడ్డుకాలం. నీ బిడ్డలను నీవే రక్షించుకోవాలి" అన్నారు. "జరగబోయేది ఏమి చెప్పగలం? కాలం కాళ్ళకు సంకెళ్ళు వేసుకుంటుందా" అని అంది. నీవే కాలస్వరూపిణివి,

---

ఎవరికి వున్న అన్నం వారు తింటున్నారు. ఒకరికి యెవరో పెట్టేదేముంది.

నీవు తలుచుకుంటే ఏమైనా చేయగలవు అని అన్నారు. కాలాన్ని అతిక్రమించటం కాని, దాన్ని మార్చటం కాని, ఎవరి తరం కాదని తన విషయంలోనే నిరూపించుకుంటూ ఈ భౌతిక దేహాన్ని విడిచింది.

అమ్మని ఎన్ని మార్లో విశాఖపట్టణం రా అమ్మా అంటే వస్తానని మటుకు అమ్మ చెప్పలేదు. పక్కనే వున్న లక్ష్మీనారాయణ అన్నయ్య, అయ్యవారిని ముందు ప్రార్థించండి అప్పుడు అమ్మగారే వస్తుందని అన్నాడు. అందరం సరదాగానే తీసుకున్నాం. కాల గమనంలో ముందుగానే నాన్నగారు ఆలయ ప్రవేశం చేసారు. ఆ తరువాతే అమ్మ నాన్నగారితో కలసి అనసూయేశ్వరుడై ఆలయ ప్రవేశం చేసింది.

అమ్మను దర్శించిన మనం, జీవితానికి ఒక ఆశయం పెట్టుకొని సాధించటంలో భవిష్యత్‌కు రూపకల్పన చేయటం జరుగుతుంది. ఆ ఆశయ సిద్ధికై మన జీవన విధానాన్ని మల్చుకుంటే, అంతరంగంలో పరవశింప చేసే మాధుర్యాన్ని వర్ణించలేము. ఆ మాధుర్యమే జీవితాన్ని వెలిగించేదిగా, పూర్ణతను, నిండుతనాన్ని ఇచ్చేదిగా వుంటుంది. చంచలమైన మన మనస్సులో ఎక్కడో ఎప్పుడో స్థిరత్వమేర్పడుతుంది. ఆస్థిరత్వం మనలను ఏకాంతంగా, ధ్యానమననాదులకు నెడుతూ, భక్తి పారవశ్యంలో ముంచి దివ్యదర్శనాలతో ఆనంద పరవశుల గావించుతుంది. ఆ భావన నుండి తిరిగి రాబుద్ధి పుట్టదు. రాకపోకడలకు మన ప్రమేయం ఉండదేమోననిపిస్తుంది. అందుకే అమ్మ “నేను కనిపిస్తే మీరు చూస్తారని” అంటుంది.

అమ్మ భౌతిక దేహానంతరం ఎందరికో, ఎన్ని రకాలుగానో, ఎన్నెన్నో అనుభూతులను కలుగచేస్తున్నది. బందరు నుండి శ్రీ ఎస్.ఆర్.వై ప్రసాద్‌గారు అమ్మ ఆయిల్ పెయింటింగ్ పెద్దది ఒకటి మాకు పంపించారు. బస్టాండు

త్రిగుణములు ఉప్పు, పులుపు, కారం.

నుండి ఆటోలో ఇంటికి తీసుకు వచ్చాక దాన్ని దింపటానికి ఎవరైనా సాయం చేస్తారేమోనని చూస్తుంటే రమేష్‌గారని మాకు తెలిసిన ఆయన ఒకరు గబగబా వచ్చి ఫోటోను సాయం పట్టి లోపలకు తెచ్చారు. లోపలికి తెస్తున్నప్పుడులో అమ్మ వారిని ఊరేగింపుకు తీసుకు వెడ్తున్న భావన కల్గింది. అంతమటుకు అమ్మను చూడనైనా లేదు. కనీసం ఫోటో కూడా చూడ లేదు. అమ్మ గురించి తెలిసిందీ చాలా తక్కువ. అమ్మ ఆయనకు అటువంటి భాగ్యాన్ని కలుగచేసింది.

అమ్మ కుంకుమ, ప్రసాదం, ఫోటో అడిగి తీసుకు వెళ్ళారు. అప్పుడు ఆయన చాలా ఇబ్బందుల్లో ఎటూ తేల్చుకోలేని పరిస్థితులలో, మనశ్శాంతి లేక అలమటిస్తున్నారు. అమ్మ ఫోటో పట్టిన తరువాతే తనకు అన్ని విధాలా కల్సివచ్చిందని, రోజు అమ్మ దర్శనం చేసుకొని మరీ వెళ్ళేవారు. కరుణా సముద్ర కదా! అమ్మ ఆయన ప్రమేయం లేకుండానే, ఆయన్ను అనుగ్రహించింది. అప్పటి నుంచీ అమ్మ విషయాలు తెల్సుకుంటూ అమ్మ మీద నమ్మకంతో ఉన్నారు.

మా అబ్బాయి పెండ్లికి ఉయ్యూరు వెడ్తూ మా ఇంట్లో పడుకోమని అడిగాము. ఆ రెండు రోజులు ఆయన, వాళ్ళ బాబు ఎనిమిది ఏళ్ళవాడు పడుకున్నారు. ఆ రాత్రి ఎవరో ఇంట్లో తిరుగుతున్నట్లుగా గజ్జల శబ్దం వినిపించిందిట. అటు చూద్దామంటే తలత్రిప్పలేక పోయారు. కానీ అటు నుంచి వచ్చిన గాలి మలయ మారుతంలా హాయిగా వారికి సోకింది. మర్నాడు ప్రొద్దున్న వాళ్ళ బాబు ఆ విషయమే వారితో అన్నాడు. అప్పటి నుంచి మునుపెన్నడు ఎరగని హాయి, శాంతి, ఆనందం, పరవశం కలిగాయి. ఆ రాత్రే అమ్మ లాకెట్ ఇచ్చినట్లుగా కలవచ్చింది. మేము వూరి నుంచి రాగానే ఆ విషయం చెప్పి అమ్మ లాకెట్స్ వుంటాయా? వుంటే నాకు ఒకటి ఇవ్వండని అడిగారు. దానికి మేము మీరు చాలా అదృష్టవంతులు అమ్మ తనంతటతానుగా

రాయిమీద రాయివేసి కొట్టినా నాదబ్రహ్మే.

మిమ్మల్ని ఎన్నుకొన్నదని, భవిష్యత్తులో మీకు దేనికీ కొరత వుండదని చెప్పాము. అదే విధంగా ఆయన హాయిగా, ప్రశాంతంగా జీవనాన్ని గడుపుతున్నారు. అమ్మ దయతోనే ఇక్కట్ల నుండి బయటపడ్డానని ఆయన ప్రగాఢ విశ్వాసం.

అమ్మను భావించుకున్నంతలో మనకు వచ్చే అనుభూతి మనలోని ఔన్నత్యానికి మార్గదర్శకమై, ఆ ఔన్నత్యమే ధ్యేయం అవుతుంది. అట్టి అనుభూతికి కారణమైన అమ్మ భావన రాగరంజితం కావడం వల్ల మన మనుగడలో చల్లదనమే నిండిపోతుంది. బ్రతుకులోని అలజడి, ఆందోళన, రభస, రగడలకు మనస్సు విరక్తి చెందక, మన ఆలోచనలలో మార్పు రావటం జరుగుతుంది. దానివల్ల మనకు స్థిమితం, శాంతి, తృప్తి కలగడమే కాక మనస్సు ఏకాగ్రత చెందుతుంది. అట్టి ఏకాగ్రతను సంపాదించుటకే అమ్మ ధ్యాన మననాదులను మనం పెంపొందించుకోవాలి. అందుకే అమ్మని 'భావనామాత్ర సంతుష్ట హృదయ' అంటాను.

అనురాగమయి - అమ్మ

సువాసనా భరితమయిన పుష్పంలో పరిమళం పలకరించినట్లు అమ్మ అనురాగం అందరినీ లాలనగా, తియ్యగా తాకుతుంది. అట్టి అనురాగానుభూతికే మన అంతరంగం పురకలు, పరుగులు తీస్తుంది. ఆ అనుభూతిలో అవ్యక్తానందం మనల్ని వివశుల్ని చేస్తుంది. ఎప్పుడు ఎటువంటి అనుభూతి కలుగుతుందో కూడా మనకు గోచరం కాదు.

పరమాత్మ మానవుల మధ్య సంచరించే ఘడియలు కొన్ని వుంటాయి. ఆ అమృత ఘడియల్లో మానవ జ్ఞానంపై, దివ్య తేజం ప్రసరిస్తుందని అంటారు. అట్టి అమృత ఘడియల్లో మనం చేసిన ఏ కొద్ది ప్రయత్నమైనా గొప్ప ఫలితాలను ఇచ్చి విధినే మార్చి వేస్తుంది. మిగిలిన కొన్ని సమయాల్లో కొద్ది ఫలితం

నడవనివ్వని శక్తులన్నీ నడిపించే శక్తిమీద ఆధారపడివున్నాయి.

కోసమే ఎంతో కృషి చేయవలసి వస్తుంది. ఆనందం కోసం పనిచేయటం కాకుండా ఆనందంతో పని చేయాలి.

షిర్డీసాయి "నీవు నా కోసం ఒక్క అడుగు వేయి, నేను నీ కోసం పది అడుగులు వేస్తానని" అంటారు. మనం ఏ కొంచెం కృషి చేసినా దానికి పదిరెట్లు భగవంతుడు సహకరిస్తాడు. ఒకమారు అమ్మ దగ్గర వుండగా ఒక అక్కయ్య ఐదుపైసల బిళ్ళలతో అమ్మకు అష్టోత్తరం పూజ చేసుకుంది. అది చూడగానే రూపాయి కాసులతో పూజ చేసుకుందామనుకున్నాను.

1985 ఫిబ్రవరి 10 వ తారీఖుకు మా వివాహమయ్యి 25 సంవత్సరములైన సందర్భముగా మా దంపతులం 'అమ్మ' కు పూజ చేసుకోవాలని రూపాయి కాసులు పోగు చేసుకున్నాను. జనవరి 26న మా అమ్మగారు దుర్గాంబగారు కాలం చేసినందున గుంటూరు వెళ్ళవలసి వచ్చింది. మళ్ళీ రావడం కుదరదు కాబట్టి "నీవు వెళ్ళి అమ్మకు పూజ చేసుకు రమ్మని" ఆయన అన్నారు. "రెండురోజులు అమ్మ సన్నిధిలో గడుపుదామని వెళ్ళాను". మర్నాడు పూలు, పళ్ళు తెచ్చిపెట్టమని వ్యాన్‌లో వాళ్ళకు చెపితే మర్చేపోయారు. రెండో రోజు బాపట్లలో పువ్వులు లేవుట. 3 వ రోజు పూలు, పళ్ళు తెప్పించుకొని అమ్మకు పూజ చేసుకుందామనుకుంటే, అమ్మ దగ్గరకు ఒడుగు చేసుకోవటానికి వచ్చారు. వాళ్ళకు పూలు, పళ్ళు, కావాలని, నేను తెప్పించుకున్నవి వాళ్ళకు వాడి, నీకు మళ్ళీ తెప్పిస్తానని వసుంధర అక్కయ్య చెప్పింది. కానీ ఆ సాయంత్రం పూలు, దండలు దొరకలేదని చెప్పారు. మర్నాడు వుండి పూజ చేసుకుంటానని అమ్మతో చెపితే ఇంకొకరోజు వుంటావన్నమాట, అని చిన్నపిల్లలా సంబరపడింది. ఇంకొకరోజు అమ్మ దగ్గర గడప గలుగుతున్నందుకు నాకు ఎనలేని సంతోషం కలిగింది, దానికి తోడు అమ్మ సంబరం చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

అమ్మ అంటే సంపూర్ణ అవతారం కాదు. సంపూర్ణత్వం.

ఆ రాత్రి అమ్మ మంచం దగ్గరే పడుకొని కబుర్లు చెప్పుకుంటూ గడిపాను. నిజంగా ఆ రాత్రి నాకు మరపురాని రాత్రే అయ్యింది. మళ్ళీ అటువంటి రాత్రికి అవకాశమే లేకుండా అమ్మ భౌతికదేహాన్ని విసర్జించింది కదా! ఉదయాన్నే కళ్ళు తెరిచేటప్పటికి అమ్మ నా ప్రక్కనే నిలబడి కనిపించింది. నా ఆనందానికి అవధులు లేవు. వెంటనే అమ్మ పాదాలకు నమస్కరించుకొని సంతోషాంతరంగ పులకితురాలైనాను.

మర్నాడు పూజ చేసుకుందామని అన్నీ సమకూర్చుకొని కూర్చోగా, అమ్మ బొట్టు పెట్టి, చీరె ఇచ్చి ఇది కట్టుకొని పూజ చేసుకోమంది. ఎప్పుడూ ఊరికి వస్తుంటే అమ్మ బట్టలు పెట్టేది. అలాంటిది దానికి భిన్నంగా ముందుగా చీరె కట్టుకొని పూజచేసుకోమందని ఆశ్చర్యమనిపించింది. నేను పూజ చేసుకున్న తరువాత అందులో నుంచి రెండు రూపాయిలు తీసి ఇచ్చి, మిగిలినవి ఆఫీసులో కట్టేయమంది. దక్షిణగా తాంబూలంలో పెట్టిన రూపాయిలతో కలిపి నూటపదహారులు అయింది. అక్కడ వున్న అక్కయ్యలు, మేము కూడా నీలాగే పూజ చేసుకుంటామని అన్నారు. 'అమ్మ' ఇచ్చిన రూపాయిలను పూజలో పెట్టుకున్నాం. ఆ రోజు నుంచీ డబ్బుకు వెనక్కు చూసుకోవలసిన అవసరం లేకుండా, ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాము.

సాయి సచ్చరిత్రలో అక్కల్ కోటకర్ మహరాజ్, సాయిబాబా, భక్తులకు రూపాయిలు ఇచ్చిన సన్నివేశాలు చదువుతుంటే నా ఒళ్ళు జలదరించింది. అనురాగమయి, ప్రేమమయి అయిన అమ్మ ప్రసాదించిన రూపాయిలు ఎంత విలువైనవో, పవిత్రమైనవో కదా!

రెండు రోజులుందామని వెళ్ళిన నేను వారం రోజులుండగలగటం నా అదృష్టమే. హడావిడిగా వెళ్ళటం వలన అమ్మకు చీరె పెట్టుకోలేక పోయానన్న

సృష్టి అనాదీ, నాదీ.

విచారాన్ని కూడ అమ్మ దూరం చేసింది. మార్చిలో అమ్మ పుట్టిన రోజుకు ఈయన వెడ్తుంటే ఆయన ద్వారా చీరె పంపించాను. అమ్మ ఆ చీరె కట్టుకొని, "అమ్మాయి పంపిన చీరె కట్టుకున్నానని, బాగుందని చెప్పమని" అందిట. 'అమ్మ' ప్రత్యేకించి అలా కబురు పెడితే ఆనందమనిపించింది. ఏమిటో ఈ మాటు అన్నీ ప్రత్యేకంగా చేస్తోందని అనుకున్నాను. ముందు చీరె పట్టుకు వెళ్ళమంటే నీవు వెళ్లినప్పుడు పెట్టుకుందువుగానివి అంటే మీరైనా నేనైనా ఒకటే అని బలవంతంగా పంపించాను, ఆయన వద్దన్నారని వూరుకుంటే జీవితాంతం బాధ పడేదాన్నే. అలా కాకుండా దానిని స్వీకరించి నాకు ఎనలేని ఆనందాన్ని ప్రసాదించింది. అనతి కాలంలోనే అంటే 1985 జూన్ 12వ తేదీన భౌతిక కాయాన్ని చాలించి, భౌతిక పరిధులకు అతీతమై జగన్మాత మానవులకు మరింత చేరువ అయింది.

పై సంఘటనలన్నీ కలిపి చూసుకుంటే అమ్మ తన అవతారం చాలించే ముందు, మనల్ని తృప్తి పరచి, తాను ఆనందపడి, తన అనురాగంతో జీవితాంతం సరిపడా మధుర స్మృతులను మనకు మిగిల్చి వెళ్ళిందా! అని అనిపిస్తోంది. అమ్మ తన జీవితకాలంలో ఎందరికో ఎన్నెన్నో అనుభూతులను పంచింది. వాటి ఛాయలను తలుచుకుంటూ ఆ జ్ఞాపకాలను కలబోసుకుంటూ 'అమ్మను' స్మరించుదాము. మన అదృష్టం కొద్ది పరమాత్మ అమ్మగా అవతరించిన అమృత ఘడియల్లో మనం మనగలగటం నిజంగా మన అదృష్టమే.

ఆధ్యాత్మిక సాధన

జ్ఞానాన్ని సంపాదించటానికి మన మనస్సునే బాణంగా ఎక్కుపెట్టి ఓంకారమనే ధనస్సుతో బ్రహ్మభావనకు వేస్తే, జ్ఞానం లభిస్తుందని పెద్దలు అంటారు. ఆధ్యాత్మిక సాధన ద్వారా భగవంతుని తెలుసుకోవాలి. ఎన్ని

తరుణమే ఋణం.

సాధనలున్నా నిప్పు లేనిదే వంట యేవిధంగా కాదో అదే విధంగా సాధనలు ఎన్ని వున్నా జ్ఞానం లేనిదే మోక్షం సిద్ధించదు.

ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆదిమానసిక కష్టాల కారణంగా మనం ప్రశాంతతను పొందలేక బాధలను అనుభవిస్తాం. అన్ని బాధలకు, దుఃఖాలకు అతీతమైన స్థితిని అందుకొనుటకు చేసే పోరాటమే ఆధ్యాత్మిక సాధన. సాధారణంగా మన మనస్సు బాహ్య వస్తువులతో తాదాత్మ్యం చెంది ఆలోచించుటకు అలవాటు పడిపోయింది. నేను, నాది అను అహంకార మమకారాలే మన బాధలన్నింటికీ మూలము.

"మనయేవ మనుష్యాణాం బంధమోక్షయోః" - అన్నింటికీ మనస్సే మూలం. బంధానికి, బంధవిమోచనానికి అదే మూలకారణమంటారు. గ్రంథపఠనము, మహాత్ముల ఆశీస్సులు, సజ్జన సాంగత్యము మనకు ఉన్నా మన మనస్సు మనతో సహకరించనిచో అన్నీ వ్యర్థమే అవుతాయి.

ఆధ్యాత్మిక సాధన అన్నది ఏ చెట్టునో కోసుకు వచ్చేది కాదు. దానికై శ్రమించవలసిన అవసరం ఎంతైనా వుంది. మనసా, వాచా, కర్మణా మనం సాధన చేయాలి. సాధన చేయటానికి శ్రద్ధ, పట్టుదల అన్నవి పట్టుకొమ్మల వంటివి. శ్రద్ధతో దేనినైతే ఆచరిస్తామో అది తప్పక మనకు కరతాలామలక మవుతుంది. శ్రద్ధకు తోడు పట్టుదల వుంటే అగ్నికి ఆజ్యం తోడైనట్లు ఉజ్వలంగా భాసిస్తుంది.

భగవన్నామం సద్గ్రంథ పఠనం, సద్గోష్ఠి అందు ఆసక్తిని కలిగిస్తుంది. అందుకే అమ్మ అఖండనామ యజ్ఞాన్ని రూపొందించింది. నామం ద్వారానే భగవంతుడు మనకు దగ్గరవుతాడు. భగవంతునిలో ఉన్న చైతన్యమే నామం. నామం తాను పొంగి మనను వంచుతుంది. భగవంతుని వంచి మన దగ్గరకు

దేహామే సందేహం.

తీసుకువస్తుంది. మనస్సు రాగి పాత్రలాంటిది. సత్సంగమనే చింతపండుతో తెల్లగా తోమాలి.

సజ్జన సాంగత్యం, మహానుభావుల ప్రసంగాలు, సత్పురుష సందర్శనం, సద్గ్రంథ పఠనంతో పాటు, మహానుభావులను జాగ్రత్తగా గమనిస్తూ వారి జీవితాలను అధ్యయనం చేస్తూ, వారు జీవితంలో ఏ విధంగా పయనించారో తెలుసుకుంటూ వారి అడుగు జాడలలో నడవాలి. మన పూర్వజన్మ సుకృతాన అమ్మ ఒడిలో పిల్లలమైనాము. "మీరు నా పిల్లలే కాదు, నా అవయవాలు కూడా" అని అమ్మ అంటుంది.

భక్తి, ధ్యాన, జ్ఞాన మార్గాలలో ఏ మార్గాన్ని అనుసరించినా మనం మంచి ఫలితాన్ని తద్వారా పొంది. మనమార్గాన్ని సుగమం చేసుకోవచ్చును. అయితే మనలోని నేను, నాది అనే భావాలను పూర్తిగా విడిచి భగవంతునికి ఆత్మార్పణ గావించు కోవాలి. ఎల్లవేళలా అమ్మను గురించి ఆలోచిస్తూ వ్యక్తిగత ఆలోచనలకు తావివ్వకుండా చూచుకోవాలి. ధ్యానమార్గమన్నది అంత తేలికకాదు. అన్నివేళలా ధ్యాన నిమగ్నులమవటానికి మనం మునీశ్వరులం కాము. కానీ మనం ఏపని చేస్తున్నా అమ్మనే స్మరిస్తూ అమ్మను గురించి మననం చేసుకుంటూ గడప గలగాలి.

భగవాన్ రమణమహర్షి దగ్గరకు ఒకామె వచ్చి ధ్యానం చేసుకుంటూ కూర్చోవాలనిపిస్తుంది, మరి పని చేసేది ఎట్లా అని అడిగిందట. దానికి భగవాన్ ఛలోక్తిగా "మనస్సు వున్న చోటనే వుంచి శరీరాన్ని పని చేయని" అన్నారుట. అందుకే అమ్మ "ధ్యాసే ధ్యానం, నాన్నా" అంటుంది.

ఈ ఆధ్యాత్మిక సాధన సందర్భంగా ఎన్నెన్నో ఒడుదుడుకులు, విపరీతాలు ఎదురవ్వొచ్చు. శ్రద్ధ, పట్టుదలతో సహనాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, కలిగి పరిస్థితులు

ఏ పాదాలకు నమస్కరించినా ఆ పాదలకే చెందుతాయి.

తారుమారైనా నిరాశ చెందక అమ్మపై భారం వుంచి ఎప్పటికైనా నీవే శరణ్యమని ముందుకు సాగాలి.

ఆత్మ సమర్పణ మూలంగా దైవసాక్షాత్కారాన్ని పొందవచ్చునంటారు. కానీ అది అంత తేలికైన పని కాదు. నేను, నాది అన్న భావన వున్నంత వరకూ పూర్తి శరణాగతి సాధ్యం కాదు. నేను, నాది అన్నది పోయి, మనము, మనది అన్న విశ్వభావన ఏర్పడాలి. అమ్మ మనకు విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని నేర్పుతున్నది. అమ్మ దర్శనానంతరం, అమ్మ సమక్షంలో నేను, నాది అన్న విషయం పూర్తిగా తుడిచిపెట్టుకు పోతుంది. అమ్మ దగ్గరకు వెళ్ళాక అన్నయ్యలు, అక్కయ్యలు అందరూ ఆత్మబంధువులుగా అవుతాము. రక్త సంబంధీకుల కంటే, అమ్మ పిల్లలు ఆత్మబంధువులుగా మారతాము. ఆ అనుబంధాన్ని మాటలతో వర్ణించనలవి కాదు. అమ్మ నేర్పిన బాటలో మనందరం పయనించాలి.

అనురాగమయి అమ్మ అండ వుండగా మనకు భయం దేనికి? మన బరువు బాధ్యతలను మోయటానికి అమ్మ వున్నది కదా! మన కష్టాలన్నింటినీ మరచి నిశ్చింతగా అమ్మను ధ్యానించు కుందాము. 'అసాధ్యాన్ని సాధ్యం చేసేదే ఆధ్యాత్మిక శక్తి' అని అమ్మ అంటుంది. కాబట్టి మనం ఎటువంటి విచారం పెట్టుకోక అమ్మను ధ్యానించుకోవటమే మనకు తగిన ఆధ్యాత్మిక సాధన.

తపస్సు - అమ్మ

భగవానుడు మనవాడన్న భావన రానంత వరకూ అడవిలో వున్నా, ఇంట్లో వున్నా ఒకటే. భగవత్సంబంధము లేని ఇల్లు చెరసాల. భగవత్సంబంధం వున్న ఇల్లు ఆశ్రమం. తపస్సు అంటే ఎక్కడో ముక్కు మూసుకు కూర్చుని

భగవంతుని గురించిన దిగులే జిజ్ఞాస.

చేసేది కాదు. మనలోని రజస్తమోగుణాలను పోగొట్టుకొని సత్వగుణాన్ని పెంపొందించు కోవటమే తపస్సు. తమస్సును పోగొట్టేదే తపస్సు. మనలోని అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి జ్ఞానజ్యోతిని వెలిగించేదే తపస్సు.

శ్రీ కృష్ణుడు తపస్సును శారీరక, వాచిక, మానసికములని విభజించాడు. దానినే మనవారు మనోవాక్కాయకర్మలు అంటారు. ఈ దేహంతో చేయవలసిన సత్కార్యాలు శారీరక తపస్సు. దేవతలను, ద్విజులను, గురువులను, జ్ఞానులను పూజించటం శుద్ధిగా వుండటం కుటిలత్వం లేకుండా వుండి అహింసను అవలంబించటం శారీరక తపస్సు. అందుకే అమ్మ తాను పరమాత్మ అయినా తాను బామ్మను, నాన్నగారిని గౌరవించటం, తనకంటే పెద్దవారిని పసిపిల్లలుగా లాలించటం, చూస్తే శరీరధారణ చేసింది కాబట్టి తనకు అవసరం లేకపోయినా మన కొరకు తాను అన్నీ ఆచరించి చూపించింది. అలాగే బాపట్ల కుష్టు ఆసుపత్రికి వెళ్ళి వారికి సేవ చేయటం, తన దగ్గరకు వచ్చిన వాళ్ళను వర్ణ, వర్గ, స్త్రీ పురుష విచక్షణ లేకుండా ప్రేమించటం చూస్తుంటే పైన చెప్పిన శారీరక తపస్సు అదే అనిపిస్తుంది.

వాఙ్మయ తపస్సు :

ఇతరుల మనస్సు నొప్పించే విధంగా మాట్లాడక పోవటం, సత్యం పలకడం, ప్రేమగా, హితము చేకూరేటట్లు పల్కడం, వేదాధ్యయన మొనర్చటం వాచిక తపస్సు. మనుష్యులు సాధారణంగా ఎదుటి వారిని చులకనగా చూడటం, తూలనాడటం, ఎగతాళి చేయటం చేస్తుంటారు. ఎదుటి వారి బాధను అర్థం చేసుకోరు. నిజాన్ని పల్కడం, కఠినంగా మాట్లాడక పోవటమే ప్రియవచనం. మంచిని చెప్పడం, మంచి గ్రంథాలను చదవటం వాఙ్మయ తపస్సు.

శుక్ల శోణితాలకు యేది కులమో అదే నా కులం.

చేసేది కాదు. మనలోని రజస్తమోగుణాలను పోగొట్టుకొని సత్వగుణాన్ని పెంపొందించు కోవటమే తపస్సు. తమస్సును పోగొట్టేదే తపస్సు. మనలోని అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి జ్ఞానజ్యోతిని వెలిగించేదే తపస్సు.

శ్రీ కృష్ణుడు తపస్సును శారీరక, వాచిక, మానసికములని విభజించాడు. దానినే మనవారు మనోవాక్కాయకర్మలు అంటారు. ఈ దేహంతో చేయవలసిన సత్కార్యాలు శారీరక తపస్సు. దేవతలను, ద్విజులను, గురువులను, జ్ఞానులను పూజించటం శుద్ధిగా వుండటం కుటిలత్వం లేకుండా వుండి అహింసను అవలంబించటం శారీరక తపస్సు. అందుకే అమ్మ తాను పరమాత్మ అయినా తాను బామ్మను, నాన్నగారిని గౌరవించటం, తనకంటే పెద్దవారిని పసిపిల్లలుగా లాలించటం, చూస్తే శరీరధారణ చేసింది కాబట్టి తనకు అవసరం లేకపోయినా మన కొరకు తాను అన్నీ ఆచరించి చూపించింది. అలాగే బాపట్ల కుష్టు ఆసుపత్రికి వెళ్ళి వారికి సేవ చేయటం, తన దగ్గరకు వచ్చిన వాళ్ళను వర్ణ, వర్గ, స్త్రీ పురుష విచక్షణ లేకుండా ప్రేమించటం చూస్తుంటే పైన చెప్పిన శారీరక తపస్సు అదే అనిపిస్తుంది.

వాఙ్మయ తపస్సు :

ఇతరుల మనస్సు నొప్పించే విధంగా మాట్లాడక పోవటం, సత్యం పలకడం, ప్రేమగా, హితము చేకూరేటట్లు పల్కడం, వేదాధ్యయన మొనర్చటం వాచిక తపస్సు. మనుష్యులు సాధారణంగా ఎదుటి వారిని చులకనగా చూడటం, తూలనాడటం, ఎగతాళి చేయటం చేస్తుంటారు. ఎదుటి వారి బాధను అర్థం చేసుకోరు. నిజాన్ని పల్కడం, కఠినంగా మాట్లాడక పోవటమే ప్రియవచనం. మంచిని చెప్పడం, మంచి గ్రంథాలను చదవటం వాఙ్మయ తపస్సు.

శుక్ల శోణితాలకు యేది కులమో అదే నా కులం.

అమ్మ ఎప్పుడూ ఎవరి మనస్సు నొప్పించక అన్నింటికీ "సరేమంత్రం" అనటం, ఎవరినీ తూలనాడటం కాని, దూషించటం కానీ చేయకపోవటమే వాచిక తపస్సు అనిపిస్తుంది. తాను ఆచరించి చూపి మనకు మార్గదర్శిని అయ్యింది. మన అనుభవాలను రాయటానికి తగిన శక్తిని ఇవ్వటం కూడా వాచిక తపస్సే అనిపిస్తుంది. వజ్రోత్సవాలప్పుడు ఇంటింటికి వెళ్ళి క్యాలెండర్లు పంచి లక్షరూపాయలు కలెక్టు చేయాలని విశాఖపట్టణం వాళ్ళు అనుకుంటే, 80 వేలే అయ్యింది. ఎక్కడో అపరాధం చేసామమ్మా క్షమించమంటే "మనకు డబ్బు అవసరాన్ని మించి రాకూడదు. అప్పు చేయకుండా గడిచిపోతే చాలు కదా అన్నది. మన మనస్సులను నొప్పించకుండా చేసి తన దైవత్వాన్ని నిరూపించుకుంది.

మానసిక తపస్సు :

ఇది చాలా ప్రధానమైనది. పై రెండు తపస్సులు పైకి కనిపించేవి. ఇది కనిపించనిది. ఎవరికి వారు తమని తాము విశ్లేషించుకొని నిర్ణయించుకోవలసినదే. మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా వుంచుకోవడం, చెడ్డ తలంపులు రానీయకుండటం, మౌనంగా వుండటం, ఆలోచనలను నిగ్రహించుకోవటం, సద్భావాన్ని కలిగి వుండటం మానసిక తపస్సు.

అమ్మ తన బిడ్డలు ఎవరు ఏమి చేసినా ఎరుగనట్లుండటమే కాక "చేతలు చేతుల్లో లేవనడం చూస్తుంటే అమ్మ మానసిక పరిస్థితిని మనమేమి అంచనా కట్టగలం". దొంగలు - దొరలు అందరూ తన బిడ్డలే అనటానికి మించిన స్థితి ఏముంది? వారి వారి మనఃస్థితులను అనుగుణంగా భూమిక లేర్పరచి అమ్మ చెప్తుంటే ఆశ్చర్యపోవడం మనవంతు అవుతుంది.

చూస్తే కనబడును, కనబడితే చూస్తారు.

గాయత్రీ యాగంకు అమ్మ మంత్రోపదేశం చేస్తుందంటే అనేక మందిమి వెళ్ళాం. అందరికీ జపమాల, గాయత్రీ మంత్రం వున్న కాగితాలను ఇచ్చింది. అప్పుడు కాకుమాను నుండి వచ్చిన ఒక అక్కయ్య తీసుకుంది. ఆమెకు చదువు అసలు రాదు. అమ్మ ఇస్తోంది కదా అని తీసుకున్నాను. నేనేం చేయగలనని తపన పడ్తుంటే హైమాలయంలోకి తీసుకువెళ్ళి అమ్మ నామం "జయహోమాతా శ్రీఅనసూయా రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి" దీనిని అమ్మ మహామంత్రం అంటుందని దానినే జపమాలతో చేయమన్నాను. ఆమె వ్యవసాయం పనులకు వెళ్ళే వ్యక్తి. అమ్మ నా చేత చెప్పించిన దానిని ఆమె మనోవాక్కాయ కర్మలా ఆచరించింది. నిరంతరం తైలధారాపాతంగా కొనసాగించింది. అమ్మ "తపనే తపస్సు" అంది. తరువాత గాయత్రీ యాగం అప్పుడు వచ్చి "నీవు చెప్పినట్లే చేస్తున్నానని, తనకు చాలా మనశ్శాంతిగా వుందని చెప్తుంటే" ఆశ్చర్యపోవటం నావంతు అయ్యింది. "నా కలలో నీవే కనిపించావు, నాగురువు నీవే" అన్నది. దానికి అందరికీ గురువు, దైవం జగన్మాత అయిన అమ్మేనని, అమ్మను నిరంతరం ధ్యానం చేసుకోమని చెప్పాను. ఆమె తపన పోగొట్టటానికి అమ్మ నన్ను ఒక పనిముట్టుగా వాడుకుంది. అంతే కాని అందులో నా గొప్పతనమేమీ లేదని చెప్పాను. అంతమటుకు ఆవిడను పట్టించుకోని బంధువులు ఎంతో ఆప్యాయత కనపరచటం అంతా అమ్మ దయేనని తరువాత కలిసినప్పుడు చెప్పింది.

తపస్సు, తమస్సును కలిగించకూడదు. ఉషస్సు నిచ్చేదిగా, హితమును కూర్చేదిగాను ఉండాలి. మనకొక స్వాభావికమైన, వ్యక్తిత్వాన్ని రూపొందించేదిగా వుండాలి. ఒక్కొక్కప్పుడు ఇతరులు మనలను తూలనాడినా మనం నిందారోపణలకు దిగరాదు. మనస్సుని నిగ్రహించుకొని మౌనాన్ని పాటించాలి.

పెళ్ళిలో పెద్దపులి వున్నదనుకొనే వారి భయం పోగొట్టడానికే నాకు పెళ్ళి.

పైన చెప్పిన శారీరక, వాచిక, మానసిక తపస్సులను కొనసాగించుతూ మన జీవితాలను నందన వనాలుగా చేసుకోవటమే కాక తోటి వారికి ఆనందాన్ని, హాయిని కలిగించటమే పరిపూర్ణమైన తపస్సు.

విశ్వవందిత – అమ్మ

విశ్వవందితయైన అమ్మ గురించి ఎంత చెప్పుకున్నా తనివి తీరదు. ఇంకా ఇంకా చెప్పుకోవలసినది, తెలుసుకోవలసినది ఎంతో వుందనిపిస్తుంది. తల్లి జబ్బుపడిన పిల్లవాడికి సగ్గుజావ ఆరోగ్యంగా ఉన్న వారికి అన్నం, కూర, పెరుగు ఎలా ఇస్తుందో అదే విధంగా అమ్మ విభిన్న మానవులకు వారి స్వభావమునకు తగినట్లుగా అందర్నీ తృప్తి పరుస్తుంది.

1976 వ సం॥లో నేను ఖమ్మం, భద్రాచలం, గుంటూరు వెళ్ళి అట్నుంచి జిల్లెళ్ళమూడి వెద్దాను, మీరు సరాసరి వెద్దారు కాబట్టి చీరె, పళ్ళెం, పసుపుకొమ్ములు తీసుకురండి, అమ్మకు పసుపు తాంబూలం నోము ఉద్యాపన చేసుకుంటానని మరీ మరీ చెప్పాను. జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గర నేను కూర్చుని వుండగా ఆయన వచ్చారు. చీరె, పళ్ళెం, తెచ్చారా అని అడిగితే మర్చేపోయానన్నారు. అన్ని మార్లు చెప్పినా మర్చేపోయారా అని నేను బాధపడ్తుంటే "ఏం నాన్నా" అని అమ్మ ఆయన్ని అడిగింది. "అది తీసుకురమ్మనవి మర్చేపోయానని కురుక్షేత్రం పెడ్తోందమ్మా" అన్నారు. "ధర్మ క్షేత్రంలోనే వున్నావు నాన్నా" అని అమ్మ అంది. ఆ మాటతో అమ్మే సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మ అని, జిల్లెళ్ళమూడి ధర్మక్షేత్రం అని అమ్మ నిస్సందేహంగా చెప్పిందనిపించి "అక్కడ వున్న అందరం ఆనందసాగరంలో తేలియాడాము".

క్రిందకు దిగి వస్తుంటే వైజాగ్ నుంచి శ్యామ్‌గారు చీరె, పళ్ళెం పట్టుకు ఎదురైనారు. ఇంతలోనే బాధ అంతలోనే సంతోషం. శ్యామ్‌గారు తరువాత

అందరికీ సమ్మతమైనదే నా మతం.

రైలులో బయలుదేరతారని తెలిసిన మా పెద్ద అమ్మాయి అనూరాధ, వెంటనే చీరె, పళ్ళెం ఆయన చేత పంపించింది. (అన్నపూర్ణాలయంలో వడ్డనలకు పనికివచ్చేటట్లుగా పెద్ద ఇత్తడి పళ్ళెం కొన్నాను). పళ్ళెం చూస్తే పెద్దదిగా వుంది సూట్‌కేసులో పట్టుందోలేదో అని అమ్మను తలుచుకొని పెడ్తే సరిగా సరిపోయిందని ఆయన చెప్తే ఆశ్చర్యపోయాము.

డిసెంబరు 31 న బందరు నించి ఎస్.ఆర్.వై. ప్రసాద్ గారు పెద్ద కేకు తీసుకు వచ్చేవారు. అమ్మ పాత సం॥కు వీడ్కోలు చెపుతూ కొత్త సం॥కు స్వాగతం పలకటానికి రిబ్బన్ కట్‌చేసి ఆ తరువాత, కేకు కట్‌చేసి, బిస్కట్లు, కేకు, టీ ప్రసాదంగా ఇచ్చేది. "ఆచరించే వారికి ఏ మతమైనా ఒకటేనని" అన్ని మతాల పండుగలు అక్కడ వైభవోపేతంగా జరిపించేది. క్రిస్మస్‌కు బైబిల్ చదివించేది. రంజాన్‌కు ఖురాన్ చదివించి, సేమ్యా చేయించేది. అమ్మ వివాహ వార్షికోత్సవము ఇంగ్లీషు తారీఖుల ప్రకారం, పుట్టినరోజు తెలుగు తిథుల ప్రకారం జరిపించేది.

ఎస్.ఇర్.వై. గారు అమ్మకు ఫోటోలు తీస్తుంటే అమ్మతో మాకు ఒక ఫోటో తీయమని అడిగాను. మర్నాడు ప్రొద్దున్న అమ్మకు పసుపు తాంబూలం ఉద్యాపన చేసుకొని నేను, ఆయనా పూజ చేసుకున్నాము. అమ్మ మాకు దండవేయబోతుండగా ఎస్.ఆర్.వై గారు "అమ్మా ఇంత వరకు నేను తీసిన ఫోటోలు అందరికీ నచ్చాయి, కానీ నాకు తృప్తినిచ్చే ఫోటో ఒక్కటీ లేదంటూ", అమ్మతో కలిపి మాకు ఫోటో తీసారు. ఆ ఫోటో అంత బాగా ఏదీ రాలేదని అమ్మ తన కోరిక తీర్చిందని మురిసి పోయారు. మేము అమ్మతో కలిపి తీయించుకోవటం అమ్మ ఇచ్చిన సువర్ణావకాశమే.

ఎస్.ఆర్.వై. గారి అమ్మాయి పెళ్లి వైభవంగా జరగటం, అమ్మ యొక్క

వింటే విమర్శకానీ, కంటే విమర్శలేదు.

కరుణాకటాక్షాలే అని ఆయన పరిపూర్ణ విశ్వాసం. వాళ్ళ అమ్మాయి అమెరికా వెడ్తునప్పుడు ఆయనకు విమానంలో నుంచి అమ్మ టాటా చెప్తూ దర్శనమిచ్చింది. వాళ్ళ అమ్మాయికి అమ్మ ఆశీస్సులు తోడుగా వున్నాయని ఎంతో ఆనందంతో చెప్పారు.

1984లో మా అమ్మగారికి చెవిపోటు, తలనొప్పితో విపరీతంగా బాధపడ్తున్నారు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేక పోవటంతో ఎక్సరే తీసారు. చెవిలోపల కాయవుందని, స్కల్ ఓపన్ చేసి మరీ ఆపరేషన్ చేయాలని చెప్పారు. హార్టుఎన్‌లార్జిమెంట్, బి.పి., షుగర్ వుండటంతో, అవి కంట్రోలు అయితే కాని ఆపరేషన్ చేయటం కుదరదని చెప్పారు. 'అమ్మ' అనుజ్ఞ తీసుకొని మా అమ్మను వైజాగ్ తీసుకు వచ్చాను. ఆవిడకు మందులు వాడుతున్నాము. బి.పి., షుగర్ కంట్రోలు అయ్యేలోగా లలితాసహస్రంలో "సర్వవ్యాధి ప్రశమనీ సర్వమృత్యునివారిణి" అన్నది, సంపుటిలా 40 రోజులు చేయమని చక్రవర్తి గారు చెప్పారు. అదే వేద మంత్రంలా, నిష్ఠగా ఆచరించింది. దానితో చెవిపోటు, తలనొప్పి తగ్గాయి. ఎందుకైనా మంచిదని ఎక్సరే తీయించగా ఆ చెవిలో కాయ మటుమాయమయింది. ఆదికాలంలో చేయి ఆపరేషన్ తప్పించి, ఇప్పుడు ఈ ఆపరేషన్ చేయాల్సిన అవసరం లేకుండా చేసి మా అమ్మగారికి అవసరమైన మనశ్శాంతిని అమ్మ కలుగచేసింది.

ఒక బలమైన దూలము ప్రవాహంలో కొట్టుకొని పోవుచూ వందలాది పక్షులను మోసుకొని పోవుచున్నా అది నీటిలో మునగదు. కాని ఆ ప్రవాహంలో కొట్టుకొని పోవుచున్న ఒక గడ్డి పరకపై కాకి వాలినను మునిగిపోవును. అదే విధంగా అవతారపురుషులు అవతరించినప్పుడు లెక్కలేనంతమంది వారిని శరణుజొచ్చి ముక్తి పొందారు. అట్లే అవతారమూర్తి, విశ్వవందిత అయిన అమ్మ సమక్షంలో ఎందరెందరో సేదతీర్చుకొనుచున్నారు. విశ్వవ్యాప్తిని అయిన అమ్మకు నమస్సుసుమాంజలులు అర్పించుకుంటున్నాను.

అసలయిన అమ్మకు ఎవరిని చూచినా తన బిడ్డేననిపిస్తుంది.

విశాఖపట్నంలో 'అమ్మ' ఆలయ శంఖుస్థాపన

అమ్మ అనుంగు బిడ్డలందరికీ అమ్మ దర్శనానంతరం అమ్మ వారి ఊరికి, వారింటికీ రావాలన్న కాంక్ష కలిగేది. లక్షమందిని ఏక బంతిని చూడాలన్న కోరిక తీరగానే, కోటి మందిని చూచుకోవాలనే కాంక్షను వెలిబుచ్చింది అమ్మ. దాని నిమిత్తమే అమ్మ వాత్సల్య యాత్ర మొదలైంది. మద్రాసు, హైద్రాబాదు, గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాలు అమ్మ పాదస్పర్శతో పునీతమైనాయి. వైజాగ్‌లోని అమ్మ పిల్లలందరూ అమ్మను విశాఖపట్టణం రమ్మని కోరాము. అమ్మ సరేనంది.

కానీ కాలపురుషుని అతిక్రమించక అమ్మ విదేహి అయి సర్వాంతర్యామి అయింది. అట్టి సర్వాంతర్యామిని ఒక చోట అర్చించుకోవాలన్న తపన, ఆర్తి, ఆవేదన ఇక్కడకు పూజ కొచ్చే ప్రతి ఒక్కరిలో ప్రబలింది. అంతకు పూర్వం అమ్మ దేవాలయానికి స్థలం వచ్చిందన్న ఆనందంతో కేశవ శర్మగారు, మిగిలిన అమ్మ బిడ్డలందరం కార్తీక పౌర్ణమికి ఆ స్థలంలో లక్ష నామార్చన కూడా చేసివచ్చాం. ఆ తరువాత ఎన్నిరకాల ప్రయత్నాలు జరిగినా నిర్మాణ కార్యక్రమం ఫలప్రదం కాలేదు.

అమ్మ "చూడకుండా ఉండలేనంత ఆవేదన నీలోవుంటే తప్పకుండా చూస్తావు" అని అంటుంది కదా! ఇక్కడ ప్రతి శుక్రవారం, అమావాస్య, పౌర్ణమి పూజలకొచ్చే వారందరి ఆవేదన, ఆర్తిలే అమ్మ మందిర నిర్మాణం జరగటానికి సోపానాలు అయ్యాయి.

అశోక్ ఫార్మసూటికల్స్, చెన్నై కంపెనీకి, మాకు మూడు దశాబ్దాలకు పైగా అవినాభావ సంబంధం వున్నది. ఆ కంపెనీ బ్రాంచి ఆఫీస్ ఇక్కడ పెట్టి దాని బాగోగులు చూచుకునే బాధ్యత శ్రీ చక్రవర్తిగారి మీద వుంచారు. కంపెనీ వారు పెద్దవాల్తేరులో ఎపార్టుమెంట్సుకు స్థలం కొనుక్కున్నారు. అందులో అమ్మ మందిరానికి కొంత స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. అందులో

శిల్పానికి అందం రావలెనంటే ఉలిదెబ్బలు అవసరం.

ప్రతిష్ఠించటానికి అమ్మ పాలరాతి విగ్రహాన్ని కూడ వారే ఇస్తామని మాట ఇచ్చారు.

అక్కడి ఎపార్టుమెంట్సుకు మా దంపతులమే మే 5న శంఖుస్థాపన చేసాము. జూన్ 12వ తారీఖున అమ్మ ఆరాధనోత్సవంనాడు అమ్మ మందిర శంఖుస్థాపనకు అమ్మ సంకల్పం కలుగజేసింది. తిథుల ప్రకారం ఆ రోజు చతుర్దశి. అమావాస్య ముందు శంఖుస్థాపన ఏమిటని కొందరు అనుమానాన్ని వెలిబుచ్చారు.

అమ్మ ఏ వేడుక చేసిన మధ్యాహ్నం 12 గం॥లకు జరపటం రివాజు. అందుకని 12వ తారీఖు 12 గం.లకు శంఖుస్థాపన చేయాలని అనుకున్నాము. 50 నుండి 60 మందికి సరివడా ప్రసాదాలు తయారు చేయించుకుందామనుకున్నాం. వారం వారం పూజలకు వచ్చే వారందరిన్నీ ఆహ్వానించాం.

అర్ధరాత్రి నుంచీ కుండపోతగా ఒకటే వర్షం. తెల్లవారింది మొదలు ఒకటే ఫోన్లు. ఇంత వర్షంలో ఎలా చేస్తారని. అంతా అమ్మే చూచుకుంటుందన్న విశ్వాసం మాకు మాత్రం ఉంది.

జంఖానాలైతే మట్టి అయి కూర్చోటానికి వీలుగా వుండదని షామియానాతోపాటు కుర్చీలకు ఆర్డరు చేసాము. నదీరా "ఆనతిచ్చావంటు, వాన తెచ్చావంటు ఆగాడు వరుణుండు, అగడా అరుణుండు అంబరమున వెలిగ" అని రాసినట్లుగా, వానదేవుడు కుంభవృష్టితో ఆ ప్రదేశాన్ని శుద్ధి చేసాడు. 10 గంటలకల్లా సూర్యభగవానుడు తన తీక్షణ దృష్టితో ఆ ప్రదేశం అంతా ఆరిపోయేట్లుగా చేసాడు. దీనితో ప్రకృతి మీద అమ్మకు ఉన్న ప్రభావం మనకు అవగతమవుతుంది.

అధ్యయన పరిషత్ తరుఫున పూజలన్నీ పురోహితులు రామంగారు చేయించేవారు. మాకు ఆయన అడ్రసు తెలియదు. బ్రాహ్మడ్ని మాట్లాడమని

విన్నవాడు విమర్శిస్తాడు. కన్నవాడు వివరిస్తాడు.

బిల్డర్‌కే చెప్పాము. రామం గారు నెలరోజులు ఉత్తరదేశయాత్రలు చేసి కాశీపుష్కర గంగను ముందురోజే తీసుకువచ్చారు. జోగారావుగారు రామం గారిని మన ఫంక్షన్‌కు రమ్మంటారా? అని ఫోను చేసారు. బిల్డర్ పురోహితులు ఎవరూ దొరకలేదన్నాడు. దానితో అమ్మ తన ఆలయ శంకుస్థాపనకు తానే ఆయన్ని పిలుచుకుందనిపించింది.

ఆ పురోహితుడు, కాశీగంగతో అమ్మ పాదాలను అభిషేకించుకొని తన జన్మ తరించిందని సంబరపడ్డాడు. ఈ విషయంలో అమ్మ తనని పనిముట్టుగా వాడుకుందని జోగారావుగారు అనందాన్ని వెలిబుచ్చారు. అదే అమ్మలోని ప్రత్యేకత. ఎవరిని ఏ విధంగా ఎప్పుడు ఉపయోగించుకోవాలో అమ్మకే తెలుసు.

శ్రీ లలితా సహస్రనామ పారాయణ, ఖడ్గమాల సామూహికంగా చేసిన తరువాత 12వ తారీఖు, 12 గంటల, 12 ని.లకు శంఖుస్థాపన జరగటం విశేషం. మా బంగారం షాపు రాజు అమ్మ శంఖుస్థాపనకు తనవంతుగా నవరత్నాలు ఇచ్చాడు. మేము మొట్టమొదట అమ్మ పాదుకలు తయారు చేయించాము. ఆ తరువాత జిల్లెళ్ళమూడి అమ్మ విగ్రహానికి దిద్దులు, బేసరి, బులాకీ, రాళ్ళగాజులు, కాసులపేరు అన్నీ తన దగ్గరే తయారు చేయించాడు.

ఈ కార్యక్రమంలో ఎంతోమంది అన్నయ్యలు, అక్కయ్యలు ఉత్సాహంతో పాల్గొన్నారు. అనంతరం అమ్మ ప్రసాదం దాదాపు వందమందికి వినియోగం జరిగింది. 'అమ్మ వాంఛితార్థ ప్రదాయిని' కదా! అందుకే అమ్మ మా అందరి కోరికను సఫలీకృతం చేసింది. అశోక్ ఫార్మసూటికల్ కంపెనీ ప్రొప్రైటర్ రమేష్ అమ్మ మందిర శంఖుస్థాపనకు ఎంతో తొందరచేసారు. ఆయనకు మా ధన్యవాదాలు. జైపూర్‌లో మా పెద్ద అమ్మాయి వాళ్ళ నుంచి విగ్రహం తయారు గురించిన విషయాలు ఎప్పటికప్పుడు అందచేస్తున్న అమ్మ కరుణకు మేమేమి విలువ కట్టగలం.

"జయహోమాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి"

చేస్తున్నా పోట్లాడేది కుమారుడు. పోట్లాడుతన్న చేసేది తల్లి.

అమ్మ 'దీవెన'

"వైరాగ్య తైల సంపూర్ణే భక్తి వర్తి సమన్వితే

ప్రబోధపూర్ణ పాత్రేతు జ్ఞప్తిదీపం వియోకయేత్"

ప్రబోధమనే ప్రమిదలో వైరాగ్యమనే తైలాన్ని పోసి భక్తి అనే వత్తిని వేస్తే అది వెలుగుతూ వి'జ్ఞాన' జ్యోతులను ప్రజ్వలింపచేస్తుంది.

ఆ జ్యోతుల కాంతి మనలోని తిమిరాన్ని హరింపచేస్తుంది. 1969 దసరాల ముందు మొట్టమొదటిసారి అమ్మను దర్శించాను. నాటి నుండి నేటి వరకూ 'అమ్మే' మా జీవిత కేదారాల్లో "సౌభాగ్య" సుమ సౌరభాలను వెదజల్లుతోంది.

1999 మార్చి 31వ తేదీన చాలా నిస్సత్తువగా వుండి ఉదయం 11 గం.లకు పడుకున్నాను, నిద్రపట్టింది. "నాకు సాధారణంగా కలలు రావు. దానికి తోడు పగలు ఎప్పుడూ రాలేదు" కలలో నేను మా ఆయన, మా పెత్తండ్రి కొడుకు నడిచి వెళ్తున్నాం. మధ్యలో నేను ఒక్క అడుగు కూడా వేయలేను. మీరు వెళ్ళండని వెనక్కు తిరిగాను. కాళ్ళకు చెప్పులు లేవు. కాళ్ళు తేలిపోతున్నాయి. అసలు నేను ఎవరు? ఎక్కడికి వెళ్ళాలి? ఏమీ తోచని అయోమయ పరిస్థితి. ప్రాణాలు తోడేస్తున్నట్లుగా వుంది. అతి కష్టం మీద ముందుకు నడిచి ఒక సందులోకి వెళ్ళాను. అక్కడ ఒక పురాతన భవనం. మొదటి గది శూన్యంగా వుంది. అది దాటిన తరువాత కోటి సూర్యుల కాంతితో, ముక్కోటి దేవతలు పరివేష్టించియున్న ఒక స్త్రీ మూర్తిని చూచాను. ఆమె ధవళ వస్త్రాలు ధరించి పద్మాసనంలో కూర్చుని వుంది. అతి కష్టం మీద ఆమె వద్దకు వెళ్ళి నా పని అయిపోయిందమ్మా! అని ఆమె ఒడిలో పడిపోయాను. నా ప్రాణం పైకి పోతున్నట్లు కట్టె మాత్రమే ఆమె చల్లని ఒళ్ళో వున్న భావన కలిగింది.

భరించలేనిది బాధ, సహించలేనిది హింస.

ఆమె రెండు ఉద్ధరిణల తీర్థం నానోట్లో పోసింది. అవి చాలవమ్మా! ఇంకా కావాలని అడిగాను. ఆ నీళ్ళు ఇటు ఇవ్వమని ప్రక్కనే ఉన్న ఆమెను అమ్మ చేయిచాచి అడగటం కనిపించింది. ఈలోగా రాములవారి ప్రసాదం అంటూ ఆయన నన్ను లేపారు. ఆ కల ప్రభావం వల్ల నాకు విపరీతమైన నీర్సం వచ్చింది. బాధ భరించరానిదైంది.

"శ్రీ కృష్ణుడు కుచేలుని చెంగునున్న అటుకులు రెండు పిడికెళ్ళు తీసుకొని తిన్న వెంటనే, ప్రక్కనే ఉన్న రుక్మిణీదేవి ఆయన్ని వారించిందని పురాణ విషయం" అదే విధంగా రెండు ఉద్ధరిణల తీర్థం చాలు కనుక నన్ను లేపి ఆయన చేత్తో నాకు 'అమ్మ', ప్రసాదం పెట్టించిందనిపించిది. ఏమిటి ఎప్పుడూ లేనిది విధంగా కల వచ్చిందని ఆశ్చర్యపోయాను.

ఆ రోజు పౌర్ణమి, బుధవారం శ్రీ యు.ఏ.ఎన్. రాజు గారి రెండవ కుమారుడు వాసురాజుగారింట్లో అమ్మపూజ. ఆయన భార్య వాణి చాలా నియమనిష్ఠలతో అమ్మను కొలుస్తుంది. (శ్రీ యు.ఏ.ఎన్. రాజుగారు అమ్మ సంస్థకు రెండు లక్షలు ఇచ్చిన వదాన్యులు)

రెండు రోజులుగా చెంప వాచింది. నొప్పి లేకపోవటంతో పట్టించుకోలేదు. ఉదయం కలలో పడ్డ బాధకు నిద్రలేచాక చాలా నీరసంగా వుంది. కాని సాయంత్రానికి చెవిపోటు మొదలైంది. వారింటికి వెళ్ళిన తరువాత పన్ను పోటూ ప్రారంభమయింది. ఎలాగో ఓర్చుకొని పూజ అయి ఇంటికి వచ్చిన వెంటనే ఈయనకు చెప్పాను. ఆయన మందు ఇచ్చారు. ప్రొద్దున్న కలకు, ఇప్పుడు ఈ బాధకు సంబంధం ఏమిటి? నాకు అర్థంకాక ఉదయం వచ్చిన కల గురించి మా ఆయనకు చెప్పాను. రోజూ 22 మార్లు ఖడ్గమాల చేస్తున్నావు కదా! అందుకు వచ్చి ఉంటుందన్నారు.

పదిగంటల నుంచి మందులు వేస్తూనే వున్నారు. ప్రొద్దున్న కలలో పడిన బాధకు పదింతలూ బాధ అనుభవించాను. 12 గం॥లకు మెల్లిగా లేచి

తృప్తి కలవాడే నిజమైన భాగ్యవంతుడు.

అమ్మ కుంకుమ నీళ్లలో వేసుకు తాగాను. రాత్రి 2 గం॥ల తరువాత నొప్పి తగ్గి నిద్ర పట్టింది. నాకు తీర్థం ఇచ్చి అమ్మే పునర్జన్మ నిచ్చిందని నా విశ్వాసం.

మానవ జన్మకు సార్థకత ఏమిటీ? మన తోటి వారికి వీలైనంత సాయం చేయాలన్న తపన కల వాళ్లం. ఇద్దరిదీ ఒకే మాట, ఒకే బాటగా ఈ జీవన యాత్రను కొనసాగిస్తున్నాం.

జూన్ 12వ తేదీ నాడు "అమ్మ మందిరానికి" మా దంపతుల చేత అమ్మ శంఖుస్థాపన జరిపించుకుంది. ఆ రోజున నా ఆనందానికి, ఉత్సాహానికి అవధులులేవు. అమ్మ విగ్రహ నిర్మాణం జైపూర్‌లో జరుగుతున్నది. దాని గురించి అన్నపూర్ణాలయ వార్షికోత్సవం తరువాత వెళ్ళాను.

ఈ మహత్తర కార్యక్రమంలో పాలుపంచుకునే అదృష్టం ఉండటం వల్లే అమ్మ నాకు పునర్జన్మ నిచ్చింది. "భక్తి అనే వత్తిని తయారు చేసుకోవటానికి అమ్మ అనుగ్రహం కావాలి" మనం ఒక్క అడుగు వేస్తే మిగిలిన తొమ్మిది అడుగులు తానే వేస్తానంటాడు భగవంతుడు. కాబట్టి ఆ ఒక్క అడుగు వేయటానికే మనం సాధన చేయాలి. దానికి అనన్య భక్తి కావాలి. అప్పుడే ఆ వత్తి వొడుదుడుకులకు, లోనవక వెలుగునిస్తుంది.

"అనన్యాశ్చింతయంతోమాం యేజనాఃపర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం"

ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడూ నా యందే నిష్ఠకలిగి ఉన్నారో, అట్టి వారి యోగక్షేమములను నేనే కాపాడుతానని భగవద్గీతలో శ్రీ కృష్ణభగవానుడు సెలవిచ్చాడు కదా! ఇంక మనకు భయమెందుకు?

పెట్టినా విమర్శించేవాడు బిడ్డ, విమర్శించినా పెట్టేది తల్లి.

క్షిప్రప్రసాదిని అమ్మ

లలితా సహస్ర నామాలలోని 869వ నామం క్షిప్రప్రసాదిని, శ్రీ మల్లాప్రగడ శ్రీరంగరావుగారు రచించిన భారతీ వ్యాఖ్యలో అమ్మవారి అనుగ్రహాన్ని గురించి ఈ నామ వివరణ ఉంది. ప్రసాదమంటే అనుగ్రహం. క్షిప్రమంటే శీఘ్రం. పరాశక్తిని ప్రార్థించిన వారు శీఘ్రమే ఆమె అనుగ్రహాన్ని పొందగలరు. ఈ నామానికి తగినట్లుగా అమ్మ మమ్మల్ని కరుణించిన విధానమే ఈ వ్యాసం.

విశాఖలో మందిర నిర్మాణం జరిగి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. వసుంధరక్కయ్య దగ్గర ఉన్న అమ్మ కాంస్య విగ్రహంలాంటిదే అభిషేకాలకు బాగుంటుందని మాకు చేయించి పెట్టవలసిందిగా అక్కయ్య దగ్గర మా కోరికను వెలిబుచ్చటం జరిగింది. విగ్రహం తయారై వచ్చిందని సన్యాసిరావు గారు ఫోను చేశారు.

ఈ కాంస్య విగ్రహానికి అనసూయేశ్వరాలయంలో పూజలు అభిషేకాలు జరిపించారు. ఒకపూట భోజనాలు కూడ అన్నపూర్ణాలయంలో పెట్టించడం జరిగింది. ఆ విగ్రహాన్ని 26వ తేదీ బుధవారం తిరుపతి – హౌరా ఎక్స్‌ప్రెస్‌లో తీసుకొని వస్తున్నట్లు మంగళవారం సన్యాసిరావుగారు ఫోను చేసి చెప్పారు. స్వయంగా ఆయనే 15 కె.జి.ల విగ్రహాన్ని జాగ్రత్తగా ఎత్తుకుని తీసుకుని వచ్చారు.

బుధవారం రాత్రి అలారం పెట్టుకుని తెల్లవారు ఝామున స్టేషన్‌కు వెళ్ళాలనుకున్నాము. రాత్రంతా సరిగా నిద్రపట్టకలేస్తూనే వున్నాము. కాని 4 గంటలకు పెట్టిన అలారం మోగలేదు. తీరా 4.30 నిముషాలకు ఎవరో తట్టి లేపినట్లుగా మెలకువ వచ్చింది. మామూలుగా తిరుపతి హౌరా 4.40 నిముషాలకు విశాఖ రావాలి కాని అది సాధారణంగా ఒక గంట ముందుగా రావటం రివాజు, దానికి తోడు 3వ ప్లాట్‌ఫారం మీదకు వస్తుంది. మాయింటి నుంచి స్టేషన్ దూరం. కార్లోవెళ్లినా 15 నిముషాలపైనే పడుతుంది. అలాంటిది

మేము రెడీ అయి స్టేషన్‌కు వెళ్ళేటప్పటికి 5 గంటలు అయింది. సన్యాసిరావుగారు ఎంతసేపటి నుండి స్టేషన్లో నిరీక్షిస్తున్నారో అని దిగులు పడ్డాం.

మేము స్టేషన్‌లో కారు ఆపేటప్పటికి తిరుపతి హౌరా ఎక్స్‌ప్రెస్ ఒకటో నంబరు ఫ్లాట్‌ఫారం మీదకు వస్తున్నట్లుగా ఎనౌన్సుమెంటు వినిపించింది. అమ్మ మమ్మల్ని సరిగా టైమ్‌కు వెళ్ళేట్లు చేసి మా కంగారు తగ్గించింది. మాకు తెల్సి ఆ రైలు ఎప్పుడూ 1వ నెంబరు ఫాట్‌ఫాము మీదకు రాలేదు.

3వ నంబరు ప్లాట్‌ఫారం మీదకు వస్తే మోసుకురావడం కష్టమని మొదటి ప్లాట్‌ఫారం మీదకు రప్పించిన అమ్మ కరుణను ఏ విధంగా కొలవగలము. కారులో నుండి ఇంట్లోకి మాతోపాటు స్టేషన్‌కు వచ్చిన మా తమ్ముడు సీతారాం తీసుకువచ్చాడు.

మా తోడికోడలు అమ్మ పాలరాతి విగ్రహానికి ఎర్రరాళ్ళ ముక్కు పుడకలు చేయించింది. కాని అవి ఈ అమ్మకు దిద్దులుగా ఎంతో బాగా అమరాయి. అమ్మకు ఏమీ లేవని మేము బాధపడకుండా ముందుగానే వాటిని సమకూర్చుకుని తరువాత రావడం విశేషం. ప్రతి నిమిషం మనతో ఉండి అన్ని అవసరాలనూ కనిపెట్టి చూచే అమ్మకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం?

మా ప్రయత్నం ఏమీ లేకుండానే ఉదయం 8 గంటలకు దశమి గురువారం నాడు ఆ విగ్రహాన్ని అమ్మ మందిరంలో ప్రతిష్ఠించాము. విగ్రహం తెచ్చిన ఆమె పెసరపప్పు, బెల్లం, పంచదార, పసుపు, కుంకుమ, జాకెట్టు గుడ్డ పెట్టి తెనాలి నుంచి తీసుకుని వచ్చారట. అమ్మను తీసుకు వచ్చేటప్పుడు కొబ్బరికాయ కొట్టి దానితో పాటే తీసుకుని వచ్చారు. అవి అన్నీ కలిపి చక్కెర పొంగలి చేయించి దాదాపు యాభైమందికి ఆ ప్రసాదాన్ని వినియోగించటం జరిగింది. ఇది అమ్మ యొక్క విశేష కృపకు నిదర్శనం కాదంటారా?

తిథులు విధిని మార్చలేవు.

అమ్మ దయ

జిల్లెళ్ళమూడిలో అమ్మకు నమ్మినబంటుగా వున్న రెడ్డి చినసుబ్బయ్య రెండవ కుమారుడు రెడ్డి సుధాకర్. సుధకు, సుధభార్యకు సరిపడటం లేదని తెలిసి రమాదేవి చేత, అడవులదీవి సుశీలక్కయ్య చేత, ఇంకా ఎందరిచేతో తన దగ్గరకు రమ్మని అమ్మ కబురు చేసింది. ఎన్నిసార్లు కబురు పెట్టినా అతను అమ్మ దగ్గరకు వెళ్ళలేదు. భార్యతో తెగతెంపులు అయిపోయింది. ఒకమారు పొలం నుంచి సుధ బండీ మీద వస్తుంటే ఒక సాధువు, నాగమణి వాళ్ళ అమ్మ బండి ఎక్కారు. ఆ సాధువు సుధతో "తప్పు జరిగింది. సరిదిద్దుకో, నాలుగు అక్షరాల పేరుగల అమ్మాయిని చేసుకో" అని చెప్పి బండి దిగి వెళ్ళిపోయాడు. తిరిగి అతని కోసం ఎంతవెతికినా కనిపించలేదు.

భగవంతుడు భక్తవత్సలుడు కదా! "నన్ను రమ్మని ఎన్ని కబుర్లు పెట్టినా నేను వెళ్ళనందున అమ్మే ఆ సాధువు రూపంలో వచ్చి నాకు సలహా ఇచ్చిందని" సుధ తెలియచేసాడు. ఆ తరువాత అమ్మ చెప్పినట్లుగా నాలుగు అక్షరాలు గల నాగమణిని చేసుకున్నాడు. భార్యాభర్తలు ఆనందంగా వున్నారు. వారిద్దరికీ ఎప్పుడూ అమ్మ ధ్యాసే, వేరే ఆలోచన, వేరే దేవుడు లేడు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా అమ్మకే నివేదించుకుంటారు.

ఒకమారు చేలో మినుములు చల్లుదామంటే విత్తనాలు లేవు. "అమ్మా! నాకు గింజలిప్పించమ్మా" అని అమ్మనే వేడుకున్నాడు. నాల్గవరోజు మూడు బస్తాల మినుములున్నాయి. కావాలా! అంటూ ఒకరు తెచ్చి ఇచ్చారు. ఇది అంతా అమ్మ మహిమేనని అతని విశ్వాసం. ఎంత అవసరం అయినా ఎవరినీ ఏమీ అడగరు. అమ్మనే కోరుకుంటారు. ఒకమారు వాళ్ళ గేదె కనిపించలేదు. దాని కోసం వెతకటంకాక భార్యభర్తలిద్దరూ అమ్మగుడిలో ప్రదక్షిణాలు చేశారు. 10 రోజుల తరువాత గేదె దానంతటదే తిరిగి వచ్చింది. "సంధ్యావందనం నేర్చుకున్నాను, సుప్రభాతం రాదు. తెల్లవారు ఝామున మెలకువరాదు అమ్మా అని అన్నాడు. "నీకు నిజంగా నేర్చుకోవాలన్న తపనవుంటే తప్పక మెలకువ

మాతృత్వం వేరూ, మాతృతత్వం వేరు.

వస్తుందని" అమ్మ అన్నది. కొన్నాళ్లు పోయిన తరువాత తెల్లవారు జామున సుప్రభాతం టైమ్ అయింది లెమ్మని ఎవరో లేపేవారు.

హైదరాబాద్ అమ్మ సేవాసమితి వాళ్ళు జిల్లెళ్ళమూడిలో మొదట్నుంచి అమ్మ దగ్గర వున్న వాళ్ళందరికీ సన్మానం చేశారు. తిరుమలక్కయ్య, అన్నపూర్ణక్కయ్య, గజేంద్రమక్కయ్య, రాముడక్కయ్య, కృష్ణవేణక్కయ్య వాళ్ళతోపాటు రెడ్డి అదెమ్మకూ సన్మానమన్నారు. సుధ ఆదెమ్మను హైద్రాబాద్ తీసుకువెళ్ళాడు. అక్కడ సభలో వారివారి అనుభవాలను చెప్తుంటే సుధవాళ్ళ అమ్మకు మైండ్ సరిగ్గా లేనందున "ఆవిడ ఏమి చెప్పగలదని ఇక్కడకు రప్పించావమ్మా! అని సుధ చాలా బాధపడ్డాడు. ఎవ్వరినీ అమ్మ బాధ పడనివ్వదు కదా! సన్మాన సభకు వెళ్ళే రోడ్డు అంతా కార్లు, స్కూటర్లతో చాలా రద్దీగా వుంది. సభకు రమ్మన్నా రెడ్డి అదెమ్మ వెళ్ళలేదు. రోడ్డుమీద నిలుచుంది. సరిగ్గా ఆమె ముందు ఒక కారు వచ్చి ఆగింది. అందులో నుంచి ఒక స్త్రీ దిగి రెడ్డి ఆదెమ్మకు బొట్టుపెట్టి చీరపెట్టింది. హైమమ్మ చీరె పెట్టిందని రెడ్డి ఆదెమ్మ చెప్పింది. హైమక్క చేత చీరపెట్టించుకునే అదృష్టం వుండబట్టే వాళ్ళు రమ్మన్నా వెళ్ళలేదు.

హైమాలయం కప్పు తీస్తుంటే వాళ్ళందరికీ ధనుర్మాసం ప్రసాదం మరికాస్త పెట్టమని సుధ అడిగాడు. అక్కడవున్న అక్కయ్య కొద్దిగానే పెట్టింది. అమ్మ ఉంటే మాకు మరికాస్త ప్రసాదం పెట్టించేది కాదా! అరటి పళ్ళైనా పంపించేది అని" సుధ అనుకున్నాడు. అంతలో ఒక కుక్క అరటిపళ్ళపెడను నోట కరచుకుని వచ్చి సుధ "మన కోసం అమ్మే పళ్ళు పంపించింది" అని అన్నాడు. అక్కడే వున్న ఒక అన్నయ్య "అమ్మ పంపటమేమిటి? ఎక్కడో ఎత్తుకొచ్చి వుంటుందని" అన్నాడు. ఒక్క పండు కూడా నలిగి పోకుండా జాగ్రత్తగా అమ్మే పంపిందని సుధ చెప్పాడు. "కుక్క పళ్ళు తింటుందా? ఏమిటి?" అన్నాడు ఆ అన్నయ్య. వెంటనే సుధ రెండుపళ్ళు తీసిపెడితే ఆ కుక్క గబగబా తినేసింది. అమ్మ మనకోసం అరటిపళ్ళు పంపించింది అని అందరికీ తలా రెండు పళ్ళు ఇచ్చాడు.

అనుభవం లేకపోతే మహావాక్యాలు మన వాక్యాలే.

సుధ భార్యను నీ అనుభవాలను చెప్పమని అడిగితే చిన్నపని, పెద్దపని అన్నీ అమ్మ చేతనే చేయించుకుంటున్నాం వేరే చెప్పేందుకు ఏముంది? ఏమిచ్చి అమ్మ ఋణం తీర్చుకోగలం అని తన సంపూర్ణ విశ్వాసాన్ని తెలియజేసింది.

జిల్లెళ్ళమూడికి బ్యాంకు పని మీద వచ్చిన వాళ్ళకు మధ్యాహ్నం మూడు గంటలకు అన్నపూర్ణాలయంలో అన్నం పెట్టించాడు. వంద ఎకరాలున్న మా ఇళ్ళలో మూడు గంటలకు అన్నం వుండదు. అలాంటిది ఏ టైంలో వచ్చినా అన్నం పెట్టగలుగుతున్నారని ఆశ్చర్యచకితులై నాలుగుబస్తాల బియ్యం తెచ్చి ఆవరణలో ఇచ్చి వెళ్ళారు. వాళ్ళు అక్కడి ప్రసాదం ఒక్కపూట తినగానే వాళ్ళకి నాలుగు బస్తాల బియ్యం ఇవ్వాలన్న ఆలోచన రావటానికి అమ్మదయే కారణం. మనం ఏంచేస్తున్నా, ఏంచేయాలన్నా అమ్మ దయలేకపోతే ఏం చేయలేము.

పిలిస్తే పలికే దైవం

"మానవిగా జిల్లెళ్ళమూడి కరణంగారి భార్య అమ్మ. ఆ సంబంధమే లేకుంటే అమ్మ మనకు అందే వుండకపోను. కష్టమో నష్టమో అమ్మ ఆ గిరిలో వుండబట్టే మనం పుణ్యమహో, పుణ్యమహో, పుణ్యతవదర్శనం" అని అనుకోగల్గుతున్నాము" అన్నారు శ్రీపాద అన్నయ్య.

జిల్లెళ్ళమూడి అమ్మ అంటే ఆ నాలుగు గోడల మధ్య మంచం మీద కూర్చున్నదే అమ్మ కాదని, తనకు గోడలు అడ్డురావని సహస్రాక్షి, సహస్రప్రసాద్ అయిన అమ్మ ధృవీకరించింది. తనకు మూడు కాలాలు లేవని వున్నదంతా ఒకటే కాలమని తెలియచేసింది. కాలస్వరూపిణి అయిన అమ్మ సిద్ధి పొందటానికి ముందుగానే 'విశృంఖల' నవుతున్నానని చెప్పింది.

అమ్మ సశరీరంగా దగ్గరకు తీసుకొని మనలను సంతృప్తి పరచింది. అట్టి అమ్మ దూరమైతే బ్రతకగలమా అని వ్యధ చెందిన మన అనుమానాలన్నింటినీ దూరం చేసి ఎక్కడికక్కడే తన జగన్మాతృత్వాన్ని విశదపరుస్తోంది అమ్మ.

తల్లికి బిడ్డ సొమ్ము. బిడ్డకు డబ్బు సొమ్ము.

విశాఖ అమ్మ మందిరంలో సుప్రతిష్ఠిత అయిన తరువాత మా బిల్డింగ్ పూర్తి అయి మేము అక్కడికి వెళ్ళటం జరిగింది. మేమున్న ఇంటికి దూరంగా వుండటం వల్ల అమ్మ మందిరం ప్రక్కనే వున్న వల్లభజోస్యుల లక్ష్మిగారే ప్రథమ పూజారిణి అయింది. ఆమె ద్వారా నిత్య నైవేద్య దీపారాధనలు జరిపించుకొని ఆమెకు ఎనలేని శాంతిని, తృప్తిని కలుగచేసింది అమ్మ.

వారి మూడవ అమ్మాయి ఉష ఎం.ఎ., ఇంగ్లీషు చేసి, ఎమ్.ఫిల్., చేసింది. ఎన్నెన్నో సంబంధాలు వచ్చినా కొన్ని జాతకాలు కుదరలేదని, కొందరు చదువు ఎక్కువని తిరిగిపోయారు. ఆవిడ అమ్మకే మొరపెట్టుకుంది. కరుణామయి అమ్మ దేహాన్ని వదిలివేసి విశ్వజనని అయింది. ఆ తరువాత తాను చెప్పినట్లుగా శృంఖలాలను వదిలించుకొని మనను అనుగ్రహించటమే అమ్మకు ధ్యేయం అయింది. అట్టి అమ్మ ఆవిడ మొరవినకుండా వుంటుందా?

అమ్మకు 75 వసంతాలు నిండిన సందర్భంగా జరిపిన అమృతోత్సవాలలో లక్ష్మిగారు, ఉషా కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో లక్షిగారికి పూళ్ళ అమ్మాయి సంగతి (అనసూయవ్రతకల్పంలో వివరణ వుంది) గుర్తుకు వచ్చి మళ్ళీ నీ పుట్టిన రోజులోగా మా అమ్మాయి ఉషకి వివాహమవ్వాలని హైమను, అమ్మను కోరుకుంది. వరాలిచ్చే దేవత మన హైమక్క ఆవిడ కోరుకున్నట్లుగానే 1999 నవంబరు 17న మంచి సంబంధం వచ్చి నిర్విఘ్నంగా పెండ్లి జరిగింది. సం॥లోపల అన్నట్లుగానే హైమక్క జన్మదినానికి ఒక రోజు ముందు పెండ్లి జరగటం ఆశ్చర్యమే. 2000 అక్టోబరు 24న పాపకు జన్మనిచ్చింది.

ఆ పుట్టిన వెంటనే ఆ పిల్లలను హైమా అని పిలిస్తే ఇంతలేసి కళ్ళుచేసుకొని "ఊ" కొట్టటం చూచిన అందరం ఆశ్చర్యచకితులమయ్యాము. మీరు ఏ పేరు పెట్టుకున్నా సరే నేను "హైమా" అనే పిలుచుకుంటానని లక్ష్మిగారు వాళ్ళ అమ్మాయికి చెప్పారు. ఎటువంటి నమ్మకంలేని ఉషకు హైమక్క వరాలిచ్చే దేవత. హైమక్క చేసినా అమ్మకు చేసినా ఒక్కటేనని వారిద్దరికి బేధం లేదని ఉష విశ్వాసం.

సత్యమే కఠోరమైనది. కఠోరసత్యం కాదు.

విశాఖలో ప్రతి శుక్రవారం, అమావాస్య పౌర్ణమిలకు విశాఖ అమ్మ మందిరంలో సామూహిక పూజలు జరుగుతాయి. ఆ పూజలకు క్రమం తప్పకుండా సత్యనారాయణ రాజుగారి దంపతులు విధిగా వస్తారు. వారు అమ్మను సర్వాత్మనానమ్మినవారు వారి బంధువర్గం కూడా తరుచూ పూజలకు వస్తుంటారు. మొదటి పూజకు వచ్చేటప్పటికి పెళ్ళివారు వచ్చి చూసుకోవటం 3వ పూజ అయ్యేటప్పటికి పెళ్ళి అవటం జరుగుతోంది.

ఈ విధంగా నలుగురి పిల్లలకు జరిగింది. అందువల్ల అమ్మ వారి కుటుంబాలలో కొంగు బంగారమై నిలిచింది.

రాజు గారి 2వ కొడుకుకు మెరైన్ ఇంజనీరింగులో సీటు వచ్చింది. వారు సామాన్య కుటుంబీకులు, అంత ఖర్చుకు తూగలేమని, చదివించటం కలలో మాట అనుకున్నారు. అమ్మ ఏ నిమిషాన ఎవరికి ఏ బుద్ధి పుట్టిస్తుందో ఆమెకే ఎరుక. ఆయన అన్నదమ్ములు, మేనల్లుళ్ళు, బంధువర్గంలో తలా పాతికవేలు వేసుకుంటామని ఆ పిల్లవాడిని చదివించాలని పట్టుబట్టారు. ఒక సంవత్సరంతో అయ్యేది కాదు కదా! ఆ దంపతులకు ఎటూ పాలుపోలేదు. అమ్మనే 'సర్వస్యశరణాగతి' అనుకున్నారు.

రాజుగారి బావగారైన యు.ఎ.ఎన్. రాజు గారు అనేక ధార్మిక సంస్థలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విరాళాలిచ్చారు. జిల్లెళ్ళమూడి లో అన్నపూర్ణాలయానికి రెండు లక్షలు విరాళం ఇచ్చారు. సరే ఆయన్నే అడుగుదామని దంపతులు నిర్ణయించుకున్నారు. ఈ సంగతి విని రాజుగారు ఇంత మటుకు అనేక సంస్థలకు ఇచ్చాను. ఇక నుంచీ చదువుకునే స్తోమతలేని, ఆసక్తికలిగిన విద్యార్థులకు చదువు చెప్పిస్తానని, ఆ పిల్లవాడి చదువు బాధ్యత పూర్తిగా తానే భరిస్తాననటం వారి దాతృత్వానికి చిహ్నం. నాలుగు సం॥లు ఆయన మీద బరువు మోపడం సబబు కాదని 2 సం॥ చెప్పించండి. ఆ తరువాత నేను రిటైరైనాక వచ్చే డబ్బుతో చెప్పించుకుంటామనటం వీరి

మంచితనానికి ప్రతీక. ఈ రెండు సం॥లు వడ్డీ కూడా వుండదు కాబట్టి ఆ సాయమే ఎంతో ఎక్కువ అని అన్నారు.

కారుణ్యమూర్తి అయిన అమ్మను ఎవరు ఆర్తితో పిలిచినా 'ఓ' అంటూ పలుకుతుందనటానికి నిదర్శనమే పై రెండు సంఘటనలు.

వాత్సల్యామృత వర్షిణి - అమ్మ

మా ఇంట్లో ప్రతి శుక్రవారం అమ్మ పూజ 1974 నుంచీ అవిచ్ఛిన్నంగా జరుగుతోంది. శుక్రవారం పూజకు దండలు కూడా కట్టలేదు. ఒంట్లో ఏమీ బాగాలేదు. చాలా దిగులుగా వుంది. మళ్ళీ అసుపత్రిపాలు అయి అందర్నీ ఇబ్బంది పెట్టాల్సివస్తుందని బాద అనిపించింది. అలాగే లేని ఓపిక తెచ్చుకుని పూలు కట్టాను. మందులు డోసు పెంచి వేసుకున్నాను. కానీ తెరిపి ఇవ్వలేదు. విపరీతమైన దగ్గు, ఆయాసం. ముందు రోజు జన్మభూమి కార్యక్రమంలో తుక్కు మంట పెట్టారు. ఆ పొగవల్ల, సాయంత్రం పార్టీ అయితే ఆరుబయట కూర్చోవటంతో మంచు పడినందున అంత బాధపడ్డాను. గుండెల్లో నొప్పో, దగ్గో, కీళ్ళనొప్పో అర్థం కావటం లేదు. తగ్గుతుందన్న ఆశ ఏ కోశాన కన్పించటం లేదు. పూజకు వెళ్ళి కామ్‌గా కూర్చున్నాను. పూజ అవుతున్నప్పుడు ఈ రోజు ఎవరైనా అమ్మ బొట్టు పెడితే నాకు తగ్గుతుంది లేకపోతే ఆసుపత్రికి వెళ్ళాల్సిందే అని అనిపించింది.

కృష్ణ కూడా ఇంట్లో లేడు. ఆయన ఖంగారుపడ్డారు. సరే మెల్లిగాలేచి అమ్మ కుంకుమ నేనే పెట్టుకున్నాను. నా మనస్సులో ఎవరైనా నేను అడగకుండా అమ్మ కుంకుమ పెట్టాలని, పెడితేనే తగ్గుతుందన్న ఆలోచన వచ్చింది.

ఈ లోగా జె.యస్.యన్.మూర్తి గారి భార్య సీతగారు వాళ్ళ పెద్ద కోడలు కైలాసగౌరి నోము ఆదివారం నోచుకుంటుందని బొట్టుపెట్టి మరీ పలిచారు. నా ఆనందానికి అవధులు లేవు. ఆ రోజు సగ్గుజావ త్రాగి నిద్రమాత్ర వేసుకుని

పెట్టింది ముహూర్తం కాదు. జరిగిందే ముహూర్తం.

పారాయణ చేసుకుంటూ పడుకున్నాను. బాధ మాత్రం దగ్గలేదు. అలా ఎప్పటికో నిద్ర పట్టింది.

కలలో "శ్రీశ్రీశ్రీ పూర్ణానంద స్వామీజీ" మేడ మీద వారి ఇంటికి వచ్చినట్లు తెలిసింది. ఆయన దర్శనం చేసుకుని మా ఇంటికి ఆహ్వానించాలని ఎంతగానో వుంది. కానీ లేవలేని స్థితి ఏమిటమ్మా! ఇలాంటి విషమ పరీక్ష పెట్టావని అమ్మనే ప్రార్థించాను. ఇంతలో స్వామీజీ క్రిందకు మా ఇంటికి వచ్చి మా పూజలో పెట్టే యంత్రాలను, విగ్రహాలను చూస్తున్నారు. నేను వెళ్దామనుకుంటే ఆయనే వచ్చారే! అన్న ఆనందంతో అప్పటి వరకూ లేవలేని స్థితిలో వున్న నేను గబ గబా లేచి వెళ్ళి నమస్కారం చేసుకున్నాను. ఆ తరువాత బాగా నిద్ర పట్టింది. నాకు ధైర్యం చెప్పటానికే అమ్మ సీతగారి చేత బొట్టు పెట్టించటం, ఆ రాత్రి స్వామీజీ కలలోకి రావటం జరిగింది. అమ్మ అనురాగ మూర్తికదా! ఎవరు బాధ పడ్తున్నా చూడలేదు. తన వాత్సల్యామృత వృష్టిని మనపై కురిపిస్తుంది. స్వామీజీ ఆశీస్సులు సర్వదా మాకు వున్నాయని తెలియజేయటానికే ఆయన కలలోకి వచ్చారని నా ధృఢ విశ్వాసం.

అమ్మ విశాఖ పక్షపాతి

జి. కొండలరావు విశాఖ నివాసి. ఆటోడ్రయివరు. కోర్టుకేసులతో చాలా యమయాతనలు పడ్డాడు. ఆ ఇబ్బందులలోనించి ఎలా బైటపడాలో ఏం చేయాలో పాలుపోలేదు. అమ్మ పూజకు వచ్చినప్పుడు అమ్మను అర్చించుకుంటే నీ ఇబ్బందులన్నీ తొలగిపోతాయని అమ్మ ఫోటో, కుంకుమ ప్రసాదం ఇచ్చాను. అమ్మను కొలుచుకుంటున్నప్పటి నుంచి ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కొనేటటు వంటి శక్తిని కలుగచేసిందని ఆనందంతో చెప్పాడు.

కోర్టు కేసుల గురించి కూడా బెంగ, భయం తొలగిపోయాయి. ఏం జరిగినా "అమ్మ నావెంట ఉంది. నాకు దిగులేమిటి?" కోర్టు కేసులో పెద్ద పెద్ద గూండాలు, పెద్ద పెద్ద అధికారులున్నా ఎదుర్కొనే శక్తి స్థైర్యం అమ్మే

వింటే విమర్శకానీ, కంటే విమర్శలేదు.

కలుగచేసింది. పిల్లలకు ఆరోగ్యం సరిగా లేనప్పుడు చక్రవర్తిగారి దగ్గర మందులు తీసుకోమని అమ్మ చెప్పిందని, అప్పటి నుండి ఎవరికి ఆరోగ్యం సరిగా లేకపోయినా వేరే డాక్టర్ల దగ్గరకు వెళ్ళక యిక్కడే మందులు తీసుకుంటున్నాడు.

అన్నీ చూచుకునే అమ్మ ఉండగా నాకు దేనికీ దిగులు ఉండదనే భరోసా కలిగింది. ఒకసారి పిల్లవాడికి జబ్బు చేసినప్పుడు డాక్టర్లు లాభం లేదని చెప్పారు. అతను ఏడుస్తూ పడుకొని వుంటే ఒక ముసలమ్మ కనిపించి నీ పిల్లవాడికి ఏమీ ఇబ్బంది ఉండదు కులాసాగా ఉంటాడని చెప్పింది. ప్రసాదరావుగారికి చెబితే అమ్మే ఆ విధంగా వచ్చిందని, అమ్మ పరిపూర్ణ కటాక్షం మీ మీద ఉందని చెప్పారు.

అతనికి యిద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల, పెద్ద పిల్లవాడికి ఏలూరు సి.ఆర్.ఆర్. కాలేజీలో పి.జి. లో సీటు వచ్చింది. 37 మందిలో వీళ్ళ అబ్బాయి ఒక్కడికే ఏ రికమండేషనూ, ఏ డొనేషను లేకుండా అతనికి కావాలనుకున్న దానిలో సీటు వచ్చింది. అమ్మ వుండగా నాకేం దిగులు, అంతా అమ్మే చూచుకుంటుందన్న ధీమా వ్యక్తం చేశాడు కొండలరావు ఆడపిల్లకు 1500/- రూ.ల ఉద్యోగం మంచి సంబంధం కుదిరిందన్న విషయం పరవశంతో చెప్పాడు. ఆ కోర్టు కేసు గెలిస్తే ఎక్కడో చిన్న ఇల్లు వేసుకుని అమ్మను అర్చించుకుంటూ కాలం వెళ్ళ దీస్తామని చెప్పాడు. అమ్మ అనుగ్రహం వల్ల ఆ కోర్టు కేసులు తననేమీ చేయలేవు అని అతని నమ్మకం. అలాగే కోర్టు కేసులు గెలవటంకు అమ్మ కరుణే కారణమని అతని విశ్వానం.

మొదటి సారిగా జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు రామకృష్ణ అన్నయ్య ఎంతో ఆదరంగా చూసాడని, గర్భగుడిలో అభిషేకం చేసుకున్నానని ఎంతో ఆనందంతో చెప్పాడు. అమ్మను దర్శించుకున్న నాటి నుంచి తన కష్టాలన్నీ దూది పింజల్లాగా ఎగిరిపోయి తనకు మనఃశాంతిగా ఉందని చెప్పాడు. అతను అన్నపూర్ణాలయ 40వ వార్షికోత్సవం నాడు అమ్మను దర్శించుకున్నాడు.

మనస్సే మంత్రం, శబ్దమే బీజం. దాని నిలకడకు అక్షరాలు.

అతను చెప్పిన విషయాలు విన్న రామకృష్ణ అన్నయ్య "విశాఖ నుంచి వచ్చిన కొండలరావు ఇక్కడ అభిషేకాదుల చేసుకుని సంతృప్తిగా తిరిగి వెళ్ళాడు. నాకు చూడగా చూడగా అమ్మ విశాఖపట్టణం పక్షపాతి అయిపోయిందేమో ననిపిస్తోందని" 1998 ఆగష్టులో ఉత్తరం వ్రాసాడు.

ఆర్తి - ఆవేదన

కళ్ళేపల్లి మోహనరావు గారు, సరోజిని విశాఖ నివాసులు, మోహన్‌రావు గారికి 25 సం॥ల క్రితం అమ్మ ఫోటోను ఎక్కడ పెట్టాలా అని ఆలోచించి ఇల్లంతా తిరిగి చివరకు ఆయన బీరువాలో పెట్టుకున్నారు. ఆ రోజు నుంచీ ఆయన జీతం కానీయండి, ఏ రకంగా తనకు డబ్బు వచ్చినా దానిని ముందుగా అమ్మ దగ్గర పెట్టేవారు. అది బస్టుసైజు ఫోటో. కాని ఆయన అమ్మ పాదాల మీద పెడ్తున్న అనుభూతిని పొందేవారు. ఆ డబ్బు తీసుకొని వాడుకొంటున్నప్పుడు అమ్మ తన ఒడిలో నుంచి ఇస్తున్న భావన కలిగేది. చాలామందిని జిల్లెళ్ళమూడి ఎలా వెళ్ళాలని అప్పట్లో అడిగారు. ఎవరూ తెలియదని చెప్పటంతో "నిన్ను చూడాలని అనుకున్నా చూడలేక పోతున్నానని" బాధపడి అంతటితో ఆ విషయం వదిలేసారు.

కాని రోజూ అమ్మకు నమస్కరించుకోవడం మానలేదు. ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మొగపిల్లలు, ఆడపిల్లలకు అనువైన సంబంధాలు వచ్చి వారు హాయిగా వున్నారు. పెద్ద కుమారుడు పుట్టపర్తిలో కంప్యూటర్సులో పని చేస్తున్నాడు. చిన్న అబ్బాయి తనతో పాటు సేల్స్‌టాక్స్ ప్రాక్టీషనర్‌గా విశాఖలోనే పని చేస్తున్నాడు. ఈ రోజు వరకూ ఎటువంటి సమస్య లేకుండా వున్నారు. 75% జీవితంలో అన్నీ సవ్యంగా జరిగాయి. మిగిలిన 25% నీవే చూచుకోవాలని ఆ రోజు అమ్మకు నమస్కరించుకుంటున్నారుట.

మూడు రోజుల క్రితమే వాళ్ళ అబ్బాయి "డబ్బు ఎందుకు ఆ ఫోటో దగ్గరే పెడ్తారు" అని అడిగాడు. అంతమటుకూ ఈ 25 సం॥లో ఎవరూ

భావం మారేటినా, స్వభావం మారనిది.

అడగలేదు. ఆ రోజు బాబు అడిగితే భార్యను కూడా పిలిచి తాను ఎందుకు డబ్బు అక్కడ పెడ్తున్నదీ, తన భావన గురించి వారికి తెలియజేసారు.

"కరూర్ వైశ్యాబ్యాంకు" లాసన్స్‌బే లో వున్న బ్రాంచి కి వెళ్లి మామూలుగా వచ్చే రోడ్డులోకాక వెనుక రోడ్డు నుండి వారింటికి వెళ్తున్నారు. కొత్తగా కట్టిన అపార్టుమెంటు కనిపిస్తే అందులో ఖాళీలు వున్నాయా? అని వాచ్‌మన్‌ని అడిగారు. ఈ లోగా వాళ్ల బాబు నాన్నగారూ "ఇక్కడ జిల్లెళ్ళమూడి అమ్మవారి మందిరం వుందని" చెప్పాడు. అప్పుడే చక్రవర్తిగారు క్రింద ఆఫీసు నుంచి పైకి రావటానికి వస్తున్నారు. ఈయన్ని చూచి మందిరం మీరు కట్టుకున్నారా? అని ఆర్తిగా అడగటంతో వారిని పైకి రమ్మని పిలిచి నన్ను పరిచయం చేసారు.

ఆయన "నేను ఎన్నో రోజులుగా చూడాలనుకున్న అమ్మ ఇవ్వాళ దర్శనమిచ్చింది". ఉదయం నా జీవితంలో మిగిలిన 25% చూడమని వేడుకోవటం, మూడు గంటలలో అమ్మ తనకు ఇలా దర్శనమిచ్చిందని పరవశంతో చెప్పారు. ఆ మందిరంలో అమ్మ విగ్రహంలా కాక శరీరం, కరచరణాదులతో కూడిన అమ్మ కనిపించిందని, అమ్మకు నా యందు ఎంతో వాత్సల్యంతో ఉందని" ఆయన చెప్పింది విని ఆశ్చర్యంతో తలమునకలయ్యాము. అమ్మ సాహిత్యం ఏమైనా ఇవ్వమంటే నా దగ్గర వున్న పుస్తకాలు ఇచ్చాను. వారం వారం జరిగే పూజలకు తప్పక వస్తామని తండ్రి కొడుకులు చెప్పారు.

మోహనరావు గారి ఆర్తి ఆవేదనలకే అమ్మ ఆ విధంగా ఆయన్ని కరుణించి దర్శనమిచ్చింది.

ఘటనా ఘటన సమర్థ అమ్మ

కలియుగంలో జన్మించి అరిషడ్వర్గముల జయించి "స్వయం తీర్ణః పరాంస్తారయతి" తను తరించి మానవాళికి తరుణోపాయమును జూపిన మహర్షి త్యాగరాజు, "సంసారులైతే నేమయా శిఖింఛా వతంసు డెదుట నుండగ" అని సంసారులైన వారికి భక్తి-జ్ఞాన-మోక్షములు సాధ్యములని, తాను గృహస్థు

అనుభవం శాస్త్రాన్నిస్తుంది. కాని శాస్త్రం అనుభవాన్నివ్వదు.

ధర్మాన్ని ఆచరించి, మన గమ్యానికి చేరటానికి మార్గాన్ని సూచించాడు త్యాగరాజస్వామి.

శ్రీ బొమ్మరాజు శ్రీరాములు గారు బొల్లాపల్లి కరణం గారు. ఆయన వైష్ణవ భక్తులు. వారి అమ్మాయిలు మునిపల్లె రాధ, సుబ్బలక్ష్మి 1960 సం॥లో కొమ్మూరు డాక్టరు అనంతసీతాచలంగారు పెళ్ళి సంబంధం నిమిత్తం బొల్లాపల్లిలో శ్రీరాములు గారింటికి వెళ్ళారు. "మనం ఇక్కడకు వచ్చిన విషయం అమ్మకు తెలిసే వుంటుందనుకున్నారు". అక్కడే వున్న సుబ్బలక్ష్మి అక్కయ్య "మీరు మీ అమ్మ గారికి చెప్పకుండానే వచ్చారా?" అని ఆశ్చర్యం వెలిబుచ్చింది. ఆ రోజుల్లో ఏ పని తలపెట్టినా ఇంట్లో పెద్ద వారి అనుమతి తీసుకొని చేయడం ఆనవాయితీగా వుండేది.

దానికి డాక్టరు గారు "అమ్మ అంటే మా అమ్మ కాదు. జిల్లెళ్ళమూడి అమ్మ". ఆమె చాలా శక్తివంతురాలు. అవతారమూర్తి అని కిరీటధారిణి అయిన అమ్మ ఫోటో ఒకటి ఇచ్చారు. అచంచల విశ్వాసంతో వారింట్లో వారు అమ్మను కొలవసాగారు. దాని ప్రభావం వల్ల కొద్ది రోజులకై అమ్మ దర్శన భాగ్యం కలిగింది.

వీళ్ళు జిల్లెళ్ళమూడిని చేరేటప్పటికి హరిదాసుగారు అమ్మకు హారతి ఇస్తూ "పరమాత్మవైన నా అమ్మా" అని రాజు బావ వ్రాసిన హారతి పాటను పాడుతున్నారు. అమ్మను దర్శించగానే సుబ్బలక్ష్మి అక్కయ్యకు ఎనలేని దుఃఖం వచ్చింది. శ్రీరాములు గారికి శంఖ చక్రాదులతో విష్ణుమూర్తిలా దర్శనమిచ్చింది అమ్మ. దానితో "నా విష్ణుమూర్తి ఇక్కడే వున్నాడని" తరుచు అమ్మను దర్శించేవారు శ్రీరాములు గారు.

మర్నాడు అమ్మ సమక్షంలో వీరంతా కూర్చున్నప్పుడు అమ్మ "నాన్నా ఇక్కడ ఎవరికి తోచిన పని వారు చేయచ్చని" సెలవిచ్చింది. వెంటనే సుబ్బలక్ష్మి

ఆశా అసంతృప్తుల కలయికే జీవితం.

అక్కయ్య వడ్డనకుపక్రమించింది. వడ్డించేటప్పుడు బకెట్టులోకి కూర తీసుకొని ఎంత వడ్డించినా, తిరిగి వచ్చేటప్పటికి అందులో కూర అందులోనే ఉండటంతో విస్మయచకితురాలై శక్తిమంతురాలైన ఆ పరమేశ్వరియైన అమ్మ లీలా విన్యాసమేనని" అనిపించేదనీ పరవశంతో తెలియజేసింది.

1978 సం॥లో మునిపల్లె రాధమ్మ గారి అమ్మాయి సీతను, రామకృష్ణ అన్నయ్య మేనల్లుడైన లాలాతో వివాహం జరపటానికి నిశ్చయమైంది. పెళ్ళికి చీరాల నుంచి జీపులో బాపట్ల దాకా వచ్చారు. రాత్రి 9.30 ని॥లు అయింది. జీపు చెడిపోవడంతో బంధువులంతా ఆందోళన చెందారు. రేడియోల్లో తుఫాను హెచ్చరికలు వినవస్తున్నాయి. బాపట్ల సముద్రతీరం కావడంతో విపరీతమైన గాలి, వర్షం, ఆ సమయంలో ఏమి చేయాలో తోచక నిశ్చేష్టులైనారు. సుబ్బలక్ష్మి అక్కయ్యకు అమ్మయందు కల అమితమైన విశ్వాసంతో "అమ్మ నామం చేద్దామని" చెప్పింది. అమ్మ నామం మినహా శరణాగతి లేదు, నామం చేస్తే ఎటువంటి విపత్తులైనా దూదిపింజల మాదిరిగా ఎగిరిపోతాయి కదా! అంతా నామం చేయసాగారు. మన నమ్మకాన్ని ఒమ్ము చేయదు అమ్మ. ఆ తుఫాన్‌లోనే జిల్లెళ్ళమూడి వ్యాన్ రావటం ఎట్టి ఒడుదుడుకులకు లోనుకాకుండా పెళ్ళి సమయానికి జిల్లెళ్ళమూడి చేరగలగటం అమ్మ దయే కారణం. పెళ్ళికూతురు సీతకు అన్ని వేడుకలు అమ్మ చేతుల మీదగా జరగటం అదృష్టం.

సుబ్బలక్ష్మి అక్కయ్యకు అమ్మను చూచినప్పటినుంచీ సకల దేవతలు అమ్మలోనే దృశ్యమానమయ్యేవారు. ఆటుపోటుల మధ్య నలిగిపోతున్న అక్కయ్య వీపు చరచి ఎనలేని ధైర్యాన్ని ప్రసాదించింది అమ్మ. వాళ్ళ ఊళ్ళో పాములూ, తేళ్ళు కుట్టిన వాళ్ళు ఇంటికి వస్తే అమ్మ కుంకుమే మందుగా ఇచ్చేది అక్కయ్య. ఏడుస్తూ వచ్చిన వాళ్లు నవ్వుతూ వెళ్ళటంతో అక్కయ్యకు అమ్మ యందు ఎనలేని గురి ఏర్పడింది. అమ్మ దర్శనానికి వెళ్లినప్పుడు దోసిళ్ళతో అక్కయ్యకు కుంకుమ పొట్లాలు పోసి "నీకు వైద్యానికి కావాలి కదా!" అన్నది అమ్మ. ఈ సంఘటనతో

అమ్మ ఘటనా ఘటన సమర్ధ అన్న విషయం అమ్మ యొక్క సర్వ వ్యాపకత్వం అవగతమైంది.

సుబ్బలక్ష్మి అక్కయ్య రాధమ్మ గారి అబ్బాయి ప్రేమకుమార్‌ని దత్తత తీసుకోవాలని మనసులో అనుకుంది. కానీ పైకి ఎవరితో చెప్పనైనా లేదు. అమ్మ వారిద్దరి చేత పూజ జరిపించుకొని దండలు వేసి పుష్పాభిషేకం చేసింది. ఆ తరువాత నెలలో అమ్మ భౌతికంగా కనుమరుగైంది. మనం చెప్పకుండానే మన కోరికలు పుష్పించి ఫలవంతం చేసే అమ్మను ఏమని కీర్తించగలము?

హైద్రాబాదులో బంధువుల ఇంటికి వెళ్తూ రాత్రి 7.30 ని॥లకు దారి తప్పింది సుబ్బలక్ష్మి అక్కయ్య. ఎటు వెళ్ళాలో పాలు పోక దారీ తెన్నూ గానక తపిస్తోంది. ఇంతలో ఇద్దరు ఆడపిల్లలు వాళ్ళంతట వాళ్ళే అక్కయ్యను పలకరించి "మామ్మగారూ ఎక్కడికి వెళ్ళాలని అడిగి, వాళ్ళ చుట్టలింటి దగ్గర దింపి వెళ్లారు". నా ఆర్తి, ఆవేదనలను కనిపెట్టి అమ్మే ఆ రూపంలో వచ్చి వుంటుంది. ఇది ఖచ్చితంగా అమ్మ అనుగ్రహమే! లేకపోతే ఈ రోజుల్లో ఇంట్లో వున్న వారినే పట్టించుకోని పిల్లలు, రోడ్డు మీద ఎవరో వెతుక్కుంటుంటే సాయం చేయటం అనూహ్యం కదా!" అన్నది అక్కయ్య.

1992లో గుండెల్లో నొప్పి వచ్చింది. అనురాగ వల్లరి అయిన అమ్మే కాపాడిందని అక్కయ్య విశ్వాసం. కష్టాల సుడిగుండంలో పడి కొట్టుకుంటున్నప్పుడు కన్న తల్లిలా ప్రతిసారీ గట్టెక్కించే అమ్మను మనసా, వాచా, కర్మణా అర్చించుకోవటం తప్పించి ఎవరం మాత్రం అంతకంటే ఏమి చేయగలం?

అమ్మ సన్నిధిలో వున్నప్పుడు అమ్మ పొట్టమీద రాసుకుంటూ "ఇది వైజాగ్ వాళ్ళది, ఇది గుంటూరు వాళ్ళది, ఇది హైద్రాబాద్ వాళ్ళది" అనేది. అక్కడ వున్న సుబ్బలక్ష్మి అక్కయ్య "నీవు అక్కడికి వెళ్ళి ఆరగించావా" అని అడిగింది. వాళ్ళు అంత భక్తిశ్రద్ధలతో పూజ చేసుకొని ప్రసాదం ఇస్తే స్వీకరించకుండా

మరుపురాకపోవడమే మంత్రసిద్ధి.

ఎలా ఉంటానని, ఈ రోజు ప్రసాదం చాలా బాగుందని అమ్మ అంటుండేదని అక్కయ్య చెప్తే మురిసిపోవటం మన వంతు అవుతుంది.

అవధూత కాని అవధూత

సాధనా మార్గంలో ఉన్న వారికి సంసారంలోని బాధలేవీ అంటవు. తామరాకు మీద నీటిబొట్టులా వారి జీవితం సాఫీగా జరిగిపోతుంది. టి.వి. రామకృష్ణ గారు ఏలూరులో టీచర్‌గా పనిచేసారు. చాలా నిక్కచ్చి మనిషి, నిర్మలమైన హృదయము. ఆయన గురువుగారైన మురాల నారాయణరావు గారు పేదలకిచ్చే యిల్లు ఆయనకు ఇప్పించారు. "నేను జీతం పుచ్చుకుంటున్నాను. పేదలకిచ్చిన ఇల్లు స్వీకరించటంలో ఎంత ఔచిత్యముందని మధనపడ్డారు. ఆ రాత్రి స్వప్నంలో అమ్మ కనిపించి నాన్నా! "పేదలకిచ్చిన ఇల్లు కదా" అన్నది. దానితో ఆయనకు మనస్తాపం తీరి వెంటనే గవర్నమెంట్‌కు స్వాధీనం చేశారు. నిత్యావసరాలకు గడ్డుగా వున్నా కూడా పరుల సొమ్ముకు ఆశించని ధీరుడు రామకృష్ణ మాష్టారు.

ఆయన శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యులు. నిత్యం దుర్గాసప్తశతి పారాయణ చేస్తారు. చాలాకాలం తరువాత అమ్మ సన్నిధికి చేరారు. ఆ పారాయణ చేయటం వల్లనే దుర్గ అయిన అమ్మ చెంతకు చేరగలిగానన్న విశ్వాసం మెండు. రామకృష్ణ పరమహంసను ఎలా సేవించారో అదే విధంగా అమ్మను కొలిచారు. జాతక ప్రకారం ఆయనకు మారకదశ. అమ్మ దరి చేరటంలో ఆ మృత్యువే భయపడి పారిపోయిందన్న నమ్మకం. "అమ్మే ఆ మృత్యుగండాన్ని తప్పించిందని" అంటారు.

దినకర్ సంస్థను నడపటానికి చాలా ఇబ్బంది పడుతున్నాడు. సంస్థలో ఎప్పుడూ దినదినగండం నూరేళ్ళాయుష్షు అన్న విధంగా ఉండేది. అమ్మ అన్నింటికీ అతీతంగా సాక్షిగా చూచేది తప్ప ఏమీ మాట్లాడదు. మా నాన్నగారు

దేశ సేవ, దేవుని సేవ, రెండూ వేరుకాదు.

శ్రీ అన్నంరాజు మాధవరావుగారితో "సంస్థలో రూపాయి డబ్బు ఉండదు గానీ లక్షల రూపాలయల పనులు జరిగిపోతాయి" అని చెప్పింది.

అన్నపూర్ణాలయంలో పాలు పోసే అతనికి రూ. 600/- లు ఇవ్వాలి. ఆ డబ్బులిస్తేనే పాలు పోస్తానన్నాడు. దినకర్‌కు ఏమీ పాలుపోలేదు. కౌంటర్ దగ్గరవున్న రామకృష్ణ మాష్టారితో "డబ్బు ఏమైనా ఉందా?" అని అడిగాడు. పది రూపాయలు మాత్రమే వుంటుందంటూ అమ్మను తలుచుకొని కౌంటర్‌లో చేయిపెట్టి వెతికారు. సరిగా అప్పటికి అవసరమైన 600 రూ. ఆయన చేతికి వచ్చాయి. సంస్థ పరువు పోకుండా అప్పటికప్పుడు అమ్మ సృష్టించిన ధనమే అయి ఉంటుంది. ఒక్క సంస్థ విషయంలోనే కాదు తన బిడ్డలందరికీ ఎప్పటికేది అవసరమో దానిని సృష్టించి ఇవ్వగలిగిన అమ్మ సర్వసృష్టికారిణి కదా!

మాష్టరు గారు తన గురించి కాని, తన కుటుంబం గురించి కాని ఎప్పుడూ ఆలోచించేవారు కాదు. ఒకమారు అప్పారావన్నయ్య "పిల్లల గురించి ఏమి ఆలోచించావు?" అని అడిగాడు. సర్వాంతర్యామి అయిన అమ్మ వుండగా మనకు ఆలోచనలెందుకు? అమ్మే అన్నీ చూసుకుంటుందన్నారు. ఆ సమాధానానికి అప్పారావన్నయ్య తృప్తి చెందక ఆయన్ని అమ్మ దగ్గరకు తీసుకువెళ్ళాడు. అమ్మ వినేటట్లుగా అన్నయ్య ఆయన్ని పిల్లల గురించి ఏమి ఆలోచించావు? అని అడిగాడు. శ్రీ రామకృష్ణ మాష్టారు త్రికరణశుద్ధిగా అమ్మ మీద నమ్మకం ఉన్నది కాబట్టి మౌనం వహించారు. అమ్మ "వాడిని అడుగుతావేమిటిరా? ఆ సంగతి నన్ను అడుగు" అన్నది. మామూలుగా కష్ట సుఖాలన్నింటినీ అమ్మకు చెప్పుకోవాలని అనుకుంటాం. మాష్టారు నిస్వార్థంగా సంస్థలో పనిచేసే వారే కానీ అమ్మను ఎక్కువగా దర్శించుకునే వారు కూడా కాదు. దేనిని అమ్మను కోరకపోవడం, జరిగేదాన్ని చూస్తూ నిశ్చింతగా ఉండటం, ఆయన స్థితప్రజ్ఞతకు తార్కాణం. "సర్వస్యశరణాగతి" అన్నవారి కష్టసుఖాలను అమ్మే చూచుకుంటుంది కదా!

అయన సంస్థలో ఉన్నా ఎవరినీ నొప్పించక తన పని తాను చేసుకు

ఏం చేసినా ఎవరిమీద అయిష్టత కలగదో వాడే ఇష్టదైవం.

వెళ్ళేవారు. "చిన్నవారితో చిన్నగా, పెద్దలతో పెద్దగా అందరితో కలిసి మెలసి ఆనందంగా గడిపేవారని" హిందూపూర్ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న జగన్నాథం ఎంతో పరవశంతో చెప్పటం గమనార్హం. ఆయనతో పాటు ఒకే రూములో ఉంటే భాగ్యం తనకు కలిగిందని చెప్పాడు జగన్నాథం.

ఎన్.టి. రామారావు ప్రభుత్వ హయాంలో 55 సం॥లకు రిటైర్ అయినప్పటికీ ఆ తరువాత వచ్చిన డబ్బును అంతా సంస్థకే ఇచ్చేసారు. అప్పుడు అమ్మ చేత "నీవు నా సోదరుడివి నాన్నా" అని అనిపించుకున్న ధన్యజీవి రామకృష్ణ మాష్టారు. అనుక్షణం అమ్మ స్మరణకే తన జీవితాన్ని అంకితమిచ్చి ఎవరు ఏది చేసినా, ఎవరికి ఏమి చేసినా అమ్మ సేవేనన్న దృక్పథంతో ఏలూరులో తన శేషజీవితాన్ని గడుపుతున్న పుణ్యశీలి. అవధూతలా కనిపించని అవధూత శ్రీ రామకృష్ణ మాష్టారు.

రోగ పర్వత దంభోళి - అమ్మ

"విశ్వాసం దారిని పూలబాట చేస్తుంది. దుఃఖాన్ని సుఖంగా మారుస్తుంది. శత్రువుని మిత్రుడ్ని చేస్తుంది. విశ్వాసం కదిలే దైవం" అని అంటాడు ఎఫ్.ఎల్.హామ్స్.

అన్నంరాజు రామకృష్ణ అన్నయ్యకు, అమ్మ యందు ఎనలేని విశ్వాసం. చేస్తున్న ఉద్యోగం వదలి అమ్మ సన్నిధికి చేరాడు. అమ్మ అతని కుటుంబాన్ని తాను చూచుకుంటానని హామీ ఇచ్చింది. దానితో పిల్లలు చిన్నవాళ్ళు, చదువులకు ఇబ్బందని కూడా ఆలోచించక అమ్మ దరి చేరాడు. మాలాంటి ఎందరినో అమ్మ దర్శనార్థం జిల్లెళ్ళమూడికి తీసుకువెళ్ళాడు.

కొన్ని సం॥లు జిల్లెళ్ళమూడిలో ఉన్న తరువాత పిల్లల చదువులు, తన వ్యాపార నిమిత్తం బాపట్లలో కాపురం పెట్టాడు. కానీ ప్రతిరోజు అమ్మ దగ్గరకు మధ్యాహ్నం 3 గంటలకు వచ్చి రాత్రి 8.30 దాకా అమ్మ చెంత గడిపేవాడు. ఇంట్లో అందరూ అమ్మను సర్వాత్మనా నమ్మినవారే.

క్షరం కానిది అక్షరమైనప్పుడు యే అక్షరం గొప్పది?

పెద్ద కొడుకు సాయి వెంకటేశ్వరరావు టైఫాయిడ్ వచ్చి చాలా నీరసపడ్డాడు. మంచం మీద నుంచి లేవలేని పరిస్థితి. ఆ సమయంలో గొంతులో వుండలాగ ఏదో అడ్డుకున్నట్లుగా ఉండి కనీసం మంచి నీళ్ళు తాగటానికి కూడా వీలు పడలేదు. డా॥ సుదర్శనాచార్యులు గారు చూచి వ్యాధి బాగా ముదిరింది, గుంటూరు తీసుకువెళ్ళినా తగ్గుతుందన్న నమ్మకం లేదని తన నిస్సహాయతను తెలియజేసారు. ఉష వదిన భయంతో వెంటనే జిల్లెళ్ళమూడికి ఫోన్ చేయించింది.

ఆ సమయంలో అన్నయ్య అమ్మ సన్నిధిలో వున్నాడు. అన్నయ్య కంగారుగా ఉండటం చూచి అమ్మ "ఏం జరిగింది?" అని ప్రశ్నించింది. అన్నయ్య గాభరాగా సాయి విషయం అమ్మకు నివేదించి బాపట్లకు ప్రయాణమాయ్యాడు. అది చూచి అమ్మ "గుంటూరు తీసుకు వెళ్ళవలసిన అవసరం లేదు. నీతో పాటు నేనూ బాపట్ల వచ్చి సాయిని చూస్తానని" చెప్పింది. దానితో అన్నయ్యకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినంత సంబరపడ్డాడు.

బాపట్లలో అమ్మ సరాసరి సాయి దగ్గరకు వెళ్ళి గదిలో వారిని బయటకు పంపి స్వయంగా తనతో పాటు తీసుకువచ్చిన చక్కెరకేళీ పండును తినిపిస్తూ కొద్ది కొద్దిగా నీరు పట్టింది. అంత మటుకూ గొంతులోవుండగా ఉన్నది ఎటుపోయిందో ఆ పరమాత్మ అయిన అమ్మకే ఎరుక. రేపు సాయిని జిల్లెళ్ళమూడి తీసుకురమ్మని అమ్మ జిల్లెళ్ళమూడి వెళ్ళింది.

అంతమటుకూ పిల్లవాడి పరిస్థితి గురించి బెంగ పెట్టుకున్న అన్నయ్య, వదినలకు ఊరట కలిగింది. జిల్లెళ్ళమూడి వెళ్ళాక సాయిని తన దగ్గర అట్టేపెట్టుకుని వసుంధర అక్కయ్య ద్వారా ఉదయం పాలు, ఆవిరికుడుం, మధ్యాహ్నం ఒక కేజీ కూరతో భోజనం సాయంత్రం మళ్ళీ ఆవిరి కుడుం రాత్రి భోజనం క్రమం తప్పక నెల రోజులు పెట్టించింది. దానితో సాయికి నీరసం తగ్గటమే కాక 15 కేజీలు పెరిగి ఆరోగ్యవంతుడయ్యాడు. అమ్మ రోగ పర్వత ధంబోళి కదా!

మంత్రం చేయించేది, తంత్రం చేసేది.

మానవత్వం+మాతృత్వం+దైవత్వం = అమ్మ

ఈ కలియుగంలో దుఃఖనివారణార్థం ప్రపంచానికి అవసరమైనది అందరినీ ప్రేమించే గుణం, అందరిపై కారుణ్యం, అమ్మ ప్రేమస్వరూపిణి. తనను ఎవరు ప్రేమించినా, ప్రేమించకపోయినా, ద్వేషించినా, దూషించినా, హింసించినా, అందరినీ ప్రేమించే ఉదాత్త మనస్విని అమ్మ. మన యోగ్యతాయోగ్యతలతో అవసరం లేని అవ్యాజమైన అమృతత్వం-అమ్మతత్వం.

దళమైన పుష్పమైనను
ఫలమైనను. సలిలమైన పాయనిభక్తిన్
గొలిచిన, జనులర్పించిన
నెలమిన్ రుచిరాన్న మగనె యేను భుజింతున్

అని కుచాలోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు అన్నట్లుగా అమ్మ మన నుంచీ ఏమీ కోరకుండానే ప్రేమతో, మనలో సమర్పణా భావం అంకురింపజేసి మనకు ముక్తి మార్గాన్ని చూపింది.

రెండే కాళ్ళు, రెండే చేతులు మామూలు శరీరధారణతో పొట్టిగా వున్న మానవాంగన, సామాన్య గృహిణి ఒక కుగ్రామంలో చిన్న మంచం మీద కుర్చుని చిన్న చిన్న మాటలతో ఉపనిషత్ సారాన్ని బోధించింది. దానికి దేశ విదేశీయులు ప్రభావితం కావటంలోనే ఆమె యొక్క విశిష్టత వ్యక్తమౌతుంది. ఆమె దగ్గర వర్గవర్ణ స్త్రీ పురుష, కుల, మత బేధాలు లేవు. అందరికీ పశుపక్షాదులకు, క్రిమికీటకాలకు సహితం అమ్మనే అని ప్రకటించిన అవతారం ఇంతమటుకు శాస్త్రాలలో ఎక్కడా మనకు కనిపించదు. శుక్ల శోణితాలదేదో అదే తన కులమని చెప్పింది. నేను గురువును కాను, మీరు శిష్యులు కారు. మీరు శిశువులు నేను అమ్మను" అని ఘంటాపదంగా తెలియజేసింది.

"పితాహమస్య జగతో మాతాధాతా పితామహః", "నేనే తల్లిని నేనే తండ్రిని" అన్నాడు పరమాత్మ. పితృస్వరూపం మాతృస్వరూపం ఆయనే

మనశ్శుద్ధే మనస్సిద్ధి. మంత్రం రక్షిస్తుంది గానీ భక్షించదు.

ధరిస్తుంటాడు. ఏది ఎప్పుడు అవసరమవుతుందో మచ్చటవుతుందో ఆయనకే తెలియాలి. ఇప్పుడు ఈ రూపంలో అనగా "మాతృరూపేణా సంస్థితా" అన్నట్లు పరమాత్మ అమ్మగా అవతరించాడు.

"ఎక్కడైనా ఆధ్యాత్మిక గగనతలంతో నెలవంకలనే చూడగలం" కాని జిల్లెళ్ళమూడిలో మాత్రమే పూర్ణచంద్రుణ్ణి చూడగలం" అన్న డాక్టర్ శ్రీపాద వారి ప్రవచనం ప్రత్యక్ష సత్యం. ఒకరు "అమ్మ దీక్ష అంటే పేర్లు పెట్టడం" అని అన్నారు. వెంటనే రామకృష్ణ అన్నయ్య అన్నం పెట్టడం కూడా అన్నాడు. దానికి అమ్మ "అవును అనసూయ దీక్ష అంటే పేర్లు పెట్టడం, అన్నం పెట్టడం" అంది. అమ్మకు ఎంతసేపూ తన బిడ్డలు అన్నం తిన్నారో లేదో అన్న తపనే ఎక్కువ. తన దర్శనమునకు వచ్చిన వారిని ముందుగా భోజనం చేయమనేది. మిమ్మల్ని చూడటానికి వచ్చామమ్మా! అంటే చూసారుగా వెళ్ళి భోజనం చేసి రమ్మనేది. వారు ఇంకా కదలక అక్కడే ఉంటే "నేను స్నానం చేసి వస్తానని" లోపలకి వెళ్ళేది. చేసేదేమీ లేక వారు భోజనానికి వెళ్ళేవారు.

ముందుగా అమ్మ గురించి విన్నా నాకు ఎటువంటి భావనా ఏర్పడలేదు. రామకృష్ణ అన్నయ్య రమ్మంటే ఒకమారు చూచివద్దాములే అని జిల్లెళ్ళమూడి వెళ్ళాను. అక్కడ అమ్మ దగ్గరకు వెళ్తున్నాను కదా ఒక పండు కాని, ఫలం కాని తీసుకువెళ్దామని కూడా తోచలేదు. చేతులూపుకుంటూ వెళ్ళినా నా అదృష్టవశాత్తు అమ్మ మా ఇంటి ఇలవేల్పులైన "కుసుమహరనాధులుగా" దర్శనభాగ్యం కలుగజేసింది. దానితో నా భావనలో కొంత మార్పు రాసాగింది.

అమ్మ సన్నిధిలో వున్నప్పుడు ఒకామె చిన్నపిల్లవాడ్ని చంకన వేసుకొని మూడు సం॥ల పిల్లవాడ్ని నడిపించుకుంటూ వచ్చింది. అమ్మ ఆమెను చూచిన చూపు ఇప్పటికీ నన్ను మైమరిపింప చేస్తుంది. ఆ చూపు జాలిగా, దయగా, కరుణతో వర్ణించటానికి శక్యం కాదు. అమ్మ ఆమెను "ఇంట్లో చెప్పే వచ్చావా?" అని ప్రశ్నించింది. "నిన్ను చూడాలన్న తపన నన్ను నిలువ నీయలేదు. అందుకని పుట్టింటికి వెళ్తున్నానని ఇక్కడికి వచ్చానమ్మా" అన్నది.

పరిస్థితులను మించిన గురువులేదు.

వసుంధరక్కయ్య చేత కాఫీ తెప్పించి తాను స్వయంగా ఆమెకు పడుతూ ఒక చేత్తో వీపు నిమిరింది. ఆమెను చూస్తే మాసిపోయిన బట్టలు, పాలిపోయిన ముఖము, సన్నగా, పీలగా వుంది. మానవ మాత్రులం అమ్మలా చేయలేమనిపించింది. పిల్లవాడికి తాను తుడుచుకునే బట్ట కప్పి ఆమెను అమ్మ తన అక్కున చేర్చుకుంది. ఆమె కూడా ఆనందంతో ఆ పరిష్వంగంలో తన్మయత్వము పొందింది.

"నీ భర్తకు చెప్పకుండా రావద్దు. భర్త ఇష్టాఇష్టాలకు అనుగుణంగా నడుచుకోవటమే భార్య విధి. నేను ఎప్పుడూ నీతోనే ఉంటానని" ఆమెకు అభయమిచ్చిన తీరు అందరినీ విస్మయచకితుల్ని చేసింది. రామకృష్ణ అన్నయ్యతో "దానికి బస్సుకు డబ్బులు ఇచ్చి పంపమని చెప్పింది. డబ్బులు సరిపడా లేనందున బాపట్ల నుంచీ ఎడపిల్లవాడిని నడిపించుకుంటూ చంటిపిల్లవాడిని ఎత్తుకొని దాదాపు 12 కిలోమీటర్లు నడిచి వచ్చిందని" అమ్మ చెబితే అవాక్కు అయినాము. ఆమె వచ్చేటప్పటికి మేము అక్కడే వున్నాము. అమ్మకు ఆమె ఏమీ చెప్పనే లేదు. ఆ తరువాత ఎలా నడిచి వచ్చావని ఆమెను అడిగితే అమ్మ నామం చేసుకుంటూ వచ్చాను. అమ్మే నన్ను తన దగ్గరకు రప్పించుకుందని" తెలియజేసింది.

మా అబ్బాయిని ఇంటర్ బెటర్‌మెంట్‌కు కట్టించాలని వుందని అమ్మతో అన్నాను. "నేనూ మీలాంటి దాన్నే! నేనేమీ చదువు కోలేదు. నాకు ఈ చదువు సంధ్యల గురించి ఏమి తెలుస్తుంది మళ్ళీ పరీక్షకు కట్టించాలని అనుకున్నావు కదా! కట్టించు" అన్నది. అమ్మ నోటి వెంట పరీక్షకు కట్టించమని వచ్చిందని పరీక్షకు కట్టించాను. మొదటి మాటు చదివినంత కూడా మా అబ్బాయి చదవలేదు. కానీ అమ్మ అనుగ్రహంతో పర్సంటేజీ పెరిగి బీఫార్మసీలో చేర్పించటానికి వీలైంది. దానితో నా ఆనందానికి అవధులు లేవు.

అమ్మ సమక్షంలో అమ్మ చూపుతో, మాటలతో అనుక్షణం మనకు ఎంతో శక్తిని ప్రసరింపజేసేది. అమ్మ పలికే పలుకులు ఒక్కరితోనైనా మనందరిని

రక్తమంతా ఈశ్వరతత్వమే. నాకంతా శిశువులే.

ఉద్దేశించి మాట్లాడినట్లుగా వుండి మన సందేహాలకు సమాధానాలుగా భాసించేవి. అమ్మ చూపులతోనే మన మనస్సులను ప్రక్షాళనం చేసి మనలో మనకే తెలియనంతగా, మనం ఊహించ శక్యం కాని మార్పును తీసుకువచ్చేది. అరణ్యరోదనంలా వున్న మన మనస్సులో అంతర్మథనం బయలుదేరేది. దానితో అంతమటుకు లోకంలోని మనుషుల మీద ఉన్న మన అభిప్రాయలు మార్పు చెందేవి. వారు ఎటువంటి పరిస్థితిలో ఈ విధంగా ప్రవర్తించారో అనే ఆలోచనలు మనలో చోటు చేసుకుంటాయి. అమ్మ కొండంత అండగా మన జీవితాలలో వెలుగులు నింపుతుండి మనం దేనికీ చలించకూడదన్న భావన మనలో చోటు చేసుకుంటుంది.

అమ్మతత్వం ఎవ్వరిలో లోపాలు ఎంచకపోవడం. అట్టి అమ్మ సన్నిధిలో మనగలిగిన మనం వీలైనంత వరకూ ఆవగింజలో అర్థభాగమైనా మనలో నింపుకోగలిగితే కొంతలో కొంతైనా అమ్మ వారసులమని ధైర్యంగా చెప్పుకోగలం. నక్సలైట్లు పడ్డప్పుడు కూడా వారిని ఏమీ అనక వారిని క్షమించిన విధానం అమ్మలోని మాతృత్వానికి పరాకాష్ఠ. అట్టి మహత్తరమైన మాతృత్వం మానవ మాత్రులకు సాధ్యం కాదు కదా! ఆ మాతృత్వమే దైవత్వానికి నిదర్శనం. లలితా సహస్రనామాలు ఒక్కో సంఘటన ఒక్కో నామంగా అమ్మే లలితా పరాభట్టారికగా భాసిల్లుతుంది. భావనా మాత్ర సంతుష్ఠ హృదయ, భయాపహ, మృత్యుదారు కుఠారికా, సువాసిన్యర్చనప్రీతా, రోగపర్వత దంభోళి మొ॥ నామాలన్నీ అమ్మ యొక్క పరిపూర్ణత్వాన్ని, దైవత్వానికి దీటుగా భాసిల్లుతాయి.

అమ్మ అందరికీ అమ్మగా తోస్తూ, మన సందేహాలకు అవి ఆధ్యాత్మికమైనా, లౌకికమైనా మరేదైనా సరే తక్షణమే దానికి తగిన సమాధానాలు లభించేవి. భాష కోసం కాని, విషయం కోసం కాని, ఆలోచన కోసం కాని ఎక్కడా వెతికే పని లేదు. సమయం తీసుకునేది కాదు. ఎవరేది అడిగినా వెంటనే సమాధానం చెప్పే అమ్మను చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. "అమ్మా! ఆ సమాధానం ఎలా తట్టిందని" అడిగితే ఎక్కడన్నా పెట్టి మర్చిపోతే కదా!" అనేది.

కాలమే కర్తవ్యాన్ని బోధిస్తుంది.

అలవి మాలిన బాధతో అమ్మ దరి చేరినప్పుడు మనం ఏమీ వ్యక్తం చేయకుండానే మన మనస్సులోని బాధను గ్రహించి చూపుల ద్వారా మనలోని వ్యధను దూరం చేసేది (చేస్తోంది). వాత్సల్యయాత్రలో అమ్మ మచిలీపట్నం వచ్చినప్పుడు అమ్మ దర్శనం కోసం వైజాగ్ నుంచి బందరు వెళ్ళాము. ఉదయ భీమరాజు గారింట్లో అమ్మకు బస ఏర్పాటు చేశారు. అమ్మను దర్శించుకుని ఇంటికి వచ్చాను. ఆ మధ్యాహ్నం అమ్మ సాయితో "కుసుమ పడరాని బాధ పడ్తోందిరా" అని చెప్పింది.

"అదేంటమ్మా! అలా అంటావు. కుసుమత్తయ్య హాయిగా నవ్వుతూ ఉంటేను" అన్నాడు.

హిందూ కాలేజి ఆవరణలో సామూహిక దర్శనానికి ఏర్పాటు చేశారు. అక్కడ అమ్మ ఫోటోలు పుస్తకాలు అమ్ముతున్నారు. సాయి నా దగ్గరకు వచ్చి "నీవు పడరాని బాధపడ్తున్నావని అమ్మ చెప్పింది. నీవు బాగానే ఉన్నావు కదా! అమ్మ ఈలా చెప్పిందేమిటి?" అని ప్రశ్నించాడు. సరిగా వారం రోజుల క్రితం పూజలో పెట్టుకున్న అమ్మ ఫోటో దీపారాధన మీద పడి అమ్మ భుజాల వరకు పై భాగం కాలిపోయింది. దానితో తట్టుకోలేక ఏమైనా సరే జిల్లెళ్ళమూడి వెళ్తానని గొడవ పెట్టాను. అప్పుడు పరిస్థితులు అనుకూలించనందున వెళ్ళలేకపోయాను. సరిగా వారం రోజుల్లో అమ్మ మచిలీపట్నం వస్తున్నదని తెలిసి సొంత వూరిలో మా ఇంట్లో అమ్మను దర్శనం చేసుకోవాలన్న తహతహతో బందరు వెళ్ళాము. అమ్మను దర్శించినా "నీ ఫోటో కాలిపోయిందమ్మా!" అని చెప్పలేక అమ్మ సమక్షంలో విపరీతంగా నాలో నేనే కుమిలిపోయాను. చెప్పకుండా నే కనిపెట్టి సాయి ద్వారా నా వ్యధను దూరం చేసింది అమ్మ. మహిమలు చేయనంటూనే మన వ్యధను దూరం చేయటానికి మనుష్యులనే పనిముట్లుగా వాడుకుంటుంది అమ్మ.

ఆ సాయంత్రం లక్షలాది జన సందోహం. ఆ ఆనందం చెప్పశక్యం కాదు. నేను ఫోటో కాలిపోయిందని సాయితో చెప్పానే కానీ ఏ ఫోటో అన్నది

తోచిందేదో చేయి. తోపింపచేసేది వాడేగా.

చెప్పలేదు. కాని సరిగా దుర్గాష్టమికి త్రిశూల చక్రధారిణియైన అమ్మ ఫోటో కొని సాయి నా చేతులలో పెట్టటంతో నా ఆశ్చర్యానందాలకు అంతూ దరి లేకపోయింది. ఎందుకంటే మా ఇంట్లో కాలిపోయిన ఫోటోనే తను నాకు తెచ్చి యిచ్చాడు. అమ్మ మాతృత్వానికి, దైవత్వానికి ఇదే నిదర్శనమనిపించింది. అంతమటుకూ అమ్మ మీద నమ్మకం వున్నా, ఈ సంఘటనతో నా నమ్మకం "ఇంతింతై వటుడింతై వామనుడు భూనభోంతరాలకు ఎదిగినట్లుగా" ఈ జీవితంలో ఎవరూ ఎప్పుడూ అమ్మ నుండి వేరు చేయలేని విధంగా అమ్మ మా మనస్సుల్లో చోటు చేసుకుంది. అమ్మ యొక్క దైవత్వం మమ్మల్ని ఆకట్టుకుంది.

అమ్మది "సరే మంత్రం". ఎవరు ఏది చెప్పినా "సరే నాన్నా!" అంటుంది. ఎవరినీ ఇబ్బంది పెట్టదు. "మీ ఇష్ట ప్రకారమే నడుస్తున్నట్లు కనిపిస్తాను కాని నిజానికి నా ఇష్ట ప్రకారమే మిమ్మల్ని నడుపుకుంటానని" తన విధానాన్ని ప్రకటించింది.

అమ్మను విశాఖపట్టణం రమ్మని చక్రవర్తి గారు వేడుకున్నారు. "అలాగే నాన్నా!" అన్నది. కాని అదే సం॥ అమ్మ సిద్ధి పొందింది. చాలా బాధపడ్డాము. అమ్మ మాట ఇచ్చిన ప్రకారమే అశోక్‌హౌస్ నందు తాను ప్రతిష్ఠ అయి ఆ ప్రాంగణంలో మా నివాసమేర్పడునట్లు చేసి నిత్యం ధూప దీప నైవేద్యాలతో అర్చించుకునే అదృష్టాన్ని కలుగజేసిన అమ్మకు మేమేమివ్వగలం?

కరైకల్‌లో అమ్మ దేవాలయం

ప్రవిష్టః కర్ణరంధ్రేణ స్వానంభావ సరోరుహామ్॥
ధునోతి శమలం కృష్ణః సలిలస్య యథా శరత్॥

ఏ విధముగా శరదృతువు జలమందలి మాలిన్యమును పోగొట్టునో ఆ విధముగానే శ్రీ కృష్ణుడు భక్తుల భావనా మయ హృదయ కమలములో కర్ణ మార్గము ద్వారా ప్రవేశించి అందలి మాలిన్యమును పోగొట్టును.

అమ్మను స్మరించినంతనే మనలో మనకే తెలియని అవ్యక్తానందం

అనుకున్నది జరగదు. తనకున్నది తప్పదు.

కలుగుతుంది. అమ్మ సన్నిధిలో మనం గడిపిన దినములలో అమ్మ వ్యక్తమైన విధానము మన మనోవిధులలో నడయాడుతుంది. శ్రీకృష్ణుని అవతారము నందు గోపికలనుభవించిన ఆనందాన్ని అమ్మ మనకు అందించి తనకు కృష్ణునకు అబేధమన్న విషయాన్ని వ్యక్తీకరించింది.

అమ్మ ప్రేమసాగరపు లోతులను మనం దర్శించగలగాలి. మన తపన, తపస్సు అదే కావాలి. "విశ్వాసమే భగవంతుడు, నమ్మకమే దైవం" అన్న భావన మనలో పాదుకోవాలి. అమ్మ దైవం అన్న భావన సుస్థిరం కావాలి. విశ్వసృష్టి, స్థితి, లయలకు, మన జనన మరణాలకు, జయాపజయాలకు, సుఖ దుఃఖాలకు, అభివృద్ధి పతనాలకు సర్వానికీ అమ్మే కారణమన్న అరూఢ స్థితి రావాలి. నిరంతరం అమ్మనే అర్చించాలి. కన్నుమూసినా తెరిచినా అమ్మ రూపమే మన కన్నులకు విందు చేయాలి. మన పంచేంద్రియాలు సదా ఆ మూర్తికి ఉన్ముఖమై ఉండాలి. అహరహరమూ, మన రోమ రోమమూ ఆ స్మరణతోనే పులకెత్తాలి. శరీరంలో ప్రతి అణువు అమ్మ గానంతోనే పరవశించాలి.

తమిళనాడు కరైకల్‌లో ఉన్న డా॥ శేషశయన గారిని విశాఖలో ఉన్న "అశోక్ ఫార్మాస్యూటికల్స్ బ్రాంచి ఆఫీసు"కు ఆ కంపెనీ రిప్రజంటేటివ్ తీసుకు వచ్చారు. ఆ కాంపౌండ్‌లో అమ్మ మందిరం చూచి ఆయన పరవశించారు. అమ్మ గురించి తెలుసుకోవాలన్న కుతూహలం వ్యక్తం చేశారు. వారికి అమ్మ సాహిత్యం ఇవ్వడం జరిగింది.

అది చదివిన తర్వాత అమ్మతో సాన్నిహిత్యం పెరిగినట్లుగా అనుభూతి చెందారు. ఇల్లు కట్టుకోవటం, మనశ్శాంతిగా ఉండటంతో అమ్మ యందు ఎనలేని నమ్మకం పెరిగింది. అమ్మకు కుర్తాళం పీఠానికి అవినాభావ సంబంధం వుందనిపిస్తుంది. మౌనస్వామి నుండి ఇప్పటి వరకూ ఆ అనుబంధం కుర్తాళం చిన్నస్వామి గారు ఒంగోలు విచ్చేసినప్పుడు వారి శిష్యులైన డా॥ శేషశయన గారు వచ్చారు. అక్కడికి జిల్లెళ్ళమూడి దగ్గరే అని తెలియడంతో వారు అమ్మను దర్శించారు.

సృష్టికి మించిన మహిమలేదు.

జిల్లెళ్ళమూడిలో అందరూ వారిని ఎంతో ఆదరంగా చూచారని, హైమాలయం, అనసూయేశ్వరాలయాలు ప్రశాంతికి నిలయాలుగా వున్నాయన్నారు. అమ్మను చూచిన వెంటనే డాక్టరు గారి శ్రీమతి తన మెడలో గొలుసును తీసి అమ్మకు వేసిందట దానికి నగలంటే విపరీతమైన వ్యామోహం. అమ్మ ఆమెకు ఏ అనుభూతి నిచ్చిందో అని డాక్టరు శేషశయన గారు ఆశ్యర్యాన్ని వెలిబుచ్చారు. చెన్నై నుంచీ (పద్మనాభన్‌గారు వారి సతీమణి, పద్మనాభం గారి తల్లి, వెంకటేశ్వర్లు గారు వారి సతీమణి ఆ కుంభాభిషేకానికి హాజరైనారు.)

అమ్మ సచ్చరిత్ర తృతీయభాగంలో నెడుంగడిలో "Indian Stell Rolling Mills" లో శ్రీరామన్ గారు జనరల్ మేనేజర్‌గా వున్న సమయంలో ఆ కంపెనీ ఆవరణలో జిల్లెళ్ళమూడి అమ్మ విగ్రహాన్ని 1988లో ఆగమశాస్త్ర పద్ధతిలో ప్రతిష్ఠించి, కుంభాభిషేకం జరిపించారని వివరించాను.

డాక్టరు గారు అమ్మ గుడి గురించి చాలామందిని వాకబు చేసి ఆ ప్రదేశం తానున్న ప్రాంతానికి 8 మైళ్ల దూరంలో వుందని తెలుసుకొన్నారు. 1988లో ప్రతిష్ఠ జరిగినట్లు జిల్లెళ్ళమూడి అనసూయా బాళ్" అని రాసి వున్నది కాని ఇప్పుడు ఎటువంటి పూజలు జరగటం లేదని విచారం వ్యక్తం చేశారు.

ఆ చుట్టు ప్రక్కల విచారించగా ఒక ముస్లిమ్ అమ్మాయి ఆ గుడిలో అప్పుడప్పుడు ఒక అమ్మాయి బయటకు వస్తుంటుందని, ఒక నాగుపాము తరుచూ ఆ విగ్రహం దగ్గరకు వస్తుందని చెప్పింది. వారు రెండవ పర్యాయం వెళ్ళినప్పుడు అప్పుడే ఆ పాము వచ్చి వెళ్ళిందని తెలియజేసిందట.

ఆ దేవాలయాన్ని శుభ్రపరచి నిత్యనైవేద్య దీపారాధనలకు తన ఖర్చుతో ఏర్పాటు చేయిస్తున్న డాక్టరు గారు ఎంతో అభినందనీయులు. ఇది చదివిన నెడుంగడి దగ్గర వున్న వాళ్ళు కరైకల్‌లో వాళ్ళు తప్పక అమ్మ దేవాలయాన్ని దర్శించి దానికి పూర్వ వైభవం తీసుకు రావలసిందిగా కోరుతున్నాము. ఆ చుట్టు పక్కలకు వెళ్ళిన అమ్మ బిడ్డలు తప్పక దర్శించవలసింది.

మనస్సు లయమయ్యే చోటు ఆలయం.

ప్రేమావతారం - అమ్మ

అనంత విశ్వంలో అవధులు లేని ప్రేమతో అమ్మ మనలను తన ఒడిలోకి తీసుకున్నది. అమ్మ యొక్క లావణ్య లలిత సుందర దరహాసజ్యోత్స్నలను తలుచుకున్న మాత్రానే మనం ఈ ప్రపంచాన్నే మరచిపోతాం. కాలం అలాగే ఆగిపోతే బాగుంటుందనిపిస్తుంది. ప్రేమమయమైన ఆ విశ్వమోహన రూపం లీలగా మనసున మెదిలి మోము జేవురించి, మేను పులకరించి మునుపెన్నడు ఎరుగని ఆనందానుభూతి కలుగుతుంది.

అమ్మ లాలనగా అనురాగంతో నిమిరే మధురస్మిత ప్రేమలో పులకరించిపోతాం. శాశ్వతమైన సత్యం ఉండి ఉండి ప్రేమైకమూర్తి అమ్మగా అవతరించిందనిపిస్తుంది. అమ్మ ప్రేమానురాగాలను చవిచూసిన వారికి కావలసిదంటూ వేరేమీ ఉండదు.

మనను మించిన శక్తి, మనకంటే అతీతమైన శక్తి ఏదో సృష్టిలో నియతి ధర్మాల ప్రవర్తిల్లుతూ మానవ జీవనానికి దోహదకారి అవుతుంది. అమ్మ సన్నిధానంలో అమ్మ ప్రేమపూరిత దృక్కులు మనలను హాయిగా నిమిరేవి. అమ్మ చిరుదరహాసం మనల్ని వెన్నెలలో చకోరాలుగా చేసేవి. మన తలపులలో అమ్మ నడయాడినప్పుడు రేగే మధురవివశత పరిసరాలను మరిపించి కాలాన్ని కూడా గమనించ కుండా చేస్తుంది. మనసులో ఇముడ్చుకోలేని బాధ కన్నీరై ప్రేమగా, భక్తిగా మారుతుంది.

"వసుధైక కుటుంబం" "ఈశ్వర స్సర్వభూతానాం", "ఏకంసత్ విప్రా: బహుధావదంతి" అని సనాతన ధర్మం చాటి చెప్పింది. మాతృదేవోభవ, పితృదేవో భవ, ఆచార్యదేవోభవ, అతిధి దేవోభవ అని మనిషికి సందేశమిచ్చింది. సనాతన ధర్మం, మనిషిని సంస్కరించి కుటుంబ వ్యవస్థను చక్కదిద్ది గృహమును ఆనంద నిలయంగా మార్చడానికి మార్గదర్శకమైంది.

''ఆదరణకు నోచుకోని అభాగినిలు, అవిటివారు, అంధులు, దీర్ఘవ్యాధిగ్రస్తులు ఈ ప్రపంచంలో ఎందరో ఉన్నారు. వారిని దగ్గరకు తీసి

దైవాన్ని నమ్మడం కాదు, నమ్మినదే దైవం.

ఆదరణతో, ప్రేమతో పరిపోషించటం ద్వారా ప్రపంచంలో దిక్కులేనివారంటూ ఉండకుండా చూడండి. దిక్కులేని ఆ అభాగ్యులలోనే భగవంతుడిని చూస్తూ, భగవత్ సేవగా వారికి సేవ చేయండి. ఒకరి కష్టాలలో మరొకరు చేదోడు వాదోడుగా ఉంటూ, ఒకరికొకరు సహాయపడుతూ ఏక కుటుంబంగా మసులుకోండి" ఇదీ నా సందేశం అని నిర్ద్వంద్వంగా ప్రకటించింది అమ్మ.

జీసస్ "ఈ ప్రపంచంలో ఆ చంద్ర తారార్కం నిలచేది మూడే మూడు అన్నారు. విశ్వాసం, ఆశ, ప్రేమ కాని వాటిలో మహోన్నతమైనది ప్రేమ. ప్రేమ వల్లనే మానవుని జ్ఞానం శోభిస్తుంది. తన ప్రీతిపాత్రుల కోసం ప్రాణత్యాగం చేయడం కన్నా మానవుని లోని మహాప్రేమకు చిహ్నం మరోకటి లేదు" అని ప్రవచించారు.

"ప్రేమ కంటే ధర్మం గొప్పది. ధర్మానికి హద్దులు ఉన్నాయి. ప్రేమకు అవధులు లేవు. ప్రేమతో ధర్మాన్ని జయించవచ్చు". అని అమ్మ ప్రేమ యొక్క గొప్పతనాన్ని ప్రేమతో మనకు అవగతం చేసింది. అమ్మను చూచి నదీరా పరవశించి అమ్మ ప్రేమ సందేశాన్ని వర్ణిస్తూ "ప్రేమించవలెనంది ప్రేమించబడమంది. ప్రేమకన్న మిన్న పెన్నిధియే లేదంది" అని మృదుమధురంగా గానం చేసాడు. ఆ పంథానే అమ్మ అనుసరిస్తూ మనందరికీ దానికి అనుగుణంగా భూమికలు ఏర్పరచి తద్వారా మానవ సమాజమును ఒక స్వర్గధామంగా మార్చింది.

సమాజంలో ధర్మాన్ని శాంతిని స్థాపించడానికి అమ్మ ప్రేమమార్గాన్ని ఎంచుకున్నది. ఆ ప్రేమకు ఉపాంగాలు కరుణ, సానుభూతి, త్యాగము, సహనము. ఈ కళ్యాణ గుణాలాధారంగా జగద్ధితము, జగదాదర్శము, జగదా రాధ్యము అయిన చరిత్రను సృష్టించింది అమ్మ. మానవుడు ఎట్లా ఉండాలో, ఎట్లా జీవిస్తే తనకు శాంతి ఆనందము కలుగుతాయో, ఎట్లా ప్రవర్తిస్తే తన వలన లోకానికి హాయి సమకూరుతుందో అమలినమైన ప్రేమ ద్వారా ఆచరణ పూర్వకంగా లోకానికి ప్రభోధించింది. అమ్మ తన అపారమైన ప్రేమ ద్వారా,

---

పరిపూర్ణమైన జ్ఞానము ద్వారా నరుడు - నారాయణుడుగా పరిణతి చెందడానికి సులభమైన, సుగమమైన మార్గాన్ని మానవాళికి అందించింది.

"ప్రేమతో నవతకు, మానవతకు బాటలు వేసింది. అమ్మ అందించే ప్రసాదం మన సమస్త బాధల నివారణకు ఆధారం, మన బాధలను మరవటానికి అది ఒక ఉపకరణం. అమ్మ సందేశం మాటలతో కాదు, చేతలతోనే అమ్మ మనలను ఉన్నతసీమలకు నడిపిస్తుంది. అమ్మ జీవితం దీపకళిక, అక్కడ విశ్వమానవ ప్రేమ ప్రజ్వరిల్లుతున్నది" అని కొండముది రామకృష్ణ అన్నయ్య అభివర్ణించాడు.

శ్రీ కందుకూరి శివానందమూర్తిగారు "ఏ సాధన లేకుండా జగన్మాతగా అమ్మ జన్మించింది. పుట్టినదాది సమస్త జంతు జాలానికి, జీవరాశులన్నింటికి, క్రిమికీటకాదులకు సహితం తాను తల్లిని అని ప్రకటించింది. ఇంతవరకు ఈ విధంగా అందరికీ, అన్నింటికీ అమ్మనే అని తెలియచేసిన విశిష్ఠ వ్యక్తిత్వం ఎక్కడ ఏ శాస్త్రాలలో కూడా కనిపించదు. పురాణాలలో జగన్మాతృత్వసిద్ధి అనసూయకు కలిగింది. విశ్వచైతన్యంలోని కార్యక్రమాలు జరపటానికి ప్రకృతిని ఇన్నివేలపేర్లతో పిలుస్తాం. దాని సమిష్ఠి త్రిమూర్తులు. సహజ సిద్ధమైనది మాతృత్వం. అనసూయా దేవిని చూచినప్పుడు ఆ జగన్మాతృత్వాన్ని గుర్తించి త్రిమూర్తులు పసిపిల్లలుగా అయ్యారు. ఆ మూడు మూర్తులను కలిపి దత్తాత్రేయుడు అంటున్నాము. ఆ లోక మాతృత్వ భావనాంశే 'అమ్మ' అని వేరే చెప్పవలసిన పని లేదని" తెలియజేసారు.

ఈ సమస్త సృష్టికి మూలం అమ్మ. నడిపించేది అమ్మ. "నేను నేనైన నేను. అన్ని నేనులు నేనైన నేను" అని చెప్పగల గుండె నిబ్బరం ఎవరికుంటుంది? సృష్టికి మూలమై సర్వాంతర్యామియై విశ్వజనని అయిన దివ్యశక్తికి మాత్రమే ఆ ధైర్యం ఉంటుంది. అట్టి విశ్వశక్తి విశ్వజనీన భావననూ, విశ్వప్రేమనూ, విశ్వానికి అందించే నిమిత్తం మానవరూపంలో మన్నవ గ్రామంలో "అనసూయ" గా ఆవిర్భవించింది. జిల్లెళ్ళమూడిలో కాలుపెట్టి

తపనే తపస్సు. శ్రీ చక్రమంటే మన శరీరమే.

భూలోక వైకుంఠంగా మార్చి వేసింది. అందరు తనబిడ్డలే అన్నది. తన ఇల్లు 'అందరిల్లు' అన్నది. తాను ఒక్కమెతుకూ తినలేదు. కాని అందరినీ కడుపునిండా తినమన్నది. లక్షమందికి ఒకేసారి ఆప్యాయంగా భోజనం పెట్టి వారు తింటుంటే, ఆనందపడి తృప్తిగా బ్రేవుమనే ప్రేమతత్వమని" శ్రీశ్రీశ్రీ విశ్వంజీ అమ్మ గురించి పలికిన పలుకులు ఆణిముత్యాలు.

శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు ప్రేమార్చన ఉత్సవాల నామకరణాన్ని విశ్లేషిస్తూ "అమ్మ అర్చన అన్నా ప్రేమార్చన అన్న ఒక్కటే. అమ్మ వేరు ప్రేమవేరు కాదు. అమ్మకు పర్యాయపదము ప్రేమ, జిల్లెళ్ళమూడి అమ్మ అనవలసిన అవసరం లేదు. అమ్మ అంటేనే జిల్లెళ్ళమూడి అమ్మ. మహర్షి అంటే రమణ మహర్షియే. పరమహంస అంటే రామకృష్ణ పరమ హంసయే, అలాగే అమ్మ అంటే 'జిల్లెళ్ళమూడి అమ్మయే' అని ఉద్ఘాటించారు.

కంచి పరామాచార్యులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామివారు "భగవంతుడు ప్రేమస్వరూపి, జ్ఞాన స్వరూపి. ఆయన అనుగ్రహం ఉంటేనే గాని మనకు ప్రేమ, జ్ఞానం లభించవని నుడివారు. మన అదృష్టవశాత్తు ప్రేమస్వరూపమైన అమ్మ అవతరించిన సమయంలో మనం మన గలగటం మన పూర్వులకంటే రాబోవు తరాలవారి కంటే మనం ఎంతో అదృష్టవంతులము.

కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులైన జగద్గురు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి వారు మంత్రమార్గం ద్వారా అమ్మను అవాహనం చేసి ఆమె దర్శనం పొంది ఆమె సందేశాన్ని అందుకోగల్గిన అదృష్టశాలి. అమ్మకు వారియందు గల అనుగ్రహానికి, వాత్సల్యానికి చిహ్నము పై సంఘటన. అమ్మ పాంచ భౌతిక శరీరాన్ని విడిచిపెట్టినా ఇప్పటికీ భక్తులను అనుగ్రహిస్తోందనటానికిది మచ్చుతునక.

"అమ్మ మార్గం విశిష్టమైనది. అమ్మను అద్వైతులు అద్వైతిగాను, విశిష్టాద్వైతులు, ద్వైతులు పరామాత్మగాను, శాక్తేయులు శక్తిస్వరూపిణిగాను, క్రైస్తవులు మరియమ్మగాను, మహమ్మదీయులు వారి ఆరాధ్య దైవముగాను

వైకల్యం లేనిది కైవల్యం.

భావిస్తారు. అమ్మ వీటన్నింటిని తనలో ఇముడ్చుకున్న 'ప్రేమతత్వంగా' నాకనిపిస్తుంటుంది. లేకపోతే వర్గ, వర్ణ, కుల, మత వివక్షత లేక ఎల్ల జనులను తన కన్నబిడ్డలుగా చూచి ఆనందించగల, ఆనందం కలిగించ గల అమృతత్వం, మానతత్వం అది ప్రేమతత్వం కాక మరేమవుతుంది?" అని పి.ఎస్.ఆర్. ఆంజనేయప్రసాద్ అన్నయ్య ప్రశ్నించాడు.

అందరింటిలో నక్సలైట్స్ పడి భీభత్సం చేసినా" కొందరు పిల్లలు అడిగి తీసుకుంటారు. కొందరు పిల్లలు అడగకుండా తీసుకుంటారు. కొందరు పిల్లలు ఆదరగండం చేసి తీసుకుంటారు. వీరు అలాంటి పిల్లలని" విలాసంగా అమ్మ వర్ణించిన తీరు ఎవరినైనా ముగ్ధులను చేస్తుంది తల్లికి తప్పదు కాదు తప్పు కనిపించదు కనుక.

అమెరికన్ యువకుడు రిచెర్డు షిప్‌మెన్ దక్షిణ భారతావనిలో ఒక మూరుమూల సరళ స్వభావం గల ఒక స్త్రీ సాన్నిధ్యంలో తాను అన్వేషిస్తున్న సత్యపదార్థాన్ని కనుకున్నాడు. లోకంలో ఆచరణలో మృగ్యమైన, అవ్యాజమైన, పవిత్రమైన, నిస్వార్థమైన, అపరిమితమైన అమలిన ప్రేమ అక్కడ వుంది. ఆ ప్రేమ పాశమై అతడిని అమ్మ పాదరాజీవాలకు బద్దుడ్ని చేసింది. అవధులు లేని ప్రేమశక్తి 'అమ్మే' అని రూఢి చేసుకున్నాడు.

సత్యాన్వేషణలో ఎలాంటి పరీక్షలు ఎదురైనా, ఎలాంటి విషమ పరిస్థితులనైనా మనస్ఫూర్తిగా ఆహ్వానించి ఆత్మానుభవ రత్నదీప్తులను లోకంలో వ్యాప్తి చేయటమే మహాత్ముల నైజం. అమ్మ బిడ్డలమైన మనకు కూడా అంతటి ఆరూఢ స్థితి కల్పించిన అమ్మ ప్రేమావాతారం అనటంలో సందేహం ఎందుకు?

అందరింటి అమ్మమ్మ

"అనాయాసేన మరణం వినాదైన్యేన జీవనం"

మరణంలోనే మనిషి మంచితనం అవగతమవుతుందని పెద్దలు అంటారు. జనవరి 16వ తేదీ ఉదయం పొన్నూరు వెళ్ళి పూలు, పళ్ళు, కొబ్బరికాయలు, అగరొత్తులు అమ్మ పూజకు తీసుకొని వచ్చి భోజనం చేసి వక్క పలుకు వేసుకొని

వర్గం లేనిది స్వర్గం. సాహిత్యంతో రాహిత్యం రాదు.

అమ్మ మందిరంలో అమ్మకు ఎదురుగా కూర్చుని ఇహలోక బంధాలను త్రెంచుకొని అమ్మలో ఐక్యమైన "అమ్మమ్మ" గురించి మనం వేరే చెప్పేందుకు ఏమి ఉంది?

బందావారి ఆడపడుచుగా మన్నవ వారి కోడలిగా ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను సంపాదించుకుంది అమ్మమ్మ. మొదటి నుంచీ ఎవరినీ లెక్కచేయని వ్యక్తిత్వం ఆమెది. ఎంతటి క్లిష్ట సమస్యలనైనా అవలీలగా దాటగలిగిన ధీమంతురాలు.

ఢిల్లీ వెళ్ళి ఫ్రీడమ్ ఫైటర్ భార్యగా పెన్షన్, రైలులో ఇండియా మొత్తం తిరగటానికి సెకండ్ ఎ.సి. పాస్ సంపాదించుకోవటంలోనే ఆమె యొక్క పట్టుదల, కార్యసిద్ధి అవగతమవుతుంది.

పూర్తిగా అమ్మ సేవకే అంకితమైన పుణ్యాత్మురాలు. అమ్మ జన్మస్థలమైన మన్నవలో అమ్మకు మందిరం నిర్మించి విగ్రహప్రతిష్ఠ జరిపించి నిత్యనైవేద్య దీపారాధనలతో మనస్ఫూర్తిగా అమ్మను ఆర్చించుకున్న ధన్యజీవి.

మన్నవ వెళ్ళిన వారందినీ ఎంతో అప్యాయంగా పలుకరించి తనకున్నంతలో అతిధి మర్యాదలను జరిపిన భాగ్యశాలి. తన శేష జీవితాన్ని అమ్మ మందిరానికే ధారపోస్తూ మనందరికీ మార్గదర్శినియై మనందరిచే అమ్మమ్మగా పిలిపించుకున్న మాతృమూర్తి. అమ్మమ్మలో మార్పు వాస్తవంగా వచ్చిందని అమ్మచే కొనియాడబడిన పుణ్యశీలి.

విశాఖ వాసులు మూడు టాక్సీలలో మన్నవ వెళ్ళినప్పుడు అమ్మమ్మ ఇచ్చిన అతిధ్యం హృదయఫలకం మీద ముద్రించబడింది. వెళ్ళిన 17మందితో పాటు టాక్సీ డ్రైవర్లకు కూడా అమ్మమ్మ బట్టలు పెట్టడం అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది.

నరసింహారావు మామయ్య రిటైర్ కావటానికి ముందు వారం రోజులు అమ్మమ్మ వచ్చి మా అందరితో కలిసి ఉండటం మా అదృష్టం. ఒక్క చేతి మీదుగా మందిర నిర్మాణం విగ్రహప్రతిష్ఠ జరిపించిన అదృష్టశాలి. అందరింటి అమ్మమ్మ మన అమ్మమ్మ గానే మన హృదయాలలో నిలిచిపోతుంది. అమ్మమ్మకు అక్షరసుమములతో నివాళినర్పిస్తున్నాము.

చిన్నకాయ భక్తి, పెరిగినప్పుడు యోగం, పండినప్పుడు జ్ఞానం.

భయాపహ - అమ్మ

"మహాత్సంగస్తు దుర్లభోఽ గమ్యోఽ మోఘశ్చ॥"

మహాత్ముల సాంగత్యము లభించుటయే దుర్లభము. దానిని తెలుసుకొనుట చాలా కష్టము. వారు మహాత్ములని తెలియుట కష్టము. తెలిసిన పిదప ఆ సాంగత్య మమోఘము. వ్యర్థము కాదు.

జనవరి 1వ తారీకు సాయంత్రం అమ్మకు దీపం పెట్టటానికి వెళ్ళినప్పుడు అమ్మ ప్రతిబింబంలో కళ్ళజోడు పెట్టుకున్నట్లు కనిపించింది. అమ్మను చూస్తే కళ్ళజోడు లేదు. ఏమ్మా! కళ్ళజోడు పెట్టుకు మరీ పరీక్ష చేస్తున్నావా అని అనుకున్నాను. సాయంత్రం నుంచీ తలనొప్పి, డోకు, గాభరా, ఒంట్లో నలతగా వుంది. ఎడమ భాగం చెష్ట క్రింద నొప్పిగా ఉండటంతో రాత్రి 9 గంటలకు ఆసుపత్రికి వెళ్ళటం తప్పనిసరి అయింది. హార్టు పేషంట్‌ను అవటం వల్ల అన్ని టెస్టులు చేసారు. రోజుకి రెండు ఇంజక్షన్స్ ఒక్కోటి 500 రూపాయలు చొప్పున 5 రోజులు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. కాని ఆ నొప్పిలో ఎటువంటి మార్పు లేదు దానితో 6 వతా॥ యాంజియోగ్రామ్ టెస్ట్ చేయాలని బ్లాక్స్‌వున్నాయని బైపాస్ అవసరమవుతుందని డాక్టరు గారు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఇంట్లో అందరికి రిపోర్టులో ఏమొస్తుందో అని భయపడ్డారు. నాకు మాత్రం అమ్మ కళ్ళజోడు పెట్టుకొని పరీక్షించి నా రుగ్మతను దూరం చేసి వుంటుందని నమ్మకము. మానవమాత్రులం కదా! భ్రమరాంబక్కయ్యకు యాంజియో చేస్తున్నప్పుడు స్క్రీన్ మీద కనిపించి ఆపరేషన్ అవసరం లేకుండా చేసావు. మరి నాకేం చేస్తావు? అని అమ్మను ప్రశ్నించాను.

6వ తారీఖు ఉదయం 7 గంటలకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్తామన్నారు. ఎమర్‌జన్సీ ఆపరేషన్ ఉండటంతో దాని తరువాత తీసుకువెళ్తామన్నారు.

నేను మీ గుణగణాలు చూచి ప్రేమించడం లేదు. నాకోసమే నేను ప్రేమిస్తున్నాను.

ఈలోగా ఊహించని విధంగా 6వ తా॥ ఉదయం 9గం॥ పి.యస్.ఆర్. అన్నయ్య, పొత్తూరి వెంకటేశ్వరరావు అన్నయ్య నన్ను చూడటానికి ఆసుపత్రికి వచ్చారు. ఆపరేషన్‌కు భయపడక్కరలేదని వెంకటేశ్వరరావు అన్నయ్య అన్నారు. దానికి నేను "ఉంటే అమ్మ సేవ చేసుకుంటాను పోతే అమ్మలో కలిసిపోతానని" చెప్పాను. అమ్మ తన పిల్లలకు చావుభయం లేకుండా చేస్తుంది కదా!

కుర్తాళం శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామివారు అన్నయ్య వాళ్ళ ద్వారా కుంకుమ, అక్షతలు, ప్రసాదం పంపటం అమ్మ అపారదయకు నిదర్శనం. దానితో నా అదృష్టానికి మురిసిపోయాను. అరగంటలో థియేటర్‌లోకి వెళ్తాననగా ప్రసాదం అందటంతో నా ఆనందానికి అవధులు లేవు.

6వ తా॥ ఉదయం సామవేదం షణ్ముఖశర్మగారి ప్రవచనంలో 'భయాపహ' అన్న నామం గురించి చెప్పటం జరిగింది. దానితో ఏ మూలన్నా, ఏ కొద్ది భయమున్నా దాన్ని సమూలంగా నాశనం చేసిన అమ్మ భయాపహకదా! యాంజో టెస్ట్‌లో హార్టు శుభ్రంగా తుడిచిన అద్దంలా ఉంది. అన్ని రిపోర్ట్సు నార్మల్‌గా రావటంతో ఎటువంటి అవాంఛనీయ పరిస్థితి ఎదురుకాలేదు. అంతమటుకు డోలాయమానంగా వున్న మా కుటుంబంలోని వారందరి మనస్సులకు స్వాంతన లభించింది.

ప్రదక్షిణలు

అమ్మ గృహిణిగా వుంటూ మనందరినీ ఎన్నో విధాల తన అనురాగంతో అలరించింది. అమ్మ ప్రసంగవశాన చెప్పిన ఆణిముత్యాలను తరచి చూచుకుంటే మనకు అనేక విషయాలు గోచరమవుతాయి. ముఖ్యంగా అమ్మ ప్రదక్షిణాలకు పెద్ద పీట వేసిందేమోననిపిస్తుంది. అమ్మ సన్నిధిలో కూర్చున్న ఎందరినో హైమాలయంలో ప్రదక్షిణాలు చేసుకోమనటం పరిపాటి.

ప్ర – సమస్త భయాలను పోగొడ్తుంది.

ద – మోక్షాన్ని కలుగజేస్తుంది.

క్ష – సర్వ రోగాలు నివారిస్తుంది.

జ్ఞాని మానవుడిలో దైవాన్ని చూస్తాడు. అజ్ఞాని దైవంలో మానవుణ్ణి చూస్తాడు.

ణ - అష్టైశ్వర్యాలు ఇస్తుంది.

ఇన్ని రకాలుగా బిడ్డలకుపయుక్తం అవుతుంది కాబట్టే మనందరినీ ప్రదక్షణాలు చేయమనేదేమో అనిపిస్తుంది. సనాతన సాంప్రదాయంలో కూడా ప్రదక్షిణాలకు ఎంతో విలువ వుంది. ఓ సుబ్బలక్ష్మికో, ఓ శరభలింగం గారికో, ఓ కుసుమకో కాక యావత్ ప్రజానీకానికీ అవసరమే ఈ ప్రదక్షిణలు.

ప్రమథగణాధిపత్యానికి గణపతి కుమారస్వామి పోటీ పడ్డారు. మొదటిగా భూప్రదక్షిణం చేసి అన్ని క్షేత్రాలు దర్శించి నదులలో స్నానమాచరించిన వారే గణాధిపతులు అవుతారని పరమేశ్వరుడు చెప్పాడు. అది విన్న వెంటనే కుమారస్వామి తన నెమలి వాహనం మీద హుటాహుటిన బయలుదేరాడు. వినాయకుడు తనని, వాహనాన్ని చూచుకొని విచారించి, తల్లిదండ్రుల చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం సలిపాడు. ఏ క్షేత్రానికి వెళ్ళినా తన కంటే ముందుగా విఘ్నేశ్వరుడే స్నానమాచరించి రావడం చూచిన కుమారస్వామి అన్నగారికే గణాధిపత్యం ఇవ్వవలసిందిగా కోరాడన్నది ప్రసిద్ధం కదా! అందుకే మన పురాణాలలో, సనాతన సంప్రదాయంలో కూడా ప్రదక్షిణాలకు అంత విలువ ఏర్పడింది.

"ఎక్కడ ఎవరిని అర్చించినా, ఏ గుడిలో ప్రదక్షిణాలు చేసినా తనకు చెందుతాయన్నది" అమ్మ. అందుకే ఆదిశంకరులు ఆసేతు హిమాచలం పర్యటించి ఆ పాదాల దగ్గరే శరణు పొందారు. విశాఖ అమ్మ మందిరంలో అనేక ఈతి బాధలతో ఎందరో ప్రదక్షణలు సల్పుతున్నారు. వారి అనుభవాలు వింటే అమ్మ చెప్పినవి నిత్యసత్యాలు అనిపిస్తాయి. తాను శరీరధారిణిగా ఉన్నప్పటి కంటే ఎక్కువగా బిడ్డల యోగ క్షేమాలను పరికిస్తోంది, పరిక్షిస్తుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "యోగక్షేమం వహామ్యహం" అని చెప్పనే చెప్పాడు కదా! కాబట్టి మన కోరికలు తీర్చే కామితార్థ ప్రదాయిని అమ్మకు ఎన్నెన్ని ప్రదక్షిణలు చేయాలో కదా!

ఏది వచ్చినా, సమంగా చూడగలిగిన గాఢమైన మార్పులేని భావమే బ్రహ్మానందం.

"విశాఖలో అమ్మ విగ్రహ ప్రతిష్ఠ"

విశాఖలో అమ్మ మందిర శంఖు స్థాపన 1999 జూన్ 12వ తారీఖు 12 గం॥ 12 ని.లకు జరిగిన సంగతి పాఠకులకు విదితమే కదా! జయపూర్ నుంచి 2000 సవంత్సరం జనవరిలో పౌర్ణమి శుక్రవారం ఉత్తరాయణ పుణ్య కాలంలో విశాఖకు అమ్మ వేంచేసింది.

విగ్రహ ప్రతిష్ఠ గురించి మాకేమీ తెలియనందున పూజ్యులు శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామి వారిని ఉచిత రీతిని సలహా ఇవ్వవలసిందిగా కోరాము. స్వామీజీ ఆదేశానుసారం మార్చి 22వ తేదీ ఉదయం 9 గం॥ 52 ని॥లకు ప్రతిష్ఠ జరిపించినాము.

అమ్మ "హైమక్క విగ్రహ ప్రతిష్ఠకు ఏమి చేసిందో అని పాత మాతృశ్రీలో చూచాను. అమ్మ తన తలలో పూలుత్రుంచి ఆ పీఠం మీద వేసి హైమక్కకు ప్రతిష్ఠ చేసినట్లు చదివాను. అమ్మ 40 సం॥ పూర్వమే ఒక చిన్న గుడ్డమూట ఇచ్చి దాచమని గోపాలన్నయ్యకి ఇస్తే పక్కనే ఉన్న పెట్టెలో పెట్టాడు. గజేంద్రమ్మక్కయ్య దానిని భద్రపరచింది. దానిని 4 సం॥లకు పూర్వమే గజేంద్రమక్కయ్య నాకు అందచేసింది. ఆ మూటలో అమ్మ శిరస్సు ధరించిన తాటి రేకులతో కుట్టిన పువ్వులు దారాలు, వున్నాయి. దాన్ని జాగ్రత్తపరిచాను. తాళపత్రాలయితే చెక్కు చెదరకుండా ఉంటాయి కదా! 45 సంవత్సరాల అనంతరం విగ్రహ ప్రతిష్ఠలో వాడటానికి గుర్తు చేసిన కారుణ్యామూర్తి అమ్మ. ఇంక ఏపూలైనా ఇన్ని సంవత్సరాలు రూపురేఖలు వుండవు. అందుకని తాటి రేకులతో చేసిన పూలను విశాఖ మందిరలో ప్రతిష్ఠకు అమ్మ ముందుగానే అందచేసింది.

భ్రమరాంబక్కయ్య వస్తుంటే ఆమె ద్వారా శ్రీ హనుమబాబుగారు అమ్మ జుత్తును పంపిచారు. ముందుగా అమ్మ చేతుల మీదుగా ఇచ్చిన మూటను, అమ్మ జుత్తును, అంఆ రాసిన పుస్తకాలను, నవరత్నాలను వేసాము. శ్రీ కామేశ్వర రావు గారి భార్య రాధగారు అష్టలక్ష్మి యంత్రం, శ్రీ సన్యాసిరాజుగారు వెండి

విశ్వరూపదర్శనమంటే ఈ కనబడేదానిని భగవంతునిగా చూడటమే.

శ్రీ చక్రం శివలింగాలు, జె.ఎస్.ఎన్.మూర్తిగారి భార్య ముత్యాలు, పొగడం, యు. రాధగారు వారి బంధువర్గం బంగారం, వెండి, ముత్యాలు, పొగడాలు వేసారు. ముందుగా లలితా లక్షనామార్చన చేసి అమ్మను ప్రతిష్ఠ చేయటం జరిగింది.

ఆ రోజు దాదాపు 300 మందికి ప్రసాద వినియోగం జరిగింది. అటువంటి రుచికరమైన పదార్థాలు ఇంతమటుకు తినలేదని, చాలా అద్భుతంగా వున్నాయని వచ్చిన వారందరూ అన్నారు. హైద్రాబాద్ వాస్తవ్యులు శ్రీ కస్తూరి సదాశివరావుగారు ఆ రోజు ఇక్కడే వుండటం సంభవించింది. ఆయన చాలా ఆనందం అనుభవించారు.

ఫాల్గుణమాసం విగ్రహ ప్రతిష్ఠకు అనుకూలం అన్నారు. దానికి తోడు రెండు నెలలగా ఆ చెక్క పెట్టెలో ముందు భాగం విడదీసి అమ్మకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ధూపదీప నైవేద్యాలు వల్లభ జోస్యుల లక్ష్మిగారు, వారి మేడపైన వుండే కుసుమగారు భక్తి శ్రద్ధలతో జరిపారు. ఇప్పటికీ లక్ష్మిగారే అమ్మకు ప్రథమ పూజారిణి. అమ్మ వాళ్ళకు అటువంటి అరుదైన అవకాశాన్ని కలుగచేసింది.

వి. నాగేశ్వరరావు అనే విద్యార్థి జిల్లెళ్ళమూడిలో 8, 9 క్లాసులు మాత్రమే చదివాడు. ప్రస్తుతం ఇండోర్‌లో ఎమ్.ఎ.సి. రెండవ సంవత్సరం చదువుతున్నాడు. పేపర్లో అమ్మ విగ్రహ ప్రతిష్ఠ గురించి చదివి ముందు రోజు సాయంత్రం చూడటానికి వెళ్ళాడు. అతనికి అమ్మ లక్ష్మీదేవిలా దర్శన మిచ్చిందని, మర్నాడు వెండి లక్ష్మీవిగ్రహాన్ని తీసుకువచ్చాడు. అతని భక్తి, ఆర్తి మా అందరినీ చాలా ఆశ్చర్య పరిచింది. అతనికి అమ్మ ఫోటో ఇచ్చాను. దానిని లామినేషన్ చేయించి బల్ల మీద పెట్టుకున్నాడుట. ప్రతిరోజు పరీక్షకు అమ్మ ఆశీర్వదించి పంపుతోందని ఫోను చేసాడు.

మే 5న అమ్మ కళ్యాణ వేడుకను ఎంతో ఘనంగా జరుపుకున్నాం. వందమందికి పైగానే ప్రసాదాన్ని స్వీకరించారు. ఆ ఫ్లాట్స్ పూర్త అయిన

సంసార బాధ్యతలే ఆధ్యాత్మిక సాధన. ఆధ్యాత్మిక సాధన అంటే అదేదో వేరుకాదు.

తరువాత "అమ్మ వ్రతం" జరుపుకుని మన వారందర్నీ పిలుచుకోవాలని మా కోరిక. వాంఛితార్థ ప్రదాయిని అయిన అమ్మ మా కోరికను మన్నిస్తుందని మా విశ్వాసం.

॥ ఓం శ్రీ అనసూయా మహాదేవ్యై నమః ॥

మృత్యుదారు కుఠారిక - అమ్మ

మాతృశ్రీ అనసూయా మహాదేవి లలితాపరాభట్టారిక అనటంలో ఎటువంటి సందేహంలేదు. దేవతగా మలచబడే హైమక్క చేత కూడా అమ్మ లలితా సహస్రనామ పారాయణ చేయించింది. రహస్యనామం అంటే ఎవ్వరికీ చెప్పకూడదని కాదు అంత పవిత్రంగా కాపాడుకోవాలని. చాతుర్వర్ణాలవారు చేయవచ్చని తన బిడ్డల చేత ఒక్క పూటలో లలితా కోటినామ పారాయణ చేయించింది శ్రీమాత అయిన మన అమ్మ. అమ్మ చూపులో, భాషణలో, క్రియలోతానే లలితగా ఎందరెందరికో అనుభూతులు ప్రసాదించింది.

మార్కండేయుని మృత్యుంజయునిగా చేసాడని దేవతలంతా పరమేశ్వరుడిని అనేక విధాలస్తోత్రం చేశారు. అది విని పక్కనే వున్న పార్వతి పక్కున నవ్వింది. ఎందుకు నవ్వుతున్నావని పరమేశ్వరుడు ప్రశ్నించగా "కేనపాదేనతాడితః" అని పార్వతి అడిగింది. "వామపాదేనతాడితః" అని శంకరుడు చెప్తాడు. ఆ భాగంనాది కదా! అని పార్వతి చిరునవ్వు నవ్వింది.

కొయ్యను గొడ్డలి చీల్చినట్లుగా మృత్యువనే దారువును నాశనం చేసే శ్రీ మాత మృత్యుదారుకుఠారిక. మృత్యువును నాశనం చేసేది. పురాణాలలో చదువుటయే కాక మాతృశ్రీ అనసూయా మహాదేవి మృత్యువు నుంచీ ఈ కలియుగంలో రక్షించిన విధానాన్ని ఈ దిగువ ఉదహరిస్తున్నాను.

1960 సం॥లో సూరంపూడి సీతా మహాలక్ష్మిగారు తొలికాన్పుకు పొన్నూరులో వున్నప్పుడు అమ్మ గురించి విని మేనత్త వెంట రాగా పిల్లవాడిని తీసుకుని జిల్లెళ్ళమూడికి బయలుదేరింది.

శరణమంటే తప్పించుకుందామన్నా తప్పనిది. చేద్దామనుకొన్నా చేయనీయనిది.

అప్పటికి జిల్లెళ్ళమూడికి దారీతెన్నూ లేదు. డొంకల వెంబడి వెళ్ళాలి. ఎటు వెళ్ళాలో తెలియక తికమక పడ్తుంటే అటు వెళ్ళమని మాట వినిపించింది. ఆ త్రోవ గుండా వెళితే సరిగ్గా అమ్మనివాసం దగ్గరకు వచ్చారు. భోజనాలు చేసి విశ్రాంతి తీసుకోమన్నారు. ఆ సాయంత్రం అమ్మ దర్శనం ఇస్తున్నప్పుడు చంటిపిల్లవాడ్ని వొళ్ళో పెట్టుకుని సీతగారు గుమ్మంలో కూర్చున్నారు. అమ్మ పిల్లవాడు జాగ్రత్త అని రెండు మూడు మార్లు చెప్పింది. గుమ్మంలో కూర్చోవటంతో వచ్చేపోయ్యేవాళ్ళ కాళ్ళు తగులుతాయని అమ్మ జాగ్రత్త చెప్పిందనుకున్నది. ఆ రాత్రి భోజనానంతరం వారిని పెద్దపాకలో పడుకోమన్నారు.

లేత తమలపాకుల వంటి అమ్మ పాదాలను స్మరించుకుంటూ, అమ్మను దర్శించిన ఆనందంలో తలమునకలవుతూ ఆ పాకలోకి వెళ్ళారు. అందులో ఎటు చూచినా అమ్మ ఫోటోలతో అద్వితీయంగా వుంది. బ్రహ్మాండం అంతా అమ్మే నిండివున్నట్లు అనుభూతి కలిగింది. అమ్మ ఆలోచనలతోనే చంటి పిల్లవాడ్ని మధ్య పడుకో బెట్టుకొని ఆమె, వాళ్ల అత్తయ్య నిద్రకుపక్రమించారు. మధ్య రాత్రి మెలుకువ వచ్చి చూస్తే అమ్మ త్రిశూలం పట్టుకుని ఎవరితోనో సంభాషిస్తున్నట్లుగా సీతగారికి కనిపించింది. అమ్మ ఎవరితో మాట్లాడుతుందా అని చూచేటప్పటికి నల్లగా జుట్టు విరబోసుకున్న మృత్యుదేవతతో ఘర్షణ పడుతున్నట్లుగా అనిపించింది. ఆమె నోట మాట పలుకు లేకుండా చూస్తూ వుండి పోయింది.

అమ్మ "నా దర్శనానికి వచ్చిన వారికి హాని కలుగుతూవుంటే నేను చూస్తూ వూరుకుంటానా?" అంటుంది. నా పని నేను చేసుకు వెళ్ళాలి నన్ను ఆపవద్దని మృత్యుదేవత అంటున్నది. "నా సన్నిధిలో నా బిడ్డకి ఎటువంటి అపకారం జరగకుండా చూసుకోవడం నావిధి" అని అమ్మ, అలా వారిద్దరి మధ్యా దాదాపు 45 ని॥లు వాగ్వివాదం జరిగింది. చివరకు మృత్యుదేవత అదృశ్యమైపోయింది. అందుకే అమ్మ సాయంత్రం నుంచే జాగ్రత్తలు చెప్పిందేమో

కష్టంలోవున్న జనాన్ని చూచి స్పందించగల మనస్తత్వమే నిజమైన మానవత్వం, అదే దైవత్వం కూడా.

అని అనుకున్నారు. అంతసేపూ ఆమె చూస్తూనే వుంది. కాని నోరు మెదపలేకపోయింది. ఆ తరువాత అమ్మ వెళ్ళిపోయింది.

మళ్ళీపడుకుంటే చిన్న కునుకుపట్టింది. పిల్లవాడి ఏడుపుతో చటుక్కున మెలుకువ వచ్చింది. పిల్లవాడి కాలి రెండువేళ్ళు వేలాడుతూ పక్క అంతా రక్తంతో తడిసిపోయింది. దానితో ఆమె కంగారుపడ్తూ పిల్లవాడ్ని పొత్తిళ్ళలో పట్టుకుని అమ్మ దగ్గరకు వెళ్ళింది. పందికొక్కు కరిచి వుంటుందని తాటిబంద తెప్పించిపెట్టింది. పిల్లవాడికి ఫరవాలేదని కంగారు అవసరం లేదని" అమ్మ చెప్పింది.

మానవమాత్రులం కదా! అమ్మ చెప్పినా మన మనస్సు స్థిమితంగా వుండనివ్వదు. కాదమ్మా!, బాపట్ల వెళ్ళి కుట్లు వేయించుకుంటామని చెప్పారు. దానికి అమ్మ సరే అని శ్రీ నాన్నగారికి లాంతరు ఇచ్చి సాయం పంపించింది. ఆ పిల్లవాడిని తన సమక్షంలోకి రప్పించి అతన్ని మృత్యుగండం నుంచి కాపాడిన అమ్మకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలరు? ఆ కుట్టు వేసిన చోట ఇప్పటికీ నల్లమచ్చగా గుర్తు వుండి పోయింది. ఇప్పుడు ఆ కుర్రాడు అమెరికాలో జాబు చేసుకుంటూ హాయిగా జీవనం సాగించడం, అమ్మ యొక్క దివ్యానుగ్రహ ప్రభావమే అని ఆ తల్లిదండ్రుల విశ్వాసం.


కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా మరొక వ్యక్తికి అర్పణ చేయడం కళ్యాణం.



రచయిత్రి

అయ్యగారి కుసుమా చక్రవర్తి ఎమ్.ఎ.బి.ఇడి.

జననం	:	తెనాలి 20-12-1942
జననీ జనకులు	:	శ్రీ అన్నంరాజు మాధవరావుగారు శ్రీమతి అన్నంరాజు కనకదుర్గాంబగారు
అత్తమామలు	:	శ్రీ అయ్యగారి రామ్మూర్తి పంతులుగారు (ఫౌండర్ ఆఫ్ ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీ, మచిలీపట్నం) శ్రీమతి రోహిణీదేవిగారు
వివాహం	:	1960 శ్రీ ఎ.ఎస్. చక్రవర్తిగారితో
వృత్తి	:	ఉపాధ్యాయురాలు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
రచనా ప్రోత్సాహం	:	శ్రీ ఎ.ఎస్. చక్రవర్తిగారు
విశేషార్హత	:	మాతృశ్రీ అనసూయా మహాదేవి అనుగ్రహం
మంత్ర స్వీకారం	:	శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామి
ఇతర రచనలు	:	దివ్యానుభూతులు, మధురస్మృతులు, అనసూయా వ్రతకల్పం, అమ్మసచ్చరిత్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ భాగాలు


Sathyam. ✆ 27358878, 2713440